సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 268

మంగళవారం 11-6-2024

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి '



సినెర్.. నంబర్‌వన్

టెన్నిస్‌లో టాప్ ర్యాంక్ అందుకున్న తొలి ఇటలీ క్రీడాకారుడు - 12లో



77,000 స్థాయి తాకి.. వెనక్కి

ఐటీ, ఫైనాన్స్ షేర్లలో లాభాల స్వీకరణ.. ట్రేడింగ్‌లో కొత్త రికార్డులు - 13లో



సిక్కిం సీఎంగా ప్రేమ్ సింగ్

సిక్కిం సీఎంగా సిక్కిం క్రాంతికారీ మోర్చా అధినేత ప్రేమ్ సింగ్ తమాంగ్ వరుసగా రెండోసారి బాధ్యతలు చేపట్టారు.

వివరాలు 6లో ▸



నేడే ఒడిశా బీజేపీఎల్పీ భేటీ

ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లో విజయం నేపథ్యంలో తదుపరి సీఎంను ఎన్నుకునేందుకు నేడు బీజేపీ శాసనసభాపక్ష భేటీ నిర్వహిస్తున్నారు.

వివరాలు 6లో ▸



'కేబినెట్'కూ పనికిరామా?

కేంద్ర మంత్రివర్గంలో తమకు స్వతంత్ర హోదా సహాయ మంత్రి పదవి ఆఫర్ చేయడంపై ఎన్సీపీ, శివసేన అసంతృప్తి వ్యక్తం చేశాయి.

వివరాలు 6లో ▸



సఫారీ 'సూపర్-8'కు

టి20 ప్రపంచకప్ లీగ్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 4 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌పై విజయం సాధించి 'సూపర్-8'కు అర్హత సాధించింది.

వివరాలు 12లో ▸



పాఠశాలల పునఃప్రారంభం

ఒకరోజు వాయిదా

- కొత్త ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం నేపథ్యంలో మార్పు
- ఎల్లుండి తెరుచుకోనున్న బడులు.. పుస్తకాలు, విద్యా కానుక పంపిణీ ఆలస్యం!

- వివరాలు 3లో



సీఎం ప్రమాణ స్వీకారానికి

ముమ్మర ఏర్పాట్లు

- ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా సభకు ప్రధాని మోదీ
- ప్రముఖులు, వీఐపీల కోసం ఐదు ప్రత్యేక గ్యాలరీలు
- 10వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు

- వివరాలు 3లో



ఫ్రాన్స్ పార్లమెంట్ రద్దు

6 లో

ఫ్రాన్స్ పార్లమెంట్‌ను ఆ దేశాధ్యక్షుడు మేక్రాన్ రద్దు చేశారు. దీంతో వచ్చే 20 రోజుల్లో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్నాయి. జూన్ 30న తొలి దశ, జూలై ఏడో తేదీన రెండో దశ పోలింగ్ జరగనుంది. ప్రజాదరణ తగ్గేలోపు ఇప్పుడే ఎన్నికలకు వెళితే తమ పార్టీయే గెలుస్తుందన్న అంచనాతో మేక్రాన్ ఈ అనూహ్య నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఇదండీ సంగతి



ప్రభుత్వ ఏర్పాటులో సహాయం చేసే సహాయ మంత్రిస్తారా అని నిలదీస్తున్నారు!

రెచ్చిపోయి దాడులు చేస్తున్న టీడీపీ నేతలు, కార్యకర్తలు

పరాకాష్టకు విధ్వంసకాండ

ఏ తప్పూ చేయకపోయినా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలే టార్గెట్

- ఇళ్లపై, ప్రభుత్వ కార్యాలయాలపై కొనసాగుతున్న దాడులు
- ఇదేమని ప్రశ్నిస్తే హత్యాయత్నాలు.. కిడ్నాప్‌లు
- చితకబాది బలవంతంగా క్షమాపణలు చెప్పిస్తున్న వైనం
- వర్సిటీ వీసీలపై దౌర్జన్యం.. బలవంతంగా విగ్రహాల తొలగింపు
- చంద్రబాబు, లోకేశ్‌ల లక్ష్యం.. ఆటవిక రాజ్యం
- వీరిద్దరి కనుసైగ మేరకే కవ్వింపులు.. ఆపై గొడవలు
- ఘర్షణలన్నింటినీ 'సినిమా'గా చూస్తున్న పోలీసులు



అనంతపురం జిల్లా కురవల్లిలో గ్రామ సచివాలయాన్ని ధ్వంసం చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

టీడీపీ నేతలు, కార్యకర్తలు రెచ్చిపోయి గొడవలు కొనసాగిస్తున్నారు. దాడులు చేయడం తమ జన్మ హక్కు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. అధికారం దక్కింది దౌర్జన్యం చేయడానికే అని చాటి చెబుతున్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తల తీరు విస్తుగొలుపుతోంది. పట్టపగలు కర్రలు, రాళ్లు, రాడ్లతో వీరంగం వేస్తున్నారు. ఊరూరా విగ్రహాలను, శిలా ఫలకాలను ధ్వంసం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీలో ఎవరూ ఉండకూడదన్నట్లు బెదిరింపులకు దిగుతున్నారు. ఈ పార్టీకి ఓట్లేసిన వారిని దుర్భాషలాడుతున్నారు. ఓట్లు వేయించిన వారు ఊరు వదిలి వెళ్లాలని హుకుం జారీ చేస్తున్నారు. ఇది అన్యాయం కదా.. అని ప్రశ్నిస్తే దుస్తులు విప్పి కొడుతున్నారు. ఏ తప్పూ చేయకపోయినా, వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇచ్చినందుకు బహిరంగ క్షమాపణలు చెప్పిస్తున్నారు. యూనివర్సిటీ వీసీలపై దౌర్జన్యం

మిగతా 2వ పేజీలో ▸

సోమవారం ప్రధాని నివాసంలో జరిగిన తొలి కేబినెట్ భేటీ



కీలక శాఖలన్నీ బీజేపీకే

సీనియర్లకు మళ్లీ అవే శాఖలు... కేబినెట్ కూర్పుపై మోదీ ముద్ర

- షాకు హోం, రాజ్‌నాథ్‌కు రక్షణ, నిర్మలకు ఆర్థికం
- జైశంకర్‌కు విదేశాంగం, గడ్కరీకి రోడ్లు, హైవేలు
- వైష్ణవ్‌కు ప్రమోషన్.. రైల్వే, ఐటీతో పాటు సమాచారం
- శివరాజ్‌కు ప్రాధాన్యం.. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి
- నడ్డా, ఖట్టర్‌లకూ రెండేసి ప్రధాన శాఖల బాధ్యతలు
- జేడీయూకు పంచాయతీ, జేడీఎస్‌కు ఉక్కు, సేనకు ఆయుష్

6 లో

- రామ్మోహన్ నాయుడుకు విమానయానం
- కిషన్‌రెడ్డికి బొగ్గు, గనుల శాఖ
- శ్రీనివాసవర్మకు భారీ పరిశ్రమలు, ఉక్కు(సహాయ)
- పెమ్మసానికి గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్(సహాయ)
- బండి సంజయ్‌కు హోం (సహాయ)



'పీఎం కిసాన్ నిధి'పై తొలి సంతకం

3 కోట్ల ఇళ్ల నిర్మాణం..

కేబినెట్ తొలి భేటీలో నిర్ణయం

6 లో

డిప్యూటీ సీఎంగా పవన్‌కళ్యాణ్..!


జనసేనకు మరో 4 మంత్రి పదవులు

కూర్పుపై కసరత్తు చేస్తున్న చంద్రబాబు

నేడు టీడీఎల్పీ సమావేశం

సాక్షి, అమరావతి: జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ రాష్ట్ర మంత్రివర్గంలో చేరడం దాదాపు ఖరారైనట్లు ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వంలో భాగస్వామిగా ఉంటూనే ప్రధాన ప్రతిపక్షంగా సభలో అడుగు పెడతామని చెప్పడంతో పలు ఊహాగానాలు సాగాయి. అయితే తాజాగా పవన్ ప్రభుత్వంలో చేరాలని నిర్ణయించుకున్నట్లు జనసేన వర్గాలు తెలిపాయి. చంద్రబాబు, పవన్ మధ్య జరిగిన చర్చలో దీనిపై ఒక అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. పవన్ ఉప ముఖ్యమంత్రి హోదాలో పంచాయతీరాజ్ - గ్రామీణాభివృద్ధి శాఖలను నిర్వహిస్తారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తనతోపాటు జనసేన నుంచి గెలిచిన మరో నలుగురికి మంత్రి పదవులు ఇవ్వాలని పవన్ కోరగా చంద్రబాబు అందుకు సిద్ధమైనట్లు సమాచారం. ఇందులో ఒకటి నాదెండ్ల మనోహర్‌కి

మిగతా 3వ పేజీలో ▸



బీజేపీకి రెండో పదవిపై సందిగ్ధం

చంద్రబాబు విచక్షణకే వదిలేసిన బీజేపీ పెద్దలు

నేడు స్పష్టత వచ్చే అవకాశం

3 లో

వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడుతున్న ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



వైఎస్ జగన్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలు

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌ని పార్టీ ముఖ్య నాయకులు, ఇటీవలి ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు కలిశారు. సోమవారం తాడేపల్లిలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో ఆయనతో భేటీ అయ్యారు. చాలాసేపు పలు అంశాలపై చర్చించారు. వైఎస్ జగన్‌ను కలిసిన వారిలో ఎంపీలు గొల్ల బాబూరావు, మోపిదేవి వెంకటరమణ, మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, పాముల పుష్ప శ్రీవాణి, గుడివాడ అమర్‌నాథ్, నాయకులు రెడ్డి శాంతి, చిర్ల జగ్గిరెడ్డి, విశ్వాసరాయ కళావతి, బుట్టా రేణుక, చింతా అనురాధ, గొడ్డేటి మాధవి, శోభా హైమావతి, వంగా గీత, ధనలక్ష్మి, విజయ, డాక్టర్ సత్యవతి, ఉమాబాల, ఎల్ అప్పిరెడ్డి, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.



నాణ్యమైన మిరప పంట

ఈ-మిర్చ్ ప్రాజెక్టు విజయవంతం

మరో ఎనిమిది జిల్లాలకు విస్తరణ

14 లో

- నాలుగు జిల్లాల్లో 67 వేల మంది రైతులకు సాంకేతికత
- క్వింటాకు రూ.1,850 అదనపు లబ్ధిపొందిన రైతులు
- ఇదే స్ఫూర్తితో 2024-25లో మరో 8 జిల్లాల్లో మిర్చి 2.0 ప్రాజెక్టు
- మిరపతో పాటు పసుపు, వేరుశనగ, టమాటా పంటలు కూడా..
- వచ్చే రెండేళ్లలో ఐదు లక్షల మంది రైతులకు డిజిటల్ సాంకేతికత



జూలై 10న 13 అసెంబ్లీ స్థానాల్లో ఉప ఎన్నికలు

పశ్చిమబెంగాల్‌లోని నాలుగు సీట్లు సహా దేశవ్యాప్తంగా ఏడు రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ స్థానాలకు జూలై 10న ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఎమ్మెల్యేల ఆకస్మిక మరణాలు, రాజీనామాల వల్ల ఆయా స్థానాలు ఖాళీ అయ్యాయని తెలిపింది.

- వివరాలు 6లో

నేడు రాయలసీమలో భారీ వర్షాలు!

రేపు, ఎల్లుండి కోస్తాంధ్రకు తేలికపాటి వానలు

స్థిరంగా కదులుతున్న నైరుతి రుతుపవనాలు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు స్థిరంగా కదులుతున్నాయి. గాలుల కోత, షీర్ జోన్ ప్రస్తుతం సముద్రమట్టానికి 3.1 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది. మరోవైపు మరఠ్వాడా ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. వీటి ప్రభావంతో రాష్ట్రంలో రానున్న మూడు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయి. మంగళవారం రాయలసీమలో కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం తెలిపింది. మంగళవారం అల్లూరి సీతారామరాజు, కృష్ణా, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో, బుధవారం నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు,



బాపట్ల, పల్నాడు, ప్రకాశం, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురుస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వివరించింది. గురువారం బాపట్ల, కోనసీమ, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురవవచ్చని పేర్కొంది.

క్లుప్తంగా...

ఎంపీ సీఎం రమేష్ స్వగ్రామంలో వైఎస్సార్‌సీపీ ఏజెంట్‌పై దాడి


బాదుల్లా చేతికి గాయమైన దృశ్యం

ఎర్రగుంట్ల: వైఎస్సార్ జిల్లా ఎర్రగుంట్ల మండలంలోని ఎంపీ సీఎం రమేష్ స్వగ్రామమైన పోట్లదుర్తిలో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఏజెంట్‌గా కూర్చున్న బాదుల్లాపై టీడీపీ కార్యకర్తలు దాడిచేసి గాయపరిచారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై ఎర్రగుంట్ల పోలీసులు విచారించి ఇద్దరు టీడీపీ కార్యకర్తలపై కేసు నమోదు చేశారు.

ఆదిమూర్తిపురంలో ప్రహరీ, మెట్లు కూల్చివేత

టీడీపీ నాయకుల దుశ్చర్య


జేసీబీ ద్వారా ప్రహరీని ధ్వంసం చేసిన దృశ్యం

కొండాపురం: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కొండాపురం మండలం గానుగపెంట పంచాయతీ ఆదిమూర్తిపురంలో టీడీపీ నేతలు రెచ్చిపోయారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్త తుమ్మల బాలయ్య ఇంటి ప్రహరీని, మెట్లను గ్రామ టీడీపీ నాయకులు ధ్వంసం చేశారు. ఎన్నికల కౌంటింగ్ జరిగిన రోజు రాత్రి టీడీపీ నాయకులు యాగర్లమూడి శ్రీనివాసులు, పాటిబండ్ల వేణు, తలపనేని నరసింహులు జేసీబీతో తమ ప్రహరీని, మెట్లను కూల్చేసినట్లు బాధితుడు బాలయ్య సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలయ్య వైఎస్సార్‌సీపీకి ఓటేసినందుకు టీడీపీ నాయకులు ఈ దాష్టీకం చేశారని గ్రామస్తులు తెలిపారు. ఈ మేరకు టీడీపీ నాయకులపై కొండాపురం ఎస్‌ఐ మహేంద్ర కేసు నమోదు చేశారు. ఇదే క్రమంలో బాలయ్య తరఫున వెళ్లిన మాధవరపు మాల్యాద్రి, ఈర్ల మనోహర్‌పై టీడీపీ నాయకులు తప్పుడు కేసులు నమోదు చేయించారు. రాజీ కుదిర్చేందుకు తనకు మద్దతుగా వచ్చిన వారిపై కేసు నమోదు చేయడం అన్యాయమని, ఉన్నతాధికారులు స్పందించి కేసును విచారించి తనకు న్యాయం చేయాలని బాలయ్య కోరారు. ఈ విషయమై ఎస్‌ఐ మహేంద్రను వివరణ కోరేందుకు పలుమార్లు ప్రయత్నించినా స్పందించలేదు. కలిగిరి సీఐ ఫిరోజ్‌ను వివరణ కోరగా రెండువర్గాల్లో ముగ్గురు ముగ్గురి మీద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

హుసేనాపురంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి

ఓర్వకల్లు: కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం హుసేనాపురంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త వెంగన్నపై సోమవారం తెలుగుదేశం కార్యకర్తలు దాడిచేసి గాయపరిచారు. గ్రామానికి చెందిన వెంగన్న ఎన్నికల ఫలితాల అనంతరం కర్నూలులోనే నివాసం ఉంటున్నారు. ఆయన వ్యక్తిగత పనిమీద ఆదివారం రాత్రి స్వగ్రామానికి రావడాన్ని గమనించిన టీడీపీ కార్యకర్తలు దాడిచేయాలని నిర్ణయించుకున్నారు. సోమవారం సాయంత్రం కారులో కర్నూలు బయలుదేరిన వెంగన్న మార్గంమధ్యలో కారుకు గాలి పట్టించుకుంటుండగా టీడీపీ కార్యకర్తలు గువ్వ రవికుమార్, బోయ రాము తదితరులు దాడిచేశారు. కారు అద్దాలను ధ్వంసం చేశారు. దుర్భాషలాడుతూ కారులోని వెంగన్నపై దాడిచేసి కొట్టారు. తప్పించుకున్న వెంగన్న పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. గాయపడిన వెంగన్నను పోలీసులు కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంగన్నను పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పరామర్శించారు. ఇదిలా ఉండగా ఓర్వకల్ మండలం మీదివేముల గ్రామంలో శుక్రవారం టీడీపీ నాయకులు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలపై దాడులు చేసిన విషయం తెలిసిందే. టీడీపీ విజయాన్ని పురస్కరించుకొని గ్రామంలో టీడీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా వెళుతూ వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై బీరు సీసాలు విసరడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో వైఎస్సార్‌సీపీకి చెందిన గొల్ల పెద్దన్నయ్య, మద్దిలేటి, రాణీ, అశోక్, చిట్టెన్న, హరీంద్ర, క్రిష్ణయ్య, చిన్నయ్య, వెంకటేశ్వర్లు, బుడ్డన్న, పెద్దయ్యలు గాయాలపాలయ్యారు.

ఎంటీఎస్ ఉపాధ్యాయుల సర్వీస్ పునరుద్ధరణ

సాక్షి, అమరావతి: మినిమం టైమ్ స్కేల్(ఎంటీఎస్) ఉపాధ్యాయులుగా నియమితులైన 1998, 2008 ఉపాధ్యాయుల సర్వీసును మరో 11 నెలలు పునరుద్ధరించారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ప్రవీణ్ ప్రకాశ్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరి సర్వీసు ఈ నెల ఒకటో తేదీ నుంచి 2025 ఏప్రిల్ 30 వరకు కొనసాగుతుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌ను కలిసిన పార్టీ ముఖ్య నేతలు

పరాకాష్టకు విధ్వంసకాండ

▶ మొదటి పేజీ తరువాయి

చేస్తున్నారు. పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలో ఇదివరకు ఇలా ఎప్పుడైనా జరిగిందా? ఇప్పుడే ఎందుకు ఇలా జరుగుతోంది? టీడీపీ నేతలు, కార్యకర్తలు నేరుగా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని విధ్వంసం సృష్టిస్తుంటే.. ప్రభుత్వ ఆస్తులను పాడు చేస్తుంటే.. స్పందించాల్సిన పోలీసులు ఎందుకు చేష్టలుడిగి చూస్తున్నారు? నిజంగా ఈ పరిణామం ఖాకీ డ్రస్సుకే అవమానం.



రాయచోటిలో ధ్వంసమైన ప్రభుత్వ భవనాలు

దేశ చరిత్రలో ఇదివరకెన్నడూ లేని రీతిలో గత ఐదేళ్లలో గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాల భవనాలు వెలిశాయి. ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్‌లు, సచివాలయాలు, కొత్త రూపు రంగరించుకున్న స్కూళ్లు.. ఇలా ఎన్నెన్నో ప్రభుత్వ బిల్డింగ్‌లు నిర్మాణమయ్యాయి. ఒక్కో గ్రామానికి కోట్లాది రూపాయల విలువైన ఆస్తి సమకూరింది. ఇదంతా ప్రజలందరి ఉమ్మడి ఆస్తి. భద్రంగా కాపాడుకోవాలి. అలాంటిది పని గట్టుకుని ఊరూరా టీడీపీ సేన గునపాలు చేత పట్టుకుని ధ్వంసం చేస్తుండటాన్ని ఏమనాలి? రౌడీయిజం, దౌర్జన్యం, ఉన్మాదం.. ఇలా ఈ పదాలన్నీ తక్కువే. ఎవర్ని చూసుకుని ఇలా పేట్రేగిపోతున్నారు? చంద్రబాబు, లోకేశ్‌లను చూసుకునే కదా!

బాపట్ల జిల్లాలో పిండ ప్రదానం చేస్తుంటే అడ్డుకోవడం.. మంగళగిరిలో వైఎస్సార్‌సీపీ అభిమాని ఇంటిని జేసీబీతో కూల్చేయడం.. ఏకంగా నెల్లూరు మేయర్ దంపతులనే బెదిరించడం.. ఇదే జిల్లా దత్తులూరు మండలంలో జగనన్న లే అవుట్‌లోని ఇళ్లను ధ్వంసం చేయడం.. కొండాపురం మండలం గానుగపెంటలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇంటి ప్రహరీ, మెట్లు కూల్చేయడం.. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్న వారిని భయభ్రాంతులకు గురి చేయడం.. ఇకపై పోస్టులు ఆపేస్తామని వారితో ప్రకటనలు ఇప్పించడం.. తప్పుడు కేసులు పెట్టడం.. ఇలా ఒక్కో ఊళ్లో ఒక్కో అరాచకం కళ్లెదుటే కనిపిస్తోంది ఒక్క పోలీసులకు తప్ప అందరికీ.

జగనన్న లేఅవుట్‌లోని ఇళ్లు ధ్వంసం

ఏరుకొల్లు ఎస్సీ కాలనీలో టీడీపీ నేత నిర్వాకం

టీడీపీ నేతను అదుపులోకి తీసుకున్న పోలీసులు


టీడీపీ నాయకుడు ధ్వంసం చేసిన జగనన్న లేఅవుట్‌లోని ఇళ్లు

దుత్తలూరు: జగనన్న లేఅవుట్లలోని ఇళ్లను కూడా టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేస్తున్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలం ఏరుకొల్లు పంచాయతీలో జగనన్న లేఅవుట్‌లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎస్సీలకు 36 ఇళ్లు మంజూరు చేసింది. వాటిలో 20 ఇళ్లు పునాది దశలో ఉన్నాయి. ఎస్సీ కాలనీవాసులు వైఎస్సార్‌సీపీకి ఓటేశారనే అక్కసుతో సోమవారం సాయంత్రం అదే పంచాయతీ రావిళ్లవారిపల్లికి చెందిన పిడికిటి వెంకటేశ్వర్లు జేసీబీతో ధ్వంసం చేశాడు. ఇదేమని ప్రశ్నిస్తే మీ దిక్కున్న చోట చెప్పుకోండని బెదిరించాడని ఎస్సీ కాలనీవాసులు తెలిపారు. ధ్వంసం చేసిన తొమ్మిది ఇళ్లలో 6 కాంట్రాక్టర్ నిర్మించగా 3 ఇళ్లు సొంతంగా నిర్మించుకుంటున్నారు. ఇళ్ల కూల్చివేతను ఎస్సీ కాలనీవాసులు అడ్డుకొన్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో కావలి డీఎస్పీ వెంకటరమణ, ఉదయగిరి సీఐ గిరిబాబు, ఎస్సై ఉమాశంకర్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. రెవెన్యూ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. తమ ఇళ్లను ధ్వంసం చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ కాలనీవాసులు డిమాండ్ చేశారు. పోలీసులు టీడీపీ నాయకుడు పిడికిటి వెంకటేశ్వర్లును, జేసీబీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు మంగళవారం వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

రేషన్ పంపిణీ వాహనంపై దాడి

వైఎస్ జగన్ ఫొటో చింపేసి.. టైర్లు కోసేసిన వైనం.. శ్రీకాకుళం జిల్లాలో ఘటన

కాశీబుగ్గ: ఎన్నికల్లో టీడీపీ గెలిచినప్పటి నుంచి అనేకరకాలుగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు దాడులకు తెగబడుతున్నారు. ప్రభుత్వ ఆస్తులపైనా దాడులు చేస్తూ ప్రజలకు అందుతున్న సేవలను నిలిపివేయాలని కుట్రలకు పాల్పడుతున్నారు. తాజాగా శ్రీకాకుళం జిల్లా పలాస మండలం గురుదాసుపురం సచివాలయం పరిధిలో ఉన్న సున్నాదేవి గ్రామంలో రేషన్ వాహనాన్ని ధ్వంసం చేశారు. గ్రామంలో ఆదివారం రాత్రి రేషన్ పంపిణీ చేసి చీకటి పడ్డాక వాహనాన్ని నిలిపి ఉంచారు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు వాహనం వద్దకు వచ్చి దానిపైన ఉన్న వైఎస్ జగన్ చిత్రపటాన్ని చించేశారు. వాహనం ఎడమ టైరును కోసేశారు. అక్కడితో ఆగకుండా వాహనానికి చుట్టూరా గీతలు గీసి రాళ్లతో కొట్టారు. వాహనం ఆపరేటర్ కిరణ్‌కుమార్ యాదవ్ వాహనం వద్దకు వెళ్లి చూసేసరికి టైర్లు కోసి బండి పాడైపోయి కనిపించింది. దీంతో అక్కడ రేషన్ పంపిణీ ఆగిపోయింది. ఉద్దానం ప్రాంతంలో ఉన్న మరో మూడు గ్రామాలకు సోమవారం బియ్యం పంపిణీ చేయాల్సి ఉండగా నిలిపివేసి పోలీసులకు సమాచారం అందించారు.


దాడికి గురైన వాహనం (ఇన్‌సెట్‌లో) కోసేసిన టైరు

ఒంగోలులో వైఎస్సార్‌సీపీ నాయకుడిపై టీడీపీ దాడి

మేకులు ఉన్న కర్రలతో కొట్టడంతో తీవ్ర గాయాలు


గాయపడిన మురళీకృష్ణ

ఒంగోలు టౌన్: నగరానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ కౌన్సిలర్ బొమ్మినేని మురళీకృష్ణపై టీడీపీ శ్రేణులు దాడి చేశారు. బొమ్మినేని మురళీకృష్ణ సోమవారం సాయంత్రం 5.30 సమయంలో ఒంగోలులోని మహాలక్ష్మి గుడి పక్కన ఉండగా టీడీపీకి చెందిన కొందరు వచ్చి మూకుమ్మడిగా దాడి చేశారు. కొద్దిసేపటికి స్కార్పియో వాహనంలో వచ్చిన మరికొందరు కూడా ఆయనపై దాడి చేశారు. మురళిని కిందపడేసి మేకులు కొట్టిన కర్రలతో కొట్టడంతో తీవ్రంగా గాయపడి, స్పృహ తప్పి పడిపోయాడు. ఆ తర్వాత టీడీపీ కార్యకర్తలు వెళ్లిపోయారు. తీవ్రంగా గాయపడిన మురళీకృష్ణను వెంటనే స్థానికులు జీజీహెచ్‌కు తరలించారు. కమ్మపాలేనికి చెందిన ఉండవల్లి రాము ఉరఫ్ క్యాట్ రాం, వెజెండ్ల సాయి, బలరాం కాలనీకి చెందిన శివ తదితరులు తనపై దాడి చేసినట్లు బాధితుడు మురళీకృష్ణ తెలిపారు.

చేతనైతే మంచి చేయండి

- టీడీపీకి మాజీ ఎమ్మెల్యే గడికోట హితవు
- ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం దారుణం
- పోలీసుల ఉదాశీన వైఖరే కారణం
- హోదా సాధనకు ఇదే సమయం
- అందుకు మేం కూడా మద్దతిస్తాం



రాయచోటి/రాయచోటి రూరల్: అధికారాన్ని దక్కించుకున్న వారు చేతనైతే అభివృద్ధితో ప్రజల మనసులను చూరగొనాలే కానీ ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తూ రాజకీయ ప్రత్యర్థులపై దాడులకు తెగబడటం ఏమిటని అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో గెలుపు, ఓటములు సహజమని, అధికారంలోకి వచ్చిన వారు అందరికీ మంచి చేస్తూ ముందుకు సాగాలన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం రాష్ట్రంలో విచ్చలవిడిగా సాగుతున్న హింసాకాండకు అడ్డుకట్ట వేయాల్సిన పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. సోమవారం రాయచోటిలోని పార్టీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషాతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు.

తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలి..

నిర్మాణాలు పూర్తి చేసుకున్న సచివాలయాలపై అల్లరి మూకలు దాడులకు తెగబడి బోర్డులు ధ్వంసం చేయటాన్ని గడికోట తీవ్రంగా ఖండించారు. ప్రజల ఆస్తులైన ప్రభుత్వ కార్యాలయాలను ధ్వంసం చేయడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ఫలితాలు అనంతరం టీడీపీకి చెందిన అల్లరి మూకలు సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్స్‌పై దాడులు చేస్తూ అరాచకం సృష్టిస్తున్నాయన్నారు. రామాపురం మండలం చిట్లూరు, రాయచోటి రూరల్ మండలం శిబ్యాల గ్రామ సచివాలయాల్లో సంఘ విద్రోహ శక్తులు విధ్వంసం సృష్టించాయని చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను ప్రజలంతా గమనిస్తున్నారని చెప్పారు. ప్రజలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు అనునిత్యం అండగా ఉంటాయని స్పష్టం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలపై జరుగుతున్న దాడులపై కలెక్టర్ తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై అక్రమ కేసులు నమోదు చేయడంపై మండిపడ్డారు. ప్రజల తీర్పు ఎప్పుడూ ఒకవైపే ఉండదని గుర్తుంచుకోవాలని సూచించారు. దాడులు, పోలీసుల నిర్లిప్త వైఖరిపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

హోదా ఇస్తేనే మద్దతివ్వాలి

కేంద్రంలో బీజేపీకి సంపూర్ణ మెజార్టీ రాకపోవడం ఏపీకి ప్రత్యేక హోదా సాధనకు సువర్ణావకాశమని గడికోట పేర్కొన్నారు. చంద్రబాబు దీన్ని సద్వినియోగం చేసుకుంటూ రాష్ట్రానికి మేలు చేయాలని సూచించారు. ప్రత్యేక హోదా ఇస్తేనే కేంద్రానికి మద్దతు ఇస్తామని గట్టిగా చెబితే కచ్చితంగా సాధించే వీలుందన్నారు. ప్రత్యేక హోదా సాధన కోసం వైఎస్సార్ సీపీకి చెందిన 11 మంది రాజ్యసభ సభ్యులతోపాటు నలుగురు లోక్‌సభ ఎంపీలు అండగా నిలబడతారని చెప్పారు. పోలవరానికి రూ.12 వేల కోట్లు కేంద్రం నుంచి రావాల్సి ఉందని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గట్టిగా ఒత్తిడి చేయడంతో ఈ ప్రక్రియ ఓ కొలిక్కి వచ్చిందని వివరించారు.

మహాత్మా.. దాడులు అరికట్టు

- పాలకులకు మంచి బుద్ధిని ప్రసాదించు
- భాకరాపేటలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి శాంతియుత నిరసన


గాంధీ విగ్రహం వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

భాకరాపేట (తిరుపతి జిల్లా): 'చంద్రగిరి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, దోపిడీలను అరికట్టు.. శాంతిని నెలకొల్పు.. పాలకులకు మంచి బుద్ధి ప్రసాదించు మహాత్మా'.. అంటూ చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి శాంతియుతంగా నిరసన చేపట్టారు. ఈ మేరకు సోమవారం తిరుపతి జిల్లా భాకరాపేటలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ఆయన నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఇటీవల భాకరాపేట కూడలి వద్ద వైఎస్సార్‌సీపీ జెండా దిమ్మెను టీడీపీ కార్యకర్తలు పగలగొట్టిన సంగతి తెలిసిందే. అలాగే రెండు రోజులు క్రితం వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు ఇర్షాద్ తల పగలగొట్టారు. చంద్రగిరి, పాకాల, రామచంద్రాపురం మండల్లాలోని వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తల ఇళ్లను టీడీపీ శ్రేణులు ధ్వంసం చేశాయి. దీంతో ఈ దాడులను అరికట్టాలంటూ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మహాత్ముని విగ్రహానికి అంజలి ఘటించి వినతిపత్రం సమర్పించారు. చంద్రగిరి నియోజకవర్గంలో దౌర్జన్యాలను ఆపి శాంతిని ప్రసాదించాలని విన్నవించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని మొరపెట్టుకున్నారు. ప్రజలు అధికారం ఇస్తే అందరికి మంచి చేయాలే తప్పా ఇలా రాజకీయ కక్షలతో దాడులు చేయడం సరికాదని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు స్పష్టం చేశారు. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఏ ఒక్క టీడీపీ నేత, కార్యకర్తకు కూడా హాని తలపెట్టలేదన్నారు. అయితే ఇప్పుడు టీడీపీ నాయకులు, కార్యకర్తలు దాడులకు దిగుతుండటం సమంజసం కాదన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సరిపల్లిలో టీడీపీ, జనసేన కార్యకర్తల విధ్వంసం


శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన దృశ్యం

కొయ్యలగూడెం: ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం సరిపల్లి గ్రామంలో సచివాలయ భవనాన్ని ఆదివారం జనసేన, టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. మాజీ ఎమ్మెల్యే బాలరాజు శిలాఫలకాన్ని, సచివాలయం నిర్మించ తలపెట్టిన సామగ్రిని ధ్వంసం చేశారు. టీడీపీ, జనసేన కార్యకర్తలు విజయోత్సవ ర్యాలీ పేరిట ప్రణాళిక ప్రకారం నూతనంగా నిర్మిస్తున్న సచివాలయ భవనం వద్దకు చేరుకుని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, తెల్లం బాలరాజు ఫ్లెక్సీలను, శిలాఫలకాలను ధ్వంసం చేశారు. సచివాలయ కార్యాలయంలోని సామగ్రిని పగలగొట్టి వీరంగం సృష్టించారు. ఎవరైనా అడ్డుకుంటే అంతుచూస్తామంటూ భవన నిర్మాణ కార్మికులను బెదిరించారు. పక్కన నిర్మాణంలో ఉన్న మహానేత వైఎస్సార్ విగ్రహం, స్మారక మందిరం వద్ద దాడులకు పాల్పడుతున్న సమయంలో సమీపంలోని రైతులు ఎదురు తిరగడంతో విరమించుకున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు పీఏసీఎస్ అధ్యక్షురాలు మందపాటి శ్రీదేవి తెలిపారు.


కొయ్యలగూడెం మండలం సరిపల్లి సచివాలయ భవనంపై దాడి చేస్తున్న కూటమి పార్టీ కార్యకర్త

మాంబట్టు సెజ్‌లో భారీ అగ్నిప్రమాదం

పాత వస్తువులు డంపింగ్ చేసే చోట ఎగసిపడిన మంటలు

తిరుపతి జిల్లా తడలో ఘటన


అగ్నిప్రమాదంలో డంపింగ్ యార్డు వద్ద ఎగిసిపడుతున్న మంటలు సమీపంలోని అల్యూమినియం కంపెనీ వైపు దూసుకొస్తున్న దృశ్యం

తడ (తిరుపతి జిల్లా): పరిశ్రమల్లో లభించే పాత వస్తువులను సేకరించే ఒక సంస్థ నిబంధనలకు విరుద్ధంగా పరిశ్రమలకు సమీపంలో నెలకొల్పిన డంపింగ్ యార్డులో సోమవారం భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. తిరుపతి జిల్లా తడలోని మాంబట్టు ఏపీఐఐసీ పారిశ్రామికవాడలో నిల్వ ఉంచిన చెత్తకు నిప్పు అంటుకోవడంతో భారీ ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. దీంతో పొగ ఆకాశాన్ని అంటుకుని చీకట్లు కమ్మేయడంతో సమీప పరిశ్రమల్లోని కార్మికులు ఆందోళన చెందారు. నాయుడుపేట సీఐ శ్రీనివాసులురెడ్డి, సూళ్లూరుపేట సీఐ మధుబాబు, తడ, సూళ్లూరుపేట ఎస్‌ఐలు నరశింహారావు, రహీంరెడ్డి తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. సూళ్లూరుపేట, అపాచీ పరిశ్రమలకు చెందిన రెండు ఫైరింజన్లు మంటలు అదుపు చేసేందుకు శ్రమించాయి. మంటలతోపాటు మంటల్లో నుంచి భారీ శబ్దాలతో పేలుళ్లు వస్తుండటంతో పోలీసులు ఆ దారిన రాకపోకలు అడ్డుకుని ఇతర మార్గాల్లో వాహనాలు మళ్లించారు. కాగా పరిశ్రమలకు సమీపంలో ఎలాంటి జాగ్రత్తలు లేకుండా ఉన్న డంపింగ్ యార్డు వల్ల తీవ్ర ఇబ్బందులు జరుగుతాయని ఏడాది క్రితం సూళ్లూరుపేట ఫైర్ అధికారులు తిరుపతికి చెందిన స్థల యజమాని హర్షవర్ధన్, చెత్త సేకరించి నిల్వ చేసుకునేందుకు స్థలాన్ని లీజుకు తీసుకున్న షేర్ అలీ అనే వ్యక్తులకు సమాచారం ఇచ్చినా వారు పెడచెవిన పెట్టారని ఫైర్ సిబ్బంది తెలిపారు. డంపింగ్ యార్డులో పనికి రాని చెత్త మాత్రమే కాలిపోగా ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని ఆనుకుని ఉన్న అల్యూమినియం క్యాస్టింగ్ కంపెనీ తీవ్రంగా నష్టపోయింది.

క్లుప్తంగా...

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టండి

డీఎంహెచ్‌వోలకు వైద్య శాఖ ఆదేశం

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని, అంటు వ్యాధులు ప్రబలకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారుల(డీఎంహెచ్‌వో)ను వైద్య శాఖ ఆదేశించింది. వరదల వల్ల ప్రభావితమయ్యే లోతట్టు ప్రాంతాలను గుర్తించి ముందస్తు కార్యాచరణ రూపొందించాలని సూచించింది. అవసరం మేరకు ఏ సమయంలోనైనా సేవలందించడానికి వీలుగా ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించింది. ఒక మెడికల్ ఆఫీసర్‌తో పాటు ఎంఎల్‌హెచ్‌పీ, ఎంపీహెచ్‌ఏలతో కూడిన ప్రత్యేక వైద్య బృందాలను అందుబాటులో ఉంచుకోవాలని స్పష్టం చేసింది. ప్రతి మండల స్థాయిలో ఒక 104, 108 వాహనాన్ని అందుబాటులో ఉంచుకోవాలని సూచించింది. ప్రసవానికి వారం రోజుల సమయం ఉన్న గర్భిణులను గుర్తించి.. వారిని ఆస్పత్రులకు తరలించడానికి అవసరమైన ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆదేశించింది.

కస్టోడియల్ టార్చర్‌పై రఘురామ ఫిర్యాదు

నగరంపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ ప్రభుత్వంలో కస్టోడియల్ టార్చర్ చేశారని మాజీ ఎంపీ, ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు సోమవారం మెయిల్ ద్వారా గుంటూరు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తనపై పోలీస్ కస్టడీలో జరిగిన హత్యాయత్నానికి బాధ్యులుగా సీఐడీ మాజీ చీఫ్ సునీల్‌కుమార్, ఐపీఎస్ అధికారి సీతారామాంజనేయులు, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, సీఐడీ ఎస్పీ విజయపాల్‌ను పేర్కొన్నారు. అలాగే, తనకు అయిన గాయాలపై కోర్టుకు తప్పుడు నివేదిక ఇచ్చిన అప్పటి గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి పేరును కూడా పేర్కొంటూ ఆయన మెయిల్‌లో ఫిర్యాదు చేశారు.

అమరావతి అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

అధికారులకు సీఆర్డీఏ కమిషనర్ ఆదేశాలు



రాయపూడిలో నిర్మిస్తున్న తాగునీటి శుద్ధి ప్లాంట్ పనులను పరిశీలిస్తున్న వివేక్‌యాదవ్

సాక్షి, అమరావతి/తాడికొండ: ఏపీ సీఆర్డీఏ పరిధి రాయపూడిలో నిర్మిస్తున్న తాగునీటి శుద్ధి ప్లాంట్ పనుల్లో వేగం పెంచాలని సీఆర్డీఏ కమిషనర్ వివేక్‌యాదవ్ అధికారులను ఆదేశించారు. రోజుకు కోటి లీటర్ల(10 ఎంఎల్‌డీ) తాగునీటిని సరఫరా చేసే ప్లాంట్ పనులను సోమవారం ఆయన సంస్థ అధికారులతో కలిసి పరిశీలించారు. రాజధానిలోని ఏపీ సచివాలయం, హైకోర్టు, అసెంబ్లీ భవనాలతో పాటు వివిధ విశ్వవిద్యాలయాలకు సంబంధించి రోజుకు 75 వేల జనాభాకు సరిపడే తాగునీటిని ఈ ప్లాంటు ద్వారా సరఫరా చేయనున్నారు. ఈ క్రమంలో నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కమిషనర్ ఆదేశించారు. అమరావతిలోని సీడ్ యాక్సెస్ రోడ్డు, కరకట్ట రోడ్డుపై రెండు వేలకు పైగా ఉన్న విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేశామని ఈ సందర్భంగా ఇంజినీరింగ్ అధికారులు కమిషనర్ దృష్టికి తీసుకురాగా, వెంటనే దీపాలను వెలిగించాలని సూచించారు. అమరావతిలో ప్రధాన అనుసంధాన రహదార్లపై జంగిల్ క్లియరెన్స్ పనులను, అమరావతి స్మార్ట్ సిటీ పనులను పరిశీలించిన వివేక్‌యాదవ్.. అధికారులకు పలు సూచనలు చేశారు.

కూటమి నేతల దాడులను నిలువరించాలి

- గవర్నర్ వెంటనే చర్యలు తీసుకోవాలి
- వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంత్ నాయక్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కూటమి విజయం సాధించిన రోజు నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులపై విచక్షణారహితంగా దాడులు చేస్తున్నారని ఆ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్ మండిపడ్డారు. వెంటనే రాష్ట్ర గవర్నర్ జోక్యం చేసుకొని ఈ దాడులను నిలువరించాలని విన్నవించారు. ఆడ, మగ తేడా లేకుండా, అడ్డూ అదుపు లేకుండా టీడీపీ శ్రేణులు భౌతిక దాడులు, ఆస్తుల విధ్వంసానికి పాల్పడుతున్నాయన్నారు. హనుమంతు నాయక్ సోమవారం గుంటూరు జిల్లా తాడేపల్లిలో మీడియాతో మాట్లాడారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలతో పాటు అనేక ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కూటమి కార్యకర్తలు దాడులకు పాల్పడుతున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం కోరుకుంటున్న మార్పు ఇదేనా అని ప్రశ్నించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయకుండానే కొంత మంది అధికారులపై కక్ష కట్టి వారిని వేధిస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నామినేటెడ్ పదవులు పొందిన వారికి కాలపరిమితి ఉన్నప్పటికీ వారిని రాజీనామా చేయాలని ఆదేశించడం అన్యాయమన్నారు.

‘సన్‌ఫ్లవర్’ సలసలా

ఉక్రెయిన్‌లో ఉత్పత్తులు పడిపోవడమే కారణం..

- రష్యా నుంచి నూనెల దిగుమతులు
- అంతర్జాతీయ మార్కెట్‌లో మార్పులతో ఒక్కసారిగా పెరిగిన ధర
- సెప్టెంబర్ వరకు ఈ పరిస్థితి ఇంతే



తాడేపల్లిగూడెం: సన్‌ఫ్లవర్ నూనెకు ధరల స్ట్రోక్ తగిలింది. ఇటీవలి కాలంలో పామాయిల్ కంటే తక్కువ రేటుకు పడిపోయిన ఈ నూనె ధరలు ఇప్పుడు మళ్లీ పెరగడం ప్రారంభించాయి. పామాయిల్, పామ్ క్రూడ్, రిఫైన్డ్ పామాయిల్ మలేసియా, ఇండోనేషియా దేశాల నుంచి దిగుమతి అవుతాయి. మలేసియాలో పంట దిగుబడులు, కూలీల లభ్యత, వాతావరణ పరిస్థితుల ఆధారంగా, అంతర్జాతీయ విపణి సూత్రం ఆధారంగా డాలర్ల ధరల్లో వ్యత్యాసాలతో పామాయిల్ ధరలు ప్రభావితమయ్యేవి. రిఫైన్డ్ పామాయిల్ దిగుమతి ఖర్చుతో కూడుకునే వ్యవహారం కావడంతో, పామ్ క్రూడ్‌ను మాత్రమే రాష్ట్రంలోని కాకినాడ, కృష్ణపట్నం వంటి పోర్టుల ద్వారా దిగుమతి చేసుకునేవారు. ఈ పోర్టుల సమీపంలో ఉండే నూనె శుద్ధి కర్మాగారాలు (రిఫైనరీలు) పామ్ క్రూడ్‌ను శుద్ధిచేసి మార్కెట్లకు పంపించేవి. ఒకప్పుడు ఆకాశాన్నంటిన పామాయిల్ ధరలు ఇటీవల దాదాపుగా దిగొచ్చాయి. పామాయిల్‌తో పోల్చుకుంటే సన్‌ఫ్లవర్ నూనె ధర ఎక్కువగా ఉండేది. దీనికి భిన్నంగా పామాయిల్ ధర కంటే దిగువకు సన్‌ఫ్లవర్ నూనె దిగింది. అంతర్జాతీయ విపణిలో మార్పుల నేపథ్యంలో ఇప్పుడు ఒక్కసారిగా సన్‌ఫ్లవర్ నూనె ధర పెరిగింది.

ఉక్రెయిన్ ప్రభావం

సన్‌ఫ్లవర్ ఎక్కువగా మన ప్రాంతానికి ఉక్రెయిన్ నుంచి దిగుమతి అవుతుంది. అక్కడ ఉత్పత్తులు పడిపోయిన కారణంగా రష్యా నుంచి ఈ నూనెను దిగుమతి చేసుకుంటున్నారు. ఉక్రెయిన్ కంటే భారతదేశానికి రష్యా మీదుగా నూనెను రవాణా చేయడంతో ఖర్చు అధికం అవుతోంది. ప్రీమియంగా పేర్కొనే ధర టన్నుకు వంద డాలర్లు పెరుగుతోంది. దీంతో గుత్త మార్కెట్‌లో టన్నుకు రూ.200కు పైబడి ధర పెరుగుతోంది. ఈ ధర ఇటీవల పెరుగుతూ వెళ్తోంది. రష్యా నుంచి సన్‌ఫ్లవర్ నూనెను దిగుమతి చేసుకోవాల్సిందే. ఈ పరిస్థితి సెప్టెంబరు వరకు ఉంటుందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

రష్యా నుంచి దిగుమతి వల్లే ధర పెరుగుదల

మార్కెట్‌లో సన్‌ఫ్లవర్ నూనెల ధరలు సెప్టెంబరు వరకు ఇదే విధంగా ఉండే అవకాశాలున్నాయి. ఉక్రెయిన్ నుంచి కాకుండా రష్యా నుంచి సన్‌ఫ్లవర్ నూనె దిగుమతి అవుతున్నందున మార్కెట్‌లో ఈ నూనె ధర పెరిగింది.
– పవన్, వ్యాపారి, తాడేపల్లిగూడెం

నిర్ణీత కొలతలు లేవు

గతంలో మాదిరిగా నూనెలకు నిర్ణీత కొలతలు లేవు. కిలో, అరకిలో, లీటరు వంటి ప్యాకింగ్‌లకు కాలం చెల్లింది. ఫుడ్ అండ్ వెయిట్ అండ్ మెజర్స్ నిబంధనల్లో ఇటీవల కేంద్రం మార్పులతో చట్టం చేసింది. దీంతో ప్యాకింగ్ ఎంతైనా చేసుకోవచ్చు. ప్యాకెట్‌పై మాత్రం కొలత, గ్రాము ధర ఎంతనే వివరాలు కచ్చితంగా ఉండాలి. ఈ కారణంగా మార్కెట్‌లో లీటర్ పౌచ్‌లు లేవు. 850 గ్రాముల నూనె ప్యాకెట్లు మాత్రమే దొరుకుతున్నాయి.

సన్‌ఫ్లవర్ ప్యాకెట్ రూ.110

ప్రస్తుతం మార్కెట్‌లో సన్‌ఫ్లవర్ ప్యాకెట్ ధర రూ.110లు ఉంది. గతంలో ఈ ధర రూ.86కు పడిపోయింది. పామాయిల్ 850 గ్రాముల ధర రూ.86లు ఉంది. రైస్‌బ్రాన్ ఆయిల్ ప్యాకెట్ రూ.115లు, వేరుశనగ నూనె ప్యాకెట్ రూ.160లు ఉంది. ఈ ధరలు సెప్టెంబరు వరకు ఇదే రకంగా ఉండే అవకాశాలున్నాయి.

బీజేపీకి రెండో పదవిపై సందిగ్ధం

సాక్షి, అమరావతి: రాష్ట్ర మంత్రివర్గంలో బీజేపీకి ఒక మంత్రి పదవితోనే సరిపెడతారా? లేదంటే రెండో మంత్రి పదవి కేటాయిస్తారా? అనే అంశంపై చంద్రబాబు నుంచి ఇంకా స్పష్టత రాలేదని ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. టీడీపీ, జనసేన మంత్రి పదవులపై పూర్తిస్థాయి స్పష్టతపైనే బీజేపీకి రెండో మంత్రి పదవి ఆధారపడి ఉన్నట్లు చెబుతున్నారు. మంగళవారం సాయంత్రం లోపు దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. బీజేపీ కేంద్ర నాయకత్వం దీన్ని చంద్రబాబు విచక్షణకే వదిలేసిందనే చర్చ బీజేపీలో సాగుతోంది. 2014లో కేంద్ర మంత్రివర్గంలో టీడీపీకి రెండు పదవులు కేటాయించగా ప్రతిగా రాష్ట్ర మంత్రివర్గంలోనూ బీజేపీకి రెండు పదవులు దక్కాయి. ఈసారి జనసేనకు కూడా మంత్రివర్గంలో చోటు కల్పించాల్సి ఉన్నందున బీజేపీకి రెండు పదవులు కేటాయించడం సందేహాస్పదంగా మారింది.

పరిచయాలా.. సామాజిక వర్గమా

మంత్రి పదవి ఎంపికలో జాతీయ స్థాయిలో బీజేపీ పెద్దలతో పరిచయాలను పరిగణనలోకి తీసుకుంటారా? లేక సామాజిక వర్గం కోణంలో పదవులను కట్టబెడతారా? అనే అంశంపై చర్చ మొదలైంది. ఢిల్లీలో ఉండే పరిచయాల ఆధారంగా ఎంపిక చేసే పక్షంలో సుజనాచౌదరి లేదా సత్యకుమార్‌కు అవకాశం దక్కవచ్చని బీజేపీ నేతలు చెబుతున్నారు. సామాజికవర్గం కోణంలో చూసినా సుజనా మొదటి వరసలో ఉంటారని, ఆయనతో పాటు కామినేని శ్రీనివాస్, విష్ణుకుమార్‌రాజు, ఆదినారాయణరెడ్డిలలో ఒకరిద్దరికి పదవులు దక్కవచ్చనే చర్చ జరుగుతోంది.

డిప్యూటీ సీఎంగా పవన్‌కళ్యాణ్!

▶ మొదటి పేజీ తరువాయి

దక్కడం ఖాయమని చెబుతున్నారు. మిగిలిన పదవులకు కందుల దుర్గేష్, పంతం నానాజీ, ఆరణి శ్రీనివాసులు, వంశీకృష్ణ యాదవ్ పేర్లు వినిపిస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాల వారీగా పదవులు

చంద్రబాబు ఉమ్మడి జిల్లాల వారీగానే మంత్రి పదవులు ఇస్తారని చెబుతున్నారు. ఒకరిద్దరు ఎమ్మెల్సీలను మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశం కనిపిస్తోంది. నారా లోకేశ్ మంత్రివర్గంలో చేరాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. మంత్రి పదవుల కోసం టీడీపీలో తీవ్ర పోటీ నెలకొంది. శ్రీకాకుళం జిల్లా నుంచి అచ్చెన్నాయుడు, గౌతు శిరీష, కూన రవికుమార్, కొండ్రు మురళి రేసులో ఉన్నారు. అయితే శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్‌నాయుడికి కేంద్ర మంత్రివర్గంలో చోటు దక్కినందున అచ్చెన్నాయుడికి ఇవ్వటంపై సందిగ్ధం నెలకొంది. విజయనగరం జిల్లా నుంచి కళా వెంకట్రావు, సంధ్యారాణి పేర్లు వినిపిస్తున్నాయి. విశాఖ జిల్లా నుంచి అయ్యన్న పాత్రుడు, గంటా శ్రీనివాసరావు, వంగలపూడి అనిత, పల్లా శ్రీనివాస్ పోటీ పడుతున్నారు. తూర్పు గోదావరి జిల్లా నుంచి జ్యోతుల నెహ్రూ, నిమ్మకాయల చినరాజప్ప, యనమల రామకృష్ణుడు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి రేసులో ఉన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నుంచి నిమ్మల రామానాయుడు, రఘురామకృష్ణరాజు, పితాని సత్యనారాయణ పేర్లు వినిపిస్తున్నాయి. కృష్ణా జిల్లా నుంచి బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్, కొల్లు రవీంద్ర పేర్లను పరిశీలిస్తున్నారు. గుంటూరు జిల్లా నుంచి ధూళిపాళ్ల నరేంద్ర, నక్కా ఆనందబాబు, అనగాని సత్యప్రసాద్, కన్నా లక్ష్మీనారాయణల్లో ఒకరిద్దరికి అవకాశం లభించనుంది. ప్రకాశం జిల్లా నుంచి గొట్టిపాటి రవికుమార్, దామచర్ల జనార్దన్, బాలవీరాంజనేయస్వామి పోటీలో ఉన్నారు. నెల్లూరు జిల్లా నుంచి పి.నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆశావహుల జాబితాలో ఉన్నారు. చిత్తూరు జిల్లా నుంచి అమర్‌నాథ్‌రెడ్డి, కిశోర్ కుమార్‌రెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. అనంతపురం జిల్లా రేసులో పయ్యావుల కేశవ్, కాల్వ శ్రీనివాసులు, పరిటాల సునీత ఉన్నారు. కడప జిల్లా నుంచి రెడ్డప్పగారి మాధవిరెడ్డి, పుట్టా సుధాకర్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు చెబుతున్నారు. కర్నూలు జిల్లాలో కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, బీసీ జనార్దన్ రెడ్డి, జయనాగేశ్వర్‌రెడ్డిలో ఒకరిద్దరికి చోటు దక్కవచ్చని ప్రచారం జరుగుతోంది.

నేడు టీడీపీ శాసన సభాపక్ష సమావేశం

టీడీపీ శాసనసభాపక్ష సమావేశం మంగళవారం విజయవాడలోని ఏ కన్వెన్షన్ హాలులో జరగనుంది. ఈ సమావేశంలో చంద్రబాబును తమ నేతగా ఎన్నుకోనున్నారు. ఆ తర్వాత ఎన్డీఏ ఎమ్మెల్యేల సమావేశం జరగనుంది. దీనికి టీడీపీ, జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలు హాజరు కానున్నారు. అనంతరం రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను కలసి తమ నేతగా చంద్రబాబును ఎన్నుకున్న విషయాన్ని నివేదించి ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశమివ్వాలని లాంఛనంగా కోరనున్నారు.

పాఠశాలల పునఃప్రారంభం ఒకరోజు వాయిదా

- కొత్త ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం నేపథ్యంలో మార్పు
- ఎల్లుండి తెరుచుకోనున్న బడులు
- పుస్తకాలు, విద్యా కానుక పంపిణీ ఆలస్యం!

సాక్షి, అమరావతి: ఈ ఏడాది పాఠశాలలు ఒకరోజు ఆలస్యంగా తెరుచుకోనున్నాయి. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈనెల 12న పాఠశాలలు పునఃప్రారంభం కావాల్సి ఉండగా వాయిదా పడ్డాయి. అదే తేదీన నూతన ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని పాఠశాలలకు బుధవారం సెలవు ప్రకటించినట్టు తెలిసింది. దీంతో గురువారం పాఠశాలలు తెరుచుకోనున్నాయి. కాగా, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 1 నుంచి 10 తరగతుల విద్యార్థులకు గత ప్రభుత్వం పాఠశాలలు తెరిచిన మొదటిరోజే పాఠ్య పుస్తకాలతో పాటు యూనిఫామ్‌తో కూడిన విద్యా కానుక కిట్లు అందజేసింది. ఇలా వరుసగా నాలుగేళ్లు విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను అందించింది. అయితే, ఈ విద్యా సంవత్సరం పాఠ్య పుస్తకాలతో పాటు విద్యా కానుక కిట్ల పంపిణీ కూడా ఆలస్యం కానుంది. పుస్తకాలు మండల కేంద్రాలకు చేరినా నూతన విద్యాశాఖ మంత్రి వచ్చాకే వీటి పంపిణీపై నిర్ణయం తీసుకునే సూచనలు కనిపిస్తున్నాయి. పాఠశాల విద్యాశాఖ 36 లక్షల విద్యా కానుక కిట్లను సిద్ధం చేయగా, ఇప్పటి వరకు సగం మాత్రమే సరఫరా చేసినట్టు తెలుస్తోంది. ఈ కిట్‌లో అన్ని సబ్జెక్టుల పాఠ్యపుస్తకాలు, టోఫెల్ వర్క్ బుక్, ఫ్యూచర్ స్కిల్స్ సబ్జెక్ట్ పుస్తకంతో పాటు 3 జతల యూనిఫాం క్లాత్, స్కూల్ బ్యాగ్, బెల్ట్, ఆక్స్‌ఫర్డ్ నిఘంటువు.. 1–5 తరగతుల విద్యార్థులకు వర్క్‌బుక్స్, పిక్టోరియల్ డిక్షనరీ, 6–10 తరగతులకు నోట్‌బుక్స్ ఉన్నాయి.

మొదటి సెమిస్టర్‌కు 3.12 కోట్ల పుస్తకాలు

ఈ విద్యా సంవత్సరంలో 1–10 తరగతుల విద్యార్థులకు మొత్తం 4.20 కోట్ల పాఠ్యపుస్తకాలు అవసరం. కాగా, మొదటి సెమిస్టర్‌కు అవసరమైన 3.12 కోట్ల పుస్తకాలు దాదాపు మండల స్టాక్ పాయింట్లకు చేరాయి. గతంలో ఇచ్చినట్టుగానే ఇప్పుడూ ద్విభాషా పుస్తకాలనే ముద్రించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి 10వ తరగతి కూడా ఇంగ్లిష్ మీడియంలోకి మారడంతో అందుకు తగ్గట్టుగా పుస్తకాల ముద్రణ చేపట్టింది. అలాగే, 3–10 తరగతులకు వరకు పాఠ్యపుస్తక ముఖచిత్రాలు మార్చారు. రాష్ట్రంలో 1,000 ప్రభుత్వ పాఠశాలలు సీబీఎస్‌ఈలోకి మారిన సంగతి తెలిసిందే. ఈ విధానంలోనే స్టేట్ సిలబస్ పుస్తకాలను అందించనున్నారు. పదో తరగతి సాంఘికశాస్త్రాన్ని సీబీఎస్‌ఈ బోధనా విధానంలో.. జాగ్రఫీ, ఎకనామిక్స్, చరిత్ర, డెమోక్రటిక్ పాలిటిక్స్ సబ్జెక్టులుగా ఎన్సీఈఆర్టీ సిలబస్‌ను ముద్రించింది. ఫిజికల్ సైన్స్ పుస్తకాలను ఆర్ట్ పేపర్‌పై ముద్రించారు. ఈ తరహా ముద్రణ చేపట్టడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఇదిలా ఉండగా, ఈ విద్యా సంవత్సరం నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ఫ్యూచర్ స్కిల్స్ కోర్సును అందుబాటులోకి తెచ్చింది. ఈ బోధనకు అనుగుణంగా మొత్తం 4.30 లక్షల పుస్తకాలు సైతం ముద్రించి పంపిణీకి సిద్ధం చేశారు. అయితే, కొత్త ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల మేరకు ఈ ఏడాది విద్యావిధానంలో కొన్ని మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని విద్యా రంగ నిపుణులు అంచనా వేస్తున్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ అధ్యాపకులకు శిక్షణ




మాట్లాడుతున్న పద్మారావు

సాక్షి, అమరావతి/పెదకాకాని: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల అధ్యాపకులకు ప్రోగ్రామబుల్ లాజిక్ కంట్రోలర్(పీఎల్‌సీ)పై వారం రోజులపాటు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు సాంకేతిక విద్యాశాఖ సంయుక్త సంచాలకులు వెలగా పద్మారావు తెలిపారు. ఏపీ ప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖ, సాంకేతిక విద్యా శిక్షణ మండలి, చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్(ఎన్‌ఐటీటీటీఆర్) ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. గుంటూరు జిల్లా నంబూరులోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీవీఐటీ) కళాశాలలో శిక్షణను సోమవారం పద్మారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులకు ఆటోమేషన్, పీఎల్‌సీ ప్రోగ్రామింగ్, ట్యాగ్స్, టైమర్స్, ఆర్గనైజేషన్ బ్లాక్స్, డేటా బ్లాక్స్ తదితర అధునాతన సాంకేతిక అంశాలపై శిక్షణ ఇస్తారు. ఈ నెల 15వరకు కొనసాగే శిక్షణ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగానికి చెందిన అధ్యాపకులు హాజరయ్యారు. వీవీఐటీ కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, ఎస్‌బీటీఈటీ కార్యదర్శి కేవీ రమణబాబు పాల్గొన్నారు.

సీఎం ప్రమాణ స్వీకారానికి ముమ్మర ఏర్పాట్లు

సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, విజయవాడ: ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారానికి ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 12వ తేదీ ఉదయం 11.27 గంటలకు విజయవాడ సమీపంలోని గన్నవరం మండలం కేసరపల్లి ఐటీ పార్క్ వద్ద ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్న విషయం తెలిసిందే. ఇందుకోసం నిర్వహించే భారీ బహిరంగ సభకు శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఐటీ పార్కు పక్కన 14 ఎకరాల్లో సభా ప్రాంగణాన్ని సిద్ధం చేస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, పలువురు కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు, రాజకీయ ప్రముఖులు, వీవీఐపీలు హాజరుకానుండటంతో అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నారు. గన్నవరం ఎయిర్‌పోర్ట్ ప్రధాన గేటు నుంచి సమీపంలోనే ఉన్న సభా వేదిక వద్దకు ప్రధాని, కేంద్ర మంత్రులు నేరుగా చేరుకునేలా చర్యలు చేపట్టారు. ప్రముఖుల కోసం ఐదు ప్రత్యేక గ్యాలరీలు రెడీ చేస్తున్నారు. ఈ సభకు లక్ష మందికిపైగా జనం వచ్చినా సరిపోయే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. 2.5 ఎకరాల్లో ప్రధాన వేదిక, వీవీఐపీ గ్యాలరీ, మిగిలిన 11.5 ఎకరాల్లో నాయకులు, ప్రజల కోసం గ్యాలరీలు సిద్ధం చేస్తున్నారు. సభా ప్రాంగణం లోపల, వెలుపల ఎల్‌ఈడీ స్క్రీన్‌లు పెడుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు, కార్లు, ఇతర వాహనాల కోసం జాతీయ రహదారి పక్కన 65 ఎకరాల్లో ఐదుచోట్ల పార్కింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఇవికాకుండా ఇంకా పలుచోట్ల కూడా వాహనాల పార్కింగ్ కోసం స్థలాలను సిద్ధం చేస్తున్నారు. ప్రముఖుల భద్రత, వేదిక, వసతుల కల్పన, బారికేడ్ల ఏర్పాటు, పారిశుధ్యం వంటి పనులను ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు ఈ కార్యక్రమం కోసం 10వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసం నుంచి ప్రమాణస్వీకారం జరిగే కేసరపల్లి వరకు 22 కిలోమీటర్ల పరిధిలో పటిష్ట బందోబస్తుకు ప్రణాళిక రూపొందించారు. ప్రధాని నరేంద్ర మోదీ వస్తున్న కారణంగా ఇప్పటికే నగరానికి చేరుకున్న ఎస్పీజీ బృందం, స్థానిక పోలీసుల సమన్వయంతో బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తోంది. ప్రధాని కాన్వాయ్‌కి సోమవారం ట్రయల్ రన్ నిర్వహించారు.



సభా ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లు

మోదీ పర్యటనపై సీఎస్ సమీక్ష

ఈ నెల 12న ప్రధాని పర్యటన, సీఎంగా చంద్రబాబు, మంత్రుల ప్రమాణస్వీకారానికి సంబంధించిన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ సోమవారం తన క్యాంపు కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. తాత్కాలిక టూర్ ప్రోగ్రాం ప్రకారం ప్రధానమంత్రి మోదీ 12వ తేదీ ఉదయం 8.20 గంటలకు ఢిల్లీ నుంచి విమానంలో బయలుదేరి 10.40గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారని సీఎస్ చెప్పారు. అక్కడి నుంచి 10.55గంటలకు కేసరపల్లి ఐటీ పార్క్ వద్ద సభా ప్రాంగణానికి చేరుకుంటారని తెలిపారు. అక్కడ మధ్యాహ్నం 12.30గంటల వరకు చంద్రబాబు ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ప్రధాని మోదీ 12.40గంటలకు గన్నవరం విమానాశ్రయం చేరుకుని 12.45గంటలకు విమానంలో భువనేశ్వర్ వెళతారని వివరించారు. ఈ నేపథ్యంలో ప్రధాని పర్యటనకు సంబంధిత శాఖలు ఏర్పాట్లన్నీ పటిష్టంగా చేయాలని సీఎస్ ఆదేశించారు.

పూసుగుప్పలో బూబీట్రాప్స్

- వెలికితీసిన ప్రత్యేక పోలీసు బృందాలు
- ఇది మావోల పనే అంటున్న అధికారులు



మావోయిస్టులు ఏర్పాటు చేసిన బూబీట్రాప్స్‌ను గుర్తిస్తున్న జవాన్

చర్ల: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం పూసుగుప్ప సమీపంలో పోలీసులను లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులు అమర్చిన 70 బూబీట్రాప్స్‌ను సోమవారం ప్రత్యేక పోలీసు బృందాలు గుర్తించాయి. ఇందుకు సంబంధించిన వివరాలను భద్రాద్రి జిల్లా ఏఎస్పీలు టి.సాయిమనోహర్, పరితోష్ పంకజ్ వెల్లడించారు. తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీ ప్రాంతమైన పూసుగుప్పలోని సీఆర్‌పీఎఫ్ 81 బెటాలియన్ క్యాంపు సమీపాన సోమవారం చర్ల పోలీసు బలగాలు, స్పెషల్ పార్టీ, సీఆర్‌పీఎఫ్ 81 బెటాలియన్‌తో పాటు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన బలగాలు సంయుక్తంగా కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో మావోయిస్టులు పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేసిన బూబీట్రాప్స్‌ను గుర్తించారు. కందకాలు తవ్వి వాటిలో ఏర్పాటు చేసిన 70 బూబీట్రాప్స్ నుంచి 4,396 పదునైన ఇనుప చువ్వలను తొలగించారు. మావోయిస్టులు చేస్తున్న ఇలాంటి పనులతో అమాయకులైన ఆదివాసీలకే కాక మూగజీవాల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోందని ఏఎస్పీలు వెల్లడించారు. ఇప్పటికే పదుల సంఖ్యలో సామాన్యులు, మూగజీవాల ప్రాణాలు పోగా.. తాజాగా ములుగు జిల్లా వాజేడు మండలం జగన్నాధపురం గ్రామానికి చెందిన యేసు.. ప్రెజర్ బాంబు బారిన పడి ప్రాణాలు పోగొట్టుకున్నాడని గుర్తు చేశారు. ఈ మేరకు మావోయిస్టుల తీరును ప్రజలు గమనించి వారికి ఎలాంటి సహకారం అందించొద్దని సూచించారు.

గుజరాత్ చాలా కాస్ట్లీ?

ఈ మధ్యకాలంలో ఖర్చులు బాగా పెరిగిపోయాయి. ఇంటి అద్దె నుంచి ఫుడ్, ట్రావెలింగ్ దాకా అన్ని ఖర్చులూ ఎక్కువైపోయాయి. ఇది ప్రాంతాన్ని బట్టి మారుతూ ఉంటుంది. బతకడానికి కొన్నిచోట్ల తక్కువగా, మరికొన్ని చోట్ల ఎక్కువగా ఖర్చులు ఉంటాయి. మరి మన దేశంలో ఏ రాష్ట్రంలో జీవన వ్యయం ఎక్కువో తెలుసా.. ఆ వివరాలేమిటో చూద్దామా. లివింగ్ కాస్ట్ వెబ్‌సైట్ దేశవ్యాప్తంగా డేటాను సేకరించి, క్రోడీకరించి.. మధ్యతరగతి కుటుంబాల నెలవారీ జీవన వ్యయాన్ని అంచనా వేసింది.

ఏ రాష్ట్రంలో సగటు జీవన వ్యయం ఎంత?

గుజరాత్	46,800
మహారాష్ట్ర	45,400
మిజోరం	43,500
కర్ణాటక	43,200
హరియాణా	39,800
గోవా	38,000
తెలంగాణ	37,700
పంజాబ్	36,500
మణిపూర్	33,000
త్రిపుర	32,400
తమిళనాడు	32,200
జమ్మూకశ్మీర్	32,200
ఉత్తరాఖండ	31,300
అస్సాం	30,900
ఛత్తీస్‌గఢ్	30,700
ఆంధ్రప్రదేశ్	30,300
రాజస్థాన్	30,100
మేఘాలయ	30,100
కేరళ	29,900
ఉత్తరప్రదేశ్	29,900
పశ్చిమబెంగాల్	29,800
మధ్యప్రదేశ్	29,200
పుదుచ్చేరి	28,400
జార్ఖండ్	28,300
ఒడిశా	26,400
బిహార్	25,900
హిమాచల్	23,600

కురుల కొమురయ్య!



ఓదెల (పెద్దపల్లి): సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండలం చిన్నకిష్టపురం గ్రామానికి చెందిన తామల్ల కొమురయ్య శ్రీమల్లికార్జునస్వామికి వీరభక్తుడు. సోమవారం పెద్దపల్లి జిల్లా ఓదెలలోని శ్రీమల్లికార్జునస్వామిని ఆయన దర్శించుకున్నాడు. ఈ సందర్భంగా 8 అడుగుల పొడవైన ఆయన కురులను చూసి భక్తులు ఆశ్చర్యపోయారు. కొమురయ్య దాదాపు 40 ఏళ్ల నుంచి జుట్టు పెంచుకుంటున్నాడు. తన 20వ ఏట తలవెంట్రుకలు పెంచడం ప్రారంభించాడు. తన ఎత్తు కన్నా పొడవైన జుట్టు ఉండటంతో తలపై రుమాలుగా చుట్టుకుని వచ్చాడు. ఏటా మాదిరిగానే ఈసారి కూడా కుటుంబసభ్యులతో కలిసి వచ్చి మల్లికార్జునస్వామికి పట్నాలు వేశాడు. బోనాలతో నైవేద్యం చెల్లించాడు. ఈ సందర్భంగా కొమురయ్య మాట్లాడుతూ, తనకు దేవుడు ప్రత్యక్ష్యంగా కనిపించాక కురులు తీస్తానని అన్నాడు.



కఠిన అనుభవాలను దాటిన, సుదూరాలకు పయనించిన మనిషి ఒక సమయం తర్వాత ఆఖరికి తన వేదనలను కూడా ఆనందిస్తాడు.

– హోమర్

సాక్షి

మంగళవారం, 11 జూన్ 2024

సరికొత్త సంకీర్ణ విన్యాసం

ఆహూతులైన వివిధ దేశాల ప్రభుత్వాధినేతలు, అనేక రంగాల ప్రముఖులు, వేలాది జనం సాక్షిగా, రాష్ట్రపతి భవన్ వేదికగా ఆదివారం రాత్రి నరేంద్ర మోదీ కొత్త ప్రభుత్వం కొలువుతీరింది. భారత ప్రధాని స్వర్గీయ నెహ్రూ తర్వాత మళ్ళీ వరుసగా మూడుసార్లు ప్రధాని పదవిని చేపట్టిన మరో వ్యక్తిగా మోదీ చరిత్ర సృష్టించారు. ప్రధాన మంత్రి కిసాన్ నిధి నుంచి 17వ విడతగా 9.3 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరేలా రూ. 20 వేల కోట్లు పంపిణీ చేసే ఫైలుపై తొలి సంతకంతో సోమవారం ఉదయమే మోదీ పనిలోకి దిగిపోయారు. మొదటి రెండు పర్యాయాలు బీజేపీ సొంత బలంతో 'మోదీ సర్కార్'గానే పాలన చేసిన కమలనాథులు ఈ మూడోసారి మాత్రం చాలినంత సంఖ్యాబలం లేక, మిత్రపక్షాల అండతో అచ్చమైన 'ఎన్డీఏ సర్కార్'గా పని చేయాల్సి రావడం కొత్త పాలనలోని పెద్ద మార్పు. గతంలో గుజరాత్ సీఎంగా కానీ, ఆ తరువాత గడచిన పదేళ్ళుగా ప్రధానిగా కానీ తన మాటే శాసనంగా చలామణీ అయిన మోదీ ఇప్పుడు వివిధ ప్రాంతాలు, పార్టీలు, ఆశలు, ఆకాంక్షలకు చెవి ఒగ్గి, ఏకాభిప్రాయసాధనలో ఏ మేరకు విజయం సాధిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

జనరల్ (24), ఓబీసీ (27), ఎస్సీ (10), ఎస్టీ (5), మైనారిటీలు (5)... ఇలా వివిధ వర్ణ శోభితమైన హరివిల్లుగా మొత్తం 71 మంది సహచరులతో మోదీ సారథ్యంలో కొత్త మంత్రి మండలి ఏర్పాటైంది. మొత్తం 81 మంది మంత్రి పదవులకు అవకాశం ఉండగా ఏకంగా 71 మందిని తొలి విడతలోనే తీసుకున్న మోదీ 24 రాష్ట్రాలకు కేంద్రంలో ప్రాతినిధ్యం కల్పించినట్టయింది. అయితే, ప్రమాణ స్వీకారం జరిగిన అనేక గంటల తర్వాత సోమవారం రాత్రికి గాని మంత్రిత్వ శాఖల కేటాయింపు ప్రకటన వెలువడలేదు. ఏకపక్ష నిర్ణయాలు అలవాటైన ప్రభుత్వ పెద్దలు సంకీర్ణ ప్రభుత్వంలో అన్ని పక్షాలకూ సంతృప్తి కలిగేలా వ్యవహరించడంలోని ఇబ్బందిని ఇప్పుడిప్పుడే గ్రహిస్తున్నట్టుంది. ఆ మాటకొస్తే ప్రమాణ స్వీకారానికి ముందు, ఆ తరువాత కూడా సంకీర్ణ పక్షాలలో కొన్ని బాహాటంగానే తమ అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఒక మంత్రి పదవి... అదీ సహాయ మంత్రి పదవే ఇవ్వడం, అందులోనూ గతంలో క్యాబినెట్ హోదాలో పనిచేసిన ప్రఫుల్ పటేల్‌కు ఆ స్థాయి తక్కువ పదవి ఇవ్వడం పట్ల అజిత్ పవార్ సారథ్యంలోని జాతీయవాద కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) ప్రమాణ స్వీకారం కన్నా ముందు ఆదివారమే అభ్యంతరం చెప్పింది. మంత్రి పదవిని తిరస్కరించింది.


గెలిచిన అనురాగ్ ఠాకూర్ నుంచి, ఓడిపోయిన స్మృతీ ఇరానీ దాకా పలు పాత ముఖాలకు కొత్త సర్కారులో మోదీ మొండిచేయి చూపారు. అదే సమయంలో 33 మందిని మొదటిసారి మంత్రుల్ని చేశారు. ఏపీ నుంచి ముగ్గురికి, తెలంగాణ నుంచి ఇద్దరికీ మంత్రులుగా బెర్తులిచ్చారు. ఆ లెక్కలెలా ఉన్నా, సోమవారం సాయంత్రం తొలిసారిగా కేంద్ర క్యాబినెట్ భేటీ జరిగే లోగా... సంకీర్ణ సర్కారు నుంచి మరిన్ని గొంతులు పైకి లేచాయి. ఏడుగురు ఎంపీలున్న తమ కన్నా తక్కువ సంఖ్యాబలం గల పార్టీలకు క్యాబినెట్ హోదా మంత్రి పదవిచ్చి, తమకు మాత్రం స్వతంత్ర హోదా ఉన్న సహాయ మంత్రి పదవితోనే సరిపుచ్చారంటూ ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలోని శివసేన అసమ్మతి వ్యక్తం చేసింది. సొంత గూటిలోనూ బీజేపీకి సణుగుళ్ళు తప్పట్లేదు. కేరళలో తొలిసారిగా ఖాతా తెరిచిన కమలం పార్టీ త్రిస్సూర్ నుంచి గెలిచిన సినీ నటుడు సురేశ్ గోపికి మంత్రిమండలిలో స్థానం కల్పించింది. అయితే, సహాయ మంత్రి హోదా ఇచ్చినందుకు కినిసి ఆయన పక్కకు తప్పుకోవడానికి సిద్ధమైనట్టు వార్తలు రావడం, రచ్చ రేగేసరికి ఆఖరుకు ట్విట్టర్‌లో అలాంటిదేమీ లేదని ఖండించడం చకచకా జరిగాయి. వీటిని బట్టి సంకీర్ణ సర్కార్ నడపడంలోని సవాళ్ళు మోదీకి ఆదిలోనే అర్థమై ఉండాలి.

మరోపక్క మరికొద్ది నెలల్లోనే మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్ రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఆ రాష్ట్రాల్లో బలహీనంగా ఉన్న బీజేపీ అక్కడ మళ్ళీ బలం పుంజుకోవాలని ప్రయత్నిస్తుంది. అలాగే, దక్షిణాది రాష్ట్రాలన్నిటికీ క్యాబినెట్‌లో ప్రాతినిధ్యమూ కమలనాథుల 'మిషన్ సౌత్' వ్యూహంలో భాగమే. ఇక, వివిధ రాష్ట్రాలకు గతంలో ముఖ్యమంత్రులుగా పనిచేసిన ఆరుగురు ఇప్పుడు మోదీ క్యాబినెట్‌లో ఉన్నారు. స్వయంగా మోదీని సైతం కలుపుకొంటే ఆ సంఖ్య ఏడుకు చేరుతుంది. అంటే పాలనలో అనుభవానికి కొరత లేదు. కాకపోతే, వ్యక్తిగతంగా అధికారంలో శిఖరాలను చూసినవారు కలసికట్టుగా ముందడుగు వేయడంలో అహంభావాలకు తావు లేకుండా చూసుకోగలరా అని విశ్లేషకుల అనుమానం. అయితే, రక్షణ, ఆర్థిక, హోమ్, విదేశీ వ్యవహారాల వంటి కీలక శాఖలను గత ప్రభుత్వంలోని మంత్రులకే కట్టబెట్టారు. ఇది కొత్త సీసాలో పాత సారాగా తోచినా, విధానాల కొనసాగింపు, సుస్థిరత్వానికి పెద్దపీట వేశారనుకోవాలి.

వెరసి మోదీ ప్రజల కొత్త తీర్పుతో ఇప్పుడు కొత్త పిచ్ మీద ఆట మొదలుపెట్టారు. ఒకప్పటి వాజ్‌పేయి సంకీర్ణ సర్కార్‌లా సక్సెస్ కావాలంటే సహనం, సహానుభూతి పెంచుకోక తప్పదు. సంకీర్ణ సర్కారుకు తోడు బలమైన ప్రతిపక్షమూ ఉన్నందున పించ్ హిట్టింగ్‌కు అవకాశం లేదు. తిరుగులేని మెజారిటీ ఉన్న గతంలోలా ఇప్పుడు ఎవరికీ ముందస్తు సమాచారం ఇవ్వకుండానే పెద్ద నోట్ల రద్దు, దేశవ్యాప్త లాక్‌డౌన్ లాంటి ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం లాంటివి చేయలేరు. వివాదాస్పదమైన ఒకే దేశం – ఒకే ఎన్నిక, ఉమ్మడి పౌరస్మృతి లాంటి సొంత అజెండాను కాషాయధ్వజులు కొన్నాళ్ళు పక్కనపెట్టక తప్పదు. ఆటలో దూకుడుకు అవకాశం లేనప్పుడు అవుటవకుండా ఆత్మరక్షణ ధోరణిలో ఆడక తప్పదు. పదేళ్ళుగా ప్రాంతీయ పార్టీలను సామ దాన భేద దండోపాయాలతో ఆడిస్తున్న పెద్దలకు కచ్చితంగా ఈ సంకీర్ణపు ఆట సరికొత్తదే! అలాగే పెరిగిన బలంతో ఊపిరి పీల్చుకున్న ప్రతిపక్షం సైతం 18వ లోక్‌సభలో కూటమిగా నిర్మాణాత్మక పాత్ర పోషిస్తేనే ప్రజలకు మేలు.

కశ్మీరీల ప్రజాస్వామిక విశ్వాసం

విశ్లేషణ



వజాహత్ హబీబుల్లా

1996 తర్వాత జమ్ము–కశ్మీర్‌లో అత్యధిక ఓటింగ్ శాతం మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో నమోదైంది. సమస్యాత్మక ప్రాంతంలో ఇది కొత్త శకానికి నాంది అనుకోవచ్చు. 2019లో ఆర్టికల్ 370 రద్దుతో రాజ్యాంగం ప్రకారం ఉన్న పరిమిత రాజకీయ స్వయంప్రతిపత్తిని మోదీ ప్రభుత్వం తొలగించిన తర్వాత జరిగిన మొదటి ఎన్నికలు ఇవి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలనే కశ్మీరీలు, లద్ధాఖ్ వాసుల సంకల్పానికి ఈ పోలింగ్ శాతం ఒక సూచన. ప్రస్తుత రాజకీయ నాయకత్వంపై కోపం ఉన్నప్పటికీ, భారతదేశంపై కొత్త విశ్వాసం అక్కడి ప్రజల్లో ఉంది. రాజకీయ, సామాజిక సమస్యలకు పరిష్కారాలను తీసుకురాగల సామర్థ్యం తుపాకీ కంటే ప్రజాస్వామిక ప్రక్రియే కలిగి ఉందని ఓటు వేయడానికి వచ్చిన ప్రజలు చూపిస్తున్నారు.

మునుపటి జమ్మూ కశ్మీర్ రాష్ట్రంలోని జమ్మూ కశ్మీర్, లద్ధాఖ్ కేంద్రపాలిత ప్రాంతాల్లో ఐదు దశల్లో ఎన్నికలు జరిగాయి. నివేదికల ప్రకారం, పరిణామంలో చిన్నదైనప్పటికీ ఎక్కువ మంది జనాభా నివసిస్తున్న కశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంలో, 1996 తర్వాత అత్యధికంగా ఓటింగ్ శాతం ఈ ఎన్నికల్లోనే నమోదయ్యింది. శ్రీనగర్‌లో 38.49 శాతం ఓటింగ్ జరగగా, బారాముల్లాలో 59.1 శాతం నమోదైంది. జమ్మూ డివిజన్‌లోని పూంఛ్–రాజౌరీ జిల్లాల చేరిక వల్ల కశ్మీరీల ప్రాబల్యం తగ్గిపోయిన అనంత్‌నాగ్‌లో 54.84 శాతం ఓటింగ్ నమోదైంది.



కొత్త శకానికి నాంది

ముస్లిం మెజారిటీ ప్రాంతాలైన కశ్మీర్, లద్ధాఖ్; హిందూ మెజారిటీ ఉన్న జమ్మూ మధ్య ఎన్నికల ఫలితాలు తీవ్రమైన మతపర విభజనను వెల్లడిస్తున్నాయి. పీర్ పంజాల్ పర్వతశ్రేణికి ఇరువైపులా ఉన్న పోటీదారులు ఓటర్లకు చేసిన మతపరమైన విజ్ఞప్తి ద్వారా కూడా ఈ విభజన ధ్రువీకరించబడింది. కశ్మీర్ లోయ వేర్పాటువాదం నుంచి బయటపడినప్పటికీ... జమ్మూలో రెండు స్థానాలను కైవసం చేసుకున్న బీజేపీ హిందుత్వ ఎజెండా (నియోజకవర్గాల పునర్విభజన కమిషన్ ద్వారా మతపరమైన అస్తిత్వాన్ని బలోపేతం చేయడానికి రూపొందించిన నియోజకవర్గాలివి) లోయలోని ప్రతి అభ్యర్థికి చెందిన విభిన్నమైన మతపరమైన ప్రాతిపదికతో సరిపోలింది. వాస్తవానికి, కశ్మీర్‌లోని షియా ముస్లిం సమాజపు మొదటి కుటుంబానికి చెంది, శ్రీనగర్ నుండి గెలుపొందిన నేషనల్ కాన్ఫరెన్స్ అభ్యర్థి ఆగా సయ్యద్ రుహుల్లా తన కమ్యూనిటీ తరపున కశ్మీరీ పండితులకు బహిరంగంగా క్షమాపణలు చెప్పడం ద్వారా అంతకుముందటి స్థితిని బద్దలుకొట్టారు. 1990–96 మధ్య కాలంలో జమ్మూ కశ్మీర్ ఇప్పటిలాగే కేంద్ర పాలనలో ఉన్నప్పుడు, కశ్మీర్ లోయ నుంచి కశ్మీరీ పండితుల భారీ వలసలను నిరోధించడంలో విఫలమైనందుకు ఆయన క్షమాపణ వేడుకున్నారు.

అలాంటప్పుడు సమస్యాత్మక ప్రాంతంలో ఇది కొత్త శకానికి నాంది కాదా? 2019లో ఆర్టికల్ 370 రద్దుతో రాజ్యాంగం ప్రకారం రాష్ట్రానికి ఉన్న పరిమిత రాజకీయ స్వయంప్రతిపత్తిని మోదీ ప్రభుత్వం తొలగించిన తర్వాత, ఇవి జమ్మూ కశ్మీర్‌లో జరిగిన మొదటి ఎన్నికలని గుర్తుంచుకోవాలి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలనే కశ్మీరీలు, లద్ధాఖ్ వాసుల సంకల్పానికి లోయలో, లద్ధాఖ్‌లో నమోదైన పోలింగ్ శాతం ఒక సూచన. స్వతంత్ర అభ్యర్థిగా లద్ధాఖ్ సీటును గెలుచుకున్న మాజీ నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు మహమ్మద్ హనీఫాకు మొదటి నుండీ ట్రెండ్స్ అనుకూలంగానే ఉన్నప్పటికీ, ఇది ఆ పార్టీ పునరుజ్జీవనం కాదు. కేంద్రంలోని అధికార పార్టీని ఓడించడానికి దాని వెనుక సమీకరించే ప్రయత్నం. ఎందుకంటే నేషనల్ కాన్ఫరెన్స్ స్టార్ అభ్యర్థి, మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా బారాముల్లా నుంచి ఓడిపోయారు. అబ్దుల్లాకు 26 శాతం ఓట్లు రాగా, ఆయన మీద గెలిచిన ఇంజనీర్ రషీద్‌కు దాదాపు 46 శాతం ఓట్లు పోలయ్యాయి. 'స్వతంత్ర కశ్మీర్'ను ప్రవచించే రషీద్ అదే కారణంగా 'ఉపా' కేసులో గత ఐదేళ్లుగా తిహార్ జైలులో ఉన్నారు. చివరి క్షణంలో ఆయన ఇద్దరు కుమారుల నేతృత్వంలో ప్రచారం ఊపందుకుంది.

ఆర్టికల్ 370 రద్దుకు కారణమైన బీజేపీకి వ్యతిరేకంగా జరిగిన ఓట్ల ఏకీకరణకు మనం ప్రత్యక్ష సాక్షులుగా ఉన్నాము. ఇంతకుముందు, కశ్మీర్‌లో పాతుకుపోయిన రెండు ప్రముఖ పార్టీలు ఎన్సీ, పీడీపీలు బీజేపీతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాయని గుర్తుంచుకోవాలి. చివరిగా కశ్మీర్‌లో ఏర్పాటైన ప్రభుత్వం బీజేపీ, పీడీపీ కూటమి. ప్రతి ఒక్కరి ఎన్నికల ప్రచారాల ద్వారా వ్యక్తీకరించబడినట్లుగా, సజ్జాద్ లోన్‌కు చెందిన పీపుల్స్ కాన్ఫరెన్స్ వంటి బీజేపీ మిత్రపక్షాలు కూడా ప్రజల మద్దతు కోసం ఏదైనా విజ్ఞప్తి చేయడానికి ముందు, ఆ పార్టీకి దూరంగా ఉండవలసి వచ్చింది.

పునరావిష్కరించుకుంటేనే కమల వికాసం

కశ్మీర్‌లోని ఏ స్థానం నుంచి కూడా బీజేపీ తన అభ్యర్థిని నిలబెట్టలేదు. కశ్మీర్‌లో కమలం వికసించడానికి సమయం పడుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. కానీ కశ్మీరీల కోసం, లద్ధాఖ్ ప్రజల కోసం పార్టీ తనను తాను తిరిగి ఆవిష్కరించుకుంటే తప్ప, ఇది అసంభవమని ఎన్నికల ఫలితాలు సూచిస్తున్నాయి. ప్రధానమంత్రులుగా జమ్ము కశ్మీర్ చూసిన భారతీయ నాయకులందరిలోకీ అటల్ బిహారీ వాజ్‌పేయి అత్యంత ప్రియమైన వ్యక్తి.

బీజేపీకి మద్దతివ్వడం పక్కన పెడితే, ఆ పార్టీతో అనుబంధం పెట్టుకోవడానికి కూడా శ్రీనగర్‌లో ఎవరూ లేరు. నేను మే మొదటి వారంలో లోయలో ఉన్నాను. డౌన్‌టౌన్‌తో సహా శ్రీనగర్‌లోని స్నేహితుల ఇళ్లలోనూ, సోపోర్‌లోనూ ఉన్నాను. ఒమర్ అబ్దుల్లాను సవాలు చేసే వ్యక్తిగా ఇంజనీర్ రషీద్ ఆవిర్భవించడం అప్పటికి ఇంకా స్పష్టీకరించబడలేదు. కానీ బీజేపీ పట్ల వ్యతిరేకత మాత్రం అక్కడ స్పష్టంగా, సార్వత్రికంగా ఉంది.

ప్రచారంలో అభ్యర్థులు ఒకరి కంటే ఒకరు బీజేపీకి వ్యతిరేకంగానే ఎక్కువగా తమ గురించి చెప్పుకున్నారు. కేంద్రంలో బీజేపీ పాలనకు వ్యతిరేకంగా కశ్మీర్ రాజకీయ రంగంలోని వివిధ వర్గాలు ఏకమయ్యాయి. కశ్మీరీలు ఇచ్చిన సందేశం బిగ్గరగా, స్పష్టంగా ఉంది. ఎన్నికల క్రమంలో కుల్‌గామ్, పూంఛ్‌లలో హింసాత్మక సంఘటనలు చోటుచేసుకున్నప్పటికీ, ఈ కేంద్రపాలిత ప్రాంతంలో వాస్తవంగా హింస తగ్గుముఖం పట్టిందనే దృక్పథాన్నే నేను కొనసాగించాలనుకుంటున్నాను. బీజేపీ మీద వ్యతిరేకతకు కారణాలు ఏమంటే, ప్రస్తుతం ఉన్న పరిపాలన ప్రజలలో ఏ విధమైన సంతృప్తిని కలిగించకపోగా, పరాయీకరణను పెంచింది.

తుపాకీ కన్నా ఓటు మేలు

అయినప్పటికీ, అదే సమయంలో, కశ్మీర్‌ను నాలాగే అభిమానిస్తున్న వారికి ప్రకాశవంతమైన భవిష్యత్తు ఉంది. అక్కడ పరాయీకరణ ఉన్నప్పటికీ, రాజకీయ, సామాజిక సమస్యలకు పరిష్కారాలను తీసుకురాగల సామర్థ్యం తుపాకీ కంటే ప్రజాస్వామిక ప్రక్రియే కలిగి ఉందని ఓటు వేయడానికి వచ్చిన ప్రజలు చూపిస్తున్నారు. ప్రస్తుత రాజకీయ నాయకత్వంపై కోపం ఉన్నప్పటికీ, భారతదేశంపై కొత్త విశ్వాసం అక్కడి ప్రజల్లో ఉంది. ఓటు రూపంలో దేశం దాని ప్రజలకు ఇచ్చిన భరోసా కూడా కశ్మీరీల్లో వ్యక్తమైంది.

ఈ ప్రాంతంలోని రెండు ప్రముఖ రాజకీయ కుటుంబాల ప్రతినిధులు, కశ్మీరీలే అయినప్పటికీ ప్రజల తిరస్కరణను ఎదుర్కొన్నారు. కానీ 1990ల నుండి గ్రహణం పట్టిన ప్రజాస్వామ్య ప్రక్రియ ఇంకా సజీవంగానూ, చైతన్యవంతంగానూ ఉంది. ఈ ప్రక్రియలో పాలుపంచుకోవాలనే ప్రజల విశ్వాసంలో, ఇతర భారతీయులకు లాగే దేశ పాలనలో తామూ భాగం కాగలమనే గుర్తింపునకు సంబంధించిన వ్యక్తీకరణలో ఇది కనబడుతోంది.

వ్యాసకర్త జమ్ము కశ్మీర్ క్యాడర్ మాజీ ఉన్నతాధికారి; 'నేషనల్ కమిషన్ ఫర్ మైనారిటీస్' మాజీ చైర్‌పర్సన్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

చీకటి రోజు



నరేంద్ర మోదీ 'ప్రమాణ స్వీకారోత్సవం' జరుపుకొంటున్న వాళ్లకు దేశంలోని ఏకైక మహిళా ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సందేశం. 'ప్రధాని' 'ఉత్సవం' జరిగినంతసేపూ ఆమె తన లైట్లన్నింటినీ ఆర్పేసి, చీకట్లో కూర్చున్నారు. ప్రచారం మొత్తం స్వీయ కేంద్రంగా చేసుకున్న మోదీని ప్రజలు తిరస్కరించారు. ఆయన్ని మార్చాలి.

– సాగరికా ఘోష్, తృణమూల్ కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ

భద్రత సాధ్యమేనా?



పది మంది హిందూ యాత్రికుల మరణానికి కారణమైన రియాసీ(కశ్మీర్) దాడిని ఇద్దరు పాకిస్తానీ తీవ్రవాదులు సరిహద్దు దాటి వచ్చి జరిపినట్టు తెలుస్తోంది. వాళ్లు సరిగ్గా తేదీ, సమయం కోసం ఎదురు చూసి దాడి చేశారు. చొరబాటు దారుల నుంచి ఇండియా తన సరిహద్దుల్ని కాపాడుకోలేదని మరోసారి నిరూపించింది.

– యానా మీర్, యాంకర్

ఊహించగలమా?



అంటే ఇప్పుడు రాష్ట్రపతి భవన్‌లో ఆ క్రూర చిరుత ఉంటే– ఒకవేళ అది అడ్డంగా నడుచుకుంటూ వెళ్లకుండా (కేంద్ర క్యాబినెట్ ప్రమాణ స్వీకారోత్సవ వేళ) కిందికి దిగివస్తే ఏమయ్యేది? అప్పుడు ఏం జరిగివుండేది?

– సుహేల్ సేథ్, నటుడు

స్థానం లేదా?



ముస్లిం పర్సనల్ లా బోర్డు మొదలైనప్పటి నుంచీ అందులో ఎంతోమంది సయ్యద్, షేక్, మొఘల్, పఠాన్లు ఉన్నారు. కానీ పస్మాందా ముస్లింలు సున్నా. పస్మాందా ముస్లింలు అంటరాని వాళ్లుగా కొనసాగుతున్నారు.

– ఫయాజ్ అహ్మద్ ఫైజీ, పస్మాందా యాక్టివిస్ట్

వందనం



సంస్కృతం, పాళీ భాషల్లో ఎంతో ప్రధానమైన మూల గ్రంథాలను రాసినవాళ్లు తమ పేరు చెప్పుకోలేదు. సూర్య సిద్ధాంత, సంధి నిర్మోచన, అభిధర్మ లాంటివి. అలాంటి పుస్తకాలకు జన్మనిస్తూ తమ అస్తిత్వాన్ని విలుప్తం చేసుకునేలా అంత గొప్ప ఆలోచనాపరులను నడిపింది ఏమిటి?

– జోసెఫ్ టి.నూనీ, రచయిత

ఇన్ బాక్స్

బాల్యానికి భరోసా ఏదీ?

'పల్లెటూరి పిల్లగాడా పసులగాసే మొనగాడా, పాలు మరచి ఎన్నాళ్ళయ్యిందో, ఓ పాల బుగ్గల జీతగాడా, కొలువుదీరి ఎన్నాళ్ళయ్యిందో' అంటూ... ప్రజాకవి సుద్దాల హనుమంతు రాసిన ఈ పాట భారతదేశంలో శతాబ్దాల తరబడి బాల కార్మిక వ్యవస్థలో మగ్గిపోతున్న బాలల జీవన చిత్రాన్ని ప్రతిబింబిస్తుంది. బడిలో ఉండాల్సిన పిల్లలను, ఆట పాటలతో గడపాల్సిన బాల్యాన్ని బందీ చేయడం ఒక అనాగరిక చర్య. ఇది మన భారతదేశ సమస్య మాత్రమే కాదు. ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న చాలా దేశాల సమస్య కూడా.

ప్రపంచవ్యాప్తంగా 28.7 కోట్ల మంది పిల్లలు బాల కార్మికులుగా ఉన్నారని సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఈ ఏడాది 'వరల్డ్ డే అగెనెస్ట్ చైల్డ్ లేబర్' ఉద్యోగుల భద్రత, ఆరోగ్యాలను మెరుగుపరచవలసిన అవసరాన్నీ, చిన్నారి బాల కార్మికుల పరిస్థితులను మెరుగుపరచవలసిన అవసరాన్నీ నొక్కి చెబుతోంది. పిల్లలందరికీ విద్య, ఆరోగ్యాలను పొందడానికి హక్కు ఉంది. కానీ ప్రపంచ వ్యాప్తంగా కోట్లాదిమంది బాలలు వీటికి దూరమవుతున్నారు. తల్లిదండ్రులు చనిపోవడంతో పిల్లలు అనాథలు కావడం, కుటుంబ పేదరికం, నిరక్షరాస్యత, తదితర కారణాల వల్ల బాలలు కార్మికులుగా మారుతున్నారు. కర్మాగారాలలో, హోటళ్లలో, రైల్వే–బస్ స్టేషన్లలో, వీధుల్లో బాలకార్మికులు కనిపిస్తున్నారు. చాలీచాలని వేతనాలతో పనులు చేస్తూ బతుకు బండిని లాగుతున్నారు. పట్టణాలు, నగరాలలో బాలకార్మికులు భిక్షాటన చేస్తున్నారు. కొంతమంది చెడువ్యసనాలకు బానిసలై దొంగతనాలూ, హత్యలకూ పాల్పడుతున్నారు. బాల కార్మికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని చర్యలు చేపడుతున్నా ఫలితాలు శూన్యం అని చెప్పవచ్చు.

బడికి వెళ్లాల్సిన బాల్యం బందీగా మారుతోంది. దీనికి కారణం ఎవరు? రోడ్డుపై విసిరేసిన ఎంగిలి విస్తరాకులూ, చిత్తుకాగితాలు ఏరుకుంటూ... చితికిపోయిన బతుకులు ఈడ్చుకుంటూ మెతుకు కోసం జీవిత పోరాటం చేస్తున్నారు వీరు. ఇటుకలు మోస్తూ, ఇనుమును కరిగిస్తూ, బిక్షమెత్తుకొంటూ, పంక్చర్ లేస్తూ, పేపర్ వేస్తూ, పాలు, పల్లీలమ్ముతూ, కంపెనీల్లో పనిచేస్తూ, పశువులు కాస్తూ, కలుపులు తీస్తూ, పాలిష్ చేస్తూ, పెయింట్‌లు వేస్తూ బతుకును వెళ్లదీస్తున్నారు. ఈ పరిస్థితులను కళ్లారా చూస్తున్న ఐక్యరాజ్యసమితి 2002లో బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవాన్ని జరపాలని నిర్ణయించింది.

అయినా ప్రపంచంలోని వివిధ దేశాలలో బాలకార్మికుల సంఖ్య పెరుగుతూనే ఉంది తప్ప, తగ్గడం లేదు. సమాజంలో భాగమైన మనమందరం బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు నడుం బిగిద్దాం.

– ముద్దం నరసింహ స్వామి; జర్నలిస్టు, హైదరాబాద్
(రేపు ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా)

చట్టసభల్లో పెరుగుతున్న కోటీశ్వరులు

అభిప్రాయం



డా॥ తిరునహరి శేషు

రాచరిక ప్రభుత్వాలు, నియంతృత్వ ప్రభుత్వాల కంటే ప్రజాస్వామిక ప్రభుత్వాలు... సంక్షేమ ప్రభుత్వాలుగా ప్రజల కోసం, ముఖ్యంగా పేద ప్రజల కోసం, వారి సంక్షేమం కోసం బాధ్యతాయుతంగా పనిచేస్తాయని బలంగా విశ్వసిస్తారు. ప్రపంచంలో పేదలు అధికంగా ఉన్న దేశాలలో భారతదేశం కూడా ఒకటి. దేశంలో 25 కోట్ల మంది పేదరికంలో ఉన్నారనీ, దాదాపు 11.2 శాతం మంది దారిద్ర్య రేఖ దిగువన నివసిస్తున్నారనీ 2023లో నీతి ఆయోగ్ విడుదల చేసిన తన రిపోర్టులో వెల్లడి చేసింది. దేశంలో 80 కోట్ల పేద కుటుంబాలు 'ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన' లాంటి పథకాల ద్వారా ఉచిత రేషన్ బియ్యం పొందుతున్న దేశంలో ఇటీవల 18వ లోక్ సభకు జరిగిన ఎన్నికలలో 93 శాతం మంది కోటీశ్వరులు, 50 శాతం మంది క్రిమినల్ కేసులు ఉన్నవారు లోక్ సభ సభ్యులుగా ఎన్నికయ్యారని 'అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్' (ఏడీఆర్) సంస్థ తన అధ్యయనంలో వెల్లడి చేసింది. ఈ నేపథ్యంలో భారతదేశం లాంటి అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికలు ధనస్వామ్యంగా, నేరస్వామ్యంగా మారినాయనే ఆందోళన కలుగక మానదు.



18వ లోక్ సభకు ఎన్నికైన మొత్తం 543 మంది లోక్ సభ సభ్యులలో 504 మంది అంటే 93 శాతం సభ్యులు కోటీశ్వరులే అని ఏడీఆర్ తన నివేదికలో వెల్లడించింది. అలాగే వరుసగా మూడోసారి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్న బీజేపీ నుండి 240 మంది లోక్ సభ సభ్యులు విజయం సాధిస్తే వారిలో 227 మంది లోక్ సభ సభ్యులు కోటీశ్వరులే. అలాగే ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ నుండి 92 మంది కోటీశ్వరులు లోక్ సభ సభ్యులుగా ఎన్నికైనారు. ప్రస్తుత ఎన్డీఏ సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటులో కీలక భాగస్వామ్య పక్షాలైన టీడీపీ నుండి గెలిచిన 16 మంది లోక్ సభ సభ్యులూ, జేడీ(యూ) నుండి గెలిచిన 12 మంది సభ్యులూ... అందరూ కోటీశ్వరులే!

2009 లోక్ సభ ఎన్నికల నుండి ప్రతి ఎన్నిక లోనూ ఎన్నికయ్యే కోటీశ్వరుల సంఖ్య పెద్ద ఎత్తున పెరుగుతూనే ఉన్నదని గణాంకాలు చెబుతున్నాయి. 2009లో 315 మంది, 2014లో 443 మంది, 2019లో 475 మంది, 2024లో 504 మంది కోటీశ్వరులు ఎన్నికయ్యారు.


లోక్ సభకు ఎన్నికవుతున్న వారిలో ఒకపక్క కోటీశ్వరుల సంఖ్య పెరుగుతుంటే మరొకవైపు క్రిమినల్స్, క్రిమినల్ కేసులు, క్రిమినల్ రికార్డ్స్ ఉన్నవారు కూడా పెరిగిపోవటం ఆందోళన కలిగించే విషయమే. 18వ లోక్ సభలో క్రిమినల్ కేసులు ఉన్నవారు 50 శాతం, క్రిమినల్ రికార్డ్స్ ఉన్నవారు 46 శాతం మంది లోక్ సభ సభ్యులుగా ఎన్నికయ్యారు. వీరిలో బీజేపీ నుండి 94 మంది, కాంగ్రెస్ నుండి 49 మంది లోక్ సభ సభ్యులుగా ఎన్నికయ్యారు. మరీ ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే మహిళలపై దాడులూ, అత్యాచారాలూ చేసిన 15 మంది, విద్వేషపు ప్రసంగాలు చేసే 43 మంది కూడా లోక్ సభ సభ్యులుగా ఎన్నికవ్వటం.

కోటీశ్వరులు, నేరగాళ్లు, క్రిమినల్ రికార్డ్స్ ఉన్నవారు, బ్యాంకులకు డబ్బులు ఎగవేతదారులు లోక్ సభ లాంటి అత్యున్నత విధాన నిర్ణాయక సభలలోకి అడుగుపెడుతుంటే... సభలో వారి సంఖ్య పెరుగుతుంటే, ఆ సభకి గౌరవం పెరుగుతుందా? పేదల స్థితిగతులు, సమస్యలు వారికి అవగతం అవుతాయా? చట్టసభలలో జరిగే చర్చలలో వారు పాల్గొంటారా? పాల్గొన్నా సహేతుకమైన సూచనలు చేస్తారా! అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కాబట్టి చట్టసభలకు నేరగాళ్ళనూ, సొంత లాభాల కోసం వ్యాపారాలు చేసే కార్పొరేట్లనూ కాకుండా దేశ అభివృద్ధి కోసం పేదల సంక్షేమం కోసం పనిచేసే వారిని ప్రజలు ఎన్నుకునే రోజులు రావాలని ఆశిద్దాం.

వ్యాసకర్త పొలిటికల్ ఎనలిస్ట్, కాకతీయ విశ్వవిద్యాలయం । 98854 65877

బ్రహ్మజ్ఞానం

ఓ తండ్రి తన ఇద్దరు పిల్లలకు బ్రహ్మజ్ఞానం తెలియాలని ఆశపడ్డారు. వారిద్దరినీ ఓ మంచి గురువు వద్దకు పంపారు. ఇద్దరూ గురుకులవాసం పూర్తి చేసుకుని ఇంటికొచ్చారు. తండ్రి తన పెద్దకొడుకుని చూసి 'బ్రహ్మజ్ఞానం గురించి ఏం నేర్చుకున్నావు' అని అడిగాడు. వెంటనే ఆ కొడుకు వివిధ అంశాల గురించి చెప్పుకుంటూ పోతున్నాడు. వేదాల నుంచీ, శాస్త్రాల నుంచీ ఉదాహరణలు చెబుతున్నాడు. అతడి మాటలకు అడ్డు తగులుతూ 'సరే ఆపు' అని తండ్రి అన్నాడు.



ఈసారి బ్రహ్మజ్ఞానం గురించి నువ్వేం నేర్చుకున్నావని చిన్న కొడుకుని అడిగాడు తండ్రి. అతను నోరెత్తలేదు. తల వంచుకుని నిల్చున్నాడు. తండ్రి అతని వంక చూశాడు. నీ వాలకం చూస్తుంటే నీకే బ్రహ్మజ్ఞానం గురించి అంతో ఇంతో తెలిసినట్లుందన్నాడు. 'బ్రహ్మం గురించి పూర్తిగా తమకు తెలుసని పలువురు అనుకుంటూ ఉంటారు. అది ఎలాంటిదంటే బ్రహ్మాండమైన చక్కెర కొండ నుంచి ఒక్క రవ్వ చక్కెరను తీసుకుని పోతున్న చీమ మరోసారి వచ్చినప్పుడు ఈ మొత్తం కొండను తీసుకుపోతానని చెప్పడం లాంటి'దని రామకృష్ణపరమహంస చెప్పారు.

బ్రహ్మం అనేది మన ఆలోచనలకు, మాటలకు అతీతమైనది. గొప్ప గొప్ప మహాత్ములను కూడా ఈ విషయంలో పెద్ద చీమలని చెప్పవచ్చు. వారందరూ ఓ ఏడెనిమిది చక్కెర రవ్వలను తీసుకుపోయి ఉంటారు. అంతే. బ్రహ్మం అనే మహాసముద్ర తీరాన నిల్చుని కాళ్ళు తడుపుకోవడం లాంటిదే వారు బ్రహ్మజ్ఞానం తమకు తెలుసునని చెప్పడం. నిజానికి వారందులో మునగలేదు. మునిగి ఉంటే వారు తిరిగివచ్చి ఉండరు.

'అనగనగా ఓ ఉప్పు బొమ్మ ఉండేది. సముద్రం లోతెంత అని తెలుసుకోవడంకోసం అందులోకి దూకాలన్నది దాని ఆశ. అలాంటి ఆశ పుట్టినప్పుడు అది ఉత్తినే ఉండగలదా! సరే, సముద్రం లోతెంత చూసేద్దామని నిర్ణయించుకుంది. వెంటనే అది సముద్రంలో దూకేసింది. కొంచెం దూరం వెళ్ళిందో లేదో... అంతే సంగతులు. ఉప్పుబొమ్మ సముద్రంలో దూకితే ఏమవుతుంది... కొంచెం కొంచెంగా కరగనారంభించింది. కాస్సేపటికే బొమ్మ మొత్తం కరిగిపోయింది. అది ఇంకేం కనిపెట్టగలదు సముద్రం లోతుని! అలాగే బ్రహ్మజ్ఞానం తనకొచ్చేసింది అనుకున్న మనిషి మౌనంగా ఉంటాడు. అది వచ్చేంతవరకూ మట్లాడుతూనే ఉంటాడు. తేనె తాగడం కోసం ఓ భ్రమరం తోటలోకి వెళ్ళింది. అది పువ్వు మీద వాలే వరకే ఝుమ్మని శబ్దం చేస్తూ ఉంటుంది. ఎప్పుడైతే పువ్వు మీద వాలిందో ఆ క్షణంలోనే అది మౌనమైపోతుంది. అలాటిదే బ్రహ్మజ్ఞానం తెలుసుకోవడ'మని పరమహంస అంటారు.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.పంచమి సా.5.44 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** ఆశ్లేష రా.12.16 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** ప.12.24 నుండి 2.05 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.05 నుండి 8.57 వరకు, తదుపరి రా.10.51 నుండి 11.35 వరకు, **అమృతఘడియలు:** రా.10.40 నుండి 12.20 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 5.28, **సూర్యాస్తమయం:** 6.29.

క్లుప్తంగా...

జేఈఈలో హర్షిత అద్భుత ప్రతిభ

- జాతీయ స్థాయిలో 43వ ర్యాంక్



నాదెండ్ల: జేఈఈ అడ్వాన్స్‌డ్‌–2024 ఫలితాల్లో పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం గణపవరం గ్రామానికి చెందిన విద్యార్థిని కాటా హర్షిత అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. వ్యవసాయ కుటుంబానికి చెందిన హర్షిత జేఈఈ అడ్వాన్స్‌డ్‌ ఫలితాల్లో జాతీయస్థాయిలో 43వ ర్యాంక్‌ను సాధించడంతోపాటు మెయిన్స్‌లో 50వ ర్యాంక్‌ కైవసం చేసుకుంది. దీంతో విద్యార్థిని తల్లిదండ్రులు కాటా విజయలక్ష్మి, హరిబాబు, తాత సూర్యనారాయణ సంతోషం వ్యక్తంచేశారు. హర్షిత తొలి నుంచి చదువులో చురుగ్గా ఉండేది. గుంటూరులోని ఓ ప్రైవేట్‌ కాలేజీలో ఇంటర్‌ చదివిన హర్షిత ఎంపీసీలో 973 మార్కులు సాధించింది. ఆమెకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

అమరావతిలో 3వ ప్రపంచ తెలుగు మహాసభలు

- 2026 జనవరి 4, 5, 6 తేదీల్లో ఆంధ్ర సారస్వత పరిషత్‌ ఆధ్వర్యంలో నిర్వహణ



ఘంటసాల: తెలుగు భాష ఔన్నత్యాన్ని ప్రపంచానికి తెలియజేసేందుకు ఆంధ్ర సారస్వత పరిషత్‌ ఆధ్వర్యంలో 2026 జనవరి 4, 5, 6 తేదీల్లో అమరావతిలో 3వ తెలుగు ప్రపంచ మహాసభలు నిర్వహించనున్నట్లు ఆంధ్ర సారస్వత పరిషత్‌ అధ్యక్షుడు డాక్టర్‌ గజల్‌ శ్రీనివాస్‌ తెలిపారు. సోమవారం కృష్ణాజిల్లా ఘంటసాల గ్రామానికి వచ్చిన ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ఈ సభలకు రాష్ట్రపతి ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు, రేవంత్‌రెడ్డిని ఆహ్వానించనున్నట్లు చెప్పారు. ఈ సభల్లో ప్రవాస తెలుగు సంఘాలతో సాంస్కృతిక ప్రదర్శనలు, మన తెలుగు సంస్కృతి, సంచార జాతుల కళారూపాలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ నిధులతో కాకుండా భాషాభిమానుల సహకారంతో తెలుగు మహాసభలను నిర్వహిస్తుందన్నారు.

నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న పవన్‌



అనకాపల్లి: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు గవరపాలెం శ్రీనూకాంబిక అమ్మవారిని జనసేన అధినేత కె.పవన్‌ కళ్యాణ్‌ సోమవారం దర్శించుకుని మొక్కు చెల్లించుకున్నారు. ఆయనకు ఆలయ ఈవో బండారు ప్రసాద్‌ సాదర స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ నూకాంబిక అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.

దౌర్జన్యంగా క్రీడా వికాస కేంద్రం పేరు మార్పు

పెనుకొండ: శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలోని క్రీడా వికాస కేంద్రం పేరును సోమవారం టీడీపీ నాయకులు దౌర్జన్యంగా మార్చేశారు. స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో వైఎస్సార్‌ క్రీడా వికాస కేంద్రాన్ని గతంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం నిర్మించింది. ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీ గెలవడంతో ఆ పార్టీ నాయకులు సోమవారం క్రీడా వికాస కేంద్రం వద్దకు చేరుకుని వైఎస్సార్‌ క్రీడా వికాస కేంద్రంగా ఉన్న పేరును తొలగించి ఎన్టీఆర్‌ క్రీడా వికాస కేంద్రంగా మార్చేశారు. ఈ దృశ్యాలను సోషల్‌ మీడియాలో వైరల్‌ చేశారు. టీడీపీ నాయకుల వైఖరి చూసిన ప్రజలు ఇదేం చోద్యమంటూ చర్చించుకున్నారు.

పదవుల్లో బీసీలకు ప్రాధాన్యత కల్పించండి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు

గాంధీనగర్‌ (విజయవాడసెంట్రల్‌): రాష్ట్రంలో నూతనంగా ఏర్పడబోయే ప్రభుత్వం బీసీలకు జనాభా దామాషా ప్రకారం పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు కోరారు. సోమవారం ఎన్టీఆర్‌ జిల్లా విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 12న ప్రమాణ స్వీకారం చేయబోతున్న చంద్రబాబునాయుడుకు బీసీల తరఫున శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ ప్రభుత్వంలో కలెక్టర్లు, హెచ్‌ఓడీలు, ఎస్పీలుగా బీసీలనే నియమించాలని, అలాగే రాజకీయ పదవుల్లోనూ పెద్ద పీటవేయాలన్నారు. కేంద్ర మంత్రిగా రామ్మోహన నాయుడికి అవకాశం కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. బీసీ సంఘం నాయకులు అన్నవరపు నాగమల్లేశ్వరరావు, కొల్లూరు హనుమంతరావు, మేక వెంకటేశ్వరరావు, చందు, వై.పుల్లారావు, సత్యనారాయణ, మహంతి వాసు, అనగాని ప్రసాదు, వీరబాబు, కొండయ్యగుంట రాము, బాయన శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఘాటెక్కిన ఉల్లి

మహారాష్ట్ర నుంచి తాడేపల్లిగూడేనికి తగ్గిన దిగుమతులు

రిటైల్‌ మార్కెట్‌లో కిలో రూ.40 నుంచి రూ.45కు అమ్మకం

కూరగాయలదీ అదే దారి



సాక్షి, భీమవరం: ఉల్లి ధర ఘాటెక్కింది. రిటైల్‌ మార్కెట్‌లో కేజీ ధర రూ.40 నుంచి రూ.45 వరకు పలుకుతోంది. మహారాష్ట్ర మార్కెట్‌ నుంచి దిగుమతులు తగ్గడమే ధర పెరుగుదలకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు. రాష్ట్రంలోనే పేరొందిన తాడేపల్లిగూడెం ఉల్లి మార్కెట్‌కు షోలాపూర్‌, నాసిక్‌, పూణే, అహ్మద్‌నగర్‌ ప్రాంతాల నుంచి నిత్యం కనీసం 450 టన్నుల వరకు ఉల్లి దిగుమతులు జరుగుతుంటాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతోపాటు ఈశాన్య రాష్ట్రాల్లోని మార్కెట్లకు సైతం ఇక్కడి నుంచే ఉల్లి ఎగుమతులు జరుగుతుంటాయి. ప్రస్తుతం రోజుకు 240 టన్నుల ఉల్లి మాత్రమే వస్తోంది. ఫలితంగా వారం రోజులుగా ధరలు పెరుగుతున్నాయి. వారం క్రితం రిటైల్‌ మార్కెట్‌లో కేజీ రూ.20 నుంచి రూ.30 వరకు పలికిన ధరలు అమాంతం పెరిగాయి. ఆటోలపై ఇళ్లకు వచ్చి నాసిరకం ఉల్లిని మూడు కిలోలు రూ.100కు విక్రయిస్తుండగా.. దుకాణాల వద్ద నాణ్యతను బట్టి కిలో రూ.40 నుంచి రూ.45 వరకు అమ్మకాలు చేస్తున్నారు.

రెట్టింపైన కూరగాయల ధరలు



కూరగాయల ధరలు సైతం రెట్టింపయ్యాయి. వేసవి ఎండలు గోదావరి లంకలు, మెట్ట ప్రాంతాల్లో సాగుచేసే కూరగాయ పంటలకు తీవ్ర నష్టం కలగజేశాయి. అధిక ఉష్ణోగ్రతలకు పూత మాడిపోయి దిగుబడులు పడిపోయాయి. ఫలితంగా ధరలకు రెక్కలొచ్చాయి. కిలో రూ.20 ఉండే వంకాయలు రూ.40కి చేరగా, బెండకాయలు రూ.24 నుంచి రూ.40కి, బీరకాయలు రూ.30 నుంచి రూ.50కి పెరిగాయి. ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకునే క్యారెట్‌, బీట్‌రూట్‌, బంగాళా దుంప ధరలు నిలకడగా ఉండగా.. టమాటా రూ.20 నుంచి రూ.50కి పెరిగింది.

పాత నిల్వలు వస్తేనే..

ప్రస్తుతం ఉల్లి ధర పెరుగుదల తాత్కాలికమేనని హోల్‌సేల్‌ వ్యాపారులు చెబుతున్నారు. నాలుగు రోజులుగా తాడేపల్లిగూడెం మార్కెట్‌కు దిగుమతులు తగ్గాయని హోల్‌సేల్‌ వ్యాపారి సర్వేశ్వరరావు తెలిపారు. రెండు, మూడు రోజుల్లో మహారాష్ట్ర మార్కెట్‌లోకి పాత నిల్వలు రానున్నట్టు అక్కడి వ్యాపారులు చెబుతున్నారన్నారు. అవి ఇక్కడి మార్కెట్‌కు చేరితే శుక్రవారం నాటికి ధరలు దిగివచ్చే అవకాశముందని ఆయన పేర్కొన్నారు.

టీమిండియాలో చోటే లక్ష్యం

- నిఖార్సైన ఆల్‌రౌండర్‌గా ఎదుగుతా
- త్వరలోనే భారత్‌ జట్టుకు ఆడుతాను
- ఐపీఎల్‌లో రాణించడం గొప్ప అనుభూతినిచ్చింది
- ఐపీఎల్‌ ఎమర్జింగ్‌ ప్లేయర్‌ అవార్డు గ్రహీత నితీష్‌కుమార్‌రెడ్డి



విశాఖ స్పోర్ట్స్‌: ఫస్ట్‌క్లాస్‌ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన మూడేళ్ల వ్యవధిలోనే.. ఐపీఎల్‌లో స్థానం సంపాదించి సన్‌రైజర్స్‌ హైదరాబాద్‌ విజయాల్లో కీలక పాత్ర పోషించడం ద్వారా ఎమర్జింగ్‌ ప్లేయర్‌ అవార్డు అందుకున్న విశాఖకు చెందిన కాకి నితీష్‌కుమార్‌రెడ్డి.. జాతీయ జట్టులో స్థానం సంపాదించడమే తన లక్ష్యమని వెల్లడించాడు. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ రాణించి నిఖార్సైన ఆల్‌రౌండర్‌గా ఎదుగుతానంటున్న నితీష్‌కుమార్‌రెడ్డితో 'సాక్షి' ఇంటర్వ్యూ.. ఆయన మాటల్లోనే..

దేశంలోనే బెస్ట్‌ క్రికెటర్‌గా..

అండర్‌–12, 14లో ఆంధ్రా క్రికెట్‌ అసోసియేషన్‌(ఏసీఏ) అకాడమీ ద్వారా శిక్షణ తీసుకున్నా. అనంతరం అండర్‌–16లో రాణించి ఏకంగా దేశంలోనే బెస్ట్‌ క్రికెటర్‌గా బీసీసీఐ నుంచి జగ్‌మోహన్‌ దాల్మియా అవార్డు అందుకోవడంతో నాలో ఆత్మవిశ్వాసం వచ్చింది. 2020లో తొలి ఫస్ట్‌క్లాస్‌ క్రికెట్‌ మ్యాచ్‌ ఆడి ఆ తర్వాతి ఏడాదే లిస్ట్‌–ఏ మ్యాచ్‌ల్లో ఇండియా–బి జట్టుకు ఆడాను. 2021 చివరికల్లా టీ20ల్లో ఆడే స్థాయికి ఎదిగాను. ఇప్పుడు ఐపీఎల్‌లో ఎమర్జింగ్‌ క్రికెటర్‌ అవార్డు లభించడం వల్ల నా ప్రతిభకు మరింత మెరుగులు దిద్దుకునే అవకాశం కలిగింది.

అది.. గొప్ప అనుభూతి

ఐపీఎల్‌లో సన్‌రైజర్స్‌ హైదరాబాద్‌ తరఫున ఆడటం ఆనందాన్నిచ్చింది. కీలక సమయాల్లో రాణించి సన్‌రైజర్స్‌ గెలుపులో భాగం కావడం నా ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. టైటిల్‌ పోరులో సరిగ్గా ఆడలేకపోవడం కాస్త నిరాశ కలిగించింది. స్వదేశీ ఆటగాళ్లతో పాటు విదేశీ ఆటగాళ్లు ఇచ్చిన సూచనలను జాగ్రత్తగా నా ఆటకు అన్వయించుకున్నా. చెన్నై సూపర్‌ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో మహీ భాయ్‌(ధోనీ) చూస్తుండగా చివరి బంతిని స్టాండ్స్‌లోకి తరలించడం.. మా జట్టు విజయం సాధించడం మరపురాని సంఘటన. మొత్తంగా ఐపీఎల్‌లో రాణించడం గొప్ప అనుభూతినిచ్చింది.

ఏపీఎల్‌లోనూ రాణిస్తా..

ప్రస్తుతం నా దృష్టి ఆంధ్ర ప్రీమియర్‌ లీగ్‌(ఏపీఎల్‌) మూడో సీజన్‌పైనే ఉంది. గోదావరి టైటాన్స్‌ ఫ్రాంచైజీ అత్యధిక ధరకు నన్ను దక్కించుకుంది. ఈ నెలాఖరు నుంచి ఏపీఎల్‌ మూడో సీజన్‌ ప్రారంభం కానుంది. నా అనుభవంతో జట్టును ముందుకు తీసుకువెళ్తా. నేను బౌలింగ్‌లోనూ రాణించేందుకు యార్కర్లపై దృష్టి పెడుతున్నా. అప్పుడే పర్‌ఫెక్ట్‌ ఆల్‌రౌండర్‌గా ఎదగగలను. ఐపీఎల్‌తో పాటు ఏపీఎల్‌ నా లక్ష్యానికి దోహదపడతాయని భావిస్తున్నా. ఆల్‌రౌండర్‌గా రాణించి జాతీయ జట్టులో స్థానం సాధించడమే నా తదుపరి లక్ష్యం. అదీ త్వరలోనే జరుగుతుందని ఆశిస్తున్నా.

నా రాజకీయ ప్రయాణం జగనన్నతోనే..

- పార్టీ మారే ప్రసక్తే లేదు..
- పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

సాక్షి,పాడేరు: 'న్యాయవాది వృత్తిలో ఉన్న నాకు రాజకీయ భవిష్యత్‌ ఇచ్చింది వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అని, ఆయన్ను మోసం చేస్తే నాకు పుట్టగతులుండవు' అని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. సోమవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. జగనన్న రాజకీయ భిక్షతో గెలిచిన తన రాజకీయ ప్రయాణం చివరి వరకు ఆయనతో నేనన్నారు. పార్టీ మారుతున్నాననే తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మొద్దని సూచించారు. వైఎస్‌ జగన్‌ నాయకత్వంపై ఉన్న నమ్మకంతో తనను గెలిపించిన పాడేరు నియోజకవర్గ పార్టీ నేతలు, కార్యకర్తలు, ఓటర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం పోరాటాలు చేస్తానని, కొంతమందిలా తాను రూ.కోట్లకు అమ్ముడుపోయే రాజకీయ నాయకుడిని కాదన్నారు. 2029లో వైఎస్సార్‌సీపీదే అధికారమని, జగన్‌ను సీఎంగా చూస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ ఎస్టీ సెల్‌ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు సురేష్‌కుమార్‌, కిల్లు కోటిబాబునాయుడు, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, పార్టీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, పలు పంచాయతీల సర్పంచ్‌లు వంతాల రాంబాబు, బసవన్నదొర, మాజీ సర్పంచ్‌లు పాంగి సత్తిబాబు, శరభ సూర్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు డీపీ రాంబాబు పాల్గొన్నారు.

నా బిడ్డను పోలీసులు బలి తీసుకున్నారు

- సత్తెనపల్లి రూరల్‌ సీఐ రాజేశ్‌ కుమార్‌ను సస్పెండ్‌ చేయాలి
- వైఎస్సార్‌సీపీ కార్యకర్త నాగమల్లేశ్వరరావు తండ్రి డిమాండ్‌

సత్తెనపల్లి: పల్నాడు జిల్లాలో పోలీసుల వేధింపులతో ఆత్మహత్యాయత్నం చేసి చికిత్స పొందుతూ మృతి చెందిన రెంటపాళ్ల ఉపసర్పంచ్‌, వైఎస్సార్‌సీపీ క్రియాశీలక కార్యకర్త కొర్లకుంట నాగమల్లేశ్వరరావు మృతదేహానికి సోమవారం గుంటూరు జీజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి తండ్రి కొర్లకుంట వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు సత్తెనపల్లి రూరల్‌ పోలీస్‌ స్టేషన్‌ ఎదుట మృతదేహంతో ఆందోళన నిర్వహిస్తారని తెలుసుకున్న పోలీసులు మేడికొండూరులో వారిని ఆపారు. సత్తెనపల్లి టౌన్‌, మేడికొండూరు సీఐలు పోలూరి శ్రీనివాసరావు, జయకుమార్‌.. వెంకటేశ్వర్లుతో మాట్లాడారు. ఎస్పీ సీఐ సురేష్‌ ఫోన్‌లో మాట్లాడుతూ జరిగిన విషయం బాధాకరమని, అన్ని విషయాలను పల్నాడు జిల్లా ఎస్పీ మలికా గర్గ్‌కు వివరించి తప్పనిసరిగా న్యాయం జరిగేలా చూస్తామని అతడికి తెలిపారు. నాగమల్లేశ్వరరావు ఆత్మహత్యకు కారకుడైన సీఐ రాజేశ్‌ కుమార్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని, ఎలాంటి ఆందోళన చేయకుండా అంత్యక్రియలు నిర్వహించాలని సూచించారు. పోలీస్‌ అధికారులు హామీ ఇవ్వడంతో మృతుడి తండ్రి వెంకటేశ్వర్లు మెత్తబడ్డారు. మృతదేహం ఉన్న వాహనంతో పాదయాత్రగా, ద్విచక్ర వాహనాలతో సత్తెనపల్లి, పాకాలపాడు మీదుగా రెంటపాళ్లకు చేరుకున్నారు. అక్కడ సత్తెనపల్లి డీఎస్పీ జి.గురునాథ్‌ బాబు నేతృత్వంలో పోలీస్‌ బలగాలు బందోబస్తు నిర్వహించాయి. ఈ సందర్భంగా మృతుడి తండ్రి కొర్లకుంట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అభం, శుభం తెలియని తన బిడ్డను పోలీసులు పొట్టన పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల పాటు పోలీస్‌ స్టేషన్‌లో నిర్బంధించి ఊరు వదిలి పోవాలని బెదిరించారని ఆరోపించారు. లేకుంటే రాజమండ్రి సెంట్రల్‌ జైలుకు పంపిస్తానని సత్తెనపల్లి రూరల్‌ సీఐ రాజేశ్‌ కుమార్‌ హెచ్చరించారని మండిపడ్డారు. తక్షణమే ఆయనను సస్పెండ్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. ఇంటిపై దాడి చేసి తన కుమారుడు ఆత్మహత్య చేసుకునేందుకు కారకులైన టీడీపీ, జనసేన నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా నాగమల్లేశ్వరరావు మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి, మాజీ మంత్రి అంబటి రాంబాబు అల్లుడు ఉపేష్‌, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్‌ చిట్టా విజయభాస్కర్‌రెడ్డి, తదితరులు సందర్శించి నివాళులు అర్పించారు.



సత్తెనపల్లి నుంచి నాగమల్లేశ్వరరావు మృతదేహం ఉన్న వాహనంతో ప్రదర్శన

బాలల సంరక్షణపై ప్రత్యేక దృష్టి

- సత్ఫలితాలిస్తున్న విజయవాడ రైల్వే డివిజన్‌ కార్యాచరణ
- ఈ ఏడాది ఇప్పటికే 61 మందిని రక్షించిన రైల్వే పోలీసులు
- రెండేళ్లలో 462 మందిని రక్షించిన ఆర్‌పీఎఫ్‌

సాక్షి, అమరావతి: మానవ అక్రమ రవాణాకు రైల్వే పోలీసుల ప్రత్యేక విభాగం సమర్థంగా అడ్డుకట్ట వేస్తోంది. విజయవాడ డివిజన్‌ పరిధిలోని 52 మంది రైల్వే భద్రతా విభాగం (ఆర్‌పీఎఫ్‌) అధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన యాంటీ హ్యూమన్‌ ట్రాఫికింగ్‌ యూనిట్‌ (ఏహెచ్‌టీయూ) కార్యాచరణ సత్ఫలితాలిస్తోంది. జనరల్‌ రైల్వే పోలీస్‌ (జీఆర్‌పీ), చైల్డ్‌ హెల్ప్‌లైన్‌, బచపన్‌ బచావో ఆందోళన్‌ (బీబీఏ), ఇతర స్వచ్ఛంద సంస్థలను సమన్వయం చేసుకుంటూ మొత్తం 14 ఏహెచ్‌టీయూ బృందాలు మానవ అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాయి. రైల్వే స్టేషన్‌ పరిసరాలు, రైల్వే ట్రాక్‌లు, రైల్వే ఆస్తులున్న ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. అపహరణకు గురైనవారు, తప్పిపోయిన బాలలను గుర్తించి సురక్షితంగా వారి కుటుంబ సభ్యుల చెంతకు చేరుస్తున్నాయి. తాజాగా విజయవాడ, రాజమహేంద్రవరం ఏహెచ్‌టీయూ విభాగాలకు రెండు ప్రత్యేక వాహనాలను కూడా దక్షిణ మధ్య రైల్వే సమకూర్చింది. కేంద్ర హోమ్‌ శాఖ విడుదల చేసిన రూ.17 లక్షలతో ఈ వాహనాలను కొనుగోలు చేశారు. విజయవాడ రైల్వే డివిజన్‌ పరిధిలో 2022లో మొత్తం 184 మందిని రక్షించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వారిలో 125 మంది బాలురు, 59 మంది బాలికలు ఉన్నారు. 2023లో 278 మందిని రక్షించగా.. వారిలో 244 మంది బాలురు, 34 మంది బాలికలు ఉన్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు 61 మంది బాలలను రక్షించగా.. వీరిలో 50 మంది బాలురు, 11 మంది బాలికలు ఉన్నారు. రక్షించిన వారిని శిశు సంక్షేమ కమిటీల (సీడబ్ల్యూసీ) ఎదుట హాజరుపరిచిన అనంతరం వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వెంకటాపురంలో పాలిటెక్నిక్‌ కాలేజీ పేరు చెరిపివేత

టీడీపీ నేతల దుశ్చర్య

కలిదిండి: కలిదిండి మండలం వెంకటాపురంలోని డాక్టర్‌ వైఎస్సార్‌ ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కాలేజీ మీద సోమవారం టీడీపీ నేతలు, కార్యకర్తలు విరుచుకుపడ్డారు. బోర్డు మీద ఉన్న కాలేజీ పేరును చెరిపేశారు. కాలేజీకి వైఎస్సార్‌ పేరు పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ శిలాఫలకంపై ఉన్న ప్రజాప్రతినిధుల చిత్రాలకు రంగులు వేయించారు. డాక్టర్‌ వైఎస్‌ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అప్పటి కైకలూరు ఎమ్మెల్యే యెర్నేని రాజారామచందర్‌ విన్నపంతో కలిదిండిలో ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కాలేజీకి అనుమతులు ఇచ్చారు. 2006 నుంచి పాలిటెక్నిక్‌ కాలేజీ హైస్కూల్‌లోనే కొనసాగుతోంది. వైఎస్‌ మరణంతో కళాశాల పనులు నిలిచిపోయాయి. చంద్రబాబు పాలనలో సమీప వెంకటాపురం గ్రామంలో దేవస్థానానికి చెందిన సుమారు ఐదెకరాల స్థలం సేకరించి నిధులు కేటాయించారు. భవన నిర్మాణం జరగలేదు. వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రూ.8 కోట్లతో భవన నిర్మాణం పూర్తిచేశారు. డాక్టర్‌ వైఎస్సార్‌ ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాలగా దానికి పేరుపెట్టారు. ఈ ఏడాది ఫిబ్రవరి 15న కాలేజీని వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్‌) ప్రారంభించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఆ భవనంలో క్లాసులు ప్రారంభం కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఇటీవలి ఎన్నికల్లో గెలవడంతో టీడీపీ నేతల చూపు కళాశాలపై పడింది. వెంకటాపురం గ్రామంలో కాలేజీ నిర్మించి వైఎస్సార్‌ పేరు పెట్టడంపై అభ్యంతరం తెలుపుతూ సోమవారం గ్రామానికి చెందిన టీడీపీ నేతలు కళాశాల బోర్డును చెరిపేయించారు. విద్యార్థుల చదువులకు సంబంధించిన కాలేజీల పైనా టీడీపీ నేతల కక్షపూరిత ధోరణిని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఖండించారు.



వెంకటాపురంలో కళాశాల బోర్డును చెరిపివేస్తున్న టీడీపీ నాయకులు

పోలీసులు షాక్‌.. శ్రీనివాస్‌ రాక్‌

- చనిపోయాడని వెళ్తే.. లేచి మాట్లాడాడు..
- ఆశ్చర్యానికి గురైన పోలీసులు



హసన్‌పర్తి: చనిపోయాడనుకున్న వ్యక్తి ఒక్కసారిగా లేచి మాట్లాడితే.. ఆ షాక్‌ ఎలా ఉంటుందో ఊహించుకోండి. అలాంటి ఘటనే వరంగల్‌ నగరంలో చోటుచేసుకుంది. కుంటలో ఓ మృతదేహం తేలియాడుతున్నదన్న సమాచారం మేరకు అక్కడికి వెళ్లిన పోలీసులు.. ఆ వ్యక్తిని బయటికి లాగుతుండగా సదరు వ్యక్తి లేచి మాట్లాడడం చూసి షాక్‌కు గురయ్యారు. శ్రీకాకుళం జిల్లా కావలికి చెందిన శ్రీనివాస్‌ కాజీపేటలోని ఓ గ్రానైట్‌ క్వారీలో పనిచేస్తున్నాడు. అతనితో పాటు మరో ఇద్దరు సోమవారం చిత్తుగా మద్యం సేవించి నగరంలోని రెడ్డిపురంలోని కోవెలకుంటకు వెళ్లారు. అక్కడ కొంతసేపు కుంటలోకి దిగారు. మద్యం మత్తులో శ్రీనివాస్‌ కొంత ఒడ్డు మేరలో నిద్ర పోయాడు. శ్రీనివాస్‌ మృతి చెందినట్లుగా భావించిన వారు అక్కడినుంచి జారుకున్నారు. ఆ తర్వాత స్థానికులు ఓ వ్యక్తి మృతదేహం నీటిలో తేలియాడుతున్నట్లు గమనించి 108 అంబులెన్స్‌, పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అంబులెన్స్‌తోపాటు కాకతీయ యూనివర్సిటీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కుంట లోతుగా ఉన్నట్లు భావించిన పోలీసులు ఒకరి చేయి మరొకరు పట్టుకుని తేలియాడుతున్న ఆ వ్యక్తికి బయటికి లాగేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో అతనే నేరుగా లేచి నిల్చొన్నారు. దీంతో ఒక్కసారిగా అందరూ షాక్‌కు గురయ్యారు. బయటికి తీసుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుంటలో చల్లదనానికి నిద్ర వచ్చినట్లు సదరు వ్యక్తి పోలీసులకు చెప్పాడు. తనకు రూ.50 ఇస్తే కాజీపేటకు వెళ్తానని చెప్పడంతో పోలీసులు అతనికి డబ్బులు ఇచ్చి పంపించి వేశారు.



పెదకాకాని వద్ద రోడ్డు ప్రమాదం..

ఇద్దరు దుర్మరణం

- ఆగి ఉన్న రెడీమిక్స్‌ వాహనాన్ని ఢీకొన్న కారు
- కారును ఢీకొన్న ప్రయాణికుల టాటా ఏస్‌ వాహనం
- మరో ముగ్గురి పరిస్థితి విషమం



పెదకాకాని వద్ద రెడీమిక్స్‌ వాహనాన్ని ఢీకొన్న కారు, టాటా ఏస్‌ వాహనం

పెదకాకాని: గుంటూరు జిల్లా పెదకాకాని సమీపంలోని జాతీయ రహదారిపై సోమవారం రాత్రి మూడు వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందారు. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల కథనం ప్రకారం.. విజయవాడ నుంచి గుంటూరు వైపు వెళ్తున్న రెడీమిక్స్‌ వాహనం మరమ్మతులకు గురవడంతో పెదకాకాని క్యాన్సర్‌ హాస్పిటల్‌ ఎదుట జాతీయ రహదారిపై మార్జిన్‌లో డ్రైవర్‌ నిలిపారు. విజయవాడ నుంచి గుంటూరుకి అతి వేగంగా వస్తున్న కారు రెడీమిక్స్‌ వాహనాన్ని ఢీకొట్టింది. దీని వెనుక ప్రయాణికులతో వస్తున్న టాటా ఏస్‌ వాహనం అతివేగంగా కారును, రెడీమిక్స్‌ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు, టాటా ఏస్‌ వాహనంలో ఉన్న పది మందికి తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో క్షతగాత్రులను గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు. ఆస్పత్రికి వెళ్లేసరికే ఇద్దరు మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. మృతులు, గాయపడిన వారి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

దాడులు ఆపకుంటే ప్రతి దాడులు తప్పవు

- వైఎస్సార్‌ సీపీ నేత ఉదయభాను హెచ్చరిక
- మా సహనాన్ని పరీక్షించొద్దు



మాజీ ప్రభుత్వ విప్‌ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్‌: ఎన్నికల ఫలితాలు వెలువడిన నాటి నుంచి అరాచకం సృష్టిస్తూ రాజకీయ ప్రత్యర్థులపై దాడులకు తెగబడుతున్న టీడీపీ మూకలు తమ సహనాన్ని పరీక్షించవద్దని ప్రభుత్వ మాజీ విప్‌, వైఎస్సార్‌ సీపీ నేత సామినేని ఉదయభాను హెచ్చరించారు. హద్దులు దాటొద్దని, తమ సహనం నశిస్తే ప్రతిచర్యలు తప్పవని స్పష్టం చేశారు. వారం రోజులుగా విజయోత్సవాల పేరుతో దాడులకు తెగబడి వైఎస్సార్‌ సీపీ కార్యకర్తలను హింసించడం, ఇళ్లలోకి చొరబడి విలువైన వస్తువులను ధ్వంసం చేసి పైశాచిక ఆనందాన్ని పొందటాన్ని తీవ్రంగా ఖండించారు. ఇది తాలిబాన్ల పాలనను తలపిస్తోందన్నారు. సోమవారం ఎన్టీఆర్‌ జిల్లా జగ్గయ్యపేటలో పార్టీ నేతలతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజాతీర్పును శిరసావహిస్తున్నామని, జగ్గయ్యపేటలో గెలిచిన శ్రీరాం తాతయ్య నియోజకవర్గ ప్రజలకు మంచి చేయాలని తాము కోరుతున్నట్లు చెప్పారు.

ఇందుకేనా గెలిపించింది?

తాను ఐదు పర్యాయాలు ఎన్నికల్లో పోటీ చేశానని, గెలిచిన పార్టీ ఇలా దౌర్జన్యాలకు పాల్పడటం ఎప్పుడూ చూడలేదన్నారు. 2019లో 151 సీట్లు గెలుచుకొని ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైఎస్సార్‌ సీపీ ఎక్కడా దాడులకు దిగలేదన్నారు. కౌంటింగ్‌ జరుగుతుండగానే సచివాలయాల మీద టీడీపీ జెండాలు ఎగురవేయడం, విగ్రహాలను కూల్చడం, వైఎస్సార్‌ సీపీ జెండా దిమ్మెలు, శిలాఫలకాలను ధ్వంసం చేయడం టీడీపీ గూండాయిజానికి నిదర్శనమని ఉదయభాను మండిపడ్డారు. ఇందుకేనా చంద్రబాబును గెలిపించింది? అని ప్రజలు అసహ్యించుకుంటున్నారని చెప్పారు.

దాడులు.. ఇళ్ల లూటీ

తొర్రగుంటపాలెంలో వైఎస్సార్‌ సీపీ కార్యకర్త పాటి సాంబ ఇంటిపై అల్లరి మూకలు అర్ధరాత్రి దాడి చేసి విలువైన వస్తువులను ధ్వంసం చేయడంతో పాటు బీరువాలోని నగదు, బంగారాన్ని దోచుకున్నాయని ఉదయభాను పేర్కొన్నారు. మైనార్టీ మహిళపై కారం చల్లడంతోపాటు గోపి అనే వ్యక్తిపై దాడి చేశారని చెప్పారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్‌, తన్నీరు నాగేంద్ర, కొండ తదితరుల నివాసాలపై రాళ్లతో దాడి చేశారని ఫొటోలను ప్రదర్శించారు. 13వ వార్డులో అభివృద్ధి శిలాఫలకాలు, జెండా దిమ్మెలను టీడీపీ మూకలు నేల కూల్చాయన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే నిందితులకు 41 ఏ నోటీసు ఇచ్చి స్టేషన్‌ బెయిల్‌తో సరిపుచ్చడంతో తిరిగి దాడులకు తెగబడుతున్నట్లు చెప్పారు. ఎన్నికల్లో కూటమి గెలుపొందినా ఒంటరిగా పోటీ చేసిన వైఎస్సార్‌ సీపీకి 40 శాతం ఓట్లు వచ్చాయని ఉదయభాను గుర్తు చేశారు. పార్టీకి ఓట్లు వేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యకర్తలు ఎవరూ ఆత్మ విశ్వాసాన్ని కోల్పోవద్దని సూచించారు. రాష్ట్ర నెడ్‌ క్యాప్‌ చైర్మన్‌ వేల్పుల రవికుమార్‌, కేడీసీసీ బ్యాంక్‌ చైర్మన్‌ తన్నీరు నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్‌ మానేపల్లి బ్రహ్మం, మున్సిపల్‌ మాజీ చైర్మన్‌ ఇంటూరి చిన్నా, మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ తుమ్మల ప్రభాకర్‌ సమావేశంలో పాల్గొన్నారు.

ఈవీఎంల ట్యాంపరింగ్‌తోనే కూటమికి అధికారం

- 'సుప్రీం' జడ్జితో విచారణ జరిపించాలి
- దళిత బహుజన పార్టీ అధ్యక్షుడు వడ్లమూరి



లిబర్టీ(హైదరాబాద్‌): ఆంధ్రప్రదేశ్‌లో ఈవీఎంలను ట్యాంపరింగ్‌ చేసి ఎన్‌డీఏ కూటమి గెలుపొందిందని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్‌ ఆరోపించారు. ఎన్నికల ఫలితాల్లో ఊహించని విధంగా ఆయా పార్టీలకు మెజార్టీ రావడంతో మేధావులు, విశ్లేషకులతో పాటు సామాన్య జనంలోనూ అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో సోమవారం వడ్లమూరి మీడియాతో మాట్లాడారు. ప్రముఖ సంస్థలు వైఎస్సార్‌సీపీ గెలుస్తుందని ఎగ్జిట్‌ పోల్స్‌లో వెల్లడిస్తే అందుకు భిన్నంగా కూటమి విజయం సాధించడం వెనుక ట్యాంపరింగ్‌ జరిగిందనే అనుమానాలను కొట్టి పారేయలేమన్నారు. అందుకే ఎన్నికల ఫలితాలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని డిమాండ్‌ చేశారు. ఈవీఎంలు తయారు చేసే సంస్థలు దాదాపు 30 ఉండగా, అందులో బీజేపీకి చెందిన వారివే ఎక్కువ సంస్థలు ఉన్నట్లు తెలుస్తోందన్నారు. ట్యాంపరింగ్‌ చేసే అవకాశం ఉందని గతంలో స్వయంగా చంద్రబాబునాయుడే ప్రకటించారని గుర్తు చేశారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు దుర్మార్గం: కొంతం గోవర్ధన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్‌: ఆంధ్రప్రదేశ్‌ సాధారణ ఎన్నికల్లో విజయం సాధించిన తెలుగుదేశం, ఆ పార్టీ కార్యకర్తలు వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ నాయకులు, కార్యకర్తల ఇళ్లతో పాటు భౌతిక దాడులు చేయడం దుర్మార్గమని తెలంగాణ అడ్వొకేట్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు కొంతం గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ఇలా దాడులకు పాల్పడటం అనాగరికమని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇలాంటి అరాచకాలతో శాంతిభద్రతలకు విఘాతం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. గవర్నర్‌ వెంటనే జోక్యం చేసుకుని, రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

మోదీ పీఎంవో కాదది...
ప్రజా పీఎంవో!

- గతంలో కేవలం అధికార కేంద్రమే
- పదేళ్లుగా ప్రేరక శక్తిగా నిలిచింది
- వికసిత భారతే మనందరి లక్ష్యం
- ప్రపంచంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దుదాం
- పీఎంవో అధికారులతో మోదీ
- ప్రధానిగా బాధ్యతల స్వీకరణ

న్యూఢిల్లీ: ''ప్రధాని కార్యాలయమంటే అధికార కేంద్రమని మన దేశంలో పదేళ్ల కింది దాకా అభిప్రాయముండేది. కానీ నేను పుట్టింది అధికారం కోసం కాదు. నాకు అధికారం కావాలని ఎప్పుడూ ఆలోచించను. ప్రధాని కార్యాలయం కూడా అధికార కేంద్రం కాకూడదు. అది ప్రజల పీఎంవోగా ఉండాలి తప్ప మోద పీఎంవోగా కాదు'' అని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. ''నేను అధికారం కోసం జన్మించలేదు. 140 కోట్ల మంది భారతీయులే నాకు దేవుళ్లు. వారి సంక్షేమమే నా పరమావధి. దానికోసమే వారు నాకు మరోసారి అవకాశమిచ్చారు. పీఎంవోను అధికార కేంద్రంగా మార్చే ఉద్దేశం నాకెన్నడూ లేదు. అది ప్రజల సంక్షేమం కోసం పని చేసే సంస్థగా ఉండాలి'' అని స్పష్టం చేశారు. 2014 నుంచీ అదే దిశగా కృషి చేస్తూ వచ్చామన్నారు. ఆయన వరుసగా మూడోసారి ప్రధానిగా ఆదివారం ప్రమాణస్వీకారం చేయడం తెలిసిందే. సోమవారం ఉదయం ప్రధాని కార్యాలయంలో ఆయన లాంఛనంగా బాధ్యతలు చేపట్టారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి 17వ విడత నిధుల విడుదల ఫైలుపై తొలి సంతకం చేశారు. పీఎంఓలో అధికారులు, సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. వారినుద్దేశించి మోదీ మాట్లాడారు. పీఎంవో ఒక ప్రేరక శక్తిగా నిలవాలన్నదే తన తపన అని చెప్పారు. ''దేశమే ముందు. నాకైనా, మీకైనా ఇదే ఏకైక లక్ష్యం కావాలి'' అని వారికి ఉద్బోధించారు. ''2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుదాం. మీనుంచి నేను కోరేది అదే'' అని స్పష్టం చేశారు. ''మనం నిర్ణీత పని గంటలు పెట్టుకుని, వాటికి పరిమితమై పని చేసే వాళ్లం కాదు. పని వేళలతో పాటు ఆలోచనలకు కూడా ఎలాంటి హద్దులూ లేనివాళ్లే నా పీఎంవో బృందం. వారిపై దేశమూ ఎంతో నమ్మకం పెట్టుకుంది'' అన్నారు. ''గత పదేళ్లో ఆలోచించిన, అమలు చేసిన దానికంటే ఎంతో ఎక్కువగా చేసి చూపించాల్సిన బాధ్యత మనపై ఉంది. ఇదే నా భవిష్యత్తు విజన్'' అని పేర్కొన్నారు.''అంతర్జాతీయ ప్రమాణాలన్నింటినీ అధిగమిద్దాం. నిన్న ఎలా ఉన్నాం, ఈ రోజు ఎంత బాగా చేశామన్నది కాదు. ఇక ముందు ప్రతి రంగంలోనూ మనమే ప్రపంచంలో అగ్రగాములుగా ఎదగాలి. ఇప్పటిదాకా ఎవరూ చేరలేని శిఖరాలకు దేశాన్ని తీసుకెళ్దాం'' అని అధికారులకు పిలుపునిచ్చారు. అది జరగాలంటే ఆలోచనల్లో స్పష్టత, చిత్తశుద్ధిపై నమ్మకం, ఆ దిశగా కష్టించే స్వభావం అత్యంత అవసరమని మోదీ చెప్పారు. పీఎంవో బృంద సభ్యులు అందిస్తూ వస్తున్న సహకారానికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అదే నా శక్తి రహస్యం...

తనకు ఇంతటి శక్తి ఎక్కడి నుంచి వస్తోందని ఈ ఎన్నికల సందర్భంగా చాలామంది అడిగారని మోదీ అన్నారు. ''30 ఏళ్లుగా నాకీ ప్రశ్న ఎదురవుతూనే ఉంది. నాలోని విద్యార్థి నిత్యం సజీవంగానే ఉంచుకుంటాను. బలహీనతకు, బద్ధకానికి ఎట్టి పరిస్థితుల్లోనూ చోటివ్వను. చైతన్యంతో, శక్తిమంతంగా ఉండటమే నా రహస్యం. అలా ఉన్నప్పుడే విజయవంతమైన వ్యక్తులుగా ఎదుగుతాం. నూతనోత్తేజం, రెట్టించిన ఉత్సాహం, శక్తియుక్తులతో ముందుకు సాగుతా'' అని చెప్పారు.



'పీఎం కిసాన్ నిధి'పై మోదీ తొలి సంతకం

సాక్షి, న్యూఢిల్లీ: మూడోసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించాక 'పీఎం కిసాన్ సమ్మాన్ నిధి' పథకం 17 వ విడత నిధుల విడుదల ఫైలుపై మోదీ తొలి సంతకం చేశారు. దాంతో దేశవ్యాప్తంగా 9.3 కోట్ల మంది రైతులకు ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున మొత్తంగా రూ.20 వేల కోట్ల నిధులు అందనున్నాయి. అనంతరం మోదీ మాట్లాడుతూ, తమది రైతు సంక్షేమానికి పూర్తిగా కట్టుబడ్డ ప్రభుత్వమన్నారు. అందుకే ప్రధానిగా బాధ్యతలు స్వీకరించాక తొలి సంతకం రైతు సంక్షేమ ఫైలుపై పెట్టడం సముచితమన్నారు. రైతులు, వ్యవసాయ రంగ అభివృద్ధికి మరింత కృషి చేయాలని భావిస్తున్నట్టు చెప్పారు.

మంత్రులు-శాఖలు

1. నరేంద్ర మోదీ	ప్రధానమంత్రి సిబ్బంది, ప్రజా సమస్యలు, పెన్షన్లు, అణు శక్తి, అంతరిక్షం, కీలక విధానాంశాలు, ఎవరికీ కేటాయించని ఇతర శాఖలు

కేబినెట్ హోదా

2. రాజ్‌నాథ్‌సింగ్ (బీజేపీ)	రక్షణ
3. అమిత్ షా (బీజేపీ)	హోం, సహకార
4. నితిన్ గడ్కరీ (బీజేపీ)	ఉపరితల రవాణా, జాతీయ రహదారులు
5. జేపీ నడ్డా (బీజేపీ)	ఆరోగ్యం-కుటుంబ సంక్షేమం, ఎరువులు-రసాయనాలు
6. శివరాజ్‌సింగ్ చౌహాన్ (బీజేపీ)	వ్యవసాయం-రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి
7. నిర్మలా సీతారామన్ (బీజేపీ)	ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాలు
8. ఎస్.జైశంకర్ (బీజేపీ)	విదేశాంగ వ్యవహారాలు
9. మనోహర్‌లాల్ ఖట్టర్ (బీజేపీ)	విద్యుత్, హౌజింగ్-పట్టణ వ్యవహారాలు
10. హెచ్.డి.కుమారస్వామి (జేడీఎస్)	భారీ పరిశ్రమలు, ఉక్కు
11. పీయూష్ గోయల్ (బీజేపీ)	వాణిజ్యం-పరిశ్రమలు
12. ధర్మేంద్ర ప్రధాన్ (బీజేపీ)	విద్య
13. జితన్ రాం మాంఝీ (హెచ్ఏఎం)	సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు
14. రాజీవ్ రంజన్ (లలన్) సింగ్ (జేడీయూ)	పంచాయతీరాజ్, మత్స్య-పశు సంవర్ధక-పాడి
15. సర్బానంద సోనోవాల్ (బీజేపీ)	పోర్టులు, షిప్పింగ్, వాటర్ వేస్
16. వీరేంద్ర కుమార్ (బీజేపీ)	సామాజిక న్యాయం-సాధికారత
17. కె.రామ్మోహన్ నాయుడు (టీడీపీ)	పౌర విమానయానం
18. ప్రహ్లాద్ జోషి (బీజేపీ)	వినియోగదారుల వ్యవహారాలు-ఆహారం-ప్రజా పంపిణీ, నూతన-సంప్రదాయేతర ఇంధన వనరులు
19. జుయెల్ ఓరం (బీజేపీ)	గిరిజన వ్యవహారాలు
20. గిరిరాజ్‌సింగ్ (బీజేపీ)	జౌళి పరిశ్రమలు
21. అశ్వినీ వైష్ణవ్ (బీజేపీ)	రైల్వే, సమాచార-ప్రసార, ఐటీ-ఎలక్ట్రానిక్స్
22. జ్యోతిరాదిత్య సింధియా (బీజేపీ)	కమ్యూనికేషన్స్, ఈశాన్య ప్రాంత అభివృద్ధి
23. భూపేందర్ యాదవ్ (బీజేపీ)	పర్యావరణ-అటవీ-వాతావరణ మార్పులు
24. గజేంద్రసింగ్ షెకావత్ (బీజేపీ)	సాంస్కృతిక, పర్యాటక
25. అన్నపూర్ణాదేవి (బీజేపీ)	మహిళా-శిశు సంక్షేమం
26. కిరెణ్ రిజిజు (బీజేపీ)	పార్లమెంటరీ, మైనారిటీ వ్యవహారాలు
27. హర్దీప్‌సింగ్ పురి (బీజేపీ)	పెట్రోలియం-సహజ వాయువులు
28. మన్‌సుఖ్ మాండవీయ (బీజేపీ)	కార్మిక-ఉపాధి, యువజన వ్యవహారాలు-క్రీడలు
29. జి.కిషన్‌రెడ్డి (బీజేపీ)	బొగ్గు, గనులు
30. చిరాగ్ పాశ్వాన్ (ఎల్జేపీ)	ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు
31. సి.ఆర్.పాటిల్ (బీజేపీ)	జలశక్తి

సహాయ మంత్రులు - స్వతంత్ర హోదా

32. రావ్ ఇందర్‌జీత్ సింగ్ (బీజేపీ)	గణంకాలు-కార్యక్రమాల అమలు (స్వతంత్ర), ప్రణాళిక (స్వతంత్ర), సాంస్కృతిక
33. జితేంద్రసింగ్ (బీజేపీ)	సైన్స్ అండ్ టెక్నాలజీ (స్వతంత్ర), ఎర్త్ సైన్సెస్ (స్వతంత్ర), ప్రధాని కార్యాలయం, సిబ్బంది- ప్రజా సమస్యలు, పెన్షన్లు, అణు శక్తి, అంతరిక్షం
34. అర్జున్‌రాం మేఘ్వాల్ (బీజేపీ)	న్యాయ (స్వతంత్ర), పార్లమెంటరీ వ్యవహారాలు
35. ప్రతాప్‌రావ్ జాదవ్ (శివసేన)	ఆయుష్ (స్వతంత్ర), ఆరోగ్య-కుటుంబ సంక్షేమం
36. జయంత్ చౌధరి (ఆరెల్డీ)	నైపుణ్యాభివృద్ధి-ఎంట్రప్రెన్యూర్‌షిప్ (స్వతంత్ర), విద్య

సహాయ మంత్రులు

37. జితిన్ ప్రసాద (బీజేపీ)	వాణిజ్యం-పరిశ్రమలు, ఐటీ-ఎలక్ట్రానిక్స్
38. శ్రీపాద యశో నాయక్ (బీజేపీ)	విద్యుత్, నూతన-సంప్రదాయేతర ఇంధన వనరులు
39. పంకజ్ చౌధరి (బీజేపీ)	ఆర్థిక
40. కృషన్‌పాల్ గుర్జర్ (బీజేపీ)	సహకార
41. రామ్‌దాస్ అథవాలె (ఆర్పీఐ)	సామాజిక న్యాయం-సాధికారత
42. రామ్‌నాథ్ ఠాకూర్ (జేడీయూ)	వ్యవసాయం-రైతు సంక్షేమం
43. నిత్యానంద్ రాయ్ (బీజేపీ)	హోం
44. అనుప్రియా పటేల్ (అప్నాదళ్)	ఆరోగ్యం-కుటుంబ సంక్షేమం, రసాయనాలు-ఎరువులు
45. వి.సోమన్న (బీజేపీ)	జల శక్తి, రైల్వే
46. చంద్రశేఖర్ పెమ్మసాని (టీడీపీ)	గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్లు
47. ఎస్పీ సింగ్ భగెల్ (బీజేపీ)	మత్స్య-పశు సంవర్ధక-పాడి, పంచాయతీరాజ్
48. శోభా కరంద్లాజె (బీజేపీ)	సూక్ష్మ-చిన్న-మధ్య తరహా పరిశ్రమలు, కార్మిక-ఉపాధి
49. కీర్తివర్ధన్ సింగ్ (బీజేపీ)	పర్యావరణ-అటవీ-వాతావరణ మార్పులు, విదేశాంగం
50. బి.ఎల్.వర్మ (బీజేపీ)	వినియోగదారుల వ్యవహారాలు, ఆహార-ప్రజా పంపిణీ, సామాజిక న్యాయం-సాధికారత
51. శాంతను ఠాకూర్ (బీజేపీ)	పోర్టులు-షిప్పింగ్-వాటర్‌వేస్
52. సురేశ్ గోపీ (బీజేపీ)	పెట్రోలియం-సహజ వాయువు, పర్యాటకం
53. ఎల్.మురుగన్ (బీజేపీ)	సమాచార-ప్రసార, పార్లమెంటరీ వ్యవహారాలు
54. అజయ్ టంటా (బీజేపీ)	ఉపరితల రవాణా-జాతీయ రహదారులు
55. బండి సంజయ్‌కుమార్ (బీజేపీ)	హోం
56. కమలేశ్ పాశ్వాన్ (బీజేపీ)	గ్రామీణాభివృద్ధి
57. భగీరథ్ చౌధరి (బీజేపీ)	వ్యవసాయం-రైతు సంక్షేమం
58. సతీశ్‌చంద్ర దూబె (బీజేపీ)	బొగ్గు, గనులు
59. సంజయ్ సేథ్ (బీజేపీ)	రక్షణ
60. రవ్‌నీత్‌సింగ్ బిట్టూ (బీజేపీ)	ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు, రైల్వే
61. దుర్గాదాస్ ఉయికే (బీజేపీ)	గిరిజన వ్యవహారాలు
62. రక్షా నిఖిల్ ఖడ్సే (బీజేపీ)	క్రీడలు-యువజన వ్యవహారాలు
63. సుకాంత మజుందార్ (బీజేపీ)	విద్య, ఈశాన్య ప్రాంత అభివృద్ధి
64. సావిత్రీ ఠాకూర్ (బీజేపీ)	మహిళా-శిశు సంక్షేమం
65. తోఖన్ సాహు (బీజేపీ)	హౌజింగ్-పట్టణ వ్యవహారాలు
66. రాజ్‌భూషణ్ చౌధరి (బీజేపీ)	జల శక్తి
67. భూపతిరాజు శ్రీనివాస వర్మ (బీజేపీ)	భారీ పరిశ్రమలు, ఉక్కు
68. హర్ష్ మల్హోత్రా (బీజేపీ)	కార్పొరేట్ వ్యవహారాలు, ఉపరితల రవాణా-జాతీయ రహదారులు
69. నిముూబెన్ బంభానియా (బీజేపీ)	వినియోగదారుల వ్యవహారాలు-ఆహారం-ప్రజా పంపిణీ
70. మురళీధర్ మొహోల్ (బీజేపీ)	సహకార, పౌర విమానయాన
71. జార్జి కురియన్ (బీజేపీ)	మైనారిటీ వ్యవహారాలు, మత్స్య-పశు సంవర్ధక-పాడి
72. పబిత్రా మార్గరీటా (బీజేపీ)	విదేశాంగం, జౌళి

3 కోట్ల ఇళ్ల నిర్మాణం
కేబినెట్ తొలి భేటీలో నిర్ణయం

న్యూఢిల్లీ: ప్రధాన్‌మంత్రి ఆవాస్ యోజన కింద (పీఎంఏవై) దేశవ్యాప్తంగా 3 కోట్ల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వ సాయమందించే ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. కొత్తగా కొలువుదీరిన ఎన్డీఏ మంత్రివర్గం సోమవారం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన తొలిసారి సమావేశమైంది. మోదీ అధికారిక నివాసం '7, లోక్ కల్యాణ్ మార్గ్'లో జరిగిన ఈ భేటీలో బీజేపీతో సహా అన్ని ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలకు చెందిన మంత్రులు పాల్గొన్నారు. అర్హులైన కుటుంబాల గృహ నిర్మాణ అవసరాలను తీర్చాలని భేటీలో నిర్ణయం తీసుకున్నట్టు అధికారులు వెల్లడించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని అర్హులైన పేద కుటుంబాలకు కనీస సదుపాయాలతో కూడిన ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సాయం చేసే నిమిత్తం 2015-16 ఆర్థిక సంవత్సరం నుంచి పీఎంఏవై పథకాన్ని కేంద్రం అమలు చేస్తోంది. దీని కింద గత పదేళ్లలో 4.21 కోట్ల మంది అర్హులైన పేదలకు ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి.

ఫ్రాన్స్ పార్లమెంట్ రద్దు

ముందస్తు ఎన్నికలకు వెళ్తున్న దేశాధ్యక్షుడు మేక్రాన్



పారిస్: యూరోపియన్ యూనియన్ (ఈయూ) పార్లమెంటరీ ఎన్నికలు పరోక్షంగా ఫ్రాన్స్ పార్లమెంట్ ముందస్తు ఎన్నికలను మోసుకొచ్చాయి. యూరోపియన్ యూనియన్‌లో మొత్తం 720 సీట్లు ఉండగా 81 సభ్యులను ఫ్రాన్స్ ఎన్నుకోనుంది. ఇందుకోసం జరిగిన ఎన్నికల్లో ఫ్రాన్స్ విపక్ష నేషనల్‌ర్యాలీ పార్టీకి 32 శాతం ఓట్లు పడొచ్చని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. ఫ్రాన్స్ దేశాధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్‌కు చెందిన రనీసాన్స్ పార్టీకి కేవలం 15 శాతం ఓట్లు పడతాయని ఎగ్జిట్ పోల్స్ ప్రకటించాయి. నిజంగానే ఈ ధోరణి ఇలాగే కొనసాగితే మూడేళ్ల తర్వాత అంటే 2027లో జరగబోయే ఫ్రాన్స్ పార్లమెంట్ ఎన్నికల్లోనూ విపక్ష పార్టీ విజయం సాధించే ప్రమాదముందని దేశాధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్ భావించారు. ఇందుకు బలం చేకూరుస్తూ ఆయన పార్లమెంట్‌ను రద్దుచేస్తున్నట్లు ఆదివారం ప్రకటించారు. దీంతో వచ్చే 20 రోజుల్లో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్నాయి. జూన్ 30న తొలి దశ, జూలై ఏడో తేదీన రెండో దశ పోలింగ్ జరగనుంది. మూడేళ్ల తర్వాత నిర్వహిస్తే ఓడిపోతామని, ప్రజాదరణ తగ్గేలోపు ఇప్పుడే నిర్వహిస్తే తమ రనీసాన్స్ పార్టీయే గెలుస్తుందన్న అంచనాతో ఆయన ఈ అనూహ్య నిర్ణయం తీసుకున్నారని వార్తలొచ్చాయి.

సరైన నిర్ణయం తీసుకున్నా: మేక్రాన్

పార్లమెంట్ రద్దు నిర్ణయాన్ని మేక్రాన్ సమర్థించుకున్నారు. '' దేశం కోసం సరైన నిర్ణయం తీసుకున్నా. ఈయూ ఎన్నికల ద్వారా ప్రజలు మా ప్రభుత్వానికి ఏం చెప్పదల్చుకున్నారో అర్థమైంది. ప్రజల సమస్యలకు పరిష్కారాలు చూపకుండా వదిలేయలేను' అని చెప్పారు.

కీలక శాఖలన్నీ బీజేపీ వద్దే

షా, రాజ్‌నాథ్, నిర్మల, జైశంకర్ సహా కీలక మంత్రులకు అవే శాఖలు

న్యూఢిల్లీ: అనుభవానికి పెద్దపీట వేస్తూ, అదే సమయంలో యువతకు సముచిత ప్రాధాన్యమిస్తూ నూతన కేంద్ర మంత్రులకు శాఖల కేటాయింపు జరిగింది. కసరత్తులో ఆసాంతం మోదీ-షా ముద్రే ప్రతిఫలించింది. పదేళ్లుగా మోదీ తొలి, మలి మంత్రివర్గాల్లో కీలకంగా వ్యవహరించిన బీజేపీ మంత్రులకు ఈసారీ ప్రాధాన్యం కొనసాగింది. హోం శాఖ బాధ్యతలు మరోసారి అమిత్ షానే చేపట్టగా రాజ్‌నాథ్‌సింగ్ రక్షణ, నిర్మలా సీతారామన్ ఆర్థిక, జైశంకర్ విదేశాంగ శాఖల్లో కొనసాగనున్నారు. మోదీతో పాటు మొత్తం 72 మందితో ఆదివారం ఎన్డీఏ మంత్రివర్గం కొలువుదీరడం తెలిసిందే. మోదీ సిఫార్సు మేరకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము వారికి సోమవారం శాఖలు కేటాయించారు. గత రెండుసార్లకు భిన్నంగా ఈసారి బీజేపీకి సొంతంగా మెజారిటీ రాకపోవడంతో ప్రభుత్వ మనుగడలో ఎన్డీఏ పక్షాలు కీలకంగా మారాయి. ఈ నేపథ్యంలో టీడీపీ, జేడీ(యూ) తదితర భాగస్వాములకు శాఖల కేటాయింపులో సముచిత ప్రాధాన్యమే దక్కినా కీలక శాఖలన్నింటినీ బీజేపీయే అట్టిపెట్టుకునేలా అన్ని జాగ్రత్తలూ తీసుకున్నట్టు స్పష్టంగా కన్పించింది. కీలక శాఖలు కావాలని జేడీ(యూ), టీడీపీ ముందుగానే కోరినా కుదరదని బీజేపీ పెద్దలు స్పష్టం చేయడం తెలిసిందే. అందుకు తగ్గట్టుగానే వ్యూహాత్మక ప్రాధాన్యమున్న అత్యధిక పోర్టుఫోలియోలు బీజేపీ మంత్రులకే దక్కాయి.

దేశవ్యాప్తంగా రోడ్డు నెట్‌వర్క్ అభివృద్ధి, విస్తరణ, ఆధునీకరణలో తనదైన మార్కు చూపిన నితిన్ గడ్కరీకి మరోసారి రోడ్లు-హైవే శాఖ దక్కింది. మోదీకి ప్రీతిపాత్రుడైన అశ్వినీ వైష్ణవ్‌కు కీలకమైన రైల్వే, ఐటీ-ఎలక్ట్రానిక్స్ శాఖలను కొనసాగించడమే గాక సమాచార-ప్రసార శాఖ బాధ్యతలు కూడా కట్టబెట్టడం విశేషం. గత ప్రభుత్వంలో ఆ బాధ్యతలు చూసిన అనురాగ్ ఠాకూర్‌కు ఈసారి మంత్రివర్గంలో చోటు దక్కకపోవడం తెలిసిందే. ఆయనకు బీజేపీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించవచ్చని వార్తలొస్తున్నాయి. ధర్మేంద్ర ప్రధాన్‌కు విద్య, పీయూష్ గోయల్‌కు వాణిజ్య, పరిశ్రమల శాఖలను కొనసాగించారు. హర్దీప్‌సింగ్ పురికి పెట్రోలియం శాఖను కొనసాగిస్తూ హౌజింగ్-పట్టణ వ్యవహారాలను తప్పించారు. తొలుత న్యాయ, తర్వాత ఎర్త్ సైన్సెస్ బాధ్యతలు చూసిన కిరెణ్ రిజిజుకు ప్రధానమైన పార్లమెంటరీ వ్యవహారాలు అప్పగించారు.

'మామ'కు వ్యవసాయం

రాష్ట్రాల్లో ఏళ్ల తరబడి చక్రం తిప్పి కొత్తగా మోదీ కేబినెట్లో చేరిన బీజేపీ దిగ్గజాలకు ప్రధాన శాఖలే కేటాయించారు. వారిలో మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్‌సింగ్‌కు కీలకమైన వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖలు దక్కాయి. ఐదేళ్ల తర్వాత కేబినెట్లో అడుగు పెట్టిన బీజేపీ అధ్యక్షుడు జగత్‌ప్రకాశ్ నడ్డాకు మరోసారి మోదీ తొలి మంత్రివర్గంలో నిర్వర్తించిన ఆరోగ్య శాఖతో పాటు ఎరువులు-రసాయనాల శాఖ కూడా దక్కింది. ఇప్పటిదాకా ఆ రెండు శాఖలనూ మాండవీయ చూశారు. హరియాణా మాజీ సీఎం మనోహర్‌లాల్ ఖట్టర్‌కు విద్యుత్‌తో పాటు పట్టణ వ్యవహారాలను అప్పగించారు. న్యాయ శాఖకు అర్జున్‌రాం మేఘ్వాల్, షిప్పింగ్‌కు సర్బానంద సోనోవాల్, పర్యావరణానికి భూపేందర్ యాదవ్, సామాజిక న్యాయానికి వీరేంద్ర కుమార్ కొనసాగారు. గిరిజన శాఖ బాధ్యతలు జ్యూయల్ ఓరంకు దక్కాయి.

తెలుగు రాష్ట్రాల నుంచి...

మోదీ 3.0 మంత్రివర్గంలో తెలుగు రాష్ట్రాల నుంచి ఐదుగురికి చోటు దక్కడం తెలిసిందే. వారిలో కిషన్‌కు బొగ్గు, గనులు, ఏపీ నుంచి టీడీపీకి చెందిన రామ్మోహన్‌కు విమానయానం రూపంలో కేబినెట్ హోదా బెర్తులు దక్కాయి. గతంలో వాజ్‌పేయి సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో కూడా టీడీపీ నేత అశోక్ గజపతిరాజు పౌర విమానయాన శాఖ మంత్రిగా చేశారు. తెలంగాణ నుంచి బండి సంజయ్‌కుమార్, ఏపీ నుంచి భూపతిరాజు శ్రీనివాస వర్మ, టీడీపీ నేత పెమ్మసాని చంద్రశేఖర్‌కు సహాయ మంత్రి పదవులు దక్కడం తెలిసిందే. బండికి హోం శాఖ కేటాయించారు. వర్మకు భారీ పరిశ్రమలు, ఉక్కు, పెమ్మసానికి గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల రూపంలో రెండేసి శాఖల బాధ్యతలు అప్పగించారు.

భాగస్వాములకు ఇలా...

ఎన్డీఏ భాగస్వాముల్లో జేడీ(యూ) నేత లలన్‌సింగ్‌కు పంచాయతీరాజ్, మత్స్య-పశుసంవర్ధకం-పాడి శాఖలు దక్కాయి. వ్యవసాయ శాఖపై ఆశలు పెట్టుకున్న జేడీ(ఎస్) చీఫ్ కుమారస్వామికి ఉక్కు, భారీ పరిశ్రమల బాధ్యతలు అప్పగించారు. హెచ్ఏఎం(ఎస్) చీఫ్ జితన్‌రాం మాంఝీకి ఎంఎస్ఎంఈ; ఎల్జేపీ (ఆర్వీ) అధ్యక్షుడు చిరాగ్ పాస్వాన్‌కు ఫుడ్ ప్రాసెసింగ్, టీడీపీ నుంచి రామ్మోహన్ నాయుడికి పౌర విమానయాన శాఖలు దక్కాయి. భాగస్వామ్య పక్షాలకు ఐదు కేబినెట్, రెండు స్వతంత్ర, నాలుగు సహాయ పదవులివ్వడం తెలిసిందే. ఇక స్వతంత్ర హోదా మంత్రుల్లో శివసేన నుంచి జి.పి.జాదవ్‌కు ఆయుష్, ఆరెల్డీ నేత జయంత్ చౌదరికి నైపుణ్యాభివృద్ధి శాఖలిచ్చారు.

సిక్కిం సీఎంగా ప్రేమ్ సింగ్ తమాంగ్
వరుసగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన ఎస్కేఎం చీఫ్

గ్యాంగ్‌టక్: సిక్కిం ముఖ్యమంత్రిగా సిక్కిం క్రాంతికారీ మోర్చా అధినేత ప్రేమ్ సింగ్ తమాంగ్(56) వరుసగా రెండోసారి సోమవారం బాధ్యతలు చేపట్టారు. రాజధాని గ్యాంగ్‌టక్‌లోని పల్జోర్‌స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ లక్ష్మణ్ ఆచార్య తమాంగ్, మరో 11 మంది మంత్రులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని గ్యాంగ్‌టక్‌లో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ కార్యాలయాలకు ఒక పూట సెలవు ప్రకటించారు. అన్ని విద్యా సంస్థలను మూసి వేయించారు. ఇటీవలి ఎన్నికల్లో అసెంబ్లీలోని 32 స్థానాలకు గాను 31 స్థానాల్లో ఎస్కేఎం ఘన విజయం సాధించడం తెల్సిందే. సీఎంగా బాధ్యతలు చేపట్టిన తమాంగ్‌ను ప్రధాని మోదీ అభినందించారు. రాష్ట్రాభివృద్ధికి కలిసి పనిచేద్దామంటూ పిలుపునిచ్చారు.

13 అసెంబ్లీ స్థానాల్లో జూలై 10న ఉప ఎన్నికలు

న్యూఢిల్లీ: పశ్చిమబెంగాల్‌లోని నాలుగు సీట్లు సహా దేశవ్యాప్తంగా ఏడు రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ స్థానాలకు జూలై 10వ తేదీన ఉప ఎన్నికలు జరుపుతామని ఎన్నికల సంఘం ప్రకటించింది. ఎమ్మెల్యేల ఆకస్మిక మరణాలు, రాజీనామాల కారణంగా ఆయా స్థానాలు ఖాళీ అయ్యాయని వివరించింది. ఎన్నికలు జరిగే స్థానాలివీ..బిహార్‌లోని రుపాలి, పశ్చిమబెంగాల్‌లోని రాయ్‌గంజ్, రాణాఘాట్ దక్షిణ్, బాగ్దా, మణిక్తల, తమిళనాడులోని విక్రవండి, మధ్యప్రదేశ్‌లోని అమర్వాడ, ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్, మంగ్లౌర్, పంజాబ్‌లోని జలంధర్(పశ్చిమ), హిమాచల్ ప్రదేశ్‌లోని డెహ్రా, హమీర్‌పూర్, నాలాగఢ్. ఈ ఉప పోరుకు గాను ఈ నెల 14న నోటిఫికేషన్ విడుదల చేస్తామని ఈసీ వివరించింది.

చిరుత పులి.. కాదు పిల్లి
రాష్ట్రపతిభవన్‌లో మంత్రుల ప్రమాణస్వీకారం వేళ ప్రత్యక్షమైన గుర్తుతెలియని జీవి!

న్యూఢిల్లీ: మోదీ మూడోసారి రాష్ట్రపతిభవన్‌లో ప్రధానిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంలో వేదిక వెనుక చిరుత పులి సంచరించిందని ఒక వీడియోను సామాజిక మాధ్యమాల్లో నెటిజన్లు విస్తృతంగా షేర్ చేశారు. రాష్ట్రపతిభవన్ వెనకాలే ఢిల్లీ రిజర్వ్ ఫారెస్ట్ ఉన్న విషయం తెల్సిందే. అయితే బీజేపీ ఎంపీ దుర్గాదాస్ ఉయికే కేంద్రమంత్రిగా ప్రమాణం చేశాక రిజిస్ట్రీలో సంతకం చేసి రాష్ట్రపతి ముర్ము వైపు నడుస్తుండగా వేదిక వెనకాల స్తంభాలను దాటుతూ ఒక మోస్తరు సైజు జంతువు కనిపించింది. రిజర్వ్ ఫారెస్ట్ నుంచి వచ్చిన చిరుతపులి రాష్ట్రపతిభవన్‌లో చొరబడిందని, ఆ వీడియోలో వెనకాల ఉన్నది అదేనని నెటిజన్లు ఖాయం చేసి సంబంధిత వీడియోను విస్తృతంగా షేర్ చేశారు. దీంతో అప్రమత్తమైన ఢిల్లీ పోలీసులు సంబంధిత వీడియోపై వివరణ ఇచ్చారు. అది సాధారణ పెంపుడు పిల్లి అని, రాష్ట్రపతిభవన్‌లో ఇలాంటి పెంపుడు పిల్లులు, శునకాలు ఉన్నాయని స్పష్టంచేస్తూ 'ఎక్స్'లో ఒక పోస్టుచేసింది.

నేడే ఒడిశా బీజేపీ శాసనసభాపక్ష భేటీ
నూతన సీఎంను ఎన్నుకోనున్న లెజిస్లేటివ్ పార్టీ సమావేశం

భువనేశ్వర్: ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎన్నిక ప్రక్రియ సాగుతోంది. శాసనసభలో తమ పక్ష నేతను ఎన్నుకునేందుకు మంగళవారం బీజేపీ ప్రధాన కార్యాలయంలో శాసనసభాపక్ష భేటీ జరగనుంది. ముఖ్య నేతలైన కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, భూపేంద్ర యాదవ్ పర్యవేక్షకులుగా ఇప్పటికే ఒడిశా చేరుకున్నారు. బుధవారం సీఎం ప్రమాణస్వీకారరుంటుందని తోమర్ మీడియతో చెప్పారు. సీనియర్ నేత, ఎంపీ ధర్మేంద్ర ప్రధాన్ కేంద్ర కేబినెట్‌లోకి వెళ్లడంతో మరో నేత, బ్రజరాజ్‌నగర్ ఎమ్మెల్యే సురేశ్ పూజారీకి ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు మరింత మెరుగయ్యాయి. ముఖ్యమంత్రి పదవి రేసులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మన్‌మోహన్ సమాల్, కేవీ సింగ్, మోహన్ మాఝీ తదితరులు కూడా ఉన్నారు.

రాజీనామా వార్త వట్టి అబద్ధం: సురేష్ గోపి

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం నుంచి తాను వైదొలగాలనుకుంటున్నట్లుగా వస్తున్న వార్తలను మలయాళ నటుడు, కేంద్ర మంత్రి సురేష్ గోపి ఖండించారు. ఆ వార్తలన్నీ పూర్తి అసత్యాలని స్పష్టం చేశారు. సోమవారం తన ఫేస్‌బుక్ పేజీలో... కేరళ ప్రజలకు ప్రతినిధిగా మోదీ ప్రభుత్వంలోని మంత్రి మండలిలో స్థానం పొందటం గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. సహాయ మంత్రి పదవికి రాజీనామా చేస్తున్నట్లుగా కొన్ని మీడియా వేదికలపై ప్రచారంలోకి వస్తున్న వార్తలు అవాస్తవాలని వివరించారు. ప్రధాని మోదీతో కలిసి ఉన్న ఫొటోను షేర్ చేశారు. ఆదివారం రాత్రి సురేష్ గోపి మీడియాతో మాట్లాడుతూ..'బీజేపీ అధిష్టానాన్ని ఏ పదవీ అడగలేదు. మంత్రి పదవి వద్దని చెప్పాను. నాకీ పదవి వద్దు. తక్షణమే ఈ బాధ్యతల నుంచి తప్పుకోవాలనుకుంటున్నాను'అని వ్యాఖ్యానించారు. దీంతో ఆయన రాజీనామా చేస్తారంటూ వదంతులు వ్యాపించాయి.

'కేబినెట్'కూ పనికిరామా: శివసేన

ముంబై: కేంద్ర మంత్రివర్గ కూర్పుపై మహారాష్ట్రలో ఎన్డీఏ భాగస్వాములు శివసేన, ఎన్సీపీ గుర్రుగా ఉన్నాయి. కేబినెట్ హోదా మంత్రి పదవి దక్కకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. రెండు పార్టీలకూ బీజేపీ ఒక్కో స్వతంత్ర హోదా సహాయ మంత్రి పదవి ఆఫర్ చేయడం, ఎన్సీపీ తిరస్కరించడం తెలిసిందే. అవసరమైతే వేచి చూస్తాం తప్ప సహాయ పదవి తీసుకునేది లేదని కుండబద్దలు కొట్టింది. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్సీపీకి ఒకే స్థానం దక్కింది. మరోవైపు ఏడు సీట్లు గెలుచుకున్న తమకు తమకు ఒకే బెర్తు ఇవ్వడం, అది కూడా స్వతంత్ర హోదా పదవి కావడంపై శివసేన ఆగ్రహంగా ఉంది. బీజేపీకి పాత మిత్రులమన్న కారణంగానైనా కనీసం కేనెబిట్ హోదా ఇస్తారని ఆశించామని పార్టీ చీఫ్ విప్ శ్రీరంగ్ బర్నే అన్నారు. ''ఐదు సీట్లే ఉన్న ఎల్జేపీ, రెండే గెలిచిన జేడీ(ఎస్), ఒకే ఒక్క స్థానమున్న హెచ్ఏఎం కేబినెట్ బెర్తులు దక్కించుకున్నాయి. మాకేమో ఏడు స్థానాలున్నాయి'' అంటూ సోమవారం ఆవేదన వ్యక్తం చేశారు. అయితే కేంద్రంలో ఎన్డీఏ సర్కారుకు తమది బేషరతు మద్దతని, అందుకు ప్రతిగా అధికారంలో వాటా కోసం ఎలాంటి బేరసారాలూ చేయడం లేదని శివసేన లోక్‌సభా పక్ష నేత శ్రీకాంత్ షిండే స్పష్టం చేశారు. గతంలోనే కేబినెట్ మంత్రిగా ఉన్న తాను సహాయ పదవి చేపట్టడమంటే స్థాయి తగ్గించుకోవడమేనని ఎన్సీపీ నేత ప్రఫుల్ పటేల్ ఆదివారం మోదీ మంత్రివర్గ ప్రమాణస్వీకారానికి ముందు వ్యాఖ్యలు చేయడం తెలిసిందే.

సేన, ఎన్సీపీలపై విపక్ష మహా వికాస్ అగాడీ చెణుకులు విసిరింది. బానిసలుగా మారితే ఇలాగే ఉంటుందంటూ శివసేన (ఉద్ధవ్) అధికార ప్రతినిధి సంజయ్ రౌత్ ఎద్దేవా చేశారు. వాడుకుని వదిలేసే బీజేపీ నైజం ఆ రెండు పార్టీలకూ మరోసారి తెలిసొచ్చిందన్నారు. ఎన్సీపీకి మోదీ కేబినెట్‌లో చోటు ఇక కలేనని కాంగ్రెస్ జోస్యం చెప్పింది.

15న కోవై కొడీస్సియాలో డీఎంకే ముప్పెరుం విళా

సాక్షి, చెన్నై: కోయంబత్తూరులోని కొడీస్సియా మైదానంలో డీఎంకే ముప్పెరుం విళా జరుగుతుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి దురై మురుగన్ సోమవారం ప్రకటించారు. డీఎంకే ఎంపీల తీర్మానం మేరకు ఈనెల 14న ముప్పెరుం విళాకు నిర్ణయించినట్టు గుర్తు చేశారు. అయితే అనివార్య కారణాల వల్ల ఈ వేడుక 15వ తేదీ సాయంత్రం నాలుగున్నర గంటల నుంచి ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. కలైంజ్ఞర్ కరుణానిధి శతజయంతి ఉత్సవాల ముగింపు, లోక్‌సభ ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ సాధించడం, సీఎం స్టాలిన్‌కు అభినందన సభతో ఈ ముప్పెరుం విళా జరుగుతుందని, కార్యకర్తలు భారీగా తరలిరావాలని కోరారు.

న్యూస్‌రీల్

20 నుంచి చిన్నమ్మ జిల్లాల బాట

సాక్షి, చెన్నై: అన్నాడీఎంకే వర్గాలను ఏకంచేయడమే లక్ష్యంగా దివంగత సీఎం జె. జయలలిత నెచ్చెలి శశికళ ఈనెల 20 నుంచి జిల్లాల బాటకు సిద్ధమవుతున్నారు. కేడర్‌తో మమేకమయ్యే విధంగా ఈ పర్యటన రూట్‌మ్యాప్ సిద్ధమవుతోంది. లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే ఓటమి గురించి తెలిసిందే. అందరంతలా ఓ దారిలో ఉండడం వల్లే నష్టాలు, కష్టాలు, ఓటమి ఎదుర్కోవాల్సి ఉందని, అందరూ ఏకం అవ్వాల్సిందేనని ఇప్పటికే శశికళ పిలుపు నిచ్చారు. ఐక్యతా రాగం అందుకున్న శశికళ ముందుగా కేడర్‌ను ఏకంచేసే దిశగా ముందుకెళ్లనున్నారు. ఇందుకోసం ఆమె తొలుత దక్షిణ తమిళనాడులోని జిల్లాలో పర్యటించేందుకు సిద్ధమయ్యారు. ఈనెల 20 నుంచి ఆమె పర్యటన సాగనుంది.

రైతుల కోసం స్నేహ పూర్వక పథకం

సాక్షి, చెన్నై: అధునాతన వ్యవసాయ పద్ధతులు, పనిముట్లు, హెవీ డ్యూటీ ట్రాక్టర్ల పంపిణీ దిశగా రైతుల కోసం స్నేహ పూర్వక పథకాన్ని ప్రారంభించామని ఇంటర్నేషనల్ ట్రాక్టర్స్ లిమిటెడ్ జాయింట్ ఎండీ రామన్ మిట్టల్ తెలిపారు. మే 2024లో తాము సాధించిన ప్రగతి, రైతులకు తోడ్పాటు గురించి సోమవారం ఆయన స్థానికంగా వివరించారు. మేలో 13,338 ట్రాక్టర్లను రైతులు ముంగిటకు విజయవంతంగా తీసుకెళ్లామని ప్రకటించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో ట్రాక్టర్ల కొనుగోలులో కొత్త ఉత్సాహం నెలకొందని, రైతుల కోసం కొత్త సాంకేతిక సలహాలను అందించే విధంగా ఉత్పత్తి పెంపునకు తమ వంతుగా తోడ్పాటు అందించేందుకు కొత్త పథకం ప్రారంభించామన్నారు. ఇందులో భాగంగా వ్యవసాయ యాంత్రీకరణను సాధించే విధంగా జూన్ ..జాక్ పాట్ ఆఫర్‌ను కూడా ప్రకటించామన్నారు.

బీఏసీ సమావేశం రేపు

- స్పీకర్ అప్పావు వెల్లడి

సాక్షి, చెన్నై: అసెంబ్లీ సమావేశాల నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్ రూపకల్పనకు ఈనెల 12న బిజినెస్ అడ్వయిజరీ కమిటీ(బీఏసీ) సమావేశం నిర్వహించనున్నట్లు స్పీకర్ అప్పావు సోమవారం ప్రకటించారు. ఫిబ్రవరిలో లోక్ సభ ఎన్నికలకు ముందుగా అసెంబ్లీలో ఆర్థిక, వ్యవసాయ బడ్జెట్ దాఖలైన విషయం తెలిసిందే. శాఖల వారీగా నిధుల కేటాయింపునకు సంబంధించి సమావేశాలను కొనసాగించ లేని పరిస్థితి ఏర్పడింది. ఇందుకు కారణం లోక్ సభ ఎన్నికలే. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఎత్తివేయడంతో అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఈ మేరకు జూన్ 24వ తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాలలో ఏఏ రోజు ఏఏ శాఖలకు సంబంధించిన నిధుల కేటాయింపు, చర్చలకు సంబంధించిన షెడ్యూల్ రూపకల్పనకు ముందుగా బీఏసీ మీటింగ్‌కు స్పీకర్ అప్పావు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు 12వ తేదీ బుధవారం సమావేశం జరగనుంది. స్పీకర్ అప్పావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో సమగ్ర షెడ్యూల్ రూపొందించనున్నారు. ఆయా శాఖల నిధుల కేటాయింపు చర్చలే కాకుండా, కొత్త తీర్మానాలు, కొత్త అంశాలకు సంబంధించిన ప్రతిపాదనలు, ముసాయిదాపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు. కొన్ని శాఖలకు సంబంధించిన చర్చలకు రెండు రోజులు అవకాశం కల్పించే విధంగా షెడ్యూల్ రూపకల్పన జరగనున్నట్లు అసెంబ్లీ కార్యాలయ వర్గాలు పేర్కొంటున్నాయి.

విద్యార్థులకు విజయ్ నగదు ప్రోత్సాహకం

- ఈనెల 28, జూలై 3న చెన్నైలో కార్యక్రమం

సాక్షి, చెన్నై: పదో తరగతి, ప్లస్–2 పరీక్షలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించడమే కాకుండా వారికి ప్రోత్సాహక నగదు అందజేయడానికి తమిళగ వెట్రి కళగం నేత, సినీనటుడు విజయ్ నిర్ణయించారు. పార్టీ ప్రకటనతో ఈనెల 28న, జూలై 3వతేదీన చెన్నై తిరువాన్మియూరులో ఈ వేడుక జరగనుంది. ఇటీవల విజయ్ తమిళగ వెట్రి కళగం పార్టీని ప్రకటించిన విషయం తెలిసిందే. పార్టీ ఏర్పాటుకు ముందుగా ఆయన సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేస్తూ వచ్చారు. గత ఏడాది 10, ప్లస్–2లో ఉత్తమ మార్కులు సాధించిన వారిని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఎంపిక చేసి సత్కరించారు. ప్రోత్సాహకం అందేశారు. ఈ సేవను కొనసాగించే విధంగా చెన్నై తిరువాన్మియూరులో వేడుక జరగనుంది. అంతలోపు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఉత్తమ మార్కులు సాధించిన వారిని ఎంపిక చేసే పనిలో తమిళగ వెట్రికళగం వర్గాలు నిమగ్నం కానున్నారు. ఈనెల 28వ తేదీన తిరునల్వేలి, కన్యాకుమారి, తూత్తుకుడి, తెన్‌కాశి, మదురై, తిరుచ్చి, కోయంబత్తూరు తదితర 21 జిల్లాలలోని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఉత్తమమార్కులు సాధించిన వారిని ఎంపిక చేసి చెన్నైకు రప్పించనున్నారు. వీరిని అదే రోజున విజయ్ సత్కరించి, ప్రోత్సాహక నగదు అందజేస్తారు. జూలై 3వ తేదీన చెన్నై, శివారు జిల్లాలతోపాటు 17 జిల్లాలకు చెందిన విద్యార్థులను ఎంపిక చేసి సత్కరించనున్నారు. పార్టీ ప్రకటన తర్వాత జరగనున్న అతిపెద్ద కార్యక్రమం ఇదే కావడంతో విజయవంతం చేయడానికి తమిళగ వెట్రి కళగం వర్గాలు పరుగులు తీస్తున్నాయి.

అలందూరులో పుస్తకాలు పంపిణీ చేస్తున్న మంత్రులు అన్బిల్ మహేష్, అన్బరసన్



బడిలో ప్రార్థన



తొలిరోజు.. ఉత్సాహంగా..!

వేసవి సెలవులు ముగియడంతో సోమవారం ఉదయాన్నే విద్యార్థులు బడిబాట పట్టారు. ఆట పాటలు, సెల్ ఫోన్లను కట్టి పెట్టి పుస్తకాల బ్యాగులతో బడుల వైపుగా ఉత్సాహంగా కదిలారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల పునః ప్రారంభంతో పరిసరాలు విద్యార్థులతో కళకళలాడాయి. విద్యార్థులను ఆహ్వానిస్తూ ఘనంగా అనేక చోట్ల ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఇక ప్రభుత్వ బడుల్లో తొలిరోజే విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, యూనిఫాం పంపిణీని విద్యాశాఖ అధికారులు ప్రారంభించారు.

- రాష్ట్రవ్యాప్తంగా బడిబాట పట్టిన విద్యార్థులు
- వేసవి సెలవుల అనంతరం తెరుచుకున్న పాఠశాలలు
- పలుచోట్ల ఘన స్వాగతం
- పుస్తకాలు, యూనిఫాం పంపిణీకి శ్రీకారం



సేలం: ఈరోడ్ ఎస్‌కేసీ రోడ్డులోని కార్పొరేషన్ మిడిల్ స్కూల్‌లో నూతనంగా చేరిన విద్యార్థులకు హారతి పట్టి గులాబీ పువ్వులు ఇచ్చి స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు



సేలం: ఈరోడ్ పన్నీర్ సెల్వం పార్క్ వద్ద ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్వాగతం పలికేందుకు ఏర్పాటు చేసిన స్వాగత తోరణాలు

సాక్షి, చెన్నై: విపరీతమైన ఎండలు, ఎన్నికల కోడ్ కారణంగా గత విద్యా సంవత్సరాన్ని రెండు వారాలకు ముందే రాష్ట్రంలో ముగించిన విషయం తెలిసిందే. అలాగే పది, ప్లస్–1, ప్లస్–2 పబ్లిక్ పరీక్షలు, ఇతర తరగతుల విద్యార్థులకు వార్షిక పరీక్షలను కొంత ముందుగానే ముగించారు. పాఠశాల జీవితాన్ని ముగించిన విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ఆయా కళాశాలలో దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈ పరిస్థితులలో జూన్ 6వ తేదీ తొలుత బడుల పునఃప్రారంభానికి చర్యలు చేపట్టినా, అకాల వర్షాలు, ఎండ దెబ్బతో మరో నాలుగు రోజులు సెలవులను పొడిగించారు. సెలవులు ముగియడంతో స్వస్థలాల నుంచి చెన్నై వైపుగా రాత్రికి రాత్రే ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భారీగా వచ్చారు. ఉదయాన్నే పిల్లలను రెడీ చేసి బడులకు పంపించే ఏర్పాట్లలో మునిగారు. సెలవులు ముగియడంతో 2024–25 విద్యా సంవత్సరం సోమవారం నుంచి ప్రారంభమైంది. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రభుత్వ సహకారంతో నడిచే పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలలో 1 నుంచి 12 తరగతులను సిబ్బంది ప్రారంభించారు. అన్ని పాఠశాలల్లో ముందుగానే మౌలిక సదుపాయాల కల్పన, మరమ్మతులు వంటి ప్రక్రియల్ని ముగించారు.

కొంచెం.. ఇష్టం.. కొంచెం కష్టం..

పాఠశాలల పునః ప్రారంభానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో సోమవారం ఉదయాన్నే పుస్తకాల బ్యాగుల్ని మోస్తూ విద్యార్థులు ఉరకలు తీశారు. ఆనందంతో కొందరు విద్యార్థులు పాఠశాలల వైపుగా నడిస్తే, మరి కొందరు అప్పుడే సెలవులు ముగిశాయా? అని నిట్టూర్పుతో కదిలారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రభుత్వ సహకారంతో నడిచే పాఠశాలలలు, ప్రైవేటు పాఠశాలల గేట్లు ఉదయం తెరచుకోవడంతో ఆ పరిసరాలు విద్యార్థులతో కళకళ లాడాయి. తమ పిల్లల్ని వెంట బెట్టుకుని దగ్గరుండి మరీ తల్లిదండ్రులు స్కూల్స్ వద్ద వదిలి పెట్టి వెళ్లారు. అనేక పాఠశాలల వద్ద విద్యార్థులను ఆహ్వానిస్తూ ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. రోజా పువ్వులు, చాక్లెట్లు, స్వీట్లు పంచి పెట్టారు. ఇక విద్యార్థుల్ని తీసుకెళ్లే వాహనాల్లో ఓవర్ లోడింగ్‌లకు ఆస్కారం ఇవ్వని రీతిలో అధికారులు నిఘాతో వ్యవహరించారు. తొలి రోజే విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, యూనిఫాం తదితర వాటిని అనేక చోట్ల పంపిణీ చేశారు. బస్ పాస్‌ల పంపిణీకి జాప్యం నెలకొననున్న దృష్ట్యా, విద్యార్థులు యూనిఫాం ధరించి ఉచితంగా బస్సులలో పయనించవచ్చని విద్యాశాఖ సూచించింది. పాఠశాలల ప్రారంభంతో విద్యార్థులకు సీఎం స్టాలిన్ శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థుల మానసిక స్థితి గతులను పరిగణించి, అందుకు తగ్గట్టుగా ఉపాధ్యాయులు వ్యవహరించాలని సూచించారు. విద్యార్థులను ప్రోత్సహించే విధంగా, అందరూ ఆనందంగా ఉండే రీతిలో జాగ్రత్తలు తీసుకోవాలని, చక్కటి విద్యాబోధనలతో మెరుగైన ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. ఇదిలా ఉండగా విద్యార్థులకు ఉచిత పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ఆలందూరులోని మహోన్నత పాఠశాలలో విద్యా మంత్రి అన్బిల్ మహేశ్, చిన్న, మధ్యత రహా పరిశ్రమల శాఖ మంత్రి అన్బరసన్ హాజరై ఉచిత పుస్తకాలను అందజేశారు. అలాగే సైదాపేట పరిధిలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు ఆరోగ్యశాఖ మంత్రి ఎం. సుబ్రమణియన్ పుస్తకాలను అందజేశారు. తొలిరోజు 80 లక్షల మంది విద్యార్థులు బడులకు హాజరైనట్లు విద్యాశాఖ ప్రకటించింది. ఇదిలా ఉండగా, ప్లస్–2(12వ తరగతి) ముగించిన విద్యార్థులు ఉన్నత విద్యా కోర్సులపై దృష్టి పెట్టారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు సోమవారం నుంచి జనరల్ కోటా సీట్ల కేటాయింపు ప్రక్రియ మొదలైంది.



బస్సులో ఉత్సాహంగా బడికి..



పాఠశాల వద్ద తల్లిదండ్రుల కోలాహలం

బెత్తంతో వచ్చిన తండ్రి

తన కుమార్తెను బడిలో చేర్పించేందుకు ఓ తండ్రి బెత్తంతో వచ్చి అందరి దృష్టిలో పడ్డాడు. తిరుచ్చి కార్పొరేషన్ పరిధిలోని పుత్తూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఉదయాన్నే అదే ప్రాంతానికి చెందిన సేతు కార్తీక్ వచ్చాడు. బెత్తం వచ్చి మరీ ఉపాధ్యాయురాలిని కలిసి తన కుమార్తెను వారికి అప్పగించి ఓ లేఖ అందజేశారు. తన కుమార్తె ఇక్కడ యూకేజీలో చేరినట్టు, ఈ రోజు నుంచి ఆమె బాధ్యతను అప్పగిస్తున్నానని, సమాజంలో ఉత్తమ పౌరురాలుగా తన కుమార్తె ఎదిగే విధంగా మార్గదర్శకం చేయాలని కోరారు. ప్రేమతో చూసుకోవడమే కాకుండా, తప్పు చేస్తే బెత్తంతో దండించాలని, ఇందులో తనకు ఎలాంటి ఆక్షేపణ లేదని ఆ లేఖలో కార్తీక్ వివరించడం గమనార్హం. అలాగే ఆ బెత్తాన్ని ఉపాధ్యాయురాలికి అందజేశాడు. ఇదిలా ఉండగా, పాఠశాల తెరుచుకున్న తొలిరోజే కరూర్‌లో విషాదం చోటు చేసుకుంది. తొమ్మిదో తరగతి ఫెయిల్ కావడంతో పదో తరగతికి ప్రమోట్ చేయడం లేని ఉపాధ్యాయులు చెప్పడంతో కరూర్ జిల్లా కులితలైలో రాజేంద్రనగర్ పంచాయతీకి చెందిన మేస్త్రీ శంకర్ కుమారుడు మహేంద్రన్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు.

మంత్రులకు అద్దె కానుక

సాక్షి, చెన్నై: రాష్ట్ర మంత్రులకు ప్రభుత్వం అద్దెను పెంచుతూ కానుక ప్రకటించింది. లోక్‌సభ ఎన్నికలలో డీఎంకే కూటమి క్లీన్ స్వీప్ నేపథ్యంలో ఈసారికి మంత్రి వర్గంలో మార్పులు ఉండవని స్పష్టమవుతోంది. రాష్ట్ర కేబినెట్‌లోని మంత్రులకు ప్రజా పనుల శాఖ నేతృత్వంలోని బంగ్లాలు, బహుళ అంతస్తుల భవనాలలో గృహాలను కేటాయిస్తున్న విషయం తెలిసిందే. అయితే కొంతమంది తమ సొంత ఇళ్లలోనూ, మరికొందరు లీజుకు వివిధ ప్రాంతాలలో బంగ్లాలను తీసుకుని తమ క్యాంప్ కార్యాలయాలుగా ఉపయోగించుకుంటూ వస్తున్నారు. ఇందుకు ప్రభుత్వం ప్రతినెలా అద్దె చెల్లిస్తోంది. మంత్రులే కాకుండా, స్పీకర్, డిప్యూటీ స్పీకర్, విప్‌లకు కూడా ఈ అద్దె వర్తింపజేశారు. ప్రభుత్వ బంగ్లాలలో మినహా ప్రైవేటుగా ఉన్న చోట్లంతా ఈ అద్దెను మంత్రుల కోసం చెల్లిస్తూ వస్తున్నారు. 2016కు పూర్వం ఈ నెలసరి అద్దె రూ. 20 వేలుగా ఉండేది. అన్నాడీఎంకే హయాంలో ఈ మొత్తాన్ని రూ. 70 వేలుగా నిర్ణయించారు. ప్రస్తుతం ఈ అద్దెను డీఎంకే పాలకులు రెట్టింపు చేశారు. లోక్‌సభ ఎన్నికలలో డీఎంకే కూటమి బ్రహ్మాండ విజయాన్ని దక్కించుకున్న విషయం తెలిసిందే. ఇందులో మంత్రులు కీలక పాత్ర పోషించారు. ఎక్కడ తమ పదవులు ఊడుతాయో అన్న బెంగతో రేయింబవళ్లు నియోజకవర్గాలలో తిష్ట వేసి అభ్యర్థులకు మద్దతుగా ఓట్ల వేటలో నిమగ్నమై క్లీన్‌స్వీప్‌కు బాట వేశారు. దీంతో మంత్రి వర్గంలో మార్పులు ఉంటాయనే చర్చకు ఈ క్లీన్‌స్వీప్ ముగింపు పలికింది. అదే సమయంలో మంత్రులకు కానుకగా అద్దెను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం విశేషం. రూ. 70 వేలుగా ఉన్న అద్దెను 1.50 లక్షలకు పెంచుతూ ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వ వావనాలకు మినహా సొంత నివాసాలు, అద్దె భవనాలు, లీజుకు నివాసం ఉన్న భవనాలకు ప్రభుత్వం ఈ మొత్తాన్ని చెల్లించనుంది.

విక్రవాండికి మోగిన 'ఉప' నగారా

- 14 నుంచి నామినేషన్ల స్వీకరణ
- జూలై 10న ఓటింగ్

సాక్షి, చెన్నై : విల్లుపురం జిల్లా విక్రవాండి అసెంబ్లీ స్థానానికి ఉప నగారా మోగింది. ఈనెల 14 నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. జూలై 10వ తేదీన ఓటింగ్ జరగనుంది. వివరాలు.. పునర్విభజన తర్వాత 2011లో విల్లుపురం జిల్లా విక్రవాండి అసెంబ్లీ స్థానానికి తొలిసారిగా ఎన్నికలు జరిగాయి. సీపీఎంకు చెందిన రామమూర్తి ఈ నియోజకవర్గానికి తొలి ఎమ్మెల్యే. 2016లో జరిగిన ఎన్నికలలో డీఎంకేకు చెందిన రాధామణి గెలిచారు. 2019లో ఆయన క్యాన్సర్ బారిన పడి మరణించారు. ఈ సమయంలో జరిగిన ఉప ఎన్నికల్లో పోటీ చేసినపుగలేంది ఓటమి పాలయ్యారు. 2021లో జరిగిన ఎన్నికలలో పుగలేంది గెలిచారు. అయితే పుగలేంది సైతం కాలేయ క్యాన్సర్ సమస్యలతో ఈ ఏడాది మార్చిలో మరణించారు. దీంతో మరోమారు విక్రవాండి నియోజకవర్గం ఉప ఎన్నిక అనివార్యమైంది. ఇక్కడ పోటీ చేసి గెలిచిన అభ్యర్థులు అనారోగ్య సమస్యలతో మరణించడంతో రెండవ సారి ఉపఎన్నికను విక్రవాండి ఎదుర్కొనుండడం గమనార్హం.

14 నుంచి నామినేషన్లు

పుగలేంది మరణంతో తక్షణం ఈ నియోజకవర్గం ఖాళీగా ఉన్నట్టు అసెంబ్లీ కార్యాలయం ప్రకటించింది. చివరి విడత లోక్‌సభ ఎన్నికలతో పాటు ఈ స్థానానికి ఉప ఎన్నిక జరుగుతుందని తొలుత భావించారు. అయితే ఆ దిశగా ఎలాంటి ప్రకటన వెలువడ లేదు.ఈ పరిస్థితులలో ఉప నగారా మోగిస్తూ ఎన్నికల యంత్రాంగం సోమవారం షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈనెల 14 నుంచి 21వ తేదీ వరకు పోటీ చేయనున్న అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. 24వ తేదీన పరిశీలన, 26వ తేదీన ఉప సంహరణ ప్రక్రియ జరగనుంది. జూలై 10వ తేదీన ఓటింగ్, 13వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపడుతారు. జూలై 15వ తేదీలోపు విక్రవాండిలో ఉప ఎన్నికల ప్రక్రియను పూర్తిచేయడానికి చర్యలు తీసుకున్నారు. ఈ షెడ్యూల్ విడుదలతో అందరి దృష్టి విక్రవాండిపై పడింది. సిట్టింగ్ సీటును మళ్లీ కైవసం చేసుకునేందుకు డీఎంకే సిద్ధమవుతోంది. అయితే, పుగలేంది కుటుంబానికి చెందిన వారికి అవకాశం ఇస్తారా? లేదా విల్లుపురం జిల్లాలోని పార్టీ ముఖ్య నేత, మంత్రి పొన్ముడి సూచించే అభ్యర్థికి సీటు కేటాయిస్తారా ? అన్నది వేచి చూడాల్సిందే. అలాగే, అన్నాడీఎంకే, బీజేపీలు సైతం అభ్యర్థులను నిలబెట్టే అవకాశాలు ఉన్నాయి. విక్రవాండి నియోజకవర్గం పరిధిలో ఎలాంటి అభివృద్ధి , సంక్షేమ కార్యక్రమాలకు చేపట్ట కూడదని, ఇక్కడ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్టు అధికారులు ప్రకటించారు.

డిసెంబరులో 'స్థానిక' సమరం

- కసరత్తు వేగవంతం
- ఒకేసారి రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికలు
- అధికారులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ జ్యోతి నిర్మలా స్వామి సమీక్ష



జ్యోతి నిర్మలా స్వామి



రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం

సాక్షి, చెన్నై: లోక్‌సభ ఎన్నికలలో క్లీన్‌స్వీప్ చేసి మంచి ఊపు మీదున్న డీఎంకే పనిలో పనిగా రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను ముగించేందుకు సిద్ధమవుతోంది. దీంతో డిసెంబరులో ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన కసరత్తు వేగవంతమైంది. అధికారులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ జ్యోతి నిర్మలా స్వామి ఈ మేరకు సమావేశాలలో బిజీ అయ్యారు. వివరాలు.. రాష్ట్రంలోని గ్రామ, యూనియన్, జిల్లాస్థాయి పంచాయతీలలో అధ్యక్ష, వార్డు సభ్యుల తదితర లక్షన్నరకు పైగా పదవులు ఉన్నాయి. వీటిలో 27 జిల్లాలకు చెందిన స్థానిక సంస్థలకు 2019లో ఎన్నికలు జరిగాయి. ఈ పదవుల కాలం డిసెంబరులో ముగియనుంది. మరో 9 జిల్లాలు కొత్తగా ఆవిర్భవించిన నేపథ్యంలో వీటికి మాత్రం ఆ సమయంలో ఎన్నికలు జరగలేదు. 2021లో డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినానంతరం ఈ జిల్లాలోని స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగాయి. అంతకు ముందుగా 2020లో 125 మేరకు ఉన్న మునిసిపాలిటీలు, 529 మేరకు ఉన్న పట్టణపంచాయతీలు, 15 కార్పొరేషన్లకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల ద్వారా ఎంపికైన స్థానిక ప్రజా ప్రతినిధుల పదవీ కాలం 2026 వరకు ఉంది. ఈ స్థానాలలో మెజారిటీ స్థానాలలో డీఎంకే ప్రతినిధులే ఉన్నారు. అదే సమయంలో 2026 అసెంబ్లీ ఎన్నికలకు ముందుగా స్థానిక సంస్థలన్నింటినీ డీఎంకే గుప్పెట్లోకి తెచ్చుకునే విధంగా ప్రభుత్వం వ్యూహాలకు పదును పెట్టింది. అన్ని స్థానిక సంస్థల పదవులను రద్దు చేసి ఒకేసారి ఎన్నికల నిర్వహణపై దృష్టిపెట్టినట్టు తెలుస్తోంది. తదానుగుణంగానే ప్రస్తుతం రాష్ట్ర ఎన్నికల కమిషన్ అడుగులు ఉండడం గమనార్హం.

డిసెంబరులో స్థానిక జాతర..

2026 అసెంబ్లీ ఎన్నికలలో మళ్లీ అధికారం రావాలంటే స్థానికంగా బలం అవశ్యమని డీఎంకే పాలకులు భావిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలలో క్లీన్ స్వీప్‌తో మంచి ఊపు మీదున్న డీఎంకే ఇదే ఉత్సాహంతో స్థానిక సంస్థలన్నింటినీ క్లీన్‌స్వీప్ చేయడానికి వ్యూహాలకు పదును పెట్టింది. 27 జిల్లాలలోని స్థానిక ప్రతినిధుల పదవీకాలం డిసెంబరుతో ముగియనుంది. మరో 9 జిల్లాలలోని ప్రతినిధుల పదవీ కాలం మరో 20 నెలలు ఉంది. అయితే అన్ని పదవులను రద్దు చేసి, ఒకే సమయంలో ఎన్నికలను నిర్వహించే విధంగా కసరత్తు జరుగుతోంది. డిసెంబరులో స్థానిక ఎన్నికల నగారా మోగించి జనవరి నాటికి అన్ని ప్రక్రియలను ముగించే విధంగా కార్యాచరణ సిద్ధమవుతోంది. దీనిని ఆచరణలో పెట్టే విధంగా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ జ్యోతి నిర్మలా స్వామి సమావేశాలపై దృష్టి పెట్టారు. సోమవారం నుంచి అన్ని జిల్లాలో ఆమె పర్యటిస్తున్నారు. సోమవారం తిరునల్వేలిలో తన సమావేశ ప్రయాణాన్ని మొదలెట్టారు. అన్ని జిల్లాలో సమావేశాలను ముగించి, త్వరితగతిన ఎన్నికల షెడ్యూల్‌కు సంబంధించిన నివేదిక సిద్ధం చేయనున్నారు. ముందుగా కేంద్ర ఎన్నికల కమిషన్ లోక్‌సభలో ఉపయోగించిన ఓటర్ల జాబితాను స్వీకరించి, దాని ఆధారంగా స్థానిక ఎన్నికలకు కసరత్తు ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది.

విమానాశ్రయానికి.. 67 హెక్టార్ల స్థలం స్వాధీనం

సాక్షి, చెన్నై : శ్రీపెరంబదూరు సమీపంలో రెండవ విమానాశ్రయం పనుల కోసం 67 హెక్టార్ల స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. చెన్నై విమానాశ్రయంలో పెరిగిన రద్దీని దృష్టిలో ఉంచుకుని కాంచీపురం జిల్లా శ్రీపెరంబదూరు సమీపంలోని పరందూరులో రెండవ విమానాశ్రయ టెర్మినల్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ పరిధిలోని వలత్తూరు, పొడవూరు, నల్వాయి, మడపురం, పరందూరు, తండలం, సింగిలిపాక్కం, తొడరూర్, పునగరం పాక్కం, వడయూర్ పాక్కం, ఎనకాపురం, అక్కయాపురం తదితర గ్రామాలలోని 5,368 ఎకరాల స్థలంలో ఈ విమానాశ్రయం రూపుదిద్దుకోనుంది. ఈ స్థల సేకరణకు వ్యతిరేకంగా ఏకనాపురం వేదికగా ఏడాదికాలానికి పైగా పోరాటాలు సాగుతున్నాయి. ఇక్కడి ప్రజలు లోక్‌సభ ఎన్నికలను సైతం బహిష్కరించడంతో వీరిని బుజ్జగించేందుకు అధికారులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. ఈ పరిస్థితుల్లో వడయూర్ పాక్కం పరిధిలోని 67 హెక్టార్ల స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు సిద్ధమయ్యారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు తాజాగా జారీ అయ్యాయి. ఈ విషయంపై ఏదైనా ఫిర్యాదులంటూ 30 రోజుల్లోపు తెలియజేయాలని సూచించారు.

క్లుప్తంగా

కానిస్టేబుళ్లకు రివార్డు


రివార్డు అందజేస్తున్న సందీప్ రాయ్ రాథోడ్

కొరుక్కుపేట: చెన్నైలోని మెరీనా తీరంలో చోరీకి యత్నించిన ఇద్దరు నిందితులను పట్టుకుని పోలీస్ స్టేషన్‌లో అప్పగించిన కానిస్టేబుళ్లను నగర పోలీసు కమిషనర్ సందీప్ రాయ్ రాథోడ్ స్వయంగా పిలిపించి, రివార్డు అందజేశారు. తమిళనాడు స్పెషల్ పోలీస్, 12 బెటాలియన్ (మణిముత్తర్)కు చెందిన ఎస్.అరుణ్‌కుమార్ (పి.సి. 7191), ఆధిత్యరాజన్ (పి.సి.7137) మెరీనా యాంటీ డ్రౌనింగ్ యూనిట్‌లో పనిచేస్తున్నారు. ఆదివారం వారు మెరీనా బీచ్‌లోని కార్మిక విగ్రహం వెనుక విధులు నిర్వహిస్తుండగా, మెరీనా బీచ్‌ను చూడడానికి వచ్చిన వ్యక్తి బ్యాగును ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు అపహరించి, పారిపోతున్న విషయాన్ని గమనించిన డ్యూటీలో ఉన్న పోలీసు సిబ్బంది వారిని పట్టుకుని చోరీకి గురైన బ్యాగ్‌తోపాటు డి-6 అన్నాస్క్వేర్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. పోలీసులు జరిపిన విచారణలో నిందితులు కర్ణాటక రాష్ట్రానికి చెందిన సునీల్ (26), హర్షద్(22) అని తెలిసింది. తదుపరి విచారణలో వారిద్దరు కలిసి మెరీనా బీచ్‌కు వచ్చిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మోహన్ అనే వ్యక్తికి చెందిన సెల్‌ఫోన్, బ్యాగును అపహరించినట్లు తేలింది. అలాగే వారు గత 8వ తేదీన థౌజెండ్‌లైట్స్ ప్రాంతానికి చెందిన జాస్మిన్ అనే మహిళ హ్యాండ్‌బ్యాగ్‌ని దొంగిలించినట్లు వెల్లడైంది. నిందితుల నుంచి 2 సెల్‌ఫోన్లు, 2 వాచీలు, బ్యాగు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసు కమీషనర్ సందీప్ రాయ్ రాథోడ్ పోలీస్ కానిస్టేబుల్ అరుణ్‌కుమార్‌కి స్వయంగా ఫోన్ చేసి, పైన పేర్కొన్న ఇద్దరు నిందితులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని పోలీస్ స్టేషన్‌లో అప్పగించినందుకుగాను అభినందించారు. ఈ క్రమంలో ఆయన స్వయంగా కానిస్టేబుళ్లను ఆహ్వానించి రివార్డు, సర్టిఫికెట్ అందజేశారు.

కాలేజీ విద్యార్థిని ఆత్మహత్య

అన్నానగర్: విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన విషాదం నింపింది. చెన్నై తాంబరం సమీపంలో ఉన్న సేలైయూర్ అగరం సౌత్ ప్రాంతానికి చెందిన ఏ సుదాను కుమార్తె మెర్లిన్ (19). ఈమె ప్రైవేటు కళాశాలలో బీబీఏ చదువుతోంది. అనారోగ్య కారణాలతో త రచూ ఈమె ఆత్మహత్యకు యత్నిస్తున్నట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విద్యార్థిని మెర్లిన్ తన దుపట్టాతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని, ఆత్మహత్య చేసుకుంది. సేలైయూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆరు నెలల పాపకు కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స

సాక్షి, చెన్నై: భూటాన్‌కు చెందిన ఆరు నెలల పాపకు చెన్నై గ్లెనెగల్స్ హెల్త్ సిటీలో కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతంగా చేశారు. శిశువు తల్లి తన కాలేయంలో కొంత భాగాన్ని దానంగా ఇవ్వడంతో ఈ శస్త్ర చికిత్సను విజయవంతం చేసినట్టు వైద్యులు ప్రకటించారు. సోమవారం స్థానికంగా జరిగిన సమావేశంలో గ్లెనెగల్స్ హెల్త్ సిటీ హెపటాలజీ అండ్ ట్రాన్స్‌ప్లాంట్ విభాగం డైరెక్టర్ డాక్టర్ జాయ్ వర్గీస్, పీడియాట్రిక్ డాక్టర్ సోమశేఖర్ హెచ్‌ఆర్, కాలేయ మార్పిడి హెచ్‌పీబీ సర్జరీ డైరెక్టర్ మెట్టు శ్రీనివాస్ రెడ్డి, సీఈఓ డాక్టర్ నగేష్ కె రావులు ఈ శస్త్ర చికిత్స గురించి వివరించారు. భూటాన్‌కు చెందిన ఓ దంపతుల ఆరు నెలల పాప తొలుత జాండిస్ బారిన పడిందని, క్రమంగా బరువు పెరగడం, వంటి సమస్యలు ఉత్పన్నమైనట్టు వివరించారు. బిలియరీ అట్రేసియా అనే వ్యాధి కారణంగా 7.5 కేజీల బరువు పెరగడం, శరీరం ఉబ్బి పోతుండటం వంటి పరిణామాలతో చెన్నై గ్లెనెగల్స్ హెల్త్ సిటీకి తీసుకొచ్చారని పేర్కొన్నారు. ఇక్కడ పరీక్షించగా కాలేయ మార్పిడి శస్త్రచికిత్స అనివార్యమైందన్నారు. తన కుమార్తెను రక్షించుకునేందుకు తల్లి తన కాలేయంలో కొంత భాగం దానంగా ఇవ్వడానికి ముందుకు రావడంతో శస్త్ర చికిత్సకు ఏర్పాట్లు చేశామన్నారు. ఈ పాప కోసం క్రౌడ్ ఫండింగ్ ద్వారా నిధుల సేకరణ జరిగినట్టు పేర్కొన్నారు. మహిళా దినోత్సవం రోజున 8 గంటల సుదీర్ఘ సమయం వైద్యుల కృషితో కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సను నిర్వహించామని, వైద్యుల పర్యవేక్షణలో కొద్ది రోజులు ఉంచినట్టు తెలిపారు. ప్రస్తుతం తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని, డిశ్చార్జ్ కూడా అయ్యారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ పాప తల్లిదండ్రులతోపాటు, ఆస్పత్రి డాక్టర్లు రజనీ కాంత్, సెల్వకుమార్ మల్లీశ్వరన్ తదితరులు పాల్గొన్నారు.


వైద్యులతో పాటుగా తమ బిడ్డతో భూటాన్ దంపతులు

మహిళను మోసం చేసిన అగంతకుడు

అన్నానగర్: ఓ మహిళ కుమారుడికి స్కూలు ఫీజు చెల్లిస్తానని చెప్పి, రూ. 24 వేలు తీసుకుని మోసం చేసిన సంఘటన కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. చెన్నై కొరుకుపేటలోని కార్నేషన్ నగర్‌కు చెందిన మారియమ్మాల్ (40). ఆమె భర్త మానసిక అ నారోగ్యంతో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో మారియమ్మాళ్ కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. వీరి 17 ఏళ్ల కుమారుడు వన్నారపేటలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ప్లస్-2 చదువుతున్నాడు. మారియ మ్మాళ్ తన కొడుకు స్కూల్ ఫీజు కట్టేందుకు సోమ వారం స్కూల్‌కి వెళ్లింది. ఆ సమయంలో పాఠశాల ప్రవేశ ద్వారం వద్ద నిలబడిన ఓ దుండగుడు, పే మెంట్ కౌంటర్ మూసి ఉందని, బ్యాంకులో ఫీజు చెల్లించి పాఠశాలకు రశీదు ఇవ్వాలని సూచించాడు. తాను కూడా తన కొడుక్కి అలాగే డబ్బులు చెల్లించానని చెప్పి మారియమ్మాల్ చేతిలో ఉన్న రూ.24 వేలు తీసుకుని ఆమె కొడుకును స్కూటర్‌పై ఎక్కించుకుని అదే ప్రాంతంలోని బ్యాంకుకు వెళ్లాడు. అ ప్పుడు విద్యార్థిని జెరాక్స్ తీసుకురావాలని సమీపంలోని దుకాణానికి పంపాడు. అనంతరం మారియమ్మాళ్ నుంచి తీసుకున్న రూ.24 వేలతో ఆ దుండగుడు అక్కడి నుంచి పరారయ్యాడు. అతను ఎంతకీ తిరిగి రాకపోవడంతో ఈ విషయమై బాధితురాలు తండయార్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

18న రవాణా శాఖ కార్మికుల నిరసన

కొరుక్కుపేట: ఖాళీలను భర్తీ చేయాలని ఈ నెల18వ తేదీన రవాణాశాఖలోని కార్మికులు నిరసనకు దిగనున్నారు. తమిళనాడు ప్రభుత్వ రవాణా సంస్థ ఉద్యోగుల సంఘం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఇలా పేర్కొంది. ఈ విషయమై సంఘం ప్రధాన కార్యదర్శి టి.వి.పద్మనాభన్ పేర్కొంటూ చెన్నైతోపాటు విల్లుపురం, సేలం, కోయంబత్తూరు, మదురై, తిరునెల్వేల్లి, పుదుకోట్టైలోని రవాణా సంస్థ ప్రధాన కార్యాలయాల ఎదుట నిరసన ప్రదర్శనలు, సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ నెల 18వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ సమావేశంలో ఉద్యోగుల ముఖ్య సమస్యలను రవాణా సంస్థ నిర్వాకంపై నిరసన తెలుపుతారని, ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా చేసి, వేతనాలు, పింఛన్లకు బడ్జెట్ నిధులు కేటాయించాలని డిమాండ్ చేయనున్నారు. పింఛనుదారులకు బకాయిలు వెంటనే చెల్లించాలని, అలాగే ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేయనున్నారు.

రెండు బైకుల ఢీ: బాలుడి మృతి

అన్నానగర్: రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో ఓ బాలుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. చెన్నై పెరంబూర్‌లోని సెంబియం రమణ నగర్ ప్రాంతానికి చెందిన కుమార్ కుమారుడు శివగురు (17) కూలీ. ఇతను సోమవారం ఉదయం హెల్మెట్ పెట్టుకుని సెంబియం రోడ్డులో బైకుపై వేగంగా వెళుతున్నట్లు తెలుస్తోంది. ఆ సమయంలో ఎదురుగా వస్తున్న మరో బైకును వేగంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో శివగురు తలపై, ముఖంపై తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎదురుగా బైకు నడుపుతున్న కొలత్తూరుకు చెందిన కాళిదాసు భార్య షర్మిలా భాను (38)కు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం చెన్నై స్టాన్లీ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై అన్నానగర్ ట్రాఫిక్ ఇన్వెస్టిగేషన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

• క్యాన్సర్ రోగులకు తోడ్పాటు

దక్షిణ మద్రాసు కల్చరల్ అసోసియేషన్ నేతృత్వంలో క్యాన్సర్ బాధితులకు తోడ్పాటు అందించే విధంగా మందుల పంపిణీ కార్యక్రమం స్థానికంగా జరిగింది. ఎస్‌ఎంసీఏ కార్యదర్శి సుదీప్‌కుమార్ మిత్ర , ట్రస్టీ డాక్టర్ నీలా గంగూలీ, సుదేష్ణ , సభ్యులు అనితా రమేష్‌లు రోగులకు అవసరమైన అన్ని రకాల మందులను వారికి తోడ్పాటు అందించే విధంగా సహాయకాలను అందజేశారు. - సాక్షి, చెన్నై



ఖైదీలకు వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ

వేలూరు: పలు నేరాలు చేసి వేలూరు సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీల జీవితాల్లో మార్పు తీసుకొచ్చేందుకు జైలులోనే పలు వృత్తి శిక్షణను ఇస్తున్నారు. జైలు ఖైదీల కోసమే తిరిచ్చిలో ప్రత్యేకంగా ప్రభుత్వ ఉపాధి కల్పనా పరిపాలన శాఖ ఆధ్వర్యంలో ఐటీఐను గత 2015 సంవత్సరంలో ప్రారంభించారు. ఈ శిక్షణ కేంద్రంలో గత ఎనిమిది సంవత్సరాలుగా అనేక కోర్సుల్లో పలువురు శిక్షణ పొందారు. ప్రస్తుతం ఈ ఐటీఐలో కంప్యూటర్ ఆపరేటర్, ఫిట్టర్, ఎలక్ట్రిషియన్, టైలరింగ్, వెల్డర్ వంటి కోర్సుల్లో మొత్తం 160 మంది ఖైదీలు శిక్షణ పొందుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జైలులో శిక్షణ పొందుతున్న ఖైదీలు 8, 10వ తరగతి చదివిన వారు ఈ కోర్సుల్లో చేరేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు జైళ్లశాఖ సిఫారసు చేసింది. వీటితోపాటు పుయల్, వేలూరు, మదురై, సేలం, పాలంకోట్టై వంటి మొత్తం తొమ్మిది జైళ్లలోని ఖైదీల వివరాలు, ఐటీఐలో చేరదలిచిన ఖైదీల వివరాలను పంపాలని జైళ్ల శాఖ తెలపడంతో ఆ జాబితాను వేలూరు సెంట్రల్ జైలు నుంచి ఉన్నతాధికారులకు పంపారు. వీటిలో వేలూరు సెంట్రల్ జైలు నుంచి నలుగురు ఖైదీలు తిరిచ్చి ఐటీఐలో చేరేందుకు అంగీకారం తెలిపినట్లు జైళ్లశాఖ అధికారులు తెలిపారు.

ప్రైవేటు పాఠశాల బస్సులో మంటలు

• విద్యార్థులను కాపాడి బయటకు పంపిన క్లీనర్

వేలూరు: ప్రైవేటు పాఠశాల బస్సులో మంటలు రేగడంతో విద్యార్థులు భయాందోళనలకు గురయ్యారు. తిరువణ్ణామలై జిల్లా ఆరణి సమీపంలోని నెచ్చల్ గ్రామంలో ఓ ప్రైవేటు పాఠశాల నడుస్తోంది. సోమవారం ఉదయం పాఠశాలలు ప్రారంభించడంతో ఉదయం 6 గంటలకే పాఠశాల బస్సు విద్యార్థులను తీసుకొచ్చేందుకు బయలుదేరింది. స్కూల్ బస్సు పడవేడు, నడుకుప్పం, కమ్మకూరు, ముళ్ళిపట్టు గ్రామాల్లోని విద్యార్థులను ఎక్కించుకొని బస్సు బయలుదేరింది. నడుకుప్పం గ్రామం దాటుతుండగా బస్సు ఇంజిన్ నుంచి ఉన్నట్టుండి మంటలు చెలరేగాయి. దీంతో బస్సులో ఉన్న విద్యార్థులు కేకలు వేశారు. దీంతో బస్సు డ్రైవర్ బస్సును ఆపి వేశారు. కేకలు విన్న స్థానికులు వెంటనే బస్సు వద్దకు చేరుకుని బస్సులో ఉన్న విద్యార్థులను బయటకు తీసి ఇంజిన్‌పై నీటిని పోసి మంటలను అదుపు చేశారు. విషయం తెలుసుకున్న కలంబూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేస్తున్నారు. ఇదిలా ఉండగా పాఠశాల ప్రారంభం రోజునే బడి బస్సులో మంటలు చెలరేగిన ఘటన ఆ ప్రాంతంలో సంచలనం రేపింది.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య


విద్యార్థులకు ఉచిత పుస్తకాలు అందజేస్తున్న కలెక్టర్ సుబ్బలక్ష్మి

వేలూరు: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని కలెక్టర్ సుబ్బలక్ష్మి తెలిపారు. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు పునఃప్రారంభించడంతో వేలూరు, తిరుపత్తూరు, రాణిపేట, తిరువణ్ణామలై జిల్లా ల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులచే పాఠశాలల్లో చేరాలని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇదిలా ఉండగా వేలూరు కొనవట్టం లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కలెక్టర్ ఉచిత పుస్తకాలను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు. 5 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన ఉందని, ఇక్కడ విద్యను అభ్యసించిన అనేక మంది ఉన్నత పదువులు ఆశించారన్నారు. తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల ఆకర్షణీయమైన ప్రకటనలకు మోసపోకుండా ఉండాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం, నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులతో బోధన ఉంటుందన్నారు. ఇదిలా ఉండగా సెలవులు ముగించుకొని పాఠశాలకు వెళ్లడంతో కొందరు కన్నీటితో పాఠశాలలకు వెళ్లగా మరికొందరు సంతోషంతో ఆలయాల్లో పూజలు చేసి తల్లి దండ్రుల ఆశీర్వాదం తీసుకొని బడిబాట పట్టారు. అలాగే వేలూరు ఈవేరా ప్రభుత్వ పాఠశాల బాలికలకు టీచర్లు కర్పూర హారతి పట్టి చాకెట్లు అందజేసి స్వాగతం పలికారు. విద్యాశాఖ సీఈఓ మణిమొయి, మేయర్ సుజాత, డీఈఓ మహాలింగం, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మనీషా కొయిరాలా

ఇండియన్ -2లో మనీషా కొయిరాలా

తమిళసినిమా: నటి మనీషా కొయిరాలా నేపాల్ మాజీ ప్రధాన మంత్రి బిశ్వేశ్వర్ ప్రసాద్ కొయిరాలా మనవరాలు. నేపాలీ చిత్రంతో కథానాయకిగా ఎంట్రీ ఇచ్చిన ఈమె ఆ తరువాత హిందీ, తమిళం, తెలుగు, ఆంగ్లం భాషల్లో నటించి పాపులర్ అయ్యారు. ముఖ్యంగా తమిళంలో ఇండియన్, బొంబాయి, బాబా వంటి సూపర్‌హిట్ చిత్రాల్లో నటించి స్టార్ హీరోయిన్‌గా రాణించారు. కాగా కమలహాసన్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో ఏఎం.రత్నం నిర్మించిన చిత్రం ఇండియన్. కమలహాసన్ తండ్రీ కొడుకులుగా ద్విపాత్రాభినయం చేసిన అందులో తండ్రి సరసన నటి సుకన్య నటించగా, కొడుకుకు జంటగా నటి మనీషాకొయిరాలా, ఊర్మిళా నటించారు. కాగా 1996లో విడుదలైన ఈ చిత్రం సంచలన విజయాన్ని సాధించింది. కాగా 28 ఏళ్ల తరువాత ఇప్పుడు ఇండియన్ చిత్రానికి సీక్వెల్ రూపొంది జూలై 12వ తేదీన తెరపైకి రానుంది. ఇందులో కమలహాసన్ సేనాపతిగా నటించగా, సిద్ధార్థ్, నటి కాజల్ అగర్వాల్, రకుల్‌ప్రీత్ సింగ్, ప్రియాభవానీ శంకర్ తదితరులు నటించినట్లు ప్రచారంలో ఉంది. అయితే ఇందులో నటి మనీషా కోయిరాలా నటించిన విషయాన్ని రహస్యంగా ఉంచడం విశేషం. కాగా ఇటీవల ఈ చిత్రం పోస్టర్‌ను విడుదల చేశారు. అందులో నటి మనీషాకోయిరాలా ఫొటో చోటుచేసుకుని ఉండడంతో ఈమె కూడా ఇండియన్ -2 చిత్రంలో నటించిన విషయం వెలుగులోకి వచ్చింది. అయితే ఈ చిత్రంలో 53 ఏళ్ల మనీషాకొయిరాలా ఎలాంటి పాత్రలో కనిపించనున్నారన్నదే ప్రస్తుతం ఆసక్తిగా మారింది. ఆ మధ్య క్యాన్సర్ వాధికి గురైన ఈమె దానితో పోరాడి గెలిచిన విషయం తెలిసిందే. కాగా మనీషాకొయిరాలా చివరిగా తమిళంలో ధనుష్ కథానాయకుడిగా నటించిన మాప్పిళ్లై చిత్రంలో ఆయనకు అత్తగా నటించారు.

కోలీవుడ్ టాక్స్

ఆఫ్ స్క్రీన్‌లో అదరగొట్టిన శ్రీలీల

తమిళసినిమా: నటి శ్రీలీల రూటే వేరయ్యా అంటున్నారు నెటిజన్లు. టాలీవుడ్‌లో పెళ్లిసందడి చిత్రం ద్వారా కథానాయకిగా ఎంట్రీ ఇచ్చిన ఈ అమ్మడు ఆ చిత్రం విడుదలైన తరువాత మరో అవకాశం లేక కొంత కాలం ఖాళీగానే ఉన్నారు. ఆ తరువాత రవితేజకు జంటగా నటించిన ధమాకా చిత్రం సక్సెస్ కావడం, అందులో ఆయన డాన్స్ కుర్రకారుని అలరించడంతో ఒక్కసారిగా క్రేజీ హీరోయిన్ అయ్యిపోయారు. అంతే వరుసగా అవకాశాలు రావడం మొదలెట్టాయి. అలా వరుసగా చిత్రాలు చేసిన శ్రీలీల వరుస ఫ్లాప్‌లను ఎదుర్కొని డీలా పడిపోయారు. మహేశ్‌బాబు సరసన నటించిన గుంటూరు కారం చిత్రం తరువాత తెలుగులో అవకాశాలే లేవు. అయితే తాజాగా బాలీవుడ్ ఎంట్రీ షురూ అయ్యిందనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇకపోతే కోలీవుడ్‌లో విజయ్ కథానాయకుడిగా నటిస్తున్న గోట్ చిత్రంలో సింగిల్ సాంగ్‌లో నటించే అవకాశం వచ్చినా, దాన్ని తిరస్కరించినట్లు ప్రచారం జరిగింది. అలాగే ప్రస్తుతం అజిత్ హీరోగా నటిస్తున్న గుడ్ బ్యాడ్ అగ్లీ చిత్రంలో కథానాయకిగా నటిస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నా, యూనిట్ వర్గాలు ఇప్పటి వరకూ ఆ విషయాన్ని ధృవీకరించలేదు. కాగా ఇటీవల శ్రీలీల సామాజిక మాధ్యమాల్లో ఎక్కువగా కనిపిస్తున్నారు. తన హాట్ ఫొటోలను పోస్ట్ చేస్తున్నారు. ఇకపోతే నటుడు విజయ్ డాన్స్‌లో కింగ్ అన్న విషయం తెలిసిందే. ఆయన డాన్స్‌కు అభిమానుల్లో పిచ్చ క్రేజ్ ఉంటుంది. కాగా విజయ్ కథానాయకుడిగా నటించిన చిత్రం బీస్ట్. నటి పూజాహెగ్డే నాయకిగా నటించిన ఈ చిత్రం ఆశించిన విజయాన్ని సాధించకపోయినా, అందులో అరబిక్ అనే పాట మాత్రం బాగా పాపులర్ అయ్యింది. అత్యధిక వ్యూస్ పొందిన పాటగా కూడా గుర్తింపు పొందింది. కాగా ఆ పాటకు ఇప్పుడు నటి శ్రీలీల జోరుగా స్టెప్స్ వేయడం విశేషం. ఆ వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. నటుడు విజయ్‌తో స్క్రీన్ షేర్ చేసుకోవడానికి నో చెప్పిన ఈ అమ్మడు ఇప్పుడు ఆఫ్ స్క్రీన్‌లో ఆయన పాటకు డాన్స్ చేయడంపై నెటిజన్లు వివిధ రకాలుగా స్పందిస్తున్నారు.


నటి శ్రీలీల

కోలీవుడ్‌లో హిట్ కోసం పాట్లు


నటి కృతిశెట్టి

తమిళసినిమా: ఇప్పుడు నటీనటులకు పబ్లిసిటీకి సామాజిక మాధ్యమాలే వేదికగా మారాయనే చెప్పాలి. ముఖ్యంగా హీరోయిన్లు వీటిని బాగా వాడుకుంటున్నారు. తమ అందమైన ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో విడుదల చేయడంతో పాటు, తన అభిప్రాయాలను పంచుకోవడానికి ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. తద్వారా బోలెడు ఉచిత ప్రచారాన్ని పొందుతున్నారు. నటి కృతిశెట్టి ఇందుకు అతీతం కాదు. ముంబాయిలో పుట్టి పెరిగిన ఈ బ్యూటీ వయసు ఇప్పుడు జస్ట్ 20 మాత్రమే. అయినప్పటికీ హిందీ, తెలుగు, తమిళం భాషల్లో కథానాయకిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఇంకా చెప్పాలంటే ఈ చిన్నది 16 ఏళ్ల వయసులోనే సూపర్ 30 అనే హిందీ చిత్రం ద్వారా నాయకిగా రంగప్రవేశం చేశారు. ఆ తరువాత తెలుగులో ఉప్పెన అనే చిత్రంతో సంచలన విజయాన్ని అందుకున్నారు. దీంతో ఈమె రాత్రికి రాత్రే క్రేజీ నటి అయిపోయారు. అలా కొన్ని చిత్రాల్లో నటించిన కృతిశెట్టికి అక్కడ అవకాశాలు సన్నగిల్లాయి. దీంతో కోలీవుడ్‌లో కన్నేశారు. అయితే ఇక్కడ ఇంకా సరైన విజయాన్ని అందుకోలేదు. తమిళ దర్శకుడు లింగుసామి తెలుగు నటుడు రామ్ హీరోగా తెరకెక్కించిన ద్విభాషా చిత్రం ది వారియర్‌తో కోలీవుడ్ ప్రేక్షకుల ముందుకు వచ్చిన కృతిశెట్టికి ఆ చిత్రం నిరాశ పరచింది. అదేవిధంగా నాగచైతన్య హీరోగా మరో తమిళ దర్శకుడు వెంకట్ ప్రభు తెరకెక్కించిన కస్టడి చిత్రంలోనూ కృతిశెట్టి హీరోయిన్‌గా నటించారు. ఈ చిత్రం ఆమె కేరీర్‌కు ఉపయోగపడలేదు. అయితే కోలీవుడ్‌లో ఈమెకు మరిన్ని అవకాశాలు వరిస్తున్నాయి. ప్రస్తుతం కార్తీకి జంటగా వా వాద్దియార్, ప్రదీప్ రంగనాథన్ సరసన ఎల్‌ఐసీ, జయంరవికి జంటగా జీనీ చిత్రాల్లో నటిస్తున్నారు. వీటిలో ఏ ఒక్క చిత్రం హిట్ అయినా, కృతిశెట్టి కోలీవుడ్‌లో పాగా వేసినట్లే. ఈమె కూడా అదే కోరుకుంటున్నట్లు తెలిసింది. ఇకపోతే సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచార ప్రయత్నాలు చేయడం మాత్రం ఆపలేదు. ఇటీవల కృతీశెట్టి పూర్తిగా ముత్యాలు పొదిగిన దుస్తులు ధరించి సొగసులను ఆరబోస్తూ ప్రత్యేకంగా ఫొటో సెషన్ చేయించుకున్నారు. ఆ ఫొటోలిప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఇదంతా హిట్ కోసం పడే పాట్లు అంటూ నెట్టింట్లో జోరుగా కామెంట్స్ వస్తుండడం గమనార్హం.

రష్యాలో గుడ్ బ్యాడ్ అగ్లీ?

తమిళసినిమా: నటుడు అజిత్ తాజాగా రెండు చిత్రాల్లో నటిస్తున్నారు. అందులో ఒకటి విడాముయర్చి కాగా రెండోది గుడ్ బ్యాడ్ అగ్లీ చిత్రం. లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న చిత్రం విడాముయర్చి. మగిళ్ తిరుమేణి దర్శకత్వం వహిస్తున్న ఇందులో నటి త్రిష నాయకిగా నటిస్తున్నారు. ఈ చిత్ర షూటింగ్ చాలా వరకూ పూర్తి చేసుకుంది. తదుపరి షూటింగ్‌ను అజర్‌బైజాన్‌లో నిర్వహించడానికి యూనిట్ సిద్ధం అవుతోందని సమాచారం. కాగా తాజాగా అజిత్ కథానాయకుడిగా నటిస్తున్న మరో చిత్రం గుడ్ బ్యాడ్ అగ్లీ. మార్క్ ఆంటని చిత్రం ఫేమ్ ఆధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని టాలీవుడ్ ప్రముఖ చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీస్ నిర్మిస్తోంది. ఇందులో నటుడు అజిత్ త్రిపాత్రాభినయం చేస్తున్నట్లు సమాచారం. దీంతో గుడ్ బ్యాడ్ అగ్లీ చిత్రంపై ఇప్పటి నుంచే భారీ అంచనాలు ఏర్పడుతున్నాయి. కాగా ఈ చిత్ర షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఇందులో కూడా అజిత్ నటిస్తున్న ఒక పాత్ర సాల్ట్ అండ్ పెప్పర్‌గా ఉంటుందని తెలిసింది. ఈ చిత్ర షూటింగ్ నుంచి అజిత్, దర్శకుడు ఆధిక్ రవిచంద్రన్ ఉన్న ఫొటో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. కాగా హైదరాబాద్‌లో షూటింగ్‌ను పూర్తి చేసిన తరువాత ఈ చిత్ర యూనిట్ తదుపరి షెడ్యూల్ చిత్రీకరణ కోసం రష్యాకు వెళ్లనున్నట్లు తాజా సమాచారం. అందుకు ముందుగా అజిత్ విడాముయర్చి చిత్ర షూటింగ్‌ను పూర్తి చేయనున్నట్లు తెలిసింది.


నటుడు అజిత్‌తో దర్శకుడు ఆధిక్ రవిచంద్రన్

తానాక్కారన్ చిత్ర దర్శకుడితో కార్తీ


కార్తీ
తమిళ్

తమిళసినిమా: నటుడు కార్తీ చేతిలో ప్రస్తుతం నాలుగు చిత్రాలు ఉన్నాయి. తాజాగా మరో చిత్రానికి పచ్చజెండా ఊపారని సమాచారం. ఇంతకు ముందు సర్దార్, పొన్నియిన్ సెల్వన్ వంటి చిత్రాల విజాయాలతో జోరు మీద ఉన్న కార్తీకి ఆయన 25వ చిత్రం జపాన్ బ్రేక్ వేసింది. ఆ చిత్ర అపజయం నుంచి బయట పడడానికి ఆయన మంచి కథా చిత్రాలను ఎంపిక చేసుకుని నటిస్తున్నారు. ఈయన నటిస్తున్న వా వాద్దియార్, మెయ్యళగన్ చిత్రాలు త్వరలో వరసగా తెరపైకి రావడానికి సిద్ధం అవుతున్నాయి. ఈ చిత్రాల కోసం ఆయన అభిమానులు ఎదురు చూస్తున్నారనే చెప్పాలి. ఇందులో మెయ్యళగన్ చిత్రాన్ని నటుడు సూర్య తన 2డీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై నిర్మిస్తున్నారు. దీనికి 96 చిత్రం ఫేమ్ ప్రేమ్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. వా వాద్దియార్ చిత్రాన్ని నలన్ కుమారసామి తెరకెక్కిస్తున్నారు. కాగా ప్రస్తుతం కార్తీ సర్దార్ -2 చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్ర షూటింగ్ ఇటీవలే సైలెంట్‌గా ప్రారంభం అయ్యి చిత్రీకరణను జరుపుకుంటోంది. కాగా తాజాగా కార్తీ తన 30వ చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీనికి తానాక్కారన్ చిత్రం ఫేమ్ తమిళ్ దర్శకత్వం వహించనున్నట్లు తెలిసింది. ఇది గ్యాంగ్‌స్టర్స్ నేపథ్యంలో సాగే 1960 కాలం నాటి కథా చిత్రంగా ఉంటుందని సమాచారం. కాగా దీన్ని ఇంతకు ముందు కార్తీ హీరోగా జపాన్ చిత్రాన్ని నిర్మించిన డ్రీమ్ వారియర్స్ సంస్థ నిర్మించనుందని తెలిసింది. అంతేకాదు ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నట్లు సమాచారం. దీనికి సంబంధించి పూర్తి వివరాలతో కూడిన అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడే అవకాశం ఉంది.

క్లుప్తంగా

ఎద్దుల దాడిలో ఇద్దరి మృతి

అన్నానగర్: మంజువిరట్టు పోటీల్లో పాల్గొన్న ఇద్దరు ఎద్దులు దాడి చేయడంతో మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. శివగంగై జిల్లా ఎస్ ఎస్ కోటలోని కారమడై అయ్యనార్ ఆలయంలో వైఖాసి మాస పండుగ సందర్భంగా ఆదివారం మంజువిరట్టు పోటీలు నిర్వహించారు. ఇందుకోసం సియ్యముత్తుపట్టి కన్మాయి వద్ద వాడివాసల్‌ను ఏర్పాటు చేశారు. మంజువిరట్టులో పాల్గొనేందుకు శివగంగై, మదురై, దిండుగల్, కారైకుడి, పుదుకోట్టై, అరతాంగి సహా వివిధ ప్రాంతాల నుంచి 400కు పైగా ఎద్దులను తీసుకొచ్చారు. అనంతరం వాడివాసల్ వద్ద ఎద్దులను ఒకదాని తర్వాత ఒకటి బరిలో విడిచిపెట్టారు. మైదానంలో విపరీతంగా పరుగెత్తిన ఎద్దులను మచ్చిక చేసుకునేందుకు వీరులు ప్రయత్నించారు. అప్పుడు ఎద్దులు పొడవడంతో 15 మందికి పైగా గాయాలయ్యాయి. ఈ ఘటనలో మధురై జిల్లా మేలూర్ ప్రాంతానికి చెందిన శరణ్ (28) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సింగంపునరి ప్రాంతానికి చెందిన కిచ్చన్ (60) కూడా తీవ్రంగా గాయపడగా, అతనిని రక్షించి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అయితే మార్గం మధ్యలోనే మృతి చెందాడు. మరోవైపు ప్రభుత్వ అనుమతి లేకుండా ఈ మంజువిరట్టు పోటీ జరిగిందని, అదే ప్రాంతానికి చెందిన ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడు..

తిరువొత్తియూరు: పుదుకోట్టై పరిధిలోని గంధర్వకోట సమీపంలో మృతదేహం ఉంచిన ఫ్రీజర్‌లో విద్యుత్ ప్రవాహంతో షాక్ తగిలి యువకుడు మృతి చెందిన సంఘటన విషాదం కలిగించింది. వివరాల్లోకి వెళితే.. పుదుకోట్టై జిల్లా గంధర్వకోట పక్కనే ఉన్న కొమాపురం గ్రామానికి చెందిన కాశయ్య కుమారుడు విశాల్ (18) ప్లస్‌టూ పూర్తి చేసి ఉన్నత విద్యకు దరఖాస్తు చేసుకున్నాడు. ఈ స్థితిలో విశాల్ తాత పరమశివం వయోభారంతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. తర్వాత పరమశివం మృతదేహాన్ని కోల్డ్ స్టోరేజీ పెట్టెలో ఉంచారు. ఆదివారం సాయంత్రం అంత్యక్రియలు కోసం వృద్ధుని మృతదేహాన్ని బయటకు తీయడానికి విశాల్ ఆ ఫ్రీజర్ ఓపెన్ చేయగా అతనికి విద్యుత్ షాక్ కొట్టింది. వెంటనే పక్కనే ఉన్నవారు విశాల్‌ను గంధర్వకోట ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్ష చేయగా అప్పటికే యువకుడు మృతి చెందినట్టు తెలిపారు. సమాచారం అందుకున్న గంధర్వకోట పోలీసులు విద్యార్థి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుదుకోట్టై మెడికల్ కాలేజీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సరస్సులో మునిగి విద్యార్థి..

అన్నానగర్: సరస్సులో మునిగి విద్యార్థి మృతి చెందిన సంఘటన విషాదం నింపింది. వివరాల్లోకి వెళితే.. అరియలూరు జిల్లా ఆండిమడం సమీపంలోని కూవత్తూరు మఠత్తువీధిలో నివాసం ఉంటున్న గ్రెగరీ, ఎమిలీ దంపతులకు ఫ్రాన్సిక (14) కుమార్తె ఉంది. ఈమె కూవత్తూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. ఆదివారం ఆమె తన తల్లి, బంధువులతో కలిసి తిమ్మకుట్టై సరస్సులో స్నానం చేయడానికి వెళ్లింది. అప్పుడు ఫ్రాన్సిక సరస్సులో లోతులోగా ఉన్న ప్రాంతంలోకి వెళ్లి నీటిలో మునిగిపోయింది. మునిగిపోతున్న ఆ బాలికను బంధువులు రక్షించి జయంగొండం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు ఫ్రాన్సిక అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటన గురించి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

బొగ్గేరు ఒడ్డున కాలిన స్థితిలో మృతదేహం

తిరువొత్తియూరు: పొదువుకోట సమీపంలోని బొగ్గేరు ఒడ్డున ఒక యువకుడి మృతదేహం కాలిన స్థితిలో పడి ఉంది. దీన్ని చూసినా స్థానికులు ఈ విషయమై పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. శరీరం పూర్తిగా కాలి ఉంది. కాళ్ల వరకే కాలకుండా ఉంది. మృతదేహాన్ని పుదుకోట్టై ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతి చెందిన యువకుడు ఎవరు? అతను ఏ ఊరికి చెందిన వాడు.. ఎందుకు హత్యకు గురయ్యాడన్న కోణంలో విచారణ జరుపుతున్నారు.

ఏసీలో మంటలు

- కార్మికుడి సజీవ దహనం

తిరువొత్తియూరు: సెయ్యారులో అర్ధరాత్రి ఏసీలో మంటలు వ్యాపించి కార్మికుడు సజీవ దహనమయ్యాడు. తిరువణ్ణామలై జిల్లాలోని వైద్యర్ వీధికి చెందిన కామరాజ్ (63) కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. అతడి తమ్ముడు వినోద్‌కుమార్ ఇంట్లో ఉంటూ కూలీ పనులు చేసుకునేవాడు. మద్యానికి బానిసైన కామరాజ్ రోజూ తాగి వస్తుంటాడు. అలాగే ఆదివారం పనికి వెళ్లి మద్యం తాగి ఇంటికి వచ్చిన కామరాజ్ తన గదిలోని ఏసీ స్విచ్ ఆన్ చేసి నిద్రపోయాడు. పనికి వెళ్లిన వినోద్‌కుమార్ రాత్రి 11.30 గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో కామరాజ్ ఉంటున్న గదిలోంచి పొగ వస్తుండడం చూసి దిగ్భ్రాంతికి గురయ్యాడు. ఇరుగుపొరుగు వారు అతని శబ్దం విని విద్యుత్‌ను ఆపి వేసి తలుపులు పగులగొట్టి గదిలోకి వెళ్లి చూడగా అప్పుడు ఏసీలో మంటలు రేగడంతో కామరాజ్ ఆ మంటల్లో చిక్కుకుని సజీవదహనం అయ్యాడు. దీనిపై వినోద్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సెయ్యూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిదంబరం రికార్డు సమం చేసిన టీఆర్

సాక్షి, చెన్నై: రాష్ట్రం నుంచి అత్యధిక సార్లు లోక్‌సభకు వెళ్లిన ఎంపీగా కాంగ్రెస్‌కు చెందిన చిదంబరం గతంలో రికార్డు సృష్టించారు. ప్రస్తుతం ఆ రికార్డును డీఎంకే ఎంపీ టీఆర్ బాలు సమం చేశారు. ఈ ఇద్దరు ఇప్పటి వరకు ఏడు సార్లు లోక్ సభలో అడుగు పెట్టారు. వివరాలు.. కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. 1984లో శివగంగై నుంచి తొలిసారిగా లోక్ సభకు ఆయన వెళ్లారు. 1989, 91లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఇదే నియోజకవర్గం నుంచి గెలిచారు. 1996, 98లలో కాంగ్రెస్ నుంచి చీలికతో ఆవిర్భవించిన తమిళ మానిల కాంగ్రెస్ నుంచి లోక్‌సభకు వెళ్లారు. మళ్లీ 2004, 2009లో కాంగ్రెస్ తరపున లోక్‌సభలో అడుగు పెట్టారు. ఆ తర్వాత ఆయన ప్రత్యక్ష ఎన్నికలకు దూరమయ్యారు. ఆయన వారసుడు కార్తీ చిదంబరం శివగంగై నుంచి పోటీచేస్తూ వస్తున్నారు. ఏడు సార్లు లోక్‌సభకు రాష్ట్రం నుంచి వెళ్లిన వారి జాబితాలో మొదటి వరుసలో ఉన్న


టీఆర్ బాలు

చిదంబరం రికార్డును ప్రస్తుతం డీఎంకే ఎంపీ టీఆర్ బాలు సమం చేశారు. టీఆర్ బాలు 1996లో దక్షిణ చెన్నై నుంచి తొలిసారిగా పార్లమెంట్‌కు వెళ్లారు. 98, 99, 2004లో ఇదే నియోజకవర్గం నుంచి గెలుస్తూ వచ్చారు. 2009లో తన మకాంను శ్రీపెరంబదూరుకు మార్చారు. అలాగే 2014లో తంజావూరుకు మకాం మార్చి ఓటమి పాలయ్యారు. మళ్లీ 2019, 2024లో శ్రీపెరంబదూరు నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఏడు సార్లు టీఆర్ బాలు గెలవడంతో చిదంబరం రికార్డును సమం చేశారు. వరసగా పార్లమెంట్‌లో అడుగు పెడుతూ వస్తున్న టీఆర్ బాలుకు మరో మారు డీఎంకే పార్లమెంటరీ నేత పదవి కట్టబెట్టేందుకు పార్టీ అధ్యక్షుడు, సీఎం స్టాలిన్ తాజాగా నిర్ణయించినట్టు తెలుస్తోంది.

మరదలికి కడుపు చేసిన బావ

తిరువళ్లూరు: నీట్ శిక్షణ కోసం వచ్చి అక్కతో నివాసం ఉంటున్న ప్లస్‌టూ బాలికను గర్భవతిని చేసిన బావను పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. తిరువళ్లూరు జిల్లా కనకమ్మసత్రం ప్రాంతానికి చెందిన 17 ఏళ్ల బాలిక అదే ప్రాంతంలోని ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో ప్లస్‌టూ చదువుతోంది. ఈ క్రమంలో పరీక్షలు ముగియడంతో ప్రభుత్వం ఉచితంగా నిర్వహిస్తున్న నీట్ శిక్షణ కోసం తిరువళ్లూరుకు వచ్చి శిక్షణ తీసుకుంటున్నట్టు తెలుస్తుంది. ఈ క్రమంలో కనమ్మసత్రం వరకు రోజు వెళ్లి రావడం కష్టంగా ఉండడంతో తిరువళ్లూరులోని తన అక్క, బావ రాబిన్‌తో కలిసి ఉంటోంది. ఈ క్రమంలో గత రెండు రోజుల క్రితం నీట్ శిక్షణకు వెళ్లిన బాలిక అక్కడే స్పృహ తప్పి పడిపోయినట్టు తెలుస్తుంది. దీంతో ఉపాధ్యాయులు బాలికను తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పరీక్షించగా బాలిక గర్భిణీ అని నిర్ధారణ కావడంతో షాక్‌కు గురయ్యారు. ఇదే విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు చేరవేసి వారిని తిరువళ్లూరు మహిళ పోలీసు స్టేషన్‌కు పిలిపించి ఫిర్యాదు స్వీకరించి, కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. పోలీసుల విచారణలో బాలిక గర్భం దాల్చడానికి ఆమె అక్క భర్త రాబిన్ కారణమని నిర్ధారించిన పోలీసులు అతడ్ని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.


అరెస్టయిన రాబిన్

మెరీనా, బీసెంట్‌నగర్ బీచ్‌లలో ఉచిత పార్కింగ్

- రీ టెండర్ వేసే వరకు అనుమతి

అన్నానగర్: ఆదాయాన్ని పెంచుకునేందుకు చెన్నై మున్సిపల్ కార్పొరేషన్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద మెరీనా బీచ్, బీసెంట్ నగర్ బీచ్, టీనగర్ సహా 170 చోట్లకు పైగా స్మార్ట్ పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసింది. అక్కడ పార్కింగ్ చేసిన వాహనాలకు టోల్ వసూలు చేసేందుకు కాంట్రాక్టు పద్ధతిలో ఓ ప్రైవేట్ కంపెనీకి కార్పొరేషన్ అనుమతి ఇచ్చింది. ఇక్కడ ద్విచక్ర వాహనాలకు గంటకు రూ.5, నాలుగు చక్రాల వాహనాలకు రూ.20 చొప్పున వసూలు చేయాలని కార్పొరేషన్ ఆదేశించింది. కానీ మెరీనా బీచ్ రాయ్‌లో నిబంధనలకు విరుద్ధంగా బస్సులు, వ్యాన్‌లకు రూ.400, కార్లకు రూ.100 నుంచి రూ.300, ద్విచక్రవాహనాలకు రూ.30 వరకు వసూలు చేసినట్లు ఫిర్యాదులు అందాయి. దానికి వారు రశీదు ఇవ్వలేదు. అలాగే కాంట్రాక్ట్ గడువు ముగిసినా చెన్నై కార్పొరేషన్ ప్రైవేట్ కంపెనీకి ఇచ్చిన కాంట్రాక్టును రద్దు చేసింది. దీనిపై దాఖలైన కేసులో ప్రైవేట్ కంపెనీకి ఇచ్చిన కాంట్రాక్టును రద్దు చేస్తున్నామని, అందువల్ల రోడ్డు పక్కన పార్కింగ్‌కు మళ్లీ టెండర్లు వేసే వరకు మెరీనా, బీసెంట్ నగర్ సహా మున్సిపల్ సరిహద్దుల్లో పార్కింగ్ చేసిన వాహనాలకు టోల్ చెల్లించవద్దని తీర్పునిచ్చింది. పాండిబజార్, టీనగర్ ఉచిత పార్కింగ్ అందుబాటులో ఉంది. డబ్బులు అడిగితే పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చని కార్పొరేషన్ అధికారి తెలిపారు.

మేడపై నుంచి పడి యువకుడి దుర్మరణం

అన్నానగర్: మద్యం మత్తులో మేడపై నుంచి పడి ఓ యువకుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. చెన్నైలోని ముగప్పేర్ పుగళేంది రోడ్డులోని ఓ అపార్ట్‌మెంట్‌లో సుధాకర్ (30) నివాసముంటున్నాడు. అంబత్తూరులోని లేత్ పట్టరైలో పనిచేస్తున్నాడు. అతను ఆదివారం రాత్రి తన స్నేహితులతో కలిసి మూడో అంతస్తులో కూర్చుని మద్యం సేవించాడు. వారంతా మద్యం మత్తులో డ్యాన్స్ చేశారు. ఆ సమయంలో సుధాకర్ మిద్దె పైనుంచి కిందపడ్డాడు. వెంటనే అతనిని 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి, కీల్పాకం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పరిశీలించని వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న జేజే నగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

ప్రారంభం

చెన్నై అన్నా సాలైలో మద్రాసు మాప్పిళ్లై (మద్రాసు అల్లుడు) పేరిట వినూత్న రీతిలో, రుచికర దక్షిణ భారత వంటకాలతో ప్రదర్శన ఏర్పాటైంది. ఇందులో 50 మంది అనాథ పిల్లలకు తొలి విందును ఏర్పాటు చేశారు. ఈ నెలాఖరు వరకు కొత్తగా పెళ్లయిన జంటలకు ప్రత్యేక వంటకాలను ఇక్కడ అందజేయనున్నారు. దీనిని సోమవారం నటుడు, వ్యాఖ్యత, సామాజిక సేవకుడు బాలన్


ఆకాశ్, నిర్వాహకులు జెరోమ్ ఫెనెలోన్, బద్రీ నారాయణ ప్రారంభించారు. - సాక్షి, చెన్నై

పిడుగుపాటుకు లోడ్‌మ్యాన్ మృతి

అన్నానగర్: మదురైలో సోమవారం తెల్లవారుజామున పిడుగుపాటుకు గురై లోడ్‌మెన్ మృతి చెందాడు. మదురైలోని సెల్లైమాన్‌లో ఉన్న అన్నానగర్ కు చెందిన శంకర్ (38). ఆండర్ కోట్టరామ్‌లో ఉన్న బాటిల్ కంపెనీలో లోడ్ మెన్‌గా పని చేస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున అతని స్నేహితులు కొందరు కంపెనీ వద్ద పార్క్ చేసిన ట్రక్కును లోడ్ చేస్తున్నారు. ఈ సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ స్థితిలో హఠత్తుగా లోడుమాన్ శంకర్‌పై పిడుగు పడింది. ఈ ఘటనలో శంకర్ దేహం కాలిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. కారుప్పాయూరణి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో బస్సు బోల్తా

- యువతి మృతి, 33 మందికి గాయాలు

తిరువొత్తియూరు: విరుదునగర్ సమీపంలో సోమవారం ఉదయం ప్రభుత్వ బస్సు రోడ్డు పక్కన ఉన్న కాలువలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో యువతి మృతి చెందగా 33 మందికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. కోయంబత్తూరు నుంచి ఆదివారం రాత్రి తూత్తుకుడి జిల్లా కోవిల్‌పట్టికి ప్రభుత్వ బస్సు బయలుదేరింది. దిండిగల్ జిల్లా పళనికి చెందిన మురుగ భూపతి (37) బస్సును నడిపాడు. మదురై జిల్లాలో పెరైయూర్‌కు చెందిన ప్రదీప్ (33) కండక్టర్‌గా ఉన్నారు. సోమవారం ఉదయం 6 గంటల సమయంలో బస్సు విరుదునగర్ సమీపంలోని ఆర్ఆర్ నగర్ వాచ్‌గక్కరపట్టి ప్రాంతంలో వెళుతుండగా హఠాత్తుగా అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న బ్రిడ్జి రక్షణగోడను ఢీకొని, కాలువలోకి బోల్తా పడింది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న 34 మంది గాయపడ్డారు. వీరిలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు అక్కడికి చేరుకుని క్షతగాత్రులను రక్షించి 108 అంబులెన్స్, ప్రైవేట్ అంబులెన్స్‌ల్లో విరుదునగర్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ కోయంబత్తూరుకు చెందిన భువనేశ్వరి(33) మృతి చెందింది. ప్రమాదంపై వచ్చకరపట్టి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కండలేరులో 6.506 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 6.506 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 40, లోలెవల్ కాలువకు 70 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

లైంగిక వేధింపుల కేసులో టీచర్‌పై చర్యలు

- మరో 10 మంది ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల బదిలీ

అన్నానగర్: కోయంబత్తూరు జిల్లా తొండాముత్తూరు ప్రాంతంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉంది. ఈ పాఠశాలలో 800 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ 37 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఈ పాఠశాలలోని ఓ విద్యార్థినిపై ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ ఆనంద్ కుమార్ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. విద్యార్థిని ఫిర్యాదు మేరకు ఉపాధ్యాయుడు ఆనందకుమార్‌ను పోలీసులు పోక్సో చట్టం కింద అరెస్టు చేశారు. అనంతరం అతడిపై సస్పెన్షన్ వేటు పడింది. కాగా టీచర్ తనను లైంగికంగా వేధిస్తున్నాడని బాధిత విద్యార్థిని గతంలో ఫిర్యాదు చేసినా సకాలంలో స్పందించలేదనే కారణంతో.. ఆ స్కూల్లో పనిచేస్తున్న ఆరుగురు టీచర్ల పేరును కూడా చార్జ్‌షీట్‌లో చేర్చారు. దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారులు కూడా విచారణ చేపట్టారు. ఈ స్థితిలో ఆ పాఠశాలలో పనిచేస్తున్న 10 మంది ఉపాధ్యాయులను ఉన్నతాధికారులు బదిలీ చేశారు. రెండు రోజుల క్రితం కోయంబత్తూరు జిల్లా విద్యాశాఖ అధికారులు ఈ చర్య తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన విద్యాశాఖలో ప్రస్తుతం కలకలం రేపుతోంది.

కుంటలో మునిగి ముగ్గురు విద్యార్థుల మృతి

వేలూరు: సెయ్యారు సమీపంలో ముగ్గురు పాఠశాల విద్యార్థులు నీటి కుంటలో మునిగి మృతి చెందిన ఘటన ఆదివారం సాయంత్రం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. తిరువణ్ణామలై జిల్లా సెయ్యారు తాలుకా నెడుంగరై గ్రామంలో అమ్మన్ ఆలయ జాతర ఉత్సవాలు జరుగుతున్నాయి. ఆలయ జాతరను చూసేందుకు అదే గ్రామానికి చెందిన మురళీ కృష్ణన్ కుమారుడు సాయి శరణ్ (12) ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చేరేందుకు సోమవారం పాఠశాలకు వెళ్లాల్సి ఉంది. రామదాసన్ కుమారులు భరత్‌కుమార్ (9), సంతోష్(7) కలిసి ఆదివారం సాయంత్రం అదే గ్రామంలోని కుంటలో స్నానానికి వెళ్లినట్లు తెలుస్తుంది. అక్కడ కుంటలో మునిగిన ముగ్గురూ ఈత రాక పోవడంతో లోతైన నీటిలో మునిగిపోయారు. ఆలయ జాతర ముగించుకుని అమ్మవారి శిరస్సును చెరువు నిమజ్జనం చేసేందుకు కడిగేందుకు గ్రామస్తులు తీసుకెళ్లారు. ఆ సమయంలో ముగ్గురు చిన్నారులు నీటిలో చిక్కుకొని ఉండడాన్ని గమనించిన వెంటనే బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షలు చేసిన డాక్టర్‌లు సాయిశరన్, భరత్‌కుమార్, సంతోష్ ముగ్గురూ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. వీటిపై సెయ్యారు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. సోమవారం ఉదయం పాఠశాలల పునః ప్రారమైన నేపథ్యంలో ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు విద్యార్థులు మృతి చెందిన సంఘటన పలువురిని కలిసి వేసింది.


భరత్‌కుమార్(ఫైల్)


సంతోష్(ఫైల్)

మహిళను మోసం చేసిన యువకుడిపై కేసు

తిరువొత్తియూరు: వివాహం చేసుకుంటానని చెప్పి ఐటీ ఉద్యోగినితో ఉల్లాసంగా గడిపి వివాహం చేసుకోవడానికి తిరస్కరించిన చెన్నై యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. కోవై శరవణంపట్టి ప్రాంతానికి చెందిన 29 ఏళ్ల యువతి అక్కడున్న ఐటీ సంస్థలో పని చేస్తోంది. ఈమెకు చెన్నై అంబత్తూరుకు చెందిన 25 ఏళ్ల యువకుడితో పరిచయం ఏర్పడింది. క్రమంగా ఆ పరిచయం ప్రేమగా మారింది. ఈ క్రమంలో కొన్ని రోజుల క్రితం యువకుడు చెన్నై నుంచి కోవైకి వచ్చాడు. తర్వాత యువతి ఇంటికి వెళ్లాడు. అక్కడ మహిళ ఒంటరిగా ఉన్న సమయంలో యువకుడు వివాహం చేసుకుంటానని చెప్పి, ఆమెతో ఉల్లాసంగా ఉన్నట్లు తెలిసింది. తర్వాత ఆమెను వివాహం చేసుకోవడానికి తిరస్కరించాడు. దీంతో మోసపోయిన యువతి శరవణంపట్టి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు యువకుడిపై కేసు నమోదు చేసి అతడిని విచారణ జరుపుతున్నారు.

రూ. 2.5 లక్షలకు చిన్నారి విక్రయం

- తల్లీ కుమార్తె అరెస్టు

కొరుక్కుపేట: బీహార్ నుంచి అక్రమంగా పిల్లలను తీసుకొచ్చి సూలూరులో రూ.2.5 లక్షలకు విక్రయిస్తున్న తల్లీ, కూతుళ్లను స్పెషల్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసి, జైలుకు పంపారు. వివరాల్లోకి వెళితే.. కోయంబత్తూరు జిల్లాలోని సూలూర్ అప్పనాయకన్ పట్టి ప్రాంతంలోని బీహార్‌కు చెందిన మహేష్ కుమార్, అంజలీదేవి ఉంటున్నారు. బీహార్ నుంచి పిల్లలను కొనుగోలు చేసి, కోయంబత్తూరులో విక్రయిస్తున్న కేసులో వారిద్దరినీ గత వారం అరెస్టు చేశారు. అనంతరం జరిపిన విచారణలో బీహార్‌లో రెండేళ్ల బాలుడు, ఒక నెల వయస్సు బాలికను రూ.1500కు కొని, సూలూరులో విక్రయించడానికి యత్నిస్తున్నట్లు తేలింది. దీంతో పోలీసులు ఆ చిన్నారులను రక్షించారు. ఈ కేసులో ఆడపిల్లను కొనుగోలు చేసినందుకు తిమ్మనాయకపాళయం ప్రాంతానికి చెందిన విజయన్ అనే వ్యక్తి అరెస్టు చేశారు. అలాగే చిన్నపిల్లలను విక్రయించడానికి యత్నించిన పూనందేవి (55), మేఘకుమారి (21)ను పోలీసులు అరెస్టు చేశారు. పూనంది, మేఘకుమారిలు అంజలీదేవికి తల్లి, చెల్లెలు అని తేలింది. పూనందేవి బీహార్‌లో రూ.1,500కు ఆడ పిల్లను కొనుగోలు చేశారు. చిన్నారిని విక్రయించేందుకు అప్పనాయకన్ పట్టిలోని ఓ దుకాణంలో ఉంచి, ఇద్దరు వ్యక్తులను సంప్రదించారు. అనంతరం రూ. 2.50 లక్షలు ఇస్తామని చెప్పి, రైతు విజయ్‌కు ఆడపిల్లను విక్రయించిన విషయం విచారణలో బట్టబయలైంది. దీంతో పోలీసులు పూనమ్‌దేవి, మేఘకుమారిని కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.


పూనమ్‌దేవి, మేఘకుమారి

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల : శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 81,744 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 36,833 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.34 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 16 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

గణ..గణ..గణ..!

అబ్బా ఇల్లు తీసి పందిరేస్తున్నాడు.. బడి తెరిస్తేనే కానీ వీడి అల్లరికి తెరపడదు.. ఇదీ నిన్నటి వరకు వినిపించిన మాట..బుజ్జిగాడు బడికెళ్లడంతో ఇల్లంతా బోసిపోయింది. అసలు ఊసుపోవడం లేదు. ఇదీ నేడు వినిపిస్తున్న మాట. అల్లరిలో శ్రీకృష్ణులు..ఆత్మవిశ్వాసంలో ప్రహ్లాదులు.. గ్రహణశక్తిలో అభిమన్యులు..ధైర్యంలో బాల హనుమంతుల్లాంటి మన చిన్నారులు ఆత్మవిశ్వాసంతో పాఠశాల వైపు ఉత్సాహంగా అడుగులేశారు. తొలిరోజు ఉల్లాసంగా గడిపారు.

- పాఠశాలలు పునఃప్రారంభం
- ఉత్సాహంగా.. ఉల్లాసంగా తొలిరోజు బడికి వచ్చిన విద్యార్థులు



తిరువళ్లూరు: ఉత్సాహంగా పాఠశాలకు వస్తున్న చిన్నారులు

పళ్లిపట్టు: వేసవి సెలవుల తరువాత సోమవారం పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. విద్యార్థులు ఉత్సాహంగా, ఉల్లాసంగా తరగతులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, ఆనందంతో స్వీట్లు పంచి విద్యార్థులకు స్వాగతం పలికారు. తిరుత్తణి యూనియన్ కేజీ కండ్రిగ ప్రభుత్వ మహోన్నత పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు దామోదరన్ అధ్యక్షతన ఉపాధ్యాయులు స్వీట్లు పంచి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోర్కె మేరకు షిరిడీ సాయి సేవాట్రస్టు ద్వారా రూ. పది వేలు విలువైన క్రీడా సామగ్రిని సాయి ట్రస్టు చైర్మన్ సాయి శ్రీనివాసులు, కార్యదర్శి ఆర్.బాలాజీ అందజేశారు. ఆర్‌కే పేట యూనియన్ ఎస్‌వీజీ పురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం గోవిందప్ప నాయుడు, టీచర్లు, శకుంతల, భాస్కర్ తదితరులు తొలిరోజు పాఠ్య పుస్తకాలు అందజేశారు. విద్యార్థులు కొత్త పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు పొంది హర్షం వ్యక్తం చేశారు.

పునఃప్రారంభమైన పాఠశాలలు

తిరువళ్లూరు: దాదాపు ఒకటిన్నర నెలల వేసవి సెలవులు అనంతరం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు సోమవారం ఉదయం నుంచి ప్రారంభమయ్యాయి. తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా 600 పైగా ప్రాథమిక, అప్పర్ ప్రైమరీ ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటితో పాటు ప్రభుత్వ, ప్రైవేటు హైస్కూళ్లు సైతం మూడు వందలకు పైగా ఉన్నాయి. ఈ పాఠశాలలలో చదివే విద్యార్థులకు ఏప్రిల్‌లో వేసవి సెలవులను ప్రకటించారు. ఈ పాఠశాలలు సోమవారం పునఃప్రారంభమయ్యాయి. దీంతో నెలన్నర రోజులుగా బోసిపోయిన పాఠశాలల్లో విద్యార్థుల రాకతో సందడి నెలకొంది. మొదటి రోజు విద్యార్థులు హుషారుగా తరగతులకు హాజరయ్యారు. పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు అందించి, స్వాగతం పలికారు.


తిరువళ్లూరు: ప్రార్థన చేస్తున్న పాఠశాల విద్యార్థులు



కేజీ కండ్రికలో విద్యార్థులకు చాక్లెట్లు పంచి స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు


పాఠ్య పుస్తకాలు పొందిన ఆనందంలో ఎస్‌వీజీ పురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు


సేలం: ఈరోడ్‌లో విద్యార్థులను ఆశీర్వదిస్తున్న ఉపాధ్యాయులు


సైదాపేటలో పుస్తకాలు అందజేస్తున్న మంత్రి ఎం.సుబ్రమణియన్


వడివడిగా.. బడులకు

క్లుప్తంగా...

ఏఎన్‌యూలో వైఎస్సార్ విగ్రహం తొలగింపు



వైఎస్సార్ విగ్రహాన్ని తొలగిస్తున్న దృశ్యం

గుంటూరు: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని సోమవారం యూనివర్సిటీ అధికారులు తొలగించారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో యూనివర్సిటీలోని డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని తొలగించాలని టీఎన్‌టీయూసీ, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు, కొందరు అధ్యాపకులు సోమవారం ధర్నా చేశారు. రెండు రోజుల్లో తొలగించకపోతే తామే తొలగిస్తామని చెప్పారు. దీంతో యూనివర్సిటీ అధికారులు సోమవారం సాయంత్రం క్రేన్ సహాయంతో విగ్రహాన్ని తొలగించారు.

అంబటి ఇంటివద్ద కవ్వింపు చర్యలు

టీడీపీ నాయకులపై పోలీసులకు అంబటి ఫిర్యాదు



అంబటి చిత్రపటం వద్ద ఆహ్వాన పత్రిక, చీర, రవిక, పసుపు కుంకుమ పెట్టిన టీడీపీ నేతలు

గుంటూరు ఈస్ట్: టీడీపీ నాయకులు సోమవారం గుంటూరులో మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటివద్ద కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. టీడీపీ జెండాలు పట్టుకొని అంబటి రాంబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబుప్రమాణ స్వీకారానికి అంబటి రాంబాబుకు ఆహ్వాన పత్రిక ఇచ్చేందుకు వచ్చినట్లు చెప్పారు. చీర, రవిక, పసుపుకుంకుమతో ఆహ్వానపత్రం ఇస్తామని ప్రకటించారు. ఇంటి బయట ఉన్న కుర్చీలో అంబటి చిత్రపటాన్ని ఉంచి చీర, రవిక, పసుపుకుంకుమ పెట్టి డ్రామా ఆడారు. పోలీసులు వచ్చి టీడీపీ నాయకులను పంపించేశారు. 20 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు తన ఇంటి వద్దకు వచ్చి తన అంతు తేలుస్తామంటూ బెదిరించారని అంబటి రాంబాబు సోమవారం రాత్రి గుంటూరు పట్టాభిపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తనను భయపెట్టడంతోపాటు తన చిత్రపటానికి చీర, రవిక, పసుపుకుంకుమలు ఇచ్చి అవమానించారని పేర్కొన్నారు. వ్యక్తిగతంగా దూషించి బెదిరించటంపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో కోరారు.

పిండ ప్రదానాన్ని అడ్డుకుని వైఎస్సార్‌సీపీ వారిపై దాడి

బాపట్ల జిల్లాలో టీడీపీ నేతల దుర్మార్గం

కర్లపాలెం: మృతి చెందిన వ్యక్తి పిండ ప్రదాన కార్యక్రమాన్ని అడ్డుకున్న టీడీపీ శ్రేణులను ప్రశ్నించినందుకు.. విచక్షణారహితంగా దాడి చేయడంతో ఓ వైఎస్సార్ సీపీ కార్యకర్త తీవ్రంగా గాయపడిన ఘటన బాపట్ల జిల్లాలో సోమవారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. పెదగొల్లపాలెం గ్రామంలో ఇటీవల వైఎస్సార్ సీపీకి చెందిన యల్లావుల శ్రీనివాసరావు మృతి చెందారు. ఈ నేపథ్యంలో అతని కుటుంబ సభ్యులు సోమవారం పెద్దకర్మ నిర్వహిస్తూ గ్రామ సమీపంలోని కాలువ కట్టపై పిండ ప్రదానం చేసేందుకు వెళ్తున్నారు. అదే గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు కాలువ కట్టపై పిండ ప్రదానం చేయడానికి వీలు లేదని.. గతంలో ఉన్న పిండాల దిబ్బ వద్ద చేయాలని గొడవకు దిగారు. పిండాల దిబ్బ వద్ద శ్రీ కృష్ణుడి ఆలయం నిర్మాణంలో ఉన్నందున కాలువకు వెళ్తున్నామని శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు చెప్పారు. దీంతో ఘర్షణకు దిగిన టీడీపీకి చెందిన పమిడి గోపి, పమిడి శ్రీనివాసరావు, పమిడి కృష్ణ, హనుమంతు, పమిడి గోపి వైఎస్సార్ సీపీ వర్గీయులపై దాడి చేశారు. ఘటనలో వైఎస్సార్ సీపీకి చెందిన యల్లావుల ఏడుకొండలు తీవ్రంగా గాయపడ్డారు. యల్లావుల ఏడుకొండలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని కర్లపాలెం ఇన్‌చార్జి ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు.

రెచ్చిపోయిన టీడీపీ శ్రేణులు



ఫెన్సింగ్ రాళ్లు పగలగొడుతున్న టీడీపీ కార్యకర్తలు

చిల్లకూరు: తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం ముత్యాలపాడులో రెచ్చిపోయిన టీడీపీ శ్రేణులు వైఎస్సార్‌సీపీ నాయకుడిపైన, సానుభూతిపరులపైన దౌర్జన్యానికి దిగారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కట్టా రామిరెడ్డి ఇంటిపై దాడిచేసి.. ఇంటిచుట్టూ గల ఫెన్సింగ్‌ను ధ్వంసం చేశారు. వారి ఆగడాలను తన సెల్‌ఫోన్‌లో వీడియో తీసేందుకు ప్రయత్నించగా లాక్కొని పగులగొట్టారు. సమీపంలోని వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఇళ్లపైనా దాడులకు తెగబడ్డారు. బాధితులు నారపరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మధురెడ్డి, సతీష్‌రెడ్డి, వంశీరెడ్డి, మనోహర్‌రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ గ్రామానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.



గోపువానిపాలెంలో ధ్వంసం చేసిన వైఎస్సార్ విగ్రహం



నంద్యాల మండలం రాయమల్పురంలో టీడీపీ నాయకులు ధ్వంసం చేసిన అభివృద్ధి శిలాఫలకాలు



కూరాడ సచివాలయంపై ఉన్న వైఎస్సార్, వైఎస్ జగన్ చిత్రాలను గునపంతో పగలకొడుతున్న జనసేన కార్యకర్త

విగ్రహాలపై అక్కసు

- రెచ్చిపోయి వ్యవహరిస్తున్న టీడీపీ, జనసేన శ్రేణులు
- గోపువానిపాలెంలో వైఎస్సార్ విగ్రహం ధ్వంసం
- పలుచోట్ల శిలాఫలకాల తొలగింపు



కందులూరులో సచివాలయానికి ఉన్న జగన్ ఫొటోలను తొలగించి చంద్రబాబు ఫొటోలు అతికించిన టీడీపీ శ్రేణులు



చింతలపట్టెడలో టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేసిన శిలాఫలకం

సాక్షి నెట్‌వర్క్ : ఎన్నికల ఫలితాల అనంతరం టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తల విధ్వంసకర ప్రవర్తన కొనసాగుతోంది. కర్రలు, రాళ్లు, రాడ్లతో వీరంగం చేస్తున్నారు. విగ్రహాలను, శిలాఫలకాలను ధ్వంసం చేస్తున్నారు. వీరు యథేచ్ఛగా దౌర్జన్యాలకు పాల్పడుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. టీడీపీ, జనసేన పార్టీల తీరుపై ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. కృష్ణాజిల్లా పమిడిముక్కల మండలం గోపువానిపాలెం గ్రామంలో ప్రధాన రహదారి పక్కన ఆంజనేయస్వామి ఆలయం ఎదుట ఉన్న మహానేత వైఎస్సార్ విగ్రహాన్ని ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. రెండేళ్ల కిందట అన్ని అనుమతులు తీసుకుని ఏర్పాటుచేసిన ఈ విగ్రహాన్ని అప్పటి ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ విగ్రహం తలభాగాన్ని దుండగులు ధ్వంసం చేశారు. ఈ విషయమై మాజీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ సూచన మేరకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు కనగాల హరిబాబు పార్టీ మండల పార్టీ నాయకులతో కలిసి సోమవారం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని, ఆంజనేయస్వామి దేవస్థానంలోని సీసీ కెమెరాలను పరిశీలించి దుండగుల ఆచూకీ తెలుసుకోవాలని కోరారు. మండలంలోని కపిలేశ్వరపురం, వీరంకిలాకు, పమిడిముక్కల, ఐనపూరు గ్రామాల్లోని వైఎస్సార్ విగ్రహాలకు రక్షణ కల్పించాలని, దాడులను అరికట్టాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు యలమంచిలి గణేష్ పార్టీ నాయకులతో కలిసి స్టేషన్‌లో వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, ఎంపీటీసీ సభ్యుడు గుర్విందపల్లి వంశీ, కోఆప్షన్ సభ్యుడు దియానత్‌అలీ, మాజీ ఎంపీపీ కొంతి వెంకటేశ్వరరావు, సర్పంచ్ కోట మణిరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కినేని సతీష్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

శిలాఫలకాలపై గునపాలతో దాడి

కాకినాడ జిల్లా కరప మండలం కూరాడ గ్రామ సచివాలయంపై ఉన్న దివంగత నేత వైఎస్సార్, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు చిత్రాలను సోమవారం జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు గునపాలతో పగులకొట్టి తొలగించారు. గత ఏడాది ఈ సచివాలయం నిర్మించి, ఇరువైపులా వైఎస్సార్, జగన్, కన్నబాబు ముఖ చిత్రాలను సిమెంట్‌తో చెక్కించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాకినాడ రూరల్ ఎమ్మెల్యేగా జనసేన అభ్యర్థి పంతం నానాజీ గెలుపొందారు. ఈ నేపథ్యంలో కూరాడలో జనసేన నాయకులు, కార్యకర్తలు గ్రామ సచివాలయంపై ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకుల చిత్రాలను, గ్రామంలో అభివృద్ధి పనుల శిలాఫలకాలను కూడా తొలగించారు. నంద్యాల మండలం రాయమాల్పురం గ్రామంలో అభివృద్ధి శిలాఫలకాలను సోమవారం టీడీపీ నేతలు ధ్వంసం చేశారు. 20 రోజుల కిందట కురిసిన వర్షాలకు గతంలో టీడీపీ నేతలు అభివృద్ధి పనుల సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకం కింద పడిపోయింది. అయితే ఇది వైఎస్సార్‌సీపీ వర్గీయుల పని అని టీడీపీ నేతలు అనుమానించారు. ఈ నేపథ్యంలో వారు సోమవారం గ్రామ సచివాలయం వద్ద ఉన్న శిలాఫలకం, రహదారి పక్కనున్న శిలాఫలకాలను ధ్వంసం చేశారు. వీటిపై పంచాయతీ కార్యదర్శి విశ్వనాథరెడ్డి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం కందులూరు గ్రామంలో రైతుభరోసా కేంద్రం, సచివాలయాలపై ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలను సోమవారం టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. అనంతరం సీఎంగా ప్రమాణ స్వీకారం చేయకముందే చంద్రబాబునాయుడు, ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే స్వామి ఉన్న ఫ్లెక్సీలను రైతుభరోసా కేంద్రం, సచివాలయాలపై అంటించి కవ్వింపు చర్యలకు దిగారు. చిత్తూరు జిల్లా నగరి మున్సిపాలిటీని చింతలపట్టెడలో నూతనంగా నిర్మించిన సెంగుంధ మొదలియార్ కమ్యూనిటీ హాలు వద్ద వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆర్కే రోజా పేరిట ఉన్న శిలాఫలకాన్ని టీడీపీ నాయకులు ఆదివారం రాత్రి ధ్వంసం చేశారు. సోమవారం ఉదయం మండపం వద్ద శిలాఫలకం ధ్వంసం కావడాన్ని గమనించిన మున్సిపల్ చైర్మన్ పి.జి.నీలమేఘం, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బి.ఆర్.వి.అయ్యప్పన్, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు సీఐ సురేష్‌కు ఫిర్యాదు చేశారు. ఇలాంటి సంస్కృతి ఇప్పటివరకు నగరిలో లేదని తెలిపారు. దీన్ని కట్టడి చేయాలని కోరారు. అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం కురువల్లిలో సోమవారం టీడీపీ కార్యకర్తలు వీరంగం చేశారు. గ్రామ సచివాలయం, అంగన్‌వాడీ భవనాల వద్ద శిలాఫలకాలను ధ్వంసం చేశారు. ఈ విషయంపై ఎస్ఐ శ్రీనివాసులకు ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ జయరామ్‌రెడ్డి తెలిపారు.

ఉపసర్పంచ్ ఇంటిపై దాడి, కారు ధ్వంసం

తిరుపతి మంగళంలోని సప్తగిరినగర్‌లో టీడీపీ నేతల వీరంగం



అశోక్ రెడ్డి కారుపై కర్రలతో దాడి చేస్తున్న టీడీపీ నాయకులు

తిరుపతి మంగళం: తిరుపతి మంగళంలోని సప్తగిరినగర్ పంచాయతీలో ఉపసర్పంచి, వైఎస్సార్‌సీపీ పంచాయతీ ఇన్‌చార్జ్ అశోక్‌రెడ్డి ఇంటిమీద సోమవారం టీడీపీ నేతలు ప్రసాద్‌రెడ్డి, పురుషోత్తమరెడ్డి రాళ్లు, కర్రలతో దాడిచేశారు. ఇంటిపైకి రాళ్లు విసిరారు. కారును ధ్వంసం చేశారు. ఈ విషయం తెలుసుకున్న చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వెళ్లి టీడీపీ నేతల విధ్వంసాన్ని పరిశీలించారు. అశోక్‌రెడ్డిని పరామర్శించి ధైర్యం చెప్పారు.

ధైర్యంగా ఉండండి.. అండగా ఉంటాం

- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు దంపతుల భరోసా
- టీడీపీ, జనసేన కార్యకర్తలు ఉన్మాదంతో దాడులు చేస్తున్నారు
- దాడులు ఆపి ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న తెల్లం బాలరాజు, రాజ్యలక్ష్మి

బుట్టాయగూడెం: ఎన్నికల ఫలితాల అనంతరం టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఉన్మాదంతో వ్యవహరిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి చెప్పారు. ఆ ఉన్మాదంలోనే వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులకు తెగబడుతున్నారని అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడవద్దని, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. త్వరలోనే తాము నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పర్యటించి నాయకులను కలుస్తామని చెప్పారు. బాలరాజు దంపతులు సోమవారం ఏలూరు జిల్లా దుద్దుకూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. టీడీపీ, జనసేన విజయం తర్వాత రాష్ట్రమంతటా భయానక పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. ఆ పార్టీల వారు ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తున్నారని, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకుల మీద, వారి ఇళ్ల మీద దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి సంస్కృతి మంచిది కాదన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఎప్పుడూ ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడలేదని తెలిపారు. వైఎస్సార్‌సీపీ వేలేరుపాడు మండల నాయకులు కామినేని వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ శ్రీనివాసగౌడ్‌ల ఇళ్లపై టీడీపీ, జనసేన కార్యకర్తలు దాడి చేసి, ఆస్తులను ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. జనసేన, టీడీపీ చేస్తున్న దాడులపై పోలీసులు కనీసం స్పందించకపోవడం బాధాకరమన్నారు. పలుచోట్ల పోలీసుల ఎదురుగానే దాడులు జరుగుతున్నా పట్టించుకోవడంలేదన్నారు. ఇప్పటికైనా టీడీపీ, జనసేన దాడులను ఆపాలని, పాలనపై దృష్టి పెట్టి, ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కూటమిలో జనసేన పరిస్థితి కూరలో కరివేపాకులానే ఉంటుందని చెప్పారు.

ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దాష్టీకాలు మొదలు

- పార్టీ మారాలని నెల్లూరు మేయర్ దంపతులకు బెదిరింపులు
- లేకుంటే ఇబ్బందులు తప్పవని హెచ్చరికలు
- భయంతో వైఎస్సార్‌సీపీకి మేయర్ దంపతుల రాజీనామా



మాట్లాడుతున్న మేయర్ స్రవంతి, జయవర్ధన్

నెల్లూరు (బారకాసు): ఎన్నికలు ముగియగానే నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దాష్టీకాలు ప్రారంభమయ్యాయి. నెల్లూరు మేయర్ దంపతులను బెదిరించి రాజకీయ అరాచకానికి తెరతీశారు. గిరిజన మహిళ రిజర్వేషన్‌తో వైఎస్సార్‌సీపీ నుంచి మేయర్‌గా ఎన్నికైన పోట్లూరి స్రవంతి, ఆమె భర్త జయవర్ధన్‌లను పార్టీ మారాలని, లేదంటే కేసుల్లో ఇరికిస్తామని బెదిరించారు. నిస్సహాయ స్థితిలో ఆ గిరిజన దంపతులు వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. వైఎస్సార్‌సీపీ నుంచి గెలిచిన కార్పొరేటర్లు, నేతలను టీడీపీలో చేరాలంటూ ఎన్నికలకు ముందు నుంచే శ్రీధర్‌రెడ్డి బెదిరింపులకు దిగారు. కొందరిపై రాజకీయంగానూ కేసులు పెట్టించారు. ఇప్పుడు అధికార పార్టీలో ఉండటంతో మరింతగా బెదిరింపులకు దిగుతున్నారు. రెండున్నరేళ్ల క్రితం జరిగిన నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల్లో 12వ డివిజన్ నుంచి పోట్లూరి స్రవంతి వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేసి కార్పొరేటర్‌గా గెలుపొందారు. ఈ డివిజన్ నెల్లూరు రూరల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఉండటంతో స్రవంతి దంపతులు అప్పట్లో వైఎస్సార్‌సీపీలోనే ఉన్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అనుచరులుగా కొనసాగేవారు. అప్పటి మంత్రి పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్ సహకారంతో స్రవంతి మేయర్‌గా ఎన్నికయ్యారు. 9 నెలల క్రితం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆ సమయంలో మేయర్ స్రవంతి దంపతులు, కొందరు కార్పొరేటర్లు ఆయన వెంట వెళ్లారు. కొద్దిరోజుల్లోనే స్రవంతి దంపతులు తిరిగి వైఎస్సార్‌సీపీ గూటికి చేరారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి టీడీపీ టిక్కెట్‌పై గెలుపొందారు.

జరిగిందిదీ..

నెల్లూరు నగరంలో దాదాపు 70 భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ లేకుండానే తనఖా చేసిన ఆస్తులను మాన్యువల్‌గా కమిషనర్ ఫోర్జరీ సంతకాలతో రిలీజ్ ఆర్డర్లు ఇచ్చారని, దీనివల్ల ప్రభుత్వానికి రూ.కోట్లు నష్టం వచ్చిందంటూ ఓ న్యాయవాది నగర పాలక సంస్థ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో మేయర్ భర్త జయవర్ధన్ పాత్ర ప్రధానంగా ఉన్నట్లు ఆరోపించారు. దీంతో ఈ వ్యవహారంపై కమిషనర్ విచారణకు ఆదేశించారు. గతంలో తన వెంట ఉండి, వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతున్న మేయర్ దంపతులను తన దారికి తెచ్చుకునేందుకు, వారిపై పెత్తనం సాగించేందుకు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఈ 'ఫోర్జరీ' ఫిర్యాదును ఆయుధంగా ఉపయోగించుకున్నారు. టీడీపీలో చేరితే కేసులు ఉండవని, లేదంటే జైలుకు పంపిస్తామని బెదిరించారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడంతో భయపడిన ఆ గిరిజన దంపతులు నిస్సహాయ స్థితిలో వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రకటించారు.

వైఎస్సార్‌సీపీ నేతపై టీడీపీ కార్యకర్తల దాడి

- వైఎస్సార్‌సీపీ బూత్ కన్వీనర్ అప్పలనాయుడు ఆవుల షెడ్ పైకి తారాజువ్వలు వదిలిన టీడీపీ శ్రేణులు
- దూరంగా కాల్చాలని చెప్పడంతో అప్పలనాయుడిపై కర్రలతో దాడి
- అడ్డుకున్న ఆయన కుటుంబ సభ్యులపైనా దాడి
- అనకాపల్లి జిల్లా ఎరకన్నపాలెంలో ఘటన



చికిత్స పొందుతున్న అప్పలనాయుడు

సాక్షి, అనకాపల్లి: అధికారం అండ చూసుకుని టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై దాడులకు తెగబడుతున్నారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపుపాలెం మండలం రాశిపల్లి శివారు ఎరకన్నపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ బూత్ కన్వీనర్ కొల్లి అప్పలనాయుడుపై కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఆదివారం రాత్రి ఎరకన్నపాలెంలో టీడీపీ విజయోత్సవ ర్యాలీ చేశారు. గ్రామ శివారులో ఉన్న వైఎస్సార్‌సీపీ బూత్ కన్వీనర్ అప్పలనాయుడు ఇంటిపై బాణా సంచా కాల్చారు. దీంతో అప్పలనాయుడు ఇంటి సమీపంలోనే ఉన్న పశువులు బెదిరాయి. పశువులు బెదురుతున్నాయని, పక్కనే గడ్డి వాము కూడా ఉందని, బాణాసంచా కాసింత దూరంలో కాల్చుకోవాలని అప్పలనాయుడు వారిని కోరాడు. వెంటనే టీడీపీ కార్యకర్తలు ఆయనపై కర్రలతో దాడి చేశారు. దాడిని అడ్డుకునేందుకు వెళ్లిన ఆయన తమ్ముడు రామారావు, తల్లి సత్యవతి, తండ్రి అప్పారావును కూడా కర్రలతో కొట్టారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పలనాయుడుకు తలపై తీవ్రమైన గాయం కావడంతో గాజువాక కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిలో, ఆయన తల్లి సత్యవతి, తమ్ముడు రామారావు ఇద్దరూ నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

ప్రణాళిక ప్రకారమే దాడి

అప్పలనాయుడిపై ప్రణాళిక ప్రకారమే దాడి జరిగిందని గ్రామస్తులు తెలిపారు. ఆయన ఇంటి వద్దకు టీడీపీ ర్యాలీ వచ్చిన వెంటనే కరెంటు పోయిందని, అప్పలనాయుడిపై దాడి జరిగిన కొన్ని నిమిషాల్లో కరెంట్ వచ్చిందని, ముందస్తుగానే కరెంటు తీసేసి దాడికి పాల్పడ్డారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దాడికి పాల్పడిన వారే ముందుగా పోలీసు స్టేషన్‌కు వెళ్లి తమపై కూడా దాడి చేశారని వెళ్లి ఫిర్యాదు చేశారు.

50 మంది టీడీపీ రౌడీలు కర్రలతో దాడి

టీడీపీ గూండాలు ఉద్దేశపూర్వకంగానే అప్పలనాయుడు ఆవుల షెడ్‌పైకి తారాయి జువ్వలు వేశారు. దూరంగా కాల్చుకోవాలని చెప్పిన అప్పలనాయుడుపై 50 మందికి పైగా టీడీపీ గూండాలు కర్రలతో దాడి చేశారు. ఆయన తల పగిలేలా కొట్టారు. అప్పలనాయుడును నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా, వైద్యుల సూచన మేరకు రాత్రి 12 గంటల సమయంలో విశాఖలోని కిమ్స్ ఐకాన్ ఆసుపత్రికి తీసుకెళ్లాం. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పారు. పోలీసు స్టేషన్‌లో 8 మందిపై కేసు నమోదు చేశారు.

– భద్రాచలం, జెడ్పీటీసీ, మాకవరపుపాలెం మండలం

వైఎస్సార్‌సీపీ ఓటమిని జీర్ణించుకోలేక ఆగిన అభిమాని గుండె

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఘటన



సయ్యద్ అబ్దుల్ రెహమాన్(ఫైల్)

కలువాయి (శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా): ఇటీవలి ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమిని జీర్ణించుకోలేక ఆ పార్టీ కార్యకర్త కలువాయికి చెందిన సయ్యద్ అబ్దుల్ రెహమాన్(60) ఆదివారం సాయంత్రం గుండెపోటుకు గురై మృతిచెందారు. వైఎస్ జగన్‌కు రెహమాన్ వీరాభిమాని. కలువాయితోపాటు నియోజకవర్గంలో జరిగే ప్రతి పార్టీ కార్యక్రమాలకు ఆయన క్రమం తప్పకుండా హాజరయ్యేవారు. వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ద్వారా ఆయన కుటుంబం కూడా లబ్ధి పొందింది. పేదల కోసం ఇన్ని పథకాలు ప్రవేశపెట్టిన వైఎస్ జగన్ గెలిచి మళ్లీ సీఎం అవుతాడని ఆయన పూర్తి నమ్మకంతో ఉన్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చి పార్టీ ఓటమి పాలైందని తెలిసినప్పటి నుంచి మానసిక వేదన అనుభవించేవారని ఆయన సతీమణి దిల్‌షాద్ తెలిపారు. ఆదివారం సాయంత్రం కూడా టీవీలో ఎన్నికల వార్తలు చూస్తూ ఒక్కసారిగా గుండెపోటుకు గురై కుప్పకూలారని తెలిపారు. వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్లగా, అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కలువాయి జెడ్పీటీసీ సభ్యులు బి.అనిల్‌కుమార్ రెడ్డి, పలువురు పార్టీ నాయకులు రెహమాన్ భౌతిక కాయం వద్ద నివాళులు అర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

అమానవీయం.. అరాచకం..

- టీడీపీ నేతల తీరు పట్ల సర్వత్రా నిరసన
- బొప్పూడి గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త రాజ్‌కుమార్ కిడ్నాప్
- ఆపై 12 గంటలు నిర్బంధించి చిత్రహింసలు
- లోకేశ్ ఫ్లెక్సీ ఎదుట మోకాళ్లపై కూర్చోబెట్టి క్షమాపణలు చెప్పించారు
- ఆ తర్వాత బోయపాలెం హైవే పక్కన తోసేసిన టీడీపీ నాయకులు
- పోలీసులకు బాధితుడి కుటుంబ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నేతల ఫిర్యాదు



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బాధితులు, వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ ప్రతినిధులు

చిలకలూరిపేట టౌన్ : టీడీపీ నేత నారా లోకేశ్ ఫొటో ఉన్న ఫ్లెక్సీ వద్ద వైఎస్సార్‌సీపీ కార్యకర్తను అర్ధ నగ్నంగా మోకాళ్లపై కూర్చోబెట్టి క్షమాపణలు చెప్పించిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. ఈ ఘటనపై సోమవారం 'సాక్షి'లో ప్రముఖంగా వార్త ప్రచురితమవ్వడం, వీడియో వైరల్ కావడంతో ప్రజల్లో చర్చనీయాంశమైంది. టీడీపీ నేతల తీరు పట్ల సర్వత్రా నిరసన వ్యక్తమైంది. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం బొప్పూడి గ్రామానికి చెందిన కర్పూరపు కృష్ణవేణి, గుంటూరు జిల్లా పొన్నూరు మండలం జూపూడి గ్రామానికి చెందిన పాలేటి రాజ్‌కుమార్‌లకు 2010లో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. బయోమెడికల్ ఇంజినీరింగ్ పనులు నిర్వహించే రాజ్‌కుమార్ వివాహం అయిన తర్వాత వృత్తి రీత్యా మంగళగిరి నియోజకవర్గం పెదవడ్లపూడిలో నివాసం ఉంటున్నారు. కృష్ణవేణి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మంగళగిరి నియోజకవర్గంలో పార్టీ తరఫున గట్టిగా పని చేశారు. ఎన్నికల అనంతరం రాజ్‌కుమార్ కుటుంబం తమ అత్తగారి ఊరు అయిన చిలకలూరిపేట మండలం బొప్పూడికి వచ్చింది. ఎన్నికల్లో టీడీపీకి వ్యతిరేకంగా పనిచేశారని కక్ష పెంచుకున్న మంగళగిరి టీడీపీ నాయకుడు జవ్వాది కిరణ్‌చంద్ ఐదు కార్లలో తన అనుచరులు నరేంద్ర, షేక్ బాజీ, జానీ, జానీ సోదరుడితో పాటు మరికొందరు ఈ నెల 9వ తేదీ సాయంత్రం 4.30 గంటలకు బొప్పూడి గ్రామానికి వచ్చారు. రాజ్‌కుమార్ ఉన్న ఇంట్లోకి దౌర్జన్యంగా జొరబడ్డారు. ఇంట్లో వస్తువుల్ని ధ్వంసం చేశారు. రాజ్‌కుమార్ భార్యతో పాటు అత్త అనురాధ, బావమరిది భార్య విజయలక్ష్మిపై దాడి చేశారు. అనంతరం రాజ్‌కుమార్‌ను బలవంతంగా ఒక కారులో ఎక్కించుకుని వెళ్లిపోయారు. 12 గంటలపాటు నిర్బంధించి, చితకబాది లోకేశ్ ఫ్లెక్సీ వద్ద మోకాళ్లపై కూర్చోబెట్టి అతనితో క్షమాపణ చెప్పించారు. అనంతరం సోమవారం ఉదయం 10 గంటలకు యడ్లపాడు మండలం బోయపాలెం హైవే వద్ద కారు నుంచి కిందకు తోసేసి వెళ్లారు. కొద్ది సేపటికి స్పృహ వచ్చాక రాజ్‌కుమార్.. స్థానికుల ద్వారా సమీప బంధువైన తుళ్లూరు శేఖర్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన బైక్‌పై వచ్చి చిలకలూరిపేట బస్టాండ్ వద్దకు చేర్చాడు. విషయం తెలుసుకున్న భార్య కృష్ణవేణి, బంధువులు, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ప్రతినిధులతో కలిసి సోమవారం సాయంత్రం చిలకలూరిపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడిని ఆస్పత్రికి తరలించారు. వైఎస్సార్‌సీపీ నేత దొంతిరెడ్డి వేమారెడ్డి బాధితుడిని పరామర్శించారు. టీడీపీ శ్రేణుల దౌర్జన్యాలు, భౌతిక దాడుల్ని సహించేది లేదన్నారు. టీడీపీ దాడుల్లో నష్టపోయిన వారికి అండగా నిలుస్తామన్నారు. ఈ ఘటనపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

లోకేశ్ అనుచరులు నా ఇంటిని కూల్చేశారు..

వడ్డెర సంఘం నేత కుంచాల కిషోర్



కూల్చివేసిన కుంచాల కిషోర్ ఇల్లు

తాడేపల్లిరూరల్: మంగళగిరి ఎమ్మెల్యే లోకేశ్ పేరు చెప్పి స్థానిక నాయకులు రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని వడ్డెర సంఘం నాయకుడు కుంచాల కిషోర్ ఆరోపించారు. తాడేపల్లి ప్రెస్ క్లబ్‌లో సోమవారం బీసీ నాయకులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. 2014–2019లో టీడీపీ అధికారంలో ఉండగా మంగళగిరి నియోజకవర్గ నేత పోతినేని శ్రీనివాసరావు తమ తాత పెద్దిరాజుల లక్ష్మీనారాయణ వద్ద 1960లో సర్వే నం.142లో 34 సెంట్లు, 143 సర్వే నంబర్‌లో ఎకరం 20 సెంట్లు భూమిని కొనుగోలు చేసినట్టు తెలిపారు. ఇందులో తమ తాత కుంచాల వెంకటేశ్వర్లు.. చింతకింది సూర్యనారాయణకు సర్వే నం.143లో 46 సెంట్ల భూమిని అమ్మినట్టు చెప్పారు. మిగిలిన భూమి తమ నాన్న వెంకటరత్నంకు, తమ నాన్న వద్ద నుంచి తమ అమ్మ కుంచాల మంగేశ్వరికి వచ్చినట్టు చెప్పారు. మంగళగిరి నియోజకవర్గ టీడీపీ నాయకులు తమ స్థలాన్ని ఆక్రమించేందుకు దొంగ డాక్యుమెంట్లు పుట్టించడంతో టీడీపీ అధికారంలో ఉండగానే తమ భూమి డాక్యుమెంట్లు అధికారులు తమకు అందించినట్టు తెలిపారు. అప్పటి నుంచి పోతినేని శ్రీనివాసరావు ఎలాగైనా తమ భూమిని ఆక్రమించాలని ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారని చెప్పారు. ఎన్నికలకు ముందు సర్వే నం.142లో 70 గజాల్లో ఇంటి నిర్మాణ పనులు చేపట్టానని, అనుమతి తీసుకోలేదన్న వంకతో అధికారులను బెదిరించి పోతినేని తన ఇంటిని కూల్చి వేయించారని ఆరోపించారు. కాగా, నియోజకవర్గంలో ఎలాంటి అనుమతి లేకుండా ఇళ్లు నిర్మించుకోవచ్చని, చివరకు కట్టలు, చెరువుల్లో ఉన్నా రెగ్యులరైజ్ చేస్తానని లోకేశ్ హామీ ఇచ్చారని, అయితే దానికి విరుద్ధంగా కక్ష సాధింపుల్లో భాగంగా తన ఇంటిని కూల్చి వేశారని తెలిపారు. 90 శాతం నిర్మాణం పూర్తయిన ఇంటిని కూల్చి వేసేందుకు అధికారులు సెలవు దినాల్లో కూడా పనిచేశారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో బీసీ నాయకులు ఆంజనేయులు, వేముల వెంకటేష్, నక్కా నాగరాజు, వంటిపల్లి సుధాకర్, నక్కా దుర్గారావు, చుక్కా భాగ్యరాజు, నరసింహారావు, పచ్చల శ్యామ్‌బాబు, మంగేశ్వరి పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
చెన్నై
మంగళవారం ॥ 11-6-2024


నిస్సీ లియోన్

కుటుంబంలో ఆడపిల్లను ఒక మైనస్‌గా భావించిన సమాజం నుంచి ఆడ, మగ అనే తేడా లేకుండా ఉన్నంతలో తమ పిల్లల్ని గొప్పగా చదివించాలనే సంకల్పం దిగువ మధ్యతరగతి కుటుంబాల్లోనూ మొదలైంది. అలాంటి కుటుంబంలో పుట్టిన అమ్మాయే నిస్సీ లియోన్. ఆడపిల్లను చదువుకోసం పొరుగూరుకు కూడా ఒంటరిగా పంపడానికి ఇప్పటికీ భయపడుతున్న రోజుల్లో విదేశాల్లో కొలువుకి ఎంపిక అయ్యేలా ప్రోత్సహించారు నిస్సీ తల్లిదండ్రులు. చదివింది డిగ్రీ అయినా యూకేలో ఉద్యోగంలో చేరుతోంది. వార్షిక వేతనం అక్షరాలా రూ.37 లక్షలు అందుకోబోతోంది. గుంటూరు జిల్లా తెనాలి పట్టణానికి చెందిన నిస్సీ లియోన్ తన విజయావకాశం గురించి ఆనందంగా తెలియజేస్తోంది.

అనుకుంది... సాధించింది

- నిస్సీ లియోన్ సక్సెస్ స్టోరీ

‘‘బీఎస్సీ కార్డియాలజీలో డిగ్రీ పూర్తిచేశాను. యూకేలోని నేషనల్ హెల్త్ సర్వీస్‌కు చెందిన ఎన్‌హెచ్‌ఎస్ నార్తెర్న్ కేర్ అలియన్స్ నన్ను ఉద్యోగానికి ఎంపికచేసింది. ప్రపంచవ్యాప్తంగా వైద్య అనుబంధ రంగాల్లో నిష్ణాతులను, నైపుణ్యం కలిగిన వారిని ఈ సంస్థ ఎంపిక చేస్తోంది. అందులో భాగంగా ఈ ఏడాది ఇండియా నుంచి ఇద్దరు ఎంపిక కాగా వారిలో నేనూ ఒకరిగా ఉన్నందుకు ఎంతో సంతోషంగా ఉంది.

ఈ రోజుల్లో...

మాది దిగువ మధ్యతరగతి కుటుంబం. నాన్న జార్జ్, అమ్మ సునీతలు స్థానిక చర్చిలో పాస్టర్స్‌గా పని చేస్తున్నారు. తమ్ముడు చదువుకుంటున్నాడు. సేవా తత్పరతతో కూడిన ఉద్యోగం చేయాలనేది నా ఆలోచన. మా అమ్మనాన్నల సేవా గుణం నాలోనూ అలాంటి ఆలోచనలు కలగడానికి కారణం అయింది. మొదట వైద్యురాలిగా స్థిరపడాలనుకునేదాన్ని. కానీ, మా కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కావడంతో వైద్య సహాయకురాలిగా స్థిరపడాలనుకున్నాను. శ్రీకాకుళంలోని బొల్లినేని మెడీ స్కిల్స్ పారా మెడికల్ డిగ్రీ కళాశాలలో కార్డియాలజీ విభాగంలో చేరాను. పిల్లల ఉన్నతోద్యోగాల గురించి పెద్దలు తరచూ ‘వాళ్లబ్బాయి సాఫ్ట్‌వేర్ అంట, వీళ్లమ్మాయి పెద్ద ఉద్యోగం చేస్తుందంట’ అనే మాటలను వింటూనే ఉంటాం. అయితే దేశంలో కొన్ని రంగాలలో ఉన్నవారు మాత్రమే అత్యధిక వేతనాలు తీసుకుంటున్నారు. వారి విద్యార్హత, నాలెడ్జ్ చదివిన కాలేజీ, అభ్యర్థి నడవడిక, బృందంలో పనిచేసే వైఖరి.. వంటి వాటి ఆధారంగా జీతాలను నిర్ణయిస్తున్నారు. అలా కాకుండా సాంకేతిక, వృత్తి విద్యా కోర్సులు పూర్తిచేసే వారికి సైతం మంచి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు దొరుకుతున్నాయి. విదేశీ సంస్థలు అందుకు స్వాగతం పలుకుతున్నాయి అని జెమ్స్ మెడికల్ కాలేజ్ చీఫ్ మెంటార్ బొల్లినేని భాస్కరరావు, బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్. నాగేశ్వరరావు, అకడమిక్ డైరెక్టర్ పద్మజల ద్వారా తెలిసింది. అంతకు ముందు నాకు విదేశాలకు వెళ్లాలనే ఆలోచన లేదు. కానీ, వారి ప్రోత్సాహంతోనే ఈ ఘనత సాధించాను.


కుటుంబ సభ్యులతో నిస్సీ లియోన్

మా చుట్టుపక్కల వాళ్లందరూ మా అమ్మాయి గురించి గొప్పగా మాట్లాడుకుంటుంటే ఆనందంగా ఉంది. నిస్సీ తల్లిదండ్రులుగా మాకూ గుర్తింపు వచ్చింది. ఈ రోజే మా అమ్మాయి విదేశాలలో ఉద్యోగం చేయడానికి బయల్దేరింది.
– తల్లిదండ్రులు

అనస్తీషియా, కార్డియాలజీ రెండూ నాకు ఇష్టమైన సబ్జెక్టులుగా ఉండేవి. కార్డియాలజీలో పని పట్ల మరింత సంతృప్తి లభిస్తుందనిపించి ఈ సబ్జెక్ట్‌ను ఎంచుకున్నాను. మా అమ్మానాన్నలు చాలా సంతోషంగా ఉన్నారు. వైద్యవృత్తిలో రాణించాలనుకునేదాన్ని. కానీ, మా కుటుంబం ఆర్థిక పరిస్థితి గురించి ఆలోచించి. ఈ డిగ్రీ తీసుకున్నాను. నా కాలేజీ ఫీజు విద్యా దీవెనలో కవర్ అయ్యింది. ఇప్పుడు మంచి సంస్థలో ఉద్యోగం లభించింది.
– నిస్సీ లియోన్

దశల వారీగా...

నేషనల్ హెల్త్ సర్వీసుకు చెందిన ఎన్‌హెచ్ఎస్ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా వైద్య అనుబంధ రంగాల్లో నిష్ణాతులను, నైపుణ్యం కలిగిన వారిని ఎంపిక చేస్తోంది. ఇందులో ప్రవేశం అంత సులువేమీ కాదని కొద్దిరోజుల్లోనే అర్థమైంది. హైదరాబాద్ కు చెందిన ప్రకార స్వచ్ఛంద సంస్థ ద్వారా మా కాలేజీకి సమాచారం వచ్చింది. నైపుణ్యం కలిగిన బీఎస్సీ కార్డియాలజీ ఎకో గ్రాఫర్ కావాలని, అందుకు వెంటనే అప్లై చేసుకోవాలనీ మా కాలేజీ వాళ్లు చెప్పారు. దీంతో అప్లై చేసి, సికింద్రాబాద్ కిమ్స్‌లో శిక్షణ తీసుకున్నాను. కిందటేడాది జరిగిన బ్రిటిష్ సొసైటీ ఆఫ్ ఎకోకార్డియోగ్రాఫీ (బిఎస్ఇ) వారు నిర్వహించిన ట్రాన్స్ థొరాసిక్ ఎకోకార్డియోగ్రఫీ (టీటీఇ) పరీక్షతో పాటు ఇంటర్వ్యూకు హాజరయ్యాను. నిపుణులతో కూడిన కమిటీ ఇంటర్వ్యూ చేసింది. అంతకుముందు జరిగిన థియరీ పరీక్షలోనూ మంచి మార్కులు వచ్చాయి. రెండింటిలోనూ ఉత్తీర్ణత సాధించడంతో ఉద్యోగానికి ఎంపికయ్యాను. వార్షిక వేతనం ఇండియా కరెన్సీలో రూ.37 లక్షలు అని తెలిసింది. అమ్మానాన్నలు ఎంత సంతోషించారో మాటల్లో చెప్పలేను. ఒక డిగ్రీ విద్యార్థిని ఈ స్థాయిలో ప్యాకేజీకి ఎంపిక కావడం చిన్న విషయం కాదని అందరూ అంటూ ఉంటే ఎంతో ఆనందం కలుగుతోంది. వీసాకు అయ్యే మొత్తాన్ని, విమాన యాన ఖర్చులు కూడా ఆ సంస్థనే అందిస్తోంది’’ అంటూ ఆనందంగా తెలియజేసింది నిస్సీ.

– నిర్మలారెడ్డి

న్యూస్‌మేకర్

సర్పంచ్ నుంచి సెంట్రల్ మినిస్టర్ వరకూ

తాజా ఎన్.డి.ఏ. మంత్రి వర్గంలో 71 మంది ప్రమాణ స్వీకారం చేస్తే ఏడుగురే స్త్రీలు. వారిలో అందరి కంటే చిన్నది రక్ష ఖడ్సే. 37 సంవత్సరాల రక్ష భర్తను కోల్పోయాక రాజకీయాల్లోకి వచ్చింది. సింగిల్ పేరెంట్‌గా ఉంటూనే సర్పంచ్ స్థాయి నుంచి కేంద్ర మంత్రి వరకూ ఎదిగింది. మహారాష్ట్ర ఎం.పి. అయిన రక్షకి ప్రజాభిమానం మెండుగా ఉంది. ఆమె స్ఫూర్తిదాయక కథనం.


రక్ష ఖడ్సే

రాజకీయ కుటుంబంలో కోడలుగా అడుగు పెట్టిన అమ్మాయికి రాజకీయాలు ఎంత నాటకీయంగా ఉంటాయో, పదవి విషయంలోనే కాదు జీవితంలో కూడా గెలుపు ఓటములు ఎంత ఖేద మోదాలు కలిగిస్తాయో మెల్లగా తెలిసి వచ్చింది. 2024 లోక్‌సభ ఎన్నికలలో మహారాష్ట్రలోని రావెర్ స్థానం నుంచి మూడోసారి బి.జె.పి. తరఫున గెలిచి, కేంద్ర మంత్రిగా మొదటిసారి ప్రమాణం చేసిన రక్ష ఖడ్సే ఆ ఎత్తుకు చేరడానికి తీవ్ర సవాళ్లనే ఎదుర్కొంది. కాని ఓడిపోలేదు. ఆగిపోలేదు. ధైర్యం కూడగట్టుకుని చేసిన ప్రయాణమే గెలుపు తీరానికి చేర్చింది.

భర్త ఆత్మహత్యతో...

మహారాష్ట్రలోని నాసిక్‌లో కంప్యూటర్ సైన్స్ చదువుకున్న రక్ష ఖడ్సే జలగావ్‌కు చెందిన రాజకీయ కుటుంబంలో కోడలిగా వచ్చింది. ఆమె మామగారు ఏక్‌నాథ్ ఖడ్సే బి.జె.పి.లో ప్రముఖ నాయకుడు. మంత్రిగా కూడా పని చేశాడు. అతని కుమారుడు నిఖిల్‌తో రక్ష వివాహం జరిగింది. రక్షకు రాజకీయాల మీద పెద్దగా ఆసక్తి లేకపోయినా 2010లో జనం ‘కొథాలి’ అనే ఊరికి సర్పంచ్‌ను చేశారు. ఆ తర్వాత ఆమె జిల్లా పరిషత్ స్థాయి నాయకురాలైంది. కాని 2013లో జీవితం తల్లకిందులైంది. 2013 శాసనమండలి ఎన్నికలలో కేవలం 500 ఓట్ల తేడాతో ఓడిపోయినందుకు మనస్తాపం చెందిన రక్ష భర్త నిఖిల్ తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అది తెలిసి తండ్రి ఏక్‌నాథ్ తీవ్రంగా జబ్బు పడ్డాడు. ఇద్దరు చిన్న పిల్లలతో రక్ష మొత్తం కుటుంబానికే ఊతంగా నిలబడాల్సి వచ్చింది.



అత్తింటి ఆదరణతో...

భర్త చనిపోయినా అత్తింటిని రక్ష వీడలేదు. అత్తింటి వారు ముఖ్యంగా మామ గారు ఆమెను కన్న కూతురిలా ఆదరించి రాజకీయాలలో ప్రోత్సహించాడు. 2014 ఎన్నికలలో రావెర్ నుంచి బీజేపీ అభ్యర్థిగా ఆమె ఘన విజయం సాధించింది. భర్త చనిపోయిన సంవత్సరానికే ఇద్దరు చిన్న పిల్లలను తీసుకుని ఆమె సాగించిన ప్రచారం ఆ రోజుల్లో పెద్ద ఆసక్తిని రేపింది. జనం ఆమెకు మద్దతుగా నిలిచి గెలిపించారు. ఐదేళ్ల కాలంలో వ్యవసాయం, విద్యావ్యవస్థ కోసం రక్ష చేసిన కృషి జనానికి నచ్చడంతో 2019లో కూడా రావెర్ నుంచి ఎం.పి.గా ఘనంగా గెలిపించారు.

ప్రత్యర్థిగా మామగారు

రక్ష మామగారైన ఏక్‌నాథ్‌కు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో వచ్చిన విభేదాలు బి.జె.పి.ని వీడేలా చేశాయి. ఆయన ఎన్‌సిపి (శరద్‌పవార్) వర్గంలో చేరి ఎం.ఎల్.సి. అయ్యాడు. కాని రక్ష బి.జె.పి.లోనే కొనసాగింది. 2024 ఎన్నికలలో రావెర్ నుంచి రక్ష నిలబడుతున్నప్పుడు శరద్ పవార్ వర్గం ఏక్‌నాథ్‌ను ప్రత్యర్థిగా నిలపాలనుకున్నాయి. కాని కోడలి విజయం కోరిన ఏక్‌నాథ్ తాను పోటీలో నిలవనని దూరంగా ఉండిపోయాడు. దాంతో ఎన్.సి.పి. అభ్యర్థి శ్రీరామ్ పాటిల్ పై రక్షా ఖడ్సే రెండు లక్షల డెబ్బయి వేల మెజారిటీతో గెలిచింది.

పిల్లల కోసం...

పిల్లలను ముంబైలో చదివిస్తున్న రక్షా ఖడ్సే ప్రతి శని, ఆదివారాలు వారి దగ్గరకు వెళ్లి సమయం గడుపుతుంది. ‘పిల్లలను ముంబైలో ఉంటున్న మా ఆడపడుచులు బాగా చూసుకుంటారు. కాబట్టి నాకు టెన్షన్ లేదు. ప్రజలకు మేలు చేయాలన్నదే నా లక్ష్యం. మా ప్రాంతంలో ఇంకా సాగునీటి వసతి చాలా చోట్ల లేదు. దేశానికి అవసరమైన అరటిలో 35 శాతం మా దగ్గరే పండుతుంది. వ్యవసాయాన్ని ఇంకా వృద్ధి చేయడంలో నేను కృషి చేస్తాను. కేంద్ర మంత్రిగా ఇప్పుడు నా బాధ్యత పెరిగింది. ఏ శాఖ ఇచ్చినా సమర్థంగా పని చేసి నిరూపించుకుంటాను’ అని తెలిపింది రక్షా ఖడ్సే.

బయోచార్ కంపోస్టు... నిజంగా బంగారమే!

- వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకునే క్రమంలో ఇటీవల అందుబాటులోకి వస్తున్న ఒక పద్ధతి ‘బయోచార్’ వినియోగం. దీన్నే మామూలు మాటల్లో ‘కట్టె బొగ్గు’ అనొచ్చు. పంట వ్యర్థాలతో రైతులే స్వయంగా దీన్ని తయారు చేసుకొని పొలాల్లో వేసుకోవచ్చు.
- బయోచార్ ఎరువు కాదు.. పంటలకు వేసే రసాయనిక ఎరువులు గానీ, సేంద్రియ ఎరువులు గానీ కనీసం 30-40% ఎక్కువ ఉపయోగపడేందుకు బయోచార్ ఉపయోగపడుతుంది అంటున్నారు స్వతంత్ర శాస్త్రవేత్త డాక్టర్ నక్కా సాయిభాస్కర్‌రెడ్డి.
- మట్టిలో పేరుకుపోయిన రసాయనిక అవశేషాలను తొలగించడానికి, వరిసాగులో మిథేన్ వాయువు కాలుష్యాన్ని తగ్గించడానికి బయోచార్ తోడ్పడుతుంది.
- ఒక్కసారి వేస్తే వందల ఏళ్లు నేలలో ఉండి మేలు చేస్తుంది.. సీజనల్ పంటలకైనా, పండ్ల తోటలకైనా బయోచార్ నిజంగా బంగారమే అంటున్న డాక్టర్ సాయి భాస్కర్ రెడ్డితో ‘సాక్షి సాగుబడి’ ముఖాముఖి.


బయోచార్ కంపోస్టు

బయోచార్.. ఈ పేరు చెప్పగానే ప్రముఖ స్వతంత్ర శాస్త్రవేత్త డాక్టర్ నక్కా సాయిభాస్కర్‌రెడ్డి(55) పేరు చప్పున గుర్తొస్తుంది. 20 ఏళ్ల క్రితం నుంచి ‘బయోచార్’ అనే పేరును ఖరారు చేసి.. వ్యవసాయకంగా, పర్యావరణపరంగా దీని ప్రయోజనాల గురించి దేశ విదేశాల్లో విస్తృతంగా పరిశోధనలు, క్షేత్ర ప్రయోగాలు చేస్తూ ఇప్పటికి 5 పుస్తకాలను వెలువరించారు. వెబ్‌సైట్ ద్వారా ఈ ఓపెన్ సోర్స్ పుస్తకాలను అందుబాటులో ఉంచారు. యూట్యూబ్ ఛానల్ ద్వారా ప్రసంగాలను అందుబాటులోకి తెస్తున్నారు. ఆయనతో ఇంటర్వ్యూలో ముఖ్యాంశాలు..

■ బయోచార్ (కట్టె బొగ్గు) అంటే..?

వ్యవసాయ వర్గాల్లో ఈ మధ్య తరచూ వినవస్తున్న మాట బయోచార్. బయో అంటే జీవం.. చార్ (చార్ కోల్) అంటే బొగ్గు. బయోచార్ అంటే ‘జీవం ఉన్న బొగ్గు’ అని చెప్పొచ్చు. భూసారానికి ముఖ్యమైనది సేంద్రియ కర్బనం. ఇది మట్టిలో స్థిరంగా ఉండదు. అంటే ఇది అస్థిర కర్బనం (ఒలేటైల్ కార్బన్). దీన్ని పెంపొందించుకోవటానికి ఫిక్స్‌డ్ కార్బన్ ఉపయోగపడుతుంది. అదే బయోచార్.

■ బయోచార్ కోసం కట్టెలు కాలబెట్టడం వల్ల అడవులకు, పర్యావరణానికి ముప్పు లేదా?

బొగ్గు నల్ల బంగారంతో సమానం. బంగారం అని ఎందుకు అన్నానంటే.. ప్రపంచంలో తయారు చేయలేనిది, డబ్బుతో కొనలేనిది మట్టి ఒక్కటే. హరిత విప్లవం పేరుతో మట్టిని మనం నాశనం/ విషతుల్యం/ నిర్జీవం చేసుకున్నాం. ఈ సమస్యలన్నిటికీ పరిష్కారం బయోచార్. అడవులను నరికి బయోచార్ తయారు చేయమని మనం చెప్పటం లేదు. పత్తి కట్టె, కంది కట్టె, వరి పొట్టు వంటి పంట వ్యర్థాలను వట్టిగానే తగులబెట్టే బదులు వాటితో బయోచార్ తయారు చేసుకోవచ్చు. పూరికే పెరిగే సర్కారు తుమ్మ వంటి కంప చెట్ల కలపతో లేదా జీడి గింజల పైపెంకులతో కూడా బయోచార్ తయారు చేసుకోవచ్చు. వరి పొట్టును బాయిలర్లలో, హోటళ్ల పొయ్యిల్లో కాల్చిన తర్వాత మిగిలే వ్యర్థాలను కూడా బయోచార్‌గా వాడుకోవచ్చు.

పరిమితంగా గాలి సోకేలా లేదా పూర్తిగా గాలి సోకకుండా ప్రత్యేక పద్ధతిలో, పెద్దగా పొగ రాకుండా, 450 నుంచి 750 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతతో కాల్చితే (ఈ ప్రక్రియనే ‘పైరోలిసిస్’ అంటారు) తయారయ్యే నల్లని కట్టె బొగ్గే బయోచార్. ఆరుబయట కట్టెను తగులబెడితే బూడిద మిగులుతుంది. ఈ పద్ధతిలో అయితే బూడిద తక్కువగా బయోచార్ ఎక్కువగా వస్తుంది. రైతు స్థాయిలో ఇనుప డ్రమ్ములో లేదా కందకం తవ్వి కూడా దీన్ని తయారు చేసుకోవచ్చు. బయోచార్ వందల ఏళ్ల పాటు మట్టిలో ఉండి మేలుచేసే సూక్ష్మజీవ రాశికి, పోషకాలకు, మొత్తంగా పర్యావరణానికి ఎంతగానో తోడ్పడుతుంది. సాగు నీటిలో విషాలను పరిహరిస్తుంది. దీనితో వ్యవసాయంలో కలిగే దీర్ఘకాలిక ప్రయోజనాలతో పోల్చితే.. దీన్ని తయారు చేసేటప్పుడు వెలువడే కొద్దిపాటి పొగ వల్ల కలిగే నష్టం చాలా తక్కువ.

■ ‘బయోచార్ కంపోస్టు’ అంటే ఏమిటి?

బయోచార్ అంటే.. పొడిగా ఉండే కట్టె బొగ్గు. దీన్ని నేరుగా పొలాల్లో వేయకూడదు. బయోచార్ కంపోస్టు తయారు చేసుకొని వేయాలి. చిటికెడు బొగ్గులో లెక్కలేనన్ని సూక్ష్మరంధ్రాలు ఉంటాయి. నేరుగా వేస్తే మట్టిలోని పోషకాలను బొగ్గు పెద్దమొత్తంలో పీల్చుకుంటుంది. అందువల్ల వట్టి బయోచార్‌ను మాత్రమే వేస్తే పంటకు పోషకాలు పూర్తిగా అందవు. అందుకనే. వట్టి బయోచార్‌ను కాకుండా బయోచార్ కంపోస్టును తయారు చేసుకొని వేస్తే ఈ సమస్య ఉండదు.

మాగిన పశువుల ఎరువు లేదా వర్మీ కంపోస్టు లేదా బయోగ్యాస్ స్లర్రీ లేదా జీవామృతం లేదా పంచగవ్య వంటి.. ఏదైనా సేంద్రియ ఘన/ ద్రవరూప ఎరువులలో ఏదో ఒకదాన్ని బయోచార్‌ను సమపాళ్లలో కలిపి కుప్ప వేసి, బెల్లం నీటిని చిలకరిస్తూ రోజూ కలియదిప్పుతూ ఉంటే 15 రోజుల్లో బయోచార్ కంపోస్టు సిద్ధం అవుతుంది. అప్పుడు దీన్ని పొలాల్లో వేసుకుంటే సత్ఫలితాలు వస్తాయి. మన పొలంలో మట్టి గుణాన్ని బట్టి తగిన మోతాదులో వేసుకోవటం ముఖ్యం. బయోచార్ ఒకటి రెండు సీజన్లలో ఖర్చయిపోయే ఎరువు వంటిది కాదని రైతులు గుర్తుంచుకోవాలి. వంద నుంచి వెయ్యేళ్ల వరకు నేలలో స్థిరంగా ఉండి మేలు చేస్తుంది.

■ ఏ పొలానికి ఎంత వెయ్యాలో తెలిసేదెలా?

మీ భూమికి ఖచ్చితంగా ఎంత మొత్తంలో బయోచార్ కంపోస్టు వేస్తే సరిపోయేదీ ఒక టెస్ట్ ద్వారా మీరే స్పష్టంగా తెలుసుకోవాలి. ఆ విషయం ఎవరినో అడిగితే తెలియదు. మీ పొలంలో ఎత్తయిన ప్రదేశంలో 5 చిన్న మడులు చేసుకొని, వాటిల్లో బయోచార్ కంపోస్టును వేర్వేరు మోతాదుల్లో వేసి.. ఆ 5 మడుల్లోనూ ఒకే రకం పంటను సాగు చేయండి. 3 నెలల్లో మీకు ఫలితం తెలిసిపోతుంది. 1 చదరపు మీటరు విస్తీర్ణం (ఈ విస్తీర్ణాన్ని మీరే నిర్ణయించుకోండి)లో పక్క పక్కనే 5 మడులు తయారు చేసుకోండి. అంటే.. మొత్తం 5 చ.మీ. స్థలం కేటాయించండి. ఒక్కో దాని మధ్య గట్టు మాత్రం ఎత్తుగా, బలంగా వేసుకోండి.

1వ మడిలో బయోచార్ కంపోస్టు అసలు వెయ్యొద్దు. 2వ మడిలో బయోచార్ కంపోస్టు 0.5 కిలో, 3వ మడిలో 1 కిలో, 4వ మడిలో 2 కిలోలు, 5వ మడిలో 4 కిలోలు వెయ్యండి. ఈ 5 మడుల్లో 3 నెలల్లో చేతికొచ్చే ఒకే రకం పంట విత్తుకోండి లేదా కూరగాయ మొక్కలు నాటుకోండి.

బయోచార్ కంపోస్టు విషయంలో వత్యాసాలు పాటించి చూడటం కోసమే ఈ ప్రయోగాత్మక సాగు. ఇక మిగతా పనులన్నీ ఈ మడుల్లో ఒకేలా చేయండి. అంటే నీరు పెట్టటం, కలుపు తీయటం, పురుగుమందులు లేదా కషాయాలు పిచికారీ చేయటం అన్నీ ఒకేలా చెయ్యండి.

ఆ పంటల్లో పెరిగే దశలో వచ్చే మార్పులన్నీ గమనించి, రాసుకోండి. ప్రతి వారానికోసారి ఫొటోలు/వీడియో తీసి పెట్టుకోండి. కాండం ఎత్తు, లావు, పిలకలు/కొమ్మల సంఖ్య, పూత, దిగుబడి, గింజ/కాయల సైజు, ఆ మొక్కల వేర్ల పొడవు వంటి అన్ని విషయాలను నమోదు చేయండి. 3 నెలల తర్వాత ఆ పంట పూర్తయ్యే నాటికి బయోచార్ కంపోస్టు అసలు వేయని మడితో వేర్వేరు మోతాదుల్లో వేసిన మడుల్లో వచ్చిన దిగుబడులతో పోల్చిచూడండి. బయోచార్ కంపోస్టు ఏ మోతాదులో వేసిన మడిలో అధిక దిగుబడి వచ్చిందో గమనించండి. ఇదే మోతాదులో మీ పొలం అంతటికీ వేసుకోండి.

■ రసాయనిక ఎరువులు వాడే రైతులకు కూడా బయోచార్ ఉపయోగపడుతుందా?

బయోచార్ సేంద్రియ ఎరువులు లేదా రసాయనిక ఎరువులు వాడే రైతులు కూడా వాడుకోవచ్చు. కట్టెబొగ్గుతో యూరియా, ఫాస్ఫేటు వంటి వాటిని కలిపి వేసుకోవచ్చు. వట్టిగా యూరియా వేస్తే 20–30 శాతం కన్నా పంటకు ఉపయోగపడదు. అదేగనక బయచార్‌తో యూరియా కలిపి వేస్తే 30–40% ఎక్కువగా పంటకు ఉపయోగపడుతుంది. బొగ్గులోని ఖాళీ గదులు ఉంటాయి కాబట్టి యూరియాను కూడా పట్టి ఉంచి, ఎక్కువ రోజుల పాటు పంట మొక్కల వేర్లకు నెమ్మదిగా అందిస్తుంది.

■ వరి సాగుకూ ఉపయోగమేనా?

వరి పొలాల్లో నీటిని నిల్వగట్టే పద్ధతి వల్ల మిథేన్ వంటి హరిత గృహ వాయువులు గాలిలో కలుస్తూ వాతావరణాన్ని అమితంగా వేడెక్కిస్తున్నాయి. రసాయనిక ఎరువులు వాడే పొలాల వాయుకాలుష్యం మరింత ఎక్కువ. ఈ పొలాల్లో బయోచార్ వేస్తే.. నీటి అడుగున మట్టిలో ఆక్సిజన్‌ను లభ్యత పెరుగుతుంది. మిథేన్ తదితర హరిత గృహ వాయువులను బొగ్గు పీల్చుకుంటుంది. కాబట్టి, వాతావరణానికి జరిగే హాని తగ్గుతుంది. అందుకనే బయోచార్ వాడితే కార్బన్ క్రెడిట్స్ పేరిట డబ్బు ఇచ్చే పద్ధతులు కూడా సమీప భవిష్యత్తులోనే అమల్లోకి రానున్నాయి.


బయోచార్ కంపోస్టుపై శిక్షణ ఇస్తున్న డా. సాయి భాస్కర్ రెడ్డి

బయోచార్‌పై మరింత సమాచారం కోసం చూడండి..
www.youtube.com/@biocharchannel
https://biochared.com

సాగుబడి
మృగశిర కార్తె : జూన్ 22 వరకు

ఎత్తు మడులపై అల్లం

- వేరు కుళ్లు సమస్య రాదు.. పంట విఫలమయ్యే బెడద లేదు..
- ఎకరానికి సగటున 5-6 టన్నుల దిగుబడి పెరుగుదల



సాధారణ బోదెలపైన అల్లం విత్తుకోవటం కన్నా వెడల్పాటి ఎత్తు మడులపై రెండు సాళ్లుగా నాటుకోవటం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ఎత్తు మడులపై అల్లం సాగు వల్ల వేరుకుళ్లు వంటి తగుళ్ల సమస్య తీరిపోతుందని, కనీసం 30–40% అల్లం దిగుబడి పెరుగుతుందని ఉత్తరాంధ్ర జిల్లాల్లో గిరిజన రైతులతో పనిచేస్తున్న వికాస స్వచ్ఛంద సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. ఎస్. కిరణ్ తెలిపారు. సాధారణంగా రైతులు బోదెలు తోలి అల్లం విత్తుకుంటూ ఉంటారు. వర్షాలకు కొద్ది రోజులకే బోదె, కాలువ కలిసిపోయి నీరు నిలబడటం ప్రారంభమవుతుంది. ఈ కారణంగా వేరుకుళ్లు వంటి తెగుళ్లు వస్తుంటాయి. నీటి ముంపు పరిస్థితుల్లో పంట దిగుబడి భారీగా దెబ్బతిని ఖర్చులు కూడా రాని సందర్భాలు ఎదురవుతూ ఉంటాయి.

ఈ సమస్యల నుంచి బయటపడి పంట విఫలం కాకుండా మంచి దిగుబడి పొందాలంటే ఎత్తుమడులపై విత్తుకోవటమే మేలని వికాస సంస్థ పాడేరు, అరకు ప్రాంత రైతులకు అవగాహన కల్పిస్తోంది. ప్రేమ్‌జీ ఫౌండేషన్ తోడ్పాటుతో ప్రారంభించిన ఈ కార్యక్రమం గత ఖరీఫ్ నాటికి రెండేళ్లలోనే 543 మంది రైతులకు విస్తరించిందని డా. కిరణ్ వివరించారు. అడుగు ఎత్తున, రెండు నుంచి రెండున్న అడుగుల వెడల్పుతో ఎత్తు మడులను పొలంలో వాలుకు అడ్డంగా నిర్మించుకోవాలి. రెండు వరుసలుగా అల్లం లేదా పసుపు విత్తుకోవచ్చు. అల్లం సాగులో పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రైతులు అనుసరిస్తున్నారు. ఎత్తుమడులపై విత్తుకోవటం, మురుగు నీరు పోవడానికి కాలువలు ఏర్పాటు చేయటంతో పాటు ఎకరానికి 200 కిలోల ఘన జీవామృతం, 25 కిలోల వేపపిండి వేస్తారు. ప్రతి 15 రోజులకోసారి ద్రవ జీవామృతం (ఏటా 600 లీటర్లు) మొక్కల మొదళ్లలో పోస్తున్నారు. ఎకరానికి కనీసం 14–15 టన్నుల దిగుబడులు సాధిస్తున్నారని డా. కిరణ్ వివరించారు. బోదెలు తోలి సాగు చేసే సాధారణ పద్ధతిలో సగటున ఎకరానికి 9–11 టన్నుల దిగుబడి వస్తుంటుందని, ఎత్తుమడుల పద్ధతిలో సగటున ఎకరానికి 5–6 టన్నులు అదనపు దిగుబడి వస్తోందన్నారు. ఎత్తుమడుల వల్ల కలుపు తీయటం సులభం అవుతుంది. పంట విఫలమై రైతు నష్టపోయే ప్రమాదం తప్పుతుంది. మైదాన ప్రాంతాల రైతులు కూడా ఎత్తు మడుల పద్ధతిని నిశ్చింతగా అనుసరించవచ్చని డా. కిరణ్ (98661 18877) భరోసా ఇస్తున్నారు.


డాక్టర్ కిరణ్

13 నుంచి తిరుపతిలో సేంద్రియ ఎఫ్‌పిఓల మేళా

కనెక్ట్ టు ఫార్మర్ సంస్థ నాబార్డ్ సహకారంతో ఈ నెల 13,14,15 తేదీల్లో తిరుపతిలోని మహతి కళాక్షేత్రం (టౌన్‌క్లబ్)లో గో ఆధారిత వ్యవసాయంలో పండించిన ఉత్పత్తులు, ఎఫ్‌పిఓల మేళాను నిర్వహించనుంది. కనెక్ట్ టు ఫార్మర్ సంస్థ నెలకో సేంద్రియ సంత నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. 13 ఉ. 11 గంటలకు తిరుపతి కలెక్టర్ ప్రవీణ్ కుమార్, నాబార్డ్ సీజీఎం గోపాల్ మేళాను ప్రారంభిస్తారు. పాత విత్తనాల ప్రదర్శన ఉంటుంది. 14న ఉదయం అమేయ కృషి వికాస కేంద్రం (భువనగిరి) వ్యవస్థాపకులు, ప్రముఖ రైతు శాస్త్రవేత్త జిట్టా బాల్‌రెడ్డి ఉద్యాన పంటల్లో గ్రాఫ్టింగ్‌పై శిక్షణ ఇస్తారు. 15న ప్రకృతి చికిత్సా పద్ధతులపై నేలకొండపల్లికి చెందిన ప్రముఖ వైద్యులు డా. కె. రామచంద్ర, ప్రకృతి సేద్యంపై గ్రామభారతి అధ్యక్షులు సూర్యకళ గుప్త, ప్రసిద్ధ అమృతాహార ప్రచారకులు ప్రకృతివనం ప్రసాద్, ఆరుతడి వరి సాగుపై ఆదర్శ రైతు శ్రీనివాస్ (గద్వాల్) వివరిస్తారు. ఇతర వివరాలకు 63036 06326.

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

చివరి రెండు మ్యాచ్‌లకు నేపాల్ జట్టులో లమిచానే




టి20 ప్రపంచకప్‌లో నేపాల్ జట్టు వెస్టిండీస్ వేదికగా ఆడే చివరి రెండు మ్యాచ్‌లకు ఆ జట్టు స్టార్ క్రికెటర్ సందీప్ లమిచానే అందుబాటులోకి రానున్నాడు. గతంలో అత్యాచార ఆరోపణలు ఎదుర్కొని ఎనిమిదేళ్ల జైలు శిక్షకు గురై... ఆ తర్వాత ఆధారాలు లేకపోవడంతో ఈ కేసు నుంచి విముక్తి పొందిన లమిచానేకు అమెరికా ప్రభుత్వం వీసా నిరాకరించింది. దాంతో అతను అమెరికా వేదికగా తొలి రెండు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. నేపాల్ తమ చివరి రెండు మ్యాచ్‌లను ఈనెల 15న దక్షిణాఫ్రికాతో, 17న బంగ్లాదేశ్‌తో కింగ్‌స్టౌన్‌లో ఆడనుంది.

5000 మీటర్లలో గుల్‌వీర్ కొత్త జాతీయ రికార్డు



భారత అథ్లెట్ గుల్‌వీర్ సింగ్ పురుషుల 5000 మీటర్ల విభాగంలో కొత్త జాతీయ రికార్డు నెలకొల్పాడు. అమెరికాలోని పోర్ట్‌ల్యాండ్ ట్రాక్ ఫెస్టివల్ హై పెర్ఫార్మెన్స్ మీట్‌లో గుల్‌వీర్ ఈ ఘనత సాధించాడు. ఈ మీట్‌లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన 26 ఏళ్ల గుల్‌వీర్ 5000 మీటర్లను 13 నిమిషాల 18.92 సెకన్లలో గమ్యానికి చేరి రెండో స్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ క్రమంలో అవినాశ్ సాబ్లే (13ని:19.30 సెకన్లు) పేరిట ఉన్న జాతీయ రికార్డును గుల్‌వీర్ బద్దలు కొట్టాడు. ప్రస్తుతం 10,000 మీటర్లలోనూ జాతీయ రికార్డు గుల్‌వీర్ పేరిటే ఉంది.

కేంద్ర క్రీడా శాఖ మంత్రిగా మన్‌సుఖ్ మాండవియా



న్యూఢిల్లీ: కేంద్ర క్రీడా శాఖ మంత్రిగా మన్‌సుఖ్ మాండవియా నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఆ బాధ్యతలు నిర్వర్తించిన అనురాగ్ ఠాకూర్ స్థానంలో 52 ఏళ్ల మాండవియాకు అవకాశం దక్కింది. గుజరాత్‌లోని పోర్‌బందర్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయన గత మంత్రివర్గంలో ఆరోగ్య శాఖ మంత్రిగా పని చేశారు. మాండవియాకు తోడు మహారాష్ట్రకు చెందిన రక్షా ఖడ్సేను క్రీడా శాఖ సహాయ మంత్రిగా కూడా నియమించారు. ఠాకూర్ క్రీడా మంత్రిగా ఉన్న సమయంలో జరిగిన టోక్యో ఒలింపిక్స్‌లో భారత్ 7 పతకాలు గెలుచుకుంది. ఠాకూర్ మరోసారి ఎన్నికల్లో గెలిచినా... ఈ సారి ఆయనకు మంత్రి పదవి దక్కలేదు.

ముంబై క్రికెట్ సంఘం అధ్యక్షుడి హఠాన్మరణం

ప్రపంచకప్ కోసం వెళ్లి కన్నుమూత


అమోల్ కాలే

న్యూయార్క్: ముంబై క్రికెట్ అసోసియేషన్ (ఎంసీఏ) అధ్యక్షుడు అమోల్ కాలే (47) గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. వరల్డ్‌కప్ చూసేందుకు న్యూయార్క్‌కు వెళ్లిన ఆయన అక్కడే ఆదివారం కన్నుమూశారు. ఆదివారం నాసా కౌంటీ స్టేడియంలో భారత్, పాకిస్తాన్ మధ్య జరిగిన మ్యాచ్‌ను ఎంసీఏ కార్యదర్శి అజింక్య నాయక్‌తో కలిసి కాలే వీక్షించారు. ఆ తర్వాతే ఆయనకు గుండెపోటు వచ్చినట్లు సమాచారం. 2022 అక్టోబరులో జరిగిన ఎన్నికల్లో మాజీ క్రికెటర్ సందీప్ పాటిల్‌ను ఓడించి ఆయన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. తన పదవీకాలంలో కాలే పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వచ్చే 2024–25 సీజన్ నుంచి ముంబై రంజీ ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులను రెట్టింపు చేయడం వాటిలో ప్రధానమైంది. ఎంసీఏ బాధ్యతలతో పాటు ఇండియన్ స్ట్రీట్ ప్రీమియర్ లీగ్ ప్రమోటర్లలో ఒకడిగా కూడా ఆయన వ్యవహరిస్తున్నారు.

‘సూపర్-8’కు దక్షిణాఫ్రికా

- బంగ్లాదేశ్‌పై 4 పరుగులతో గెలుపు
- మెరిసిన క్లాసెన్
- రాణించిన కేశవ్, రబడ, నోర్జే


రబడ, కేశవ్ మహరాజ్


హృదయ్

న్యూయార్క్: దక్షిణాఫ్రికాపై బంగ్లాదేశ్ టి20ల్లో ఏనాడూ గెలవలేదు. కానీ ప్రపంచకప్‌లో భాగంగా సోమవారం జరిగిన గ్రూప్ ‘డి’ మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌కు విజయం సాధించే అవకాశం వచ్చింది. బంగ్లాదేశ్ నెగ్గడానికి ఆఖరి 6 బంతుల్లో 11 పరుగులు చేయాలి. ఒక వైడ్ రావడం, మహ్ముదుల్లా (27 బంతుల్లో 20; 2 ఫోర్లు) క్రీజులో ఉండటంతో బంగ్లా కోటి ఆశలతో ఉంది. కేశవ్ మహరాజ్ తొలి 4 బంతుల్లో వికెట్ తీసి 5 పరుగులిచ్చాడు. ఇక 2 బంతుల్లో 6 పరుగులు కావాల్సి ఉండగా మహ్ముదుల్లా భారీషాట్ బాదాడు. కానీ సిక్సర్‌గా వెళ్లే బంతిని దక్షిణాఫ్రికా కెప్టెన్ మార్క్‌రమ్ తనను తాను బ్యాలెన్స్ చేసుకొని బౌండరీ లైన్ వద్ద చక్కని క్యాచ్ అందుకోవడంతోనే బంగ్లా ఓటమి ఖాయమైంది. చివరి బంతికి సిక్స్ కొడితే స్కోరు సమమయ్యే స్థితిలో బంగ్లాదేశ్ ఒక్క పరుగే తీసింది. దాంతో దక్షిణాఫ్రికా 4 పరుగుల తేడాతో గెలిచి వరుసగా మూడో విజయంతో ‘సూపర్-8’ దశకు అర్హత సాధించింది.

టాస్ నెగ్గిన దక్షిణాఫ్రికా ముందుగా 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 113 పరుగులు చేసింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ హెన్రిచ్ క్లాసెన్ (44 బంతుల్లో 46; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), డేవిడ్ మిల్లర్ (38 బంతుల్లో 29; 1 ఫోర్, 1 సిక్స్) రాణించారు. ప్రత్యర్థి బౌలర్లలో తంజీమ్ హసన్ సకిబ్ 3, టస్కిన్ 2 వికెట్లు తీశారు. అనంతరం బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 109 పరుగులకే పరిమితమై ఓడింది. తౌహిద్ హృదయ్ (34 బంతుల్లో 37; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుగ్గా ఆడాడు. కేశవ్ మహరాజ్ 3, రబడ, నోర్జే చెరో 2 వికెట్లు తీశారు.

సఫారీ విలవిల

బౌలర్లకు అనుకూలించిన పిచ్‌పై పరుగులు క్లిష్టంగా, వికెట్లు సులభంగా వచ్చాయి. ముందుగా దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌లో ఓపెనర్ హెండ్రిక్స్ (0) డకౌటయ్యాడు. డికాక్ (18; 1 ఫోర్, 2 సిక్స్‌లు) దూకుడు మూడో ఓవర్ ముగియకముందే ముగిసింది. ఇద్దర్ని తంజీమ్ పెవిలియన్ చేర్చగా, మార్క్‌రమ్ (4)ను టస్కిన్ క్లీన్‌బౌల్డ్ చేశాడు. స్టబ్స్ (0)ను కూడా తంజీమ్ ఖాతా తెరువనివ్వలేదు. దీంతో 4.2 ఓవర్లలోనే కీలకమైన 4 వికెట్లను కోల్పోయిన దక్షిణాఫ్రికా కష్టాల్లో పడింది. ఈ దశలో క్లాసెన్, మిల్లర్ ఇన్నింగ్స్‌ను నడిపించి జట్టు స్కోరు ను 100 దాటించారు. స్వల్ప వ్యవధిలో ఇద్దరు అవుట్ కావడంతో డెత్ ఓవర్లలో ఆశించినన్ని పరుగులు రాలేదు. లక్ష్యం సులువుగానే ఉంది. ఇన్నింగ్స్ మొదలయ్యాక... 8 ఓవర్లు ముగియక ముందే ఓపెనర్ తంజిద్ (9), లిటన్ దాస్ (9), షకీబుల్ హసన్ (3) వికెట్లను కోల్పోయింది. అప్పటికి జట్టు స్కోరు 37/3. పదో ఓవర్లో 50 పరుగులకు చేరగానే నజ్ముల్ (14) కూడా వికెట్ పారేసుకున్నాడు. తౌహిద్ హృదయ్ చేసిన ఆ కాస్త పోరాటంతో జట్టు వంద పరుగులకు సమీపించింది. కానీ 94 పరుగుల స్కోరు వద్ద తౌహిద్ వికెట్ పడటంతో బంగ్లా విజయానికి దూరమైంది.

టి20 ప్రపంచకప్‌లో నేడు

పాకిస్తాన్ X కెనడా

వేదిక: న్యూయార్క్ ; రాత్రి గం. 8 నుంచి

స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం



భారత ఫుట్‌బాల్ జట్టు సత్తాకు పరీక్ష

- నేడు ఆసియా చాంపియన్ ఖతర్‌తో కీలకపోరు
- గెలిస్తే నేరుగా మూడో రౌండ్‌కు అర్హత

దోహా: స్టార్ ప్లేయర్, కెప్టెన్ సునీల్ ఛెత్రి అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికిన తర్వాత... భారత ఫుట్‌బాల్ జట్టు మరో కీలక పోరుకు సిద్ధమైంది. 2026 ప్రపంచకప్ ఆసియా జోన్ రెండో రౌండ్ క్వాలిఫయర్స్‌లో భాగంగా గ్రూప్ ‘ఎ’లో భారత జట్టు తమ చివరి లీగ్ మ్యాచ్‌ను ఆసియా చాంపియన్ ఖతర్ జట్టుతో నేడు ఆడనుంది. ఓవరాల్‌గా ఖతర్‌తో ఇప్పటి వరకు నాలుగుసార్లు ఆడిన భారత్ ఒక మ్యాచ్‌ను ‘డ్రా’ చేసుకొని, మూడు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. ఇప్పటికే ఆసియా జోన్ మూడో రౌండ్‌కు అర్హత పొందిన ఖతర్ జట్టుకు ఈ మ్యాచ్ ప్రాక్టీస్‌లా ఉపయోగ పడనుండగా... భారత జట్టుకు మాత్రం తాడోపేడోలాంటిది. గోల్‌కీపర్ గుర్‌ప్రీత్ సింగ్ సంధూ నాయకత్వంలో ఈ మ్యాచ్ ఆడనున్న భారత జట్టు విజయం సాధిస్తే ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా మూడో రౌండ్‌కు చేరుకుంటుంది. ఒకవేళ ‘డ్రా’గా ముగిస్తే మాత్రం అఫ్గానిస్తాన్, కువైట్ జట్ల మధ్య జరిగే మ్యాచ్ ఫలితంపై భారత జట్టు భవితవ్యం ఆధారపడి ఉంటుంది. భారత్ తమ మ్యాచ్‌ను ‘డ్రా’ చేసుకుంటే అఫ్గానిస్తాన్–కువైట్ మ్యాచ్ కూడా ‘డ్రా’గా ముగియాలి. అలా జరిగితేనే భారత్ మూడో రౌండ్‌కు అర్హత సాధిస్తుంది. ఒకవేళ అఫ్గానిస్తాన్–కువైట్ మ్యాచ్‌లో ఫలితం వస్తే గెలిచిన జట్టు మూడో రౌండ్‌కు చేరుకుంటుంది. భారత్‌తోపాటు ఓడిన మరో జట్టు రెండో రౌండ్‌కే పరిమితమవుతుంది. 2026 ప్రపంచకప్‌లో తొలిసారి 48 జట్లు పోటీపడనుండగా... ఆసియా నుంచి 8 జట్లకు నేరుగా అవకాశం లభిస్తుంది. మరో బెర్త్ ప్లే ఆఫ్ మ్యాచ్ ద్వారా ఖరారవుతుంది.

వెర్‌స్టాపెన్ ‘హ్యాట్రిక్’

కెనడా గ్రాండ్‌ప్రిలో వరుసగా మూడో ఏడాది విజయం



మాంట్రియల్: ‘పోల్ పొజిషన్’తో రేసును ఆరంభించకపోయినా... అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్న రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ ఈ సీజన్‌లో తన ఖాతాలో ఆరో విజయం జమ చేసుకున్నాడు. కెనడా గ్రాండ్‌ప్రి ప్రధాన రేసును రెండో స్థానం నుంచి ప్రారంభించిన వెర్‌స్టాపెన్ నిర్ణీత 70 ల్యాప్‌లను అందరికంటే వేగంగా ఒక గంటా 45 నిమిషాల 47.927 సెకన్లలో ముగించి విజేతగా నిలిచాడు. వరుసగా మూడో ఏడాది కెనడా గ్రాండ్‌ప్రిలో టైటిల్ నెగ్గి ‘హ్యాట్రిక్’ నమోదు చేసిన వెర్‌స్టాపెన్ కెరీర్‌లో ఓవరాల్‌గా 60వ విజయం సాధించాడు. ‘పోల్ పొజిషన్’తో రేసును మొదలుపెట్టిన జార్జి రసెల్ (మెర్సిడెస్) మూడో స్థానంతో సరిపెట్టుకున్నాడు. లాండో నోరిస్ (మెక్‌లారెన్) రెండో స్థానంలో నిలువగా... లూయిస్ హామిల్టన్ (మెర్సిడెస్) నాలుగో స్థానాన్ని దక్కించుకున్నాడు. ఐదుగురు డ్రైవర్లు కార్లోస్ సెయింజ్ (ఫెరారీ), అలెగ్జాండర్ అల్బోన్ (విలియమ్స్), సెర్గియో పెరెజ్ (రెడ్‌బుల్), చార్లెస్ లెక్‌లెర్క్ (ఫెరారీ), లొగాన్ సార్జెంట్ (విలియమ్స్) రేసును ముగించలేకపోయారు. 24 రేసుల ఈ సీజన్‌లో ఇప్పటికి తొమ్మిది రేసులు ముగిశాయి. ఆరు రేసుల్లో నెగ్గిన వెర్‌స్టాపెన్ 194 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. సీజన్‌లోని పదో రేసు స్పెయిన్ గ్రాండ్‌ప్రి ఈనెల 23న బార్సిలోనాలో జరుగుతుంది.

భారత క్రికెటర్ల ‘టాస్’

బెంగళూరు: ‘నేను టాస్‌కు సిద్ధం’ అంటూ ఒకవైపు జస్‌ప్రీత్ బుమ్రా... ‘టాస్ కోసం ఎదురు చూస్తున్నా’ అంటూ మరోవైపు సూర్యకుమార్ యాదవ్ సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చకు తెర లేపారు. అసలు ఈ ‘టాస్’ ఏమిటనే ఆసక్తి అందరిలో నెలకొంది. ప్రముఖ సంస్థ ఐటీసీ లిమిటెడ్ ఇప్పుడు ఈ వివరాలను వెల్లడించింది. తమ బ్రాండ్ సన్‌ఫీస్ట్ ద్వారా ఇప్పటికే ప్రాచుర్యంలో ఉన్న ‘ఈపీ నూడుల్స్’కు మరో కొత్త రుచిని జోడించి ‘ఈపీ టాస్’ అంటూ మార్కెట్లోకి తీసుకొచ్చింది. తాజా ప్రచారమంతా ‘ఈపీ టాస్’ గురించేనని సంస్థ ప్రకటించింది. ఇద్దరు ఆటగాళ్లతో పాటు భారత కోచ్ రాహుల్ ద్రవిడ్ కూడా ఈ వాణిజ్య ప్రకటనలో పాల్గొన్నాడు. వరల్డ్‌కప్ సమయంలో క్రికెట్ అభిమానులకు మరింత చేరువయ్యేందుకు కొత్త తరహా ‘ఈపీ టాస్’ ఉత్పత్తిని తీసుకొచ్చినట్లు ఐటీసీ సీఈఓ కవితా చతుర్వేది పేర్కొన్నారు.

సినెర్... కొత్త నంబర్‌వన్

టెన్నిస్‌లో టాప్ ర్యాంక్ అందుకున్న తొలి ఇటలీ ప్లేయర్‌గా ఘనత



పారిస్: ఈ సీజన్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్న ఇటలీ టెన్నిస్ ప్లేయర్ యానిక్ సినెర్ తన కెరీర్‌లో గొప్ప ఘనత సాధించాడు. అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) పురుషుల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో తొలిసారి ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకున్నాడు. సోమవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో సినెర్ ఒక స్థానం మెరుగుపర్చుకొని 9,525 పాయింట్లతో నంబర్‌వన్ స్థానానికి చేరుకున్నాడు. టెన్నిస్‌లో కంప్యూటర్ ఆధారిత ర్యాంకింగ్స్ (1973 నుంచి) మొదలయ్యాక వరల్డ్ నంబర్‌వన్ ర్యాంక్ అందుకున్న తొలి ఇటలీ ప్లేయర్‌గా 22 ఏళ్ల సినెర్ రికార్డు నెలకొల్పాడు. ఈ ఏడాది సినెర్ 33 మ్యాచ్‌ల్లో గెలిచి, 3 మ్యాచ్‌ల్లో ఓడిపోయాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌తోపాటు మయామి మాస్టర్స్ సిరీస్, రోటర్‌డామ్ ఓపెన్‌లో అతను విజేతగా నిలిచాడు. ఫ్రెంచ్ ఓపెన్‌లో సెమీఫైనల్లో ఓడిపోయాడు. గతవారం వరకు టాప్ ర్యాంక్‌లో ఉన్న సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ రెండు స్థానాలు పడిపోయి మూడో ర్యాంక్‌లో నిలిచాడు. ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ నెగ్గిన కార్లోస్ అల్‌కరాజ్ ఒక స్థానం పురోగతి సాధించి రెండో ర్యాంక్‌లో నిలిచాడు.

కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో నగాల్

భారత టెన్నిస్ స్టార్ సుమిత్ నగాల్ కెరీర్ బెస్ట్ 77వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. ఆదివారం జర్మనీలో జరిగిన నెకర్ కప్ టోర్నీలో విజేతగా నిలిచిన సుమిత్ 18 స్థానాలు పురోగతి సాధించాడు. తాజా ర్యాంక్ కారణంగా సుమిత్ వచ్చే నెలలో జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడల్లో సింగిల్స్ విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించడం ఖాయమైంది.

సినిమా

డేట్ చేంజ్


ధనుష్

ధనుష్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం ‘రాయన్’. ఈ మూవీ కాస్త ఆలస్యంగా థియేటర్స్‌లోకి రానుంది. సందీప్ కిషన్, కాళిదాస్ జయరామ్, ఎస్‌జే సూర్య, సెల్వరాఘవన్, అపర్ణ బాలమురళి, దుషార విజయన్ ఇతర లీడ్ రోల్స్‌లో నటించిన ఈ సినిమాను సన్‌పిక్చర్స్ సంస్థ నిర్మించింది. నార్త్ చెన్నై బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామాను తొలుత జూన్ 13న విడుదల చేయాలనుకున్నారు. కానీ జూలై 26న రిలీజ్ చేయనున్నట్లుగా ధనుష్ ‘ఎక్స్’ వేదికగా వెల్లడించారు. ధనుష్ కెరీర్‌లో 50వ సినిమాగా రూపొందిన ‘రాయన్’ కి ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు.


రకుల్ ప్రీత్ సింగ్

రికార్డ్స్ చూసుకో..!


ప్రభాస్

‘**ఈ** భూమ్మీద మొదటి నగరం.. ఈ వరల్డ్‌లో చివరి నగరం కాశీ’ అనే డైలాగ్‌తో ‘కల్కి 2898 ఏడీ’ ట్రైలర్ ప్రారంభమైంది. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన చిత్రం ‘కల్కి 2898 ఏడీ’. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకోన్, దిశా పటానీ కీలక పాత్రల్లో నటించారు. వైజయంతీ మూవీస్‌పై సి.అశ్వినీదత్ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 27న విడుదలవుతోంది. ఈ మూవీ ట్రైలర్‌ని సోమవారం రిలీజ్ చేశారు మేకర్స్. తెలుగుతో పాటు హిందీ, తమిళం, మలయాళం, కన్నడ, ఇంగ్లిష్‌తో సహా పలు భాషల్లో ఈ ట్రైలర్‌ని విడుదల చేశారు. ‘నువ్వు ఇప్పుడు కనబోయేది మామూలు ప్రాణం కాదమ్మా.. సృష్టి.. నేను కాపాడతా’(అమితాబ్ బచ్చన్), ‘పాయింట్ ఏంటంటే నేనొక్కడినే ఆ అమ్మాయిని తీసుకురాగలను.. రికార్డ్స్ చూసుకో ఇంత వరకూ ఒక్క ఫైట్ కూడా ఓడిపోలేదు.. ఇది కూడా ఓడిపోను’(ప్రభాస్), ‘ఇంకా తొలి ఊపిరి కూడా తీసుకోని ఈ బిడ్డ కోసం ఇంకెంత మంది చనిపోవాలి’(దీపికా పదుకోన్), ‘భయపడకు.. మరో ప్రపంచం వస్తుంది’(కమల్‌హాసన్) వంటి డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. ఈ సందర్భంగా నాగ్ అశ్విన్ మాట్లాడుతూ– ‘‘ఒక ఫిల్మ్ మేకర్‌గా ఇండియన్ మైథాలజీ, సైన్స్ ఫిక్షన్ పట్ల నాకు చాలా ప్యాషన్ ఉంది. ‘కల్కి 2898 ఏడీ’లో ఈ రెండు ఎలిమెంట్స్‌ని మెర్జ్ చేయడం మా ఆర్టిస్టులు, టీం అద్భుతమైన ప్రతిభ, అంకితభావం వల్ల సాధ్యమైంది. ఈ కలని సాకారం చేసుకోవడానికి మాకు చాలా టైమ్ పట్టింది. ఈ ట్రైలర్ తెలుగు ప్రేక్షకులను, యావత్ దేశాన్ని గర్వించేలా చేస్తుందని, సినిమా కోసం వారిని ఎగ్జైట్ చేసేలా ఉంటుందని ఆశిస్తున్నాను’’ అన్నారు.

మహారాజపై నమ్మకం ఉంది - విజయ్ సేతుపతి


మమతా మోహన్‌దాస్, అభిరామి, విజయ్ సేతుపతి

‘‘**మ**హారాజ’ నా కెరీర్‌లో 50వ సినిమా. ఈ మూవీ విజయంపై చాలా నమ్మకం ఉంది. తెలుగు ప్రేక్షకులను కూడా ఈ చిత్రం మెప్పిస్తుంది. థియేటర్స్‌కి వచ్చి చూడండి’’ అని విజయ్ సేతుపతి అన్నారు. నితిలన్ సామినాథన్ దర్శకత్వం వహించిన చిత్రం ‘మహారాజ’. విజయ్ సేతుపతి హీరోగా నటించిన ఈ చిత్రంలో మమతా మోహన్‌దాస్, అనురాగ్ కశ్యప్, అభిరామి ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. సుధన్ సుందరం, జగదీష్ పళనిసామి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ మూవీని ఏపీ, తెలంగాణలో ఎన్వీఆర్ సినిమా విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ‘మహారాజ’ ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో మమతా మోహన్‌దాస్ మాట్లాడుతూ– ‘‘తమిళంలో కొంత గ్యాప్ తర్వాత నేను చేసిన సినిమా ‘మహారాజ’. విజయ్ సేతుపతిగారికి నేను పెద్ద అభిమానిని. ఆయనతో వర్క్ చేయడం చాలా సంతోషంగా ఉంది. ఈ మధ్యకాలంలో ఇలాంటి సినిమా రాలేదు’’ అన్నారు. ‘‘విజయ్‌గారి 50వ సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తుండటం సంతోషంగా ఉంది’’ అన్నారు నితిలన్ సామినాథన్. ‘‘మహారాజ’లో మంచి ఫ్యామిలీ ఎమోషన్ ఉంది. విజయ్‌గారి నట విశ్వరూపం చూస్తారు’’ అన్నారు నిర్మాత ఎన్వీ ప్రసాద్. ఈ కార్యక్రమంలో నటి అభిరామి, డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి మాట్లాడారు.

సికందర్ యాక్షన్


సల్మాన్ ఖాన్

ముంబైలో అదిరిపోయే ఫైట్స్ చేసేందుకు సిద్ధం అవుతున్నాడు సికందర్. సల్మాన్ ఖాన్ హీరోగా ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో తెరకెక్కనున్న యాక్షన్ థ్రిల్లర్ మూవీ ‘సికందర్’. ఈ చిత్రంలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటించనున్నారు. ఇందులో సికందర్‌గా కనిపించనున్నారు సల్మాన్ ఖాన్. కాగా ఈ మూవీ చిత్రీకరణ ఈ నెల 18 నుంచి ముంబైలో ప్రారంభం కానుంది. తొలుత యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించేలా సన్నాహాలు చేస్తున్నారు ఏఆర్ మురుగదాస్. ముంబై షెడ్యూల్ తర్వాత విదేశాల్లో ఓ భారీ షెడ్యూల్‌ను జరపాలని ప్లాన్ చేస్తోందట యూనిట్. సాజిద్ నడియాడ్‌వాలా నిర్మించనున్న ఈ సినిమా వచ్చే ఏడాది రంజాన్ సందర్భంగా విడుదల కానుంది.

ఇంకా సమయం ఉంది

‘‘భారతీయుడు 2(తమిళంలో ఇండియన్ 2)’ చిత్రం నా కెరీర్‌లో బెస్ట్‌గా నిలుస్తుంది. ఈ మూవీలో నేను చేసిన పాత్ర నా నిజజీవితానికి చాలా దగ్గరగా ఉందనే భావన కలిగించింది. ఈ సినిమా గురించి చాలా విషయాలు జనాలతో పంచుకోవాలనే ఆత్రుతగా ఉంది. కానీ, అందుకు ఇంకా సమయం ఉంది’’ అంటున్నారు హీరోయిన్ రకుల్‌ప్రీత్ సింగ్. నటుడు, దర్శక–నిర్మాత జాకీ భగ్నానీతో రకుల్ వివాహం ఈ ఏడాది ఫిబ్రవరి 21న జరిగిన విషయం తెలిసిందే. పెళ్లి కోసం కొద్ది రోజులు సినిమాలకు విరామం ఇచ్చిన ఈ బ్యూటీ మళ్లీ జోరుమీదున్నారు. రకుల్‌ప్రీత్ సింగ్ నటించిన తాజా చిత్రం ‘భారతీయుడు 2’. హీరో కమల్ హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో 1996లో వచ్చిన ‘భారతీయుడు’ కి సీక్వెల్‌గా ‘భారతీయుడు 2’ రూపొందింది. ఈ మూవీలో రకుల్‌ప్రీత్ సింగ్ కీలక పాత్రలో నటించారు. లైకా ప్రొడక్షన్స్, రెడ్ జెయింట్ బ్యానర్‌పై సుభాస్కరన్ నిర్మించిన ఈ మూవీ జూలై 12న తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదలవుతోంది. కాగా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో రకుల్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ–‘‘భారతీయుడు 2’ నా కెరీర్‌లోనే ఎంతో స్పెషల్ మూవీ. ఇందులో ఆత్మవిశ్వాసం కలిగిన అమ్మాయిగా కనిపిస్తాను. నా గత చిత్రాలకంటే ఈ మూవీలోని నా క్యారెక్టర్ వైవిధ్యంగా ఉంటుంది. ఈ ప్రాజెక్టుతో ప్రయాణం చేసినన్ని రోజులు గొప్ప అనుభూతి కలిగింది. శంకర్‌గారితో పని చేయడం అదృష్టంగా భావిస్తున్నాను’’ అన్నారు.

అది నా అదృష్టం - వైవీఎస్ చౌదరి


వైవీఎస్ చౌదరి, గీత

‘‘నా కెరీర్‌లో ఎంతోమంది కొత్తవారిని పరిచయం చేశాను. ‘దేవదాసు’ మూవీతో రామ్‌ని, ‘రేయ్’ చిత్రంతో సాయి ధరమ్ తేజ్‌ని హీరోలుగా పరిచయం చేశాను. ఇప్పుడు నందమూరి కుటుంబంలో నాలుగో తరానికి చెందిన తారక రామారావుని ప్రపంచానికి పరిచయం చేయడం నా అదృష్టంగా భావిస్తున్నాను’’ అని డైరెక్టర్ వైవీఎస్ చౌదరి అన్నారు. దివంగత హరికృష్ణ కుమారుడు దివంగత జానకి రామ్(ఎన్టీఆర్ సోదరుడు) తనయుడు తారక రామారావును హీరోగా పరిచయం చేస్తూ కొత్త సినిమాని ప్రకటించారు వైవీఎస్ చౌదరి. న్యూ టాలెంట్ రోర్స్ బ్యానర్‌పై యలమంచిలి గీత ఈ సినిమాని నిర్మించనున్నారు. సోమవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో వైవీఎస్ చౌదరి మాట్లాడుతూ–‘‘శ్రీ సీతారాముల కళ్యాణం చూతము రారండి’ మూవీతో దర్శకునిగా నాకు తొలి అవకాశం ఇచ్చిన నాగార్జునగారికి రుణపడి ఉంటాను. తొలి సినిమాకే నాగేశ్వరరావుగారితో పని చేసే అవకాశం రావడం గొప్ప అదృష్టం. తాజాగా నా కొత్త సినిమాకి హీరోగా ఎవర్ని తీసుకోవాలి? అనుకుంటున్న సమయంలో తమ్ముల ప్రసన్న కుమార్ గారు తారక రామారావుని చూపించారు. తనని చూడగానే జానకి రామ్ కలని నెరవేర్చుతాడనిపించింది. ఈ మూవీ ద్వారా తెలుగమ్మాయిని కథానాయికగా పరిచయం చేస్తున్నాం. త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తా’’ అన్నారు. ‘‘మా స్నేహితులు, సన్నిహితుల అండదండలతో న్యూ టాలెంట్ రోర్స్ బ్యానర్‌పై ఫస్ట్ ప్రొడక్షన్ స్టార్ట్ చేయబోతున్నాం. అందరి ఆశీస్సులు ఉంటాయని నమ్ముతున్నాం’’ అన్నారు యలమంచిలి గీత. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రమేష్ అత్తిలి.

రాజధాని రౌడీ వస్తున్నాడు


యశ్

‘**కే**జీఎఫ్’ ఫేమ్ యశ్ హీరోగా, షీనా హీరోయిన్‌గా నటించిన కన్నడ చిత్రం ‘రాజధాని’. కేవీ రాజు దర్శకత్వం వహించిన ఈ సినిమాకు అర్జున్ జన్య సంగీతం అందించారు. కన్నడలో విజయం సాధించిన ఈ మూవీని ‘రాజధాని రౌడీ’ పేరుతో సంతోష్ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై సంతోష్ కుమార్ తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ నెల 14న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ–‘‘మాదక ద్రవ్యాలు, మద్యపానం బారినపడి నలుగురు యువకులు వారి జీవితాలను ఎలా నాశనం చేసుకున్నారు? అనే కథాంశంతో ఈ సినిమా ఉంటుంది. చెడు పరిణామాలను ఎత్తి చూపించి, ఆలోచన రేకెత్తించే పోలీస్ ఆఫీసర్‌గా ప్రకాష్ రాజ్ నటించారు. ప్రేక్షకులు మా సినిమాని ఆదరించాలి’’ అన్నారు.

యూత్‌ఫుల్ డ్రామా


కాల భైరవ

‘శాకుంతలం’ (2023) సినిమా తర్వాత దర్శకుడు గుణశేఖర్ తెరకెక్కించనున్న తాజా చిత్రం ‘యుఫోరియా’. గుణ హ్యాండ్‌మేడ్ ఫిలిమ్స్‌పై నీలిమ గుణ ఈ సినిమాను నిర్మించనున్నారు. యూత్‌ఫుల్ సోషల్ డ్రామాగా తెరకెక్కనున్న ఈ సినిమా చిత్రీకరణ త్వరలోనే ప్రారంభం కానుంది. తాజాగా ఈ సినిమాకు కాలభైరవ సంగీతం అందించనున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా వెల్లడించింది. ‘‘యుఫోరియా’ ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సినిమాకు సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం’’ అని చిత్రబృందం పేర్కొంది.

సాక్షి బిజినెస్
మంగళవారం
11-6-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	203	76,490
నిఫ్టీ ▽	31	23,259

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	17,176	△ 42
డోజోన్స్	38,733	▽ 66
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,228	▽ 17
డాక్స్	18,495	▽ 62
షాంఘై (శుక్రవారం ముగింపు)	3,051	△ 2
నికాయ్	39,038	△ 354

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	71,176
బంగారం (99.5 స్వచ్ఛత)	70,891
వెండి (కిలో)	88,928

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.09	84.11
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	105.06	107.62
€	యూరో	ఎస్‌బీఐ	88.82	91.18
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	52.62	53.78
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.11	56.04
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.40	64.08
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.37	22.93
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.85	23.63
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.40	12.47

వికసిత భారత్ దిశగా సంస్కరణలు

మోదీ 3.0పై కార్పొరేట్ల ఆశాభావం

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో మూడోసారి ఏర్పడ్డ కేంద్ర ప్రభుత్వం వికసిత భారత్ లక్ష్య సాధన దిశగా తదుపరి సంస్కరణలను అమలు చేయగలదని కార్పొరేట్లు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధానిగా మోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో పలువురు కార్పొరేట్ దిగ్గజాలు ఎక్స్ వేదికగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.



మరింత పురోగతి
వరుసగా మూడోసారి భారత ప్రధానిగా ఎన్నికైన నరేంద్ర మోదీజీకి శుభాకాంక్షలు. మీ దార్శనిక సారథ్యంలో భారత్ అనేక మైలురాళ్లను అధిగమించింది. ఇకపైనా దేశం వృద్ధి బాటలో ముందుకు దూసుకెడుతుందని విశ్వసిస్తున్నాం.
– అనిల్ అగర్వాల్, చైర్మన్, వేదాంత గ్రూప్



దేశాభివృద్ధి కొనసాగుతుంది
నెహ్రూజీ తర్వాత వరుసగా మూడోసారి ప్రధాని పదవిని చేపట్టిన మోదీజీకి శుభాకాంక్షలు. కొత్త కేబినెట్ ఏర్పాటుతో దేశ అభివృద్ధి, పురోగతి కొనసాగగలదని ఆశిస్తున్నాను.
– సజ్జన్ జిందాల్, సీఎండీ, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్



కీలక సమయం
భారతదేశ అభివృద్ధి, శ్రేయస్సుకు ఈ విడత మరింత కీలకం కాగలదని ఆశిస్తున్నాను.
– ఆనంద్ మహీంద్రా, చైర్మన్, మహీంద్రా గ్రూప్



సంస్కరణల అమలు లక్ష్యం
అంతర్జాతీయంగా అవకాశాలను అందిపుచ్చుకునేందుకు, ఆర్థిక వ్యవస్థ ఫండమెంటల్స్‌ను పటిష్టపర్చేందుకు మోదీ నాయకత్వంలోని కొత్త ప్రభుత్వం తదుపరి విడత సంస్కరణలు అమలు చేయగలదని ఆశిస్తున్నాం.
– చంద్రజిత్ బెనర్జీ, డైరెక్టర్, సీఐఐ



లక్ష్యానికి పటిష్ట పునాదులు
ఎన్‌డీఏ వరుసగా మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు చేయడమనేది సంస్కరణల ఎజెండా కొనసాగింపునకు దోహదపడగలదు. ఆర్థిక, సామాజికాభివృద్ధికి తోడ్పడుతూ, వికసిత భారత్ లక్ష్యానికి గట్టి పునాదులు వేసే పురోగామి విధానాలు, చర్యలను కొత్త ప్రభుత్వం తీసుకోగలదని ఆశిస్తున్నాము.
– అనీష్ షా, ప్రెసిడెంట్, ఫిక్కీ



ఎకానమీ మరింత స్పీడ్
కీలక దేశాలకు మించి అత్యధిక వృద్ధి రేటును కొనసాగిస్తూ, దేశ నాయకత్వం భారత్‌ను కొత్త ఎత్తులకు తీసుకెళ్లగలదని కార్పొరేట్లు విశ్వసిస్తున్నారు.
– దీపక్ సూద్, సెక్రటరీ జనరల్, అసోచాం

కఠిన సంస్కరణలకు సవాళ్లు: యూబీఎస్



న్యూఢిల్లీ: స్థూల, **వ్యవసాయ**, డిజిన్వెస్ట్‌**మెంట్**, యూనిఫాం సివిల్ **కోడ్**, వన్ నేషన్ వన్ ఎలక్ష**న్ తది**తర కఠిన సంస్కరణలను అమలు చేయగలిగితే భారత వృద్ధి రేటు ప్రస్తుతం అంచనా వేస్తున్న 6.5–7 శాతం కన్నా అధికంగా 7.5 శాతం పైగా ఉండగలదని స్విస్ బ్రోకరేజ్ సంస్థ యూబీఎస్ అభిప్రాయపడింది. అయితే, కేంద్రంలో కొత్తగా ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వం.. మిత్రపక్షాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉన్నందున 2014, 2019తో పోలిస్తే వీటి అమల్లో సవాళ్లు ఎదురుకావొచ్చని అంచనా వేసింది. తయారీ రంగానికి తోడ్పాటునిచ్చే చర్యలు, నైపుణ్యాల అభివృద్ధి, గతంలో ఆమోదించిన కార్మిక చట్టాలను వచ్చే 12–18 నెలల్లో అమలు చేయడం మొదలైన వాటిపైనే ప్రభుత్వం ప్రస్తుతానికి దృష్టి పెట్టే అవకాశం ఉందని యూబీఎస్ ఇండియా చీఫ్ ఎకనమిస్ట్ తన్వీ గుప్తా జైన్ పేర్కొన్నారు. రాబోయే కేంద్ర బడ్జెట్‌లో విధానపరంగా చేసే కీలక ప్రకటనలను నిశితంగా పరిశీలించాల్సి ఉంటుందని ఆమె వివరించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

11-6-2024

విశాఖ	530–00
చిత్తూరు	593–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525–00
విజయవాడ	530–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	520–00
వరంగల్	522–00
రిటైల్ ధర	5.80

77,000 స్థాయి తాకి.. వెనక్కి

ట్రేడింగ్‌లో సరికొత్త రికార్డుల నమోదు ● నష్టాలతో ముగిసిన స్టాక్ సూచీలు



ముంబై: సరికొత్త రికార్డుల వద్ద ఐటీ, ఫైనాన్స్ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో స్టాక్ సూచీలు సోమవారం నష్టాలతో ముగిశాయి. ప్రధానిగా నరేంద్ర మోదీ మూడోసారి ప్రమాణస్వీకారంతో ఉదయం ప్రారంభంలోనే సూచీలు జీవితకాల గరిష్టాలను నమోదు చేశాయి. సెన్సెక్స్ 386 పాయింట్లు పెరిగి 77,000 స్థాయిపై 77,079 వద్ద, నిఫ్టీ 122 పాయింట్లు బలపడి 23,412 వద్ద జీవితకాల గరిష్టాలు నమోదు చేశాయి. తదుపరి ఐటీ, ఫైనాన్స్ మెటల్, ఇంధన షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో స్టాక్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 203 పాయింట్లు పతనమై 76,490 వద్ద, నిఫ్టీ 31 పాయింట్లు నష్టపోయి 23,259 వద్ద నిలిచాయి. సర్వీసెస్, రియల్టీ, కమోడిటీస్, యుటిలిటీస్, హెల్త్‌కేర్, పారిశ్రామికోత్పత్తి రంగాలకు చెందిన చిన్న, మధ్య తరహా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఫలితంగా బీఎస్ఈ స్మాల్, మిడ్ సూచీలు వరుసగా 1.04%, 0.56% చొప్పున రాణించాయి.

క్రోనాక్స్ ల్యాబ్ సైన్సెస్ షేరు బీఎస్ఈలో ఇష్యూ ధర (రూ.136)తో పోలిస్తే 21% ప్రీమియంతో రూ.165 వద్ద లిస్టయ్యింది. ఆఖరికి 17% లాభంతో రూ.159 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.591.25 కోట్లుగా నమోదైంది.

డీప్‌ఫేక్ వీడియోలను నమ్మొద్దు: ఎన్ఎస్ఈ

కాగా, డీప్‌ఫేక్ వీడియోల పట్ల జాగ్రత్త వహించాలంటూ నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ ఇన్వెస్టర్లను హెచ్చరించింది. ఎన్ఎస్ఈ ఎండీ, సీఈవో అశిష్‌కుమార్ చౌహాన్ పెట్టుబడులకు సంబంధించి సలహాలిస్తున్నట్లు వైరల్ అవుతున్న నకిలీ వీడియోల నేపథ్యంలో ఎక్స్ఛేంజీ ఈ హెచ్చరిక జారీ చేసింది.

మేలో ఈక్విటీ ఎంఎఫ్‌ల రికార్డ్

మే నెలలో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్(ఎంఎఫ్‌లు)కు ఇన్వెస్టర్లు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. దీంతో సరికొత్త రికార్డ్ నెలకొల్పుతూ మే నెలలో రూ. 34,697 కోట్ల పెట్టుబడులు ప్రవహించాయి. ఏప్రిల్‌తో పోలిస్తే ఇది 83 శాతం అధికం. సిప్‌కు సైతం రూ. 20,904 కోట్ల పెట్టుబడులు లభించినట్లు యంఫీ వెల్లడించింది.

తెలుగు రాష్ట్రాల్లో మహీంద్రా రోటావేటర్లకు డిమాండ్



హైదరాబాద్: ఈ ఖరీఫ్ సీజన్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వరి, గోధుమ దిగుబడి గణనీయంగా ఉండగలదని అంచనాలు ఉన్నాయని మహీంద్రా ఫార్మ్ ఎక్విప్‌మెంట్ సెక్టార్ తెలిపింది. ఈ నేపథ్యంలో తమ రోటావేటర్లకు డిమాండ్ పెరుగుతోందని, దానికి అనుగుణంగా సరఫరా కోసం కసరత్తు చేస్తున్నామని సంస్థ వివరించింది. హెవీ సెగ్మెంట్ (మహావేటర్ సిరీస్) నుంచి తేలికపాటి సెగ్మెంట్ (జైరోవేటర్ సిరీస్, ప్యాడీవేటర్ సిరీస్) వరకు, అలాగే చిన్న ట్రాక్టర్ల ఓనర్ల కోసం మినీవేటర్ సిరీస్‌లలో రోటావేటర్లను విక్రయిస్తున్నట్లు పేర్కొంది. వేరియంట్‌ను బట్టి 100 శాతం వరకు రుణ స్కీమ్‌లను మహీంద్రా ఫైనాన్స్ అందిస్తున్నట్లు వివరించింది. మిగతా సంస్థలు ఆరు నెలలే వారంటీ ఇస్తుండగా తాము ఏడాది నుంచి రెండేళ్ల వరకు వారంటీ ఇస్తున్నట్లు పేర్కొంది.

వాహన పరిశ్రమ నెమ్మది

మే నెల అమ్మకాల్లో 5.28% క్షీణత



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎండల తీవ్రత.. మరోవైపు ఎన్నికలు. వెరసి దేశవ్యాప్తంగా మే నెలలో వాహన పరిశ్రమపై ఈ రెండు అంశాలు ప్రభావం చూపాయి. షోరూంలకు వచ్చే కస్టమర్ల సంఖ్య గత నెలలో 18 శాతం తగ్గినట్టు ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఏడీఏ) వెల్లడించింది. 2024 ఏప్రిల్‌తో పోలిస్తే అన్ని విభాగాల్లో కలిపి అమ్మకాలు మే నెలలో 5.28 శాతం క్షీణించాయి. 2023 మే నెలతో పోలిస్తే గత నెల విక్రయాల్లో 2.61% వృద్ధి నమోదైంది. మే నెలలో మొత్తం 20,89,603 యూనిట్ల వాహనాలు రోడ్డెక్కాయి. 2024 ఏప్రిల్‌తో పోలిస్తే గత నెలలో ద్విచక్ర వాహనాల అమ్మకాలు 6.61% తగ్గి 15,34,856 యూనిట్లకు చేరాయి.

ఎంఫసిస్‌లో ప్రమోటర్ వాటా విక్రయం


● 15 శాతం వాటా అమ్మిన బ్లాక్‌స్టోన్
● డీల్ విలువ రూ. 6,736 కోట్లు



న్యూఢిల్లీ: ఐటీ, కన్సల్టింగ్ సేవల కంపెనీ ఎంఫసిస్‌లో ప్రమోటర్ సంస్థ బ్లాక్‌స్టోన్ తాజాగా 15.08 శాతం వాటాను విక్రయించింది. ఎన్ఎస్ఈలో ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజం ఈ వాటాను దాదాపు రూ. 6,736 కోట్లకు అమ్మివేసింది. బల్క్‌డీల్ గణాంకాల ప్రకారం షేరుకి రూ. 2,363.37 సగటు ధరలో బ్లాక్‌స్టోన్ 2.85 కోట్ల షేర్లను విక్రయించింది. అనుబంధ సంస్థ బీసీపీ టాప్కో 9 పీటీఈ వాటా విక్రయాన్ని చేపట్టింది. ఇది ఈ ఏడాదిలో నమోదైన రెండో అతిపెద్ద బ్లాక్‌డీల్‌గా నిలిచింది. దీంతో ఎంఫసిస్‌లో బ్లాక్‌స్టోన్ వాటా 55.45 శాతం నుంచి 40.37 శాతానికి క్షీణించింది. అయినప్పటికీ ఎంఫసిస్‌లో బ్లాక్‌స్టోన్ అతిపెద్ద వాటాదారుగా నిలుస్తోంది. కొటక్ మహీంద్రా ఎంఎఫ్, మోర్గాన్ స్టాన్లీ ఏషియా సింగపూర్ పీటీఈ, సొసైటీ జనరాలి ఉమ్మడిగా ఎంఫసిస్‌లో 80.32 లక్షల షేర్లను కొనుగోలు చేశాయి. షేరుకి రూ. 2,363 సగటు ధరలో వీటిని రూ. 1,898 కోట్లకు సొంతం చేసుకున్నాయి. కాగా.. ఇంతక్రితం డైవర్సిఫైడ్ దిగ్గజం ఐటీసీలో బ్రిటిష్ అమెరికన్ టొబాకో (బాట్) 3.5% వాటాను రూ. 17,485 కోట్లకు విక్రయించింది. ఇది అతిపెద్ద బ్లాక్‌డీల్‌గా నమోదైంది. 2016 ఏప్రిల్‌లో హ్యూలెట్ ప్యాకార్డ్ ఎంటర్‌ప్రైజ్ నుంచి 60.5 శాతం వాటాను బ్లాక్‌స్టోన్ చేజిక్కించుకున్న విషయం విదితమే.

ఎంఫసిస్ షేరు ఎన్ఎస్ఈలో 3% క్షీణించి రూ. 2,398 వద్ద ముగిసింది.

వివో మేడిన్ ఇండియా ఎక్స్ ఫోల్డ్3 ప్రో



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మొబైల్స్ బ్రాండ్ వివో తాజాగా మేడిన్ ఇండియా ఎక్స్ ఫోల్డ్3 ప్రో స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసింది. ఫోల్డబుల్ విభాగంలో అధిక సామర్థ్యంతో 5700 ఎంఏహెచ్ బ్యాటరీతో మార్కెట్లోకి వచ్చిన తొలి ఫోన్ ఇదేనని కంపెనీ తెలిపింది. 16 జీబీ ర్యామ్, 512 జీబీ ఇంటర్నల్ మెమరీ, 2కె ఇమ్మెర్సివ్ డిస్‌ప్లే, 8.03 అంగుళాల మెయిన్ స్క్రీన్, 6.53 అంగుళాల కవర్ స్క్రీన్, జైస్ తయారీ 50+50+64 ఎంపీ కెమెరా, 32+32 ఎంపీ ఫ్రంట్ కెమెరా, స్నాప్‌డ్రాగన్ 8 జెన్ 3, ఫన్‌టచ్ ఓఎస్ 14, మైక్రో క్రిస్టల్ గ్లాస్‌తో తయారైన అర్మర్ గ్లాస్, 1.12 సెంటీమీటర్ల మందం వంటి హంగులు ఉన్నాయి. ధర రూ.1,59,999 ఉంది.

పేటీఎంలో ఉద్యోగాల కోత



న్యూఢిల్లీ: పేటీఎం బ్రాండ్ పేరుతో కార్యకలాపాలు సాగిస్తున్న ఫిన్‌టెక్ కంపెనీ వన్ 97 కమ్యూనికేషన్స్ మరోమారు ఉద్యోగుల్లో కోత విధించింది. వీరికి ఔట్‌ప్లేస్‌మెంట్ సపోర్ట్ అందిస్తున్నట్లు కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. రెజ్యూమే రూపకల్పనకు సాయం చేయడంతోపాటు ఇంటర్వ్యూకు సన్నద్ధం చేయడం, మెళకువలు నేర్పడం, మార్కెట్లో ఉన్న ఉద్యోగావకాశాలను తెలియజేయడం వంటివి ఔట్‌ప్లేస్‌మెంట్ సపోర్ట్ అంటారు. తీసివేతకు గురైన సిబ్బందికి సాయం చేసేందుకు.. మార్కెట్లో నియామకాలు చేపడుతున్న 30 కంపెనీలతో పేటీఎం మానవ వనరుల విభాగం చేతులు కలిపింది. కాగా, ఎంత మందిని తొలగించిందీ అన్న విషయం మాత్రం వన్97 కమ్యూనికేషన్స్ వెల్లడించలేదు.

భవిత

● గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం | ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఇండియన్ ఆర్మీలో 52వ టెక్నికల్ ఎంట్రీ స్కీమ్ కోర్సులో ప్రవేశాలు

ఇండియన్ ఆర్మీ.. జనవరి 2025లో ప్రారంభమయ్యే 52వ 10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్(టీఈఎస్) కోర్సులో ప్రవేశాలకు అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 90
» **అర్హత:** గుర్తింపు పొందిన ఎడ్యుకేషన్ బోర్డు నుంచి కనీసం 60 శాతం మార్కులతో 10+2(ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్) ఉత్తీర్ణత లేదా తత్సమాన అర్హతతోపాటు జేఈఈ(మెయిన్స్) 2024లో ర్యాంకు సాధించాలి.
» **వయసు:** 16.5 నుంచి 19.5 ఏళ్ల మధ్య ఉండాలి. నిర్దిష్ట శారీరక ప్రమాణాలు తప్పనిసరి.
» **ఎంపిక విధానం:** జేఈఈ(మెయిన్స్) స్కోరు, స్టేజ్–1, స్టేజ్–2 పరీక్షలు, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **కోర్సు, శిక్షణ:** మొత్తం ఐదేళ్ల కోర్సులో భాగంగా శిక్షణ ఇస్తారు. ఇందులో ఏడాది పాటు బేసిక్ మిలిటరీ ట్రెనింగ్, నాలుగేళ్లు టెక్నికల్ ట్రెనింగ్ ఇస్తారు. శిక్షణ, కోర్సు విజయవంతంగా పూర్తిచేసుకున్నవారికి ఇంజనీరింగ్(బీఈ/బీటెక్)డిగ్రీ అందజేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 13.05.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 13.06.2024
» **వెబ్‌సైట్:**https://joinindianarmy.nic.in

ఐజీసీఏఆర్, కల్పక్కంలో 91 పోస్టులు

కల్పక్కం(తమిళనాడు)లోని ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ అటామిక్‌రీసెర్చ్(ఐజీసీఏఆర్).. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన దేశవ్యాప్తంగా ఉన్న డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ పరిధిలోని వివిధ యూనిట్లలో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 91
» **పోస్టుల వివరాలు:** సైంటిఫిక్ ఆఫీసర్–ఈ/డీ/సీ –34, టెక్నికల్ ఆఫీస్–బి–01, సైంటిఫిక్ అసిస్టెంట్–సి/బి–12, నర్స్–ఎ–27, ఫార్మసిస్ట్ బి–14, టెక్నీషియన్ బి–03.
» **విభాగాలు:** జనరల్ సర్జరీ, న్యూక్లియర్ మెడిసిన్, డెంటల్ ప్రోస్టోడోంటిక్స్, అనెస్తీషియా, ఆప్తాల్మాలజీ, గైనకాలజీ, రేడియాలజీ, పీడియాట్రిక్స్, ఈఎన్‌టీ, న్యూక్లియర్ మెడిసిన్, జనరల్ సర్జరీ, హ్యూమన్/మెడికల్ జెనెటిస్ట్, జనరల్ డ్యూటీ/క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్, ఫిజియోథెరపీ, మెడికల్ సోషల్ వర్కర్, పాథాలజీ, రేడియోగ్రఫీ, న్యూక్లియర్ మెడిసిన్ టెక్నాలజిస్ట్, ఆర్థోపెడిక్ టెక్నీషియన్, ఈసీజీ టెక్నీషియన్, కార్డియో సోనోగ్రఫీ టెక్నీషియన్.
» **వయసు:**సైంటిఫిక్ ఆఫీసర్/ఈ పోస్టుకు 50ఏళ్లు, సైంటిఫిక్ ఆఫీసర్/డి–40 ఏళ్లు,సైంటిఫిక్ ఆఫీసర్/సి–35 ఏళ్లు, టెక్నికల్ ఆఫీసర్/సైంటిఫిక్ అసిస్టెంట్/నర్స్/సైంటిఫిక్ అసిస్టెంట్–30 ఏళ్లు, ఫార్మసిస్ట్/టెక్నీషియన్–25ఏళ్లు మించకూడదు.
» **అర్హత:**సంబంధిత విభాగంలో 10+2/డిప్లొమా/డిగ్రీ/పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి
» **ఎంపిక విధానం:** పోస్టును అనుసరించి ప్రిలిమినరీ టెస్ట్, అడ్వాన్స్‌డ్ టెస్ట్, ట్రేడ్/స్కిల్స్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 01.06.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.06.2024
» **వెబ్‌సైట్:** https://www.igcar.gov.in

పీజేటీఎస్ఏ యూనివర్శిటీలో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్శిటీ(పీజేటీఎస్ఏయూ).. 2024–24 విద్యా సంవత్సరానికి సంబంధించి పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సులు-సీట్ల వివరాలు

» డిప్లొమా ఇన్ అగ్రికల్చర్(రెండేళ్లు, ఇంగ్లిష్ మీడియం)–630 సీట్లు.
» డిప్లొమా ఇన్ ఆర్గానిక్ అగ్రికల్చర్(రెండేళ్లు, ఇంగ్లిష్ మీడియం)–60 సీట్లు.
» డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్(మూడేళ్లు, ఇంగ్లిష్ మీడియం)–110 సీట్లు.
» **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు పాలిసెట్ –2024లో అర్హత సాధించి ఉండాలి.
» **వయసు:** 31.12.2024 నాటికి 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** తెలంగాణ రాష్ట్ర పాలిసెట్–2024లో అగ్రికల్చర్ స్ట్రీమ్ కింద పొందిన ర్యాంకులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.

ముఖ్యసమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 04.06.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 26.06.2024
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 27.06.2024.
» **వెబ్‌సైట్:** https://diploma.pjtsau.ac.in

హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, హైదరాబాద్‌లో 20 పోస్టులు

హైదరాబాద్‌లోని హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్).. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 20
» **పోస్టుల వివరాలు:** సీఎంఎం ఇంజనీర్–04, మిడిల్ స్పెషలిస్ట్–08,జూనియర్ స్పెషలిస్ట్–08.
» **అర్హత:** టెక్నాలజీ ఇంజనీరింగ్‌లో డిగ్రీ/తత్సమాన విద్యార్హతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** సీఎంఎం ఇంజనీర్ పోస్టుకు రూ.60,000, మిడిల్ స్పెషలిస్ట్‌కు రూ.50,000, జూనియర్ స్పెషలిస్ట్ పోస్టుకు రూ.40,000.
» **వయసు:** సీఎంఎం ఇంజనీర్ పోస్టుకు 45 ఏళ్లు, మిడిల్ స్పెషలిస్ట్‌కు 40 ఏళ్లు, జూనియర్ స్పెషలిస్ట్ పోస్టుకు 35 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్ట్, రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **రాతపరీక్ష తేది:** 23.06.2024.
» **దరఖాస్తులకు చివరితేది:** 17.06.2024.
» **వెబ్‌సైట్:** https://hal-india.co.in

బీఎస్ఎఫ్‌లో 162 ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టులు

కేంద్ర హోంశాఖ, డైరెక్టరేట్ జనరల్ బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్).. ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ గ్రూప్–బి, సి(నాన్ గెజిటెడ్) పోస్టుల భర్తీకి పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 162
» **పోస్టుల వివరాలు:** ఎస్ఐ(మాస్టర్)–07, ఎస్ఐ(ఇంజిన్ డ్రైవర్)–04, హెడ్ కానిస్టేబుల్(మాస్టర్)–35, హెడ్ కానిస్టేబుల్(ఇంజిన్ డ్రైవర్)–57, హెడ్ కానిస్టేబుల్(వర్క్‌షాప్)(మెకానిక్) (డీజిల్/పెట్రోల్ ఇంజిన్)–03, హెడ్ కానిస్టేబుల్(వర్క్‌షాప్) (ఎలక్ట్రీషియన్)–02, హెడ్ కానిస్టేబుల్(వర్క్‌షాప్) (ఏసీ టెక్నీషియన్)–01, హెడ్ కానిస్టేబుల్(వర్క్‌షాప్) (ఎలక్ట్రానిక్స్)–01, హెడ్ కానిస్టేబుల్(వర్క్‌షాప్) (మెషినిస్ట్)–01, హెడ్ కానిస్టేబుల్(వర్క్‌షాప్) (కార్పెంటర్)–03, హెడ్ కానిస్టేబుల్(వర్క్‌షాప్) (ప్లంబర్)–02, కానిస్టేబుల్(క్రూ)–46.
» **అర్హత:** పోస్టును అనుసరించి మెట్రిక్యులేషన్,10+2, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, ఇంజిన్ డ్రైవర్ సర్టిఫికేట్ ఉండాలి.
» **వయసు:** 01.07.2024 నాటికి ఎస్ఐ(మాస్టర్), ఎస్ఐ(ఇంజిన్ డ్రైవర్) పోస్టులకు 22 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి. హెచ్‌సీ(మాస్టర్), హెచ్‌సీ(ఇంజిన్ డ్రైవర్), హెచ్‌సీ(వర్క్‌షాప్), కానిస్టేబుల్(క్రూ) పోస్టులకు 20 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు ఎస్ఐ పోస్టులకు రూ.35,400–రూ.1,12,400, హెచ్‌సీ పోస్టులకు రూ.25,500–రూ.81,100, కానిస్టేబుల్ పోస్టులకు రూ.21,700–రూ.69,100.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ప్రాక్టికల్/ట్రేడ్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు. బీఎస్ఎఫ్ వాటర్ వింగ్ డైరెక్ట్ ఎంట్రీ ఎగ్జామ్–2024 ద్వారా అభ్యర్థులను ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 02.06.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 01.07.2024
» **వెబ్‌సైట్:** https://rectt.bsf.gov.in

ఐఐటీలకు దీటైన ఇన్‌స్టిట్యూట్స్!

» అడ్వాన్స్‌డ్ అభ్యర్థులకు ఎన్నో ప్రత్యామ్నాయాలు
» ప్రముఖ విద్యాసంస్థల్లో ప్రవేశాలకు అవకాశం



జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఉత్తీర్ణత సాధించినప్పటికీ.. కటాఫ్ పర్సంటైల్, పరిమిత సీట్లు, ఇతర నిబంధనల కారణంగా అడ్మిషన్ లభించని విద్యార్థులు నిరాశ చెందక్కర్లేదు. ఎందుకంటే.. అడ్వాన్స్‌డ్ స్కోర్‌తోనే దేశంలో మరెన్నో ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్.. బీఎస్, బీటెక్‌ల్లో ప్రవేశాలు కల్పిస్తున్నాయి. వీటిలో చేరి కోర్సు పూర్తి చేసుకుంటే.. ఐఐటీలకు దీటైన అవకాశాలు సొంతం చేసుకోవచ్చు. తాజాగా జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు వెలువడిన నేపథ్యంలో.. ప్రస్తుతం దేశంలో ఐఐటీలకు దీటుగా నిలుస్తున్న పలు ఇన్‌స్టిట్యూట్స్, అవి అందించే కోర్సులు తదితర వివరాలు..

సైన్స్ పరిశోధనలకు కింగ్.. ఐఐఎస్‌సీ

సైన్స్ బోధన, పరిశోధనలో అంతర్జాతీయ గుర్తింపు ఉన్న సంస్థ.. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్‌సీ), బెంగళూరు. అంతర్జాతీయ సర్వేల్లో టాప్‌లో నిలిచే ఇన్‌స్టిట్యూట్ ఇది. సైన్స్ రంగంలో కెరీర్ కోరుకునే విద్యార్థులకు చక్కటి వేదిక.. ఐఐఎస్‌సీ. ఈ ఇన్‌స్టిట్యూట్‌లో నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ (రీసెర్చ్) కోర్సు అందుబాటులో ఉంది. ఈ కోర్సులో భాగంగా విద్యార్థులు బయాలజీ, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, మెటీరియల్స్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్‌లలో ఏదో ఒక సబ్జెక్ట్‌ను మేజర్‌గా ఎంచుకుని రీసెర్చ్ చేయొచ్చు. ఈ కోర్సులో మొత్తం 120 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో జేఈఈ మెయిన్/జేఈఈ అడ్వాన్స్‌డ్/ఐఐఎస్ఈఆర్ అప్టిట్యూడ్ టెస్ట్‌లో ర్యాంకు ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు. జేఈఈ ర్యాంకర్లతోపాటు నీట్–యూజీ ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. దీంతోపాటు ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ లేదా బైపీసీ గ్రూప్‌లలో కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత తప్పనిసరి. ఐఐఎస్‌సీ బెంగళూరులో బీఎస్ కోర్సు పూర్తి చేసుకున్న వారికి క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్స్‌లో ఆకర్షణీయ వేతనాలతో ఉద్యోగాలు ఖరారవుతున్నాయి. ఐటీ మొదలు మాన్యుఫ్యాక్చరింగ్ వరకూ.. పలు విభాగాలకు చెందిన సంస్థలు ఆఫర్లు అందిస్తున్నాయి.

▪ **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://bsug.iisc.ac.in/news.html

ఐఐఎస్‌టీ కోర్సు.. ఇస్రోలో సైంటిస్ట్!

జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకుతో ప్రవేశం కల్పించే మరో ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్.. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఐఐఎస్‌టీ). కేరళ రాష్ట్రం తిరువనంతపురంలో ఏర్పాటైన ఈ విద్యాసంస్థలో గ్రాడ్యుయేషన్ స్థాయిలో నాలుగేళ్ల వ్యవధిలోని బీటెక్, అయిదేళ్ల వ్యవధిలోని బీటెక్+ఎంటెక్ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. బీటెక్‌లో ఏరోస్పేస్ ఇంజనీరింగ్, ఏవియానిక్స్(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్) బ్రాంచ్‌లను అందిస్తున్నారు. బీటెక్‌లో ఒక్కో బ్రాంచ్‌లో 75 సీట్లు చొప్పున, బీటెక్+ఎంటెక్ డ్యూయల్ డిగ్రీలో 24 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

ఉన్నత అవకాశాలు

ఐఐఎస్‌టీలో బీటెక్, డ్యూయల్ డిగ్రీ పూర్తి చేసుకున్న వారికి ఇస్రోలోనే సైంటిస్ట్/ ఇంజనీర్‌గా కొలువులు ఖరారు చేస్తారు. వీరు కనీసం 7.5 జీపీఏతో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. వీరికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో కూడా ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం

ఐఐఎస్‌టీలో ప్రవేశాలకు ప్రత్యేక దరఖాస్తు ప్రక్రియ ఉంటుంది. 2024కు సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ జూన్ 3 నుంచి ప్రారంభమైంది. దరఖాస్తుకు చివరి తేదీ జూన్ 14. సీట్ల కేటాయింపును జూన్ 17న ప్రకటిస్తారు.

▪ **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.iist.ac.in/admissions/undergraduate

ఆర్‌జీఐపీటీ

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఉత్తీర్ణులకు మరో ప్రత్యామ్నాయ ఇన్‌స్టిట్యూట్.. రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం టెక్నాలజీ (ఆర్‌జీఐపీటీ). పెట్రోలియం రంగంలోని పలు ప్రముఖ సంస్థల సహభాగస్వామ్యంతో అమేథీలో ఏర్పాటైన ఈ విద్యాసంస్థకు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్‌గా గుర్తింపు ఉంది. ఈ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రస్తుతం నాలుగేళ్ల బీటెక్ ప్రోగ్రామ్‌లు, అదే విధంగా ఇంటిగ్రేటెడ్ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లు అందిస్తున్నారు. వీటిలో ప్రవేశానికి జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకును పరిగణనలోకి తీసుకుంటారు. అడ్వాన్స్‌డ్ ఉత్తీర్ణులు ఇన్‌స్టిట్యూట్‌కు ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మొదటి రౌండ్ దరఖాస్తుకు చివరితేదీ జూలై 7.

▪ **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.rgipt.ac.in

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ

పెట్రోలియం రంగంలో నిపుణులైన మానవ వనరుల కొరతను తీర్చేందుకు, పరిశోధనలు చేసేందుకు ఏర్పాటైన ఇన్‌స్టిట్యూట్.. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ(ఐఐపీఈ). 2016లో విశాఖపట్నంలో నెలకొల్పిన ఈ విద్యాసంస్థకు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్‌గా గుర్తింపు లభించింది. ప్రస్తుతం బీటెక్–పెట్రోలియం ఇంజనీరింగ్, బీటెక్–కెమికల్ ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌లు, పీహెచ్‌డీల్లో ప్రవేశాలు కల్పిస్తోంది. ఐఐపీఈలో బీటెక్ పెట్రోలియం ఇంజనీరింగ్ 60 సీట్లు, కెమికల్ ఇంజనీరింగ్ 60 సీట్లు, మెకానికల్ ఇంజనీరింగ్ 40 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అభ్యర్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకు ఆధారంగా.. ఇన్‌స్టిట్యూట్ వెబ్‌సైట్‌లో లాగిన్ అయి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులకు చివరి తేదీ జూలై 7. ఐఐపీఈలోని బీటెక్ కోర్సులను పూర్తి చేసుకుంటే.. పెట్రోలియం రంగంలోని హిందుస్థాన్ పెట్రోలియం, ఇండియన్ ఆయిల్, గెయిల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలతోపాటు టీసీఎస్, ఎల్ అండ్ టీ, అరబిందో ఫార్మా, యాక్సెంచర్ వంటి సంస్థల్లో ఆఫర్లు పొందే అవకాశముంది.

▪ **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:**https://iipe.ac.in

ఐఐఎస్ఈఆర్ (ఐసర్)

సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్‌లో మంచి గుర్తింపు ఉన్న మరో జాతీయ స్థాయి విద్యాసంస్థ.. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్)! బేసిక్ సైన్స్ రంగంలో విద్యార్థులను ప్రోత్సహించి మెరికల్లా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ఐఐఎస్ఈఆర్ క్యాంపస్‌లను కేంద్ర ప్రభుత్వం నెలకొల్పింది. ఐఐఎస్ఈఆర్‌కు దేశ వ్యాప్తంగా ఉన్న ఏడు క్యాంపస్‌ల్లో(బరంపూర్, భోపాల్, కోల్‌కత, పుణె, తిరువనంతపురం, మొహాలి, తిరుపతి) అయిదేళ్ల బీఎస్–ఎంఎస్ డ్యూయల్ డిగ్రీలో ప్రవేశం కల్పిస్తున్నాయి. అదే విధంగా ఐఐఎస్ఈఆర్ భోపాల్ క్యాంపస్‌లో నాలుగేళ్ల వ్యవధిలో బీఎస్ ఇంజనీరింగ్ సైన్సెస్, బీఎస్ ఎకనామిక్ సైన్సెస్ కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయి. బీఎస్–ఎంఎస్ కోర్సుకు సంబంధించి మొత్తం ఏడు క్యాంపస్‌లలో కలిపి 1741 సీట్లు ఉన్నాయి. ఐఐఎస్ఈఆర్ భోపాల్ క్యాంపస్‌లో బీఎస్ ఇంజనీరింగ్ సైన్సెస్‌లో 73 సీట్లు, బీఎస్ ఎకనామిక్ సైన్సెస్‌లో 42 సీట్లు ఉన్నాయి.

త్వరలో దరఖాస్తు ప్రక్రియ

ఈ కోర్సులకు సంబంధించి గతేడాది వరకూ జేఈఈ అడ్వాన్స్‌డ్ తదితర విధానాల్లో ప్రవేశం కల్పించారు. కాని ఈ ఏడాది(2024) నుంచి స్టేట్ అండ్ సెంట్రల్ బోర్డ్స్ ఛానల్ (ఎస్‌సీబీ) పేరుతో.. ఐఐఎస్ఈఆర్ ప్రత్యేకంగా నిర్వహించే ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో ఉత్తీర్ణత ఆధారంగా ప్రవేశం కల్పించనున్నట్లు ఇటీవల ప్రకటించారు.

▪ **వెబ్‌సైట్:** www.iiserpune.ac.in/education/admissions

క్లుప్తంగా...

కొత్త ప్రభుత్వం సామాజిక న్యాయం పాటించాలి

బీఎస్పీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ జె. పూర్ణచంద్రరావు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొలువుదీరనున్న కొత్త ప్రభుత్వం సామాజిక న్యాయం పాటించాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ జె.పూర్ణచంద్రరావు కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సామాజికన్యాయం సాధికారత పేరుతో పదవుల్లో బహుజన కులాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మెరుగైన ప్రాతినిధ్యం ఇచ్చిందని తెలిపారు. కొత్త ప్రభుత్వంలో కూడా ఇదే తరహాలో ఆయా వర్గాల అభివృద్ధికి అధికారాన్ని ఉపయోగించుకునే అవకాశం కల్పించాలని కోరారు. గతంలో చంద్రబాబు పరిపాలనలో కులపక్షపాతం, అప్రజాస్వామిక పద్ధతులు, కక్ష సాధింపు చర్యలు నెలకొన్నాయని తెలిపారు. ఆ విధానాలు భవిష్యత్‌లో లేకుండా జాగ్రత్త పడాలని సూచించారు.

51 మంది ఆర్టీసీ ఉద్యోగులపై సస్పెన్షన్ తొలగించాలి

ప్రభుత్వానికి ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: ఎన్నికల నియమావళి ఉల్లంఘించారనే అభియోగాలతో 51మంది ఆర్టీసీ ఉద్యోగులపై విధించిన సస్పెన్షన్‌ను తొలగించాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) ప్రభుత్వాన్ని కోరింది. ఆ ఉద్యోగులకు అదే డిపోల్లోనే పోస్టింగులు ఇవ్వాలని కోరుతూ ఈయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.దామోదరరావు, జీవీ నరసయ్య ఆర్టీసీ ఎండీ సీహెచ్.ద్వారకా తిరుమలరావుకు సోమవారం వినతిపత్రం సమర్పించారు. మరికొన్ని ఫిర్యాదులపై ఎన్నికల అనంతరం నిర్వహించాలని ఆదేశించిన విచారణలను కూడా నిలిపివేయాలని కోరారు.

జీవో నం.117ను రద్దు చేయండి

కొత్త ప్రభుత్వానికి బీటీఏ విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నం.117ను రద్దు చేయాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) కొత్త ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. సోమవారం బీటీఏ రాష్ట్ర కార్యవర్గ సమావేశం విజయవాడలో నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మనోజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న నారా చంద్రబాబునాయుడికి అభినందనలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 28 వేల ఉపాధ్యాయ ఖాళీలతో మెగా డీఎస్సీ ప్రకటించి త్వరగా నియామకాలు పూర్తిచేయాలని కోరారు. ప్రతి పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను నియమించి సింగిల్ టీచర్ పాఠశాలలు లేకుండా చూడాలన్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పర్రె వెంకటరావు మాట్లాడుతూ.. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న 11వ పీఆర్సీ, డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని, ఐఆర్ ప్రకటించి 12వ పీఆర్సీ వెంటనే ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. వివిధ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

ఈ–మిర్చ్ ప్రాజెక్టు విజయవంతం

మరో ఎనిమిది జిల్లాలకు విస్తరణ

నాలుగు జిల్లాల్లో 67 వేల మంది రైతులకు సాంకేతికత



సాక్షి, అమరావతి: మిరప సాగులో నాణ్యత, దిగుబడులను పెంచడమే లక్ష్యంగా డిజిటల్ గ్రీన్, బిల్ అండ్ మిలిందా గేట్స్ ఫౌండేషన్ రాష్ట్రంలో ఏపీ ప్రభుత్వ సహకారంతో చేపట్టిన ఈ–మిర్చ్ పైలెట్ ప్రాజెక్టు విజయవంతమైంది. దీంతో ప్రస్తుత రబీ సీజన్ నుంచి ఈ–మిర్చ్ 2.0 పేరిట మరో ఎనిమిది జిల్లాల్లో మిరపతో పాటు పసుపు, వేరుశనగ, టమాటా పంటలకు ఈ ప్రాజెక్టును విస్తరించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

2021లో నాలుగు జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టు..

ఈ–మిర్చ్ పైలెట్ ప్రాజెక్టుకు 2021లో శ్రీకారం చుట్టారు. రైతులకు సరైన సమయంలో సలహాలు, సూచనలు అందించడమేగాక నూతన సాంకేతికతను చేరువ చేయడం, పెట్టుబడి ఖర్చులు ఆదా చేయడం, నాణ్యతతో కూడిన ఉత్పాదకతను పెంచడం, మార్కెట్‌ను సాగుదారులతో అనుసంధానించడం ద్వారా వారికి అదనపు లబ్ధిచేకూర్చడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. రసాయన పురుగు మందుల వినియోగాన్ని నియంత్రిస్తూ విత్తు నుంచి విక్రయం వరకు అనుసరించాల్సిన ఉత్తమ యాజమాన్య పద్ధతులపై రూపొందించిన నూతన సాంకేతికతను గుంటూరు, పల్నాడు, ప్రకాశం, ఎన్టీఆర్ జిల్లాల్లోని 67 వేల మంది మిరప రైతులకు అందించారు.

నాలుగుచోట్ల క్వాలిటీ టెస్టింగ్ సెంటర్లు..

అంతర్జాతీయ ప్రమాణాలతో రాష్ట్రంలో నాలుగు క్వాలిటీ టెస్టింగ్ సెంటర్లను ఏర్పాటుచేశారు. కనీసం రూ.3 వేల నుంచి రూ.5 వేల విలువైన వివిధ రకాల నాణ్యత నిర్ధారణ పరీక్షలను కేవలం రూ.150కే అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ నూతన సాంకేతికతను అందిపుచ్చుకున్న 80 శాతం మంది రైతులు 16.4 శాతం పెట్టుబడి వ్యయాన్ని ఆదా చేసుకోవడమేగాక 10–20 శాతం మేర అధిక నాణ్యతతో పాటు దిగుబడులు సాధించారు. 8,125 మంది రైతులు పండించిన మిరప శాంపిళ్లను పరీక్షించగా.. 75 శాతం ఏ–గ్రేడ్ దిగుబడులు సాధించినట్లు గుర్తించారు. 20 వేల మంది రైతులను కాల్గుడి డిజిటల్ మార్కెట్ ప్లేస్‌తో అనుసంధానించడం ద్వారా వారు పండించిన మిరప పంటను అంతర్జాతీయ మార్కెట్‌లో విక్రయించుకునే వెసులుబాటు పొందారు. అత్యుత్తమ నాణ్యత కల్గిన 7,027 టన్నుల మిరపను విదేశాలకు ఎగుమతి చేసేందుకు వీలుగా దానిని జాతీయస్థాయి వ్యాపారులకు విక్రయించారు. సగటున క్వింటాకు రూ.1,850 చొప్పున ప్రతి రైతు అదనపు లబ్ధిపొందారు.

మరో మూడు పంటలకు విస్తరణ..

ఇదిలా ఉంటే.. మిరప పైలెట్ ప్రాజెక్టు విజయవంతం కావడంతో ప్రస్తుత వ్యవసాయ సీజన్ నుంచి మరో ఎనిమిది జిల్లాల్లో మిరపతో పాటు వేరుశనగ, పసుపు, టమాటా పంటలకు ఈ–మిర్చ్ 2.0 పేరిట విస్తరిస్తున్నారు. ఆర్బీకేలో పనిచేసే వెయ్యిమంది సిబ్బందికి ఇప్పటికే ఫౌండేషన్ ద్వారా ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. డిజిటల్ అడ్వయిజరీ కమ్యూనిటీ వీడియోస్, వాట్సాప్, టెలిగ్రామ్ ఆధారిత చాట్‌బాట్, ఐవీఆర్ఎస్ వంటి సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో రైతులకు ఉత్తమ యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నారు. సాగులో ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారు. ఇప్పటికే నాలుగు క్వాలిటీ టెస్టింగ్ సెంటర్లను ఏర్పాటుచేయగా వీటికి అదనంగా మరో ఏడు క్వాలిటీ టెస్టింగ్ సెంటర్లు ఏర్పాటుచేస్తున్నారు. ఈ–కామర్స్ ద్వారా మార్కెట్లను అనుసంధానించడంతో పాటు జాతీయస్థాయి వ్యాపారులు, ఎగుమతిదారులను రైతులతో అనుసంధానించనున్నారు. వచ్చే రెండేళ్లలో ప్రాజెక్టులో 40 రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు (ఎఫ్‌పీఓలకు) భాగస్వామ్యం కల్పించి, కనీసం ఐదు లక్షల మంది రైతులకు డిజిటల్ గ్రీన్ సాంకేతికతను బదలాయించనున్నారు. వీరిలో కనీసం 30 శాతం మంది మహిళలు ఉండేలా చూస్తున్నారు.

నూతన పద్ధతులను నేర్చుకున్నాం..



డిజిటల్ గ్రీన్ సమయోచిత సలహాల ద్వారా చీడపీడలు, తెగుళ్ల నియంత్రణలో నూతన పద్ధతులను నేర్చుకోగలిగాం. పెట్టుబడి ఖర్చులు గణనీయంగా తగ్గించుకోగలిగాం. డిజిటల్ మార్కెట్ ద్వారా విక్రయించుకుని అదనపు ఆదాయం పొందడం చాలా సంతోషంగా ఉంది.

– తులసి యెరవాడ, మహిళా రైతు, గుంటూరు

దశలవారీగా మిగిలిన పంటలకు విస్తరణ..



ఈ–మిర్చ్ ప్రాజెక్టు ద్వారా డిజిటల్ వ్యవసాయ సామర్థ్యాలను ఉపయోగించుకునేలా రైతులను తీర్చిదిద్దగలిగాం.75 శాతం మేర నాణ్యత పెరగడమే కాదు.. 80 శాతం మంది రైతులు లబ్ధి పొందగలిగారు. ఇదే స్ఫూర్తితో దశలవారీగా మిగిలిన పంటలకు కూడా విస్తరించే దిశగా అడుగులు వేస్తున్నాం.

– నరేంద్ర కండిమళ్ల, ఫౌండేషన్ రీజినల్ హెడ్, ఏపీ

ఏపీఎల్ లోగో ఆవిష్కరణ

ఈ నెల 30న మూడో సీజన్ ప్రారంభం– తలపడనున్న ఆరు జట్లు



లోగో ఆవిష్కరిస్తున్న ఏపీఎల్ జట్ల కెప్టెన్లు

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్రా ప్రీమియర్ లీగ్(ఏపీఎల్) మూడో సీజన్ కోసం రూపొందించిన సరికొత్త లోగో, గీతాన్ని క్రికెటర్లు నితీష్‌కుమార్‌రెడ్డి, కేఎస్ భరత్, రికీ భుయ్‌లు ఆవిష్కరించారు. సోమవారం విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో ఆంధ్ర క్రికెట్ సంఘం(ఏసీఏ) అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపినాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. 'ఈనెల 30 నుంచి ప్రారంభం కానున్న ఏపీఎల్ మూడో సీజన్‌లో ఆరు ఫ్రాంచైజీ జట్లు తలపడనున్నాయి. మన ఆంధ్రా మన ఏపీఎల్ పేరిట సరికొత్త లోగోతో పాటు గీతాన్ని ఆవిష్కరించాం. కడప, విశాఖ వేదికగా 19 మ్యాచ్‌లు జరగనున్నాయి. విశాఖలో జూలై 13న ఫైనల్స్ నిర్వహిస్తాం. ఆంధ్రా క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకోవడానికి ఏపీఎల్ మంచి వేదిక' అని చెప్పారు. కేఎస్ భరత్ మాట్లాడుతూ.. ఏపీఎల్ మూడో సీజన్ కోసం ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నానని చెప్పారు. నితీష్‌కుమార్ రెడ్డి, రికీభుయ్ మాట్లాడుతూ.. హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాల్లోని పిచ్‌లకు దీటైనవి ఆంధ్రాలో ఉన్నాయని చెప్పారు. ఏపీఎల్ మూడో సీజన్‌లో బెజవాడ టైగర్స్, ఉత్తరాంధ్ర లయన్స్, వైజాగ్ వారియర్స్, గోదావరి టైటాన్స్, రాయలసీమ కింగ్స్, కోస్టల్ రైడర్స్ జట్లు పోటీపడనున్నాయి. ఈ మ్యాచ్‌లను స్టార్‌స్పోర్ట్స్ తెలుగు, స్టార్ స్పోర్ట్స్ ఫస్ట్ ప్రత్యక్ష ప్రసారం చేయనున్నాయి.

ఇలా అయితే ఇంటికెళ్లేదెలా?

ఆందోళనలో ఢిల్లీకి వచ్చిన నేతలు, కార్యకర్తలు

- విజయవాడ, తిరుపతి, విశాఖ, రాజమండ్రికి భారీగా విమాన టికెట్ ధరలు
- ఒక్కో విమాన టిక్కెట్ ధర రూ.25 వేలకు పైనే ఉండటంతో నిరాశ
- రైలులో టికెట్లు లేక అవస్థలు
- కన్ఫర్మేషన్ కోసం ఎంపీల ద్వారా ప్రయత్నాలు



సాక్షి, న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ ప్రమాణస్వీకారానికి తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన నేతలు, కార్యకర్తలు తమ ప్రాంతాలకు తిరిగి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దేశవ్యాప్తంగా మోదీ ప్రమాణస్వీకారానికి తరలిరావడంతో విమానాలు, రైళ్లలో రద్దీ పెరిగింది. దీంతో విమానయాన సంస్థలు టికెట్ రేట్లను పెంచేశాయి. హైదరాబాద్, తిరుపతి, విశాఖపట్నం, విజయవాడ, రాజమండ్రికి వెళ్లడానికి ఒక్కో టికెట్‌కు రూ.25 వేల వరకు విమాన టిక్కెట్లు ఉండటంతో అంతపెట్టలేనివారు ఢిల్లీలోనే ఉండిపోయారు. పోనీ రైళ్ల ద్వారా అయినా తమ ప్రాంతాలకు చేరుకుందామంటే వాటిలోనూ టికెట్లు లేక అవస్థలు పడుతున్నారు. ఎంపీల ద్వారా సీట్లు కన్ఫర్మ్ చేసుకోవడానికి ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఆదివారం ఉదయం నుంచే నేతలు, కార్యకర్తలతో ఢిల్లీ రద్దీగా మారిపోయింది. మోదీ కేబినెట్‌లో తెలుగు రాష్ట్రాల నుంచి ఐదుగురు ఎంపీలకు చోటు దక్కడంతో వారి అనుచరులు, కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో ఢిల్లీకి వచ్చారు. ఢిల్లీ నుంచి తిరుగు ప్రయాణంలో మాత్రం వీరికి చేదు అనుభవం ఎదురవుతోంది. హైదరాబాద్, విజయవాడ(గన్నవరం), రేణిగుంట(తిరుపతి), విశాఖపట్నం, రాజమండ్రి ఇలా ఎటు చూసినా రూ.25వేల నుంచి రూ.45వేల ధరతో ఒక్కో టికెట్ కనిపిస్తుండటంతో నేతలు షాక్‌కు గురి అవుతున్నారు. ప్రత్యామ్నాయంగా రైలులో వెళ్లేందుకు ప్రయత్నించగా అక్కడా పెద్ద ఎత్తున వెయిటింగ్ లిస్టు ఉండటంతో ఇక్కడకు వచ్చిన వారంతా ఆందోళన చెందుతున్నారు. ఢిల్లీకి వచ్చేటప్పుడు రూ.10 వేలు–రూ.12 వేలు మాత్రమే టికెట్ ధర ఉండటంతో ఇబ్బందేమీ పడలేదు. ఢిల్లీ నుంచి తిరిగివెళ్లేప్పుడే విమాన టికెట్ ధరల విషయంలో వారికి చుక్కలు కనిపిస్తున్నాయి. ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు దాదాపు 20కి పైగా విమాన సర్వీసులు ఉన్నాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం అర్ధరాత్రి వరకు ఏ విమానం చూసినా ఒక్కో టికెట్ ధర రూ.25 వేలు, రూ.28వేలు, రూ.29వేలు, రూ.35వేలు, రూ.45వేలు చొప్పున ఉన్నాయి. ఇక విజయవాడ, రేణిగుంట(తిరుపతి), విశాఖపట్నం, రాజమండ్రి ఈ నాలుగు ప్రాంతాలకు కూడా ఒక్కో టికెట్ రూ.25వేలు పైమాటే ఉన్నాయి. ఈ ప్రాంతాలకు నేరుగా రెండు, మూడేసి విమాన సర్వీసులు ఉండగా.. ఒకటి లేదా రెండు స్టాపులతో మరో పది సర్వీసుల్ని ఎయిర్ ఇండియా, ఇండిగో సంస్థలు నడుపుతున్నాయి.

ఈక్యూ లెటర్‌ల కోసం వినతులు

భారీ మొత్తాలను వెచ్చించి విమాన టికెట్ కొనుక్కోలేని వారంతా రైలులో వెళ్లేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. అయితే సికింద్రాబాద్, విజయవాడ ప్రాంతాలకు ఉన్న ఏడెనిమిది రైలు సర్వీసుల్లో స్లీపర్‌క్లాస్ 150–200 మేర వెయిటింగ్ లిస్టు ఉంది. ఇక థర్డ్/సెకెండ్ ఏసీ కోచ్‌లలో అయితే 'నో అవైలబుల్' అని కనిపిస్తోంది. ఈ క్రమంలో సోమవారం, మంగళవారం, బుధవారం వెళ్లాల్సిన వారు రైలు టికెట్ కన్ఫర్మేషన్ కోసం ఎమర్జెన్సీ కోటా (ఈక్యూ) లెటర్స్ కావాలంటూ గెలిచిన ఎంపీల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సోమవారం ఉదయం వెళ్లే వారు శనివారమే ఈక్యూ లెటర్ వేసినప్పటికీ వాళ్లకు టికెట్ ఖరారు కాకపోవడంతో వారంతా నిరాశతో ఢిల్లీలోనే ఉండిపోయారు. విమాన టికెట్ ధరలు తగ్గే వరకు లేదా రైలులో టికెట్లు దొరికే వరకూ ఢిల్లీలోనే వారంతా ఉండనున్నారు. మరికొందరు చండీగఢ్, సిమ్లా వంటి ప్రాంతాలకు విహారయాత్రకు వెళ్లి అక్కడ సేద తీరుతున్నారు. రైలు, విమాన టికెట్ల విషయంలో ఎంపీలు సైతం చేతులెత్తేస్తున్నారు.

భారత పశువైద్య మండలి సభ్యురాలిగా గీతాప్రియ



కడప అగ్రికల్చర్: భారత పశు వైద్య మండలికి ఈ నెల 8వ తేదీన ఆన్‌లైన్ లింక్ ద్వారా జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ జిల్లా కడపలోని పశువైద్య శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ గీతాప్రియ డాక్టర్ ఉమేష్‌చంద్ర ప్యానెల్ తరఫున పోటీ చేసి ఘన విజయం సాధించారు. దేశవ్యాప్తంగా పశు వైద్య పట్టభద్రులకు జరిగిన ఈ ఎన్నికల్లో డాక్టర్ ఉమేష్‌చంద్ర ప్యానెల్ తరఫున పోటీ చేసిన 11 మంది ప్యానెల్ సభ్యులు గెలుపొందారు. వారిలో డాక్టర్ గీతాప్రియ 12,999 ఓట్లతో రెండో అతిపెద్ద మెజార్టీని సాధించారు. ఈ పోటీలో దేశవ్యాప్తంగా 93 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలవగా.. 77 వేల మంది పశువైద్య పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఆశా మీనన్ వ్యవహరించారు. ఈ సందర్భంగా డాక్టర్ గీతాప్రియ మాట్లాడుతూ విజయాన్ని అందించిన తెలుగు రాష్ట్రాల పశువైద్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. పశువైద్యుల శ్రేయస్సు కోసం, పశువుల ఆరోగ్య సంరక్షణకు కృషి చేస్తానన్నారు.

ఢిల్లీలో తెలుగు నేతల సందడి

కేంద్ర మంత్రులకు శుభాకాంక్షల వెల్లువ

సాక్షి, న్యూఢిల్లీ: గత రెండు మూడు రోజులుగా ఢిల్లీలో తెలుగు నేతలు సందడి చేస్తున్నారు. కేంద్రంలో మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర మంత్రుల నివాసాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన నేతలు క్యూ కడుతున్నారు. మోదీ 3.0 ప్రభుత్వంలో రెండోసారి కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి, తొలిసారి బండి సంజ య్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ నేపథ్యంలో సో మవారం తెలంగాణ బీజేపీ ఎంపీలు డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్‌రావు, ఈటల రాజేందర్, ఏపీ బీజేపీ నేతలు భానుప్రకాశ్, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులతోపాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన కుల సంఘాల ప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ప్రధాని ప్రమాణ స్వీకారోత్సవాన్ని తిలకించేందుకు కూడా తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున బీజేపీ శ్రేణులు తరలివచ్చాయి. ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా తిలకించే అవకాశం లభించని వారి కోసం కిషన్‌రెడ్డి నివాసంలో ఒక భారీ షెడ్డు నిర్మించి అందులో ఎల్‌ఈడీ స్క్రీన్, ప్రతిరోజూ అతిథుల కోసం భోజనాలు ఏర్పాటు చేశారు. మరోవైపు.. మల్కాజ్‌గిరి ఎంపీగా గెలిచిన ఈటల రాజేందర్, నిజామాబాద్ ఎంపీగా రెండోసారి గెలిచిన ధర్మపురి అర్వింద్‌లు ఢిల్లీలోనే ఉన్నారు. వారిని కూడా అభినందించేందుకు ప్రాంతాలకు అతీతంగా నేతలు, కార్యకర్తలు అభిమానులు వెల్లువెత్తారు. దీంతో అర్వింద్ నివాసం, ఈటల రాజేందర్ మకాం వేసిన మాజీ ఎంపీ బీబీ పాటిల్ నివాసాలు సందడిగా మారాయి.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943